





మనసులో
# మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 195: శనివారం 14 మార్చి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు30:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్




# మరింత వేగవంతం

## అమరావతి నిర్మాణ పనుల వేగంగా పూర్తికి అనుమతి

- రూ.2,316 కోట్ల పరిపాలన అనుమతులు మంజూరు
- చిన్నతరహా పరిశ్రమల ద్వారా 17 వేల మందికి కొత్తగా ఉపాధి
- 3,500 సూక్ష్మ పరిశ్రమలకు రూ.300 కోట్ల ఆర్థిక సాయం
- 'సఖీ నివాస్' పేరుతో పిల్లల సంరక్షణకు హాస్టళ్ల ఏర్పాటు
- ఏప్రిల్ 2 నుంచి 90 రోజుల పాటు జలధార కార్యక్రమం
- గ్యాస సరఫరాలో ఇబ్బందులు రాకుండా మంత్రుల పర్యవేక్షణ
- ఏపీ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు

**అమరావతి, మార్చి 13:** అమరావతిలో ప్రతిష్ఠాత్మకమైన సచివాలయం, ప్రభుత్వ విభాగాధిపతుల టవర్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భవనాల్లో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2,316 కోట్ల పరిపాలన అనుమతులను మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాజధానిలో తెలుగు సంస్కృతిని చాటిచెప్పేలా రూ.119 కోట్లతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. అమరావతిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. దీనిలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణం నుంచి సాగునీటి ప్రాజెక్టుల వరకు పలు అంశాలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సీఎం చంద్రబాబు నేతృత్వంలో శుక్రవారం జరిగిన ఏపీ మంత్రివర్గ సమావేశం రాష్ట్ర ప్రగతికి దిశానిర్దేశర చేసింది.

మిగతా 2 లో

## అన్నదాత సుఖీభవ నిధులు విడుదల



## ఏపీ హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణం

- ప్రమాణ స్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్ 2



## ఏపీ మాజీ డీజీపీ దొర మృతి

- అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి
- వివిధ హోదాల్లో పోలీస్ శాఖలో కీలక పదవుల నిర్వహణ 3

## ఏపీ సమాచార కమిషనర్‌తో పంజాబ్ సీఐసీ భేటీ



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడును పంజాబ్ రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ (సీఐసీ) ఇంద్రపాల్ సింగ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు కమిషనర్లు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలు తీరుతెన్నులపై సుదీర్ఘంగా చర్చించారు. ఏపీ సమాచార కమిషన్ పనితీరు, కేసుల విచారణ ప్రక్రియ గురించి పంజాబ్ సీఐసీ ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. 2




## అమరావతిలో దేశంలోనే తొలి 'ఏఐ' క్యాంపస్

- బిట్స్ పిలానీ కీలక నిర్ణయం
- మంత్రి లోకేశ్‌తో బిట్స్ ప్రతినిధుల భేటీ
- రూ. 1000 కోట్ల పెట్టుబడి.. 70 ఎకరాల్లో అత్యాధునిక నిర్మాణాలు..
- 7 వేల మంది విద్యార్థులకు అవకాశ

రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న బిట్స్ పిలానీ దేశంలోనే మొట్టమొదటి పూర్తిస్థాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్యాంపస్‌గా అవతరించబోతోంది. శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌తో ఆ సంస్థ ప్రతినిధులు సమావేశమై క్యాంపస్ నిర్మాణ ప్లాన్లను వివరించారు. 2

### జువ్వలదిన్నె ప్రైవేటీకరణ

# కాలేదు..

## అదంతా వైసీపీ దుష్ప్రచారం!

- 7 ఎకరాల్లో మాత్రమే రక్షణ రంగ యూనిట్
- హార్బర్ ప్రభుత్వ పరిధిలోనే: మంత్రులు
- రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా జగన్ కుట్రలు.. అడ్డుకుంటే ఉపేక్షించం

నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ప్రైవేట్ పరం చేస్తున్నామంటూ ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న విమర్శల్లో ఎంతమాత్రం వాస్తవం లేదని రాష్ట్ర మంత్రులు బీసీ జనార్థన్ రెడ్డి, కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులను అడ్డుకోవడమే లక్ష్యంగా జగన్ అండ్ కో అసత్య ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు.

2





## జర్నలిస్టులకు ఉగాది పురస్కారాలు

- జర్నలిస్టు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- ప్రభుత్వ పరిశీలనలో జర్నలిస్ట్ పెన్షన్ స్కీమ్
- ఏపీయూడబ్ల్యూజే నేతలతో సమాచార శాఖ మంత్రి పార్థసారథి 2

## తిరుమల లడ్డూపై పిటిషన్ కొట్టివేత



**న్యూఢిల్లీ, మార్చి 13:** తిరుమల లడ్డూ వ్యవహారంలో దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ఈ వ్యవహారంపై కామెంట్లు చేయకుండా నిలువరించాలని మానూరు శ్రీనివాస్ పిటిషన్ వేశారు. ఈ కామెంట్లపై సీబీఐ ఎలాంటి దర్యాప్తు జరపలేదని పేర్కొన్నారు. అయితే.. దర్యాప్తు పెండింగ్‌లో ఉన్నప్పుడు జోక్యం చేసుకోలేమని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేస్తూ పిటిషన్ కొట్టివేసింది. అన్ని అంశాలు పరిశీలించాకే సీబీఐతో సిట్ వేయించామని పేర్కొంది. ఏదైనా ఉంటే సీబీఐ ముందే చెప్పుకోవాలని సూచించింది.



4

## టెహ్రాన్‌లో పేలుడు

### తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు

# శుభవార్త



4

- అస్సాంలో ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభించిన ప్రధాని మోదీ

# ఇరాన్ వ్యూహాత్మక అడుగులు

### అమెరికాపై పట్టుకు వేగంగా కదులుతున్న పావులు

### గల్ఫ్ దేశాలకు ప్రాణసంకటంగా ఇరాన్ దాడులు



4

## అలా చేస్తే.. మహిళలకు ఉద్యోగం ఇవ్వరు!

- నిబంధనలు విధిస్తే ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి యజమానులు వెనుకాడుతారు
- పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు
- ప్రభుత్వాలే నిర్ణయించాలని సూచన

4





# ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ ప్రమాణ స్వీకారం

**ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ చేత ప్రమాణం**

**ఏపీ హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి కానున్న జస్టిస్ లీసా గిల్**

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమె చేత ప్రమాణ స్వీకారం చేయించారు. పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ లీసా గిల్, ఇటీవలే బదిలీపై ఏపీ హైకోర్టుకు వచ్చారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏప్రిల్ నెలలో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో, ఆ తర్వాత ఏపీ హైకోర్టుకు మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ బాధ్యతలు చేపట్టనుండటం విశేషం. చండీగఢ్‌కు చెందిన జస్టిస్ లీసా గిల్ పంజాబ్ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. 1990లో పంజాబ్, హర్యానా హైకోర్టులో న్యాయవాదిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆమె, 2014 మార్చి 31న అదే హైకోర్టులో న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సుదీర్ఘ కాలం పాటు న్యాయవాదిగా, న్యాయమూర్తిగా విశేష సేవలు అందించిన ఆమె ఇప్పుడు ఏపీ హైకోర్టులో బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అడ్వకేట్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కేవీ రఘు కుమార్, బార్ కౌన్సిల్ ఛైర్మన్ ద్వారకానాథ్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీ నారాయణతో పాటు పలువురు సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ లీసా గిల్‌కు సహచర న్యాయమూర్తులు, న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఏపీ జెన్‌కో అద్భుత ప్రతిభ

**ఒకే రోజు 6160 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి**

**అధికారులను అభినందించిన సీఎం చంద్రబాబు**

**అమరావతి, మార్చి 13:** ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ విజయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఏపీ జెన్కో ఒకే రోజు 6160 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సాధించి సరికొత్త చరిత్ర సృష్టించిందని వ్యాఖ్యానించారు. ఈ నెల 11వ తేదీన, 6160 మెగావాట్ల ఉత్పత్తితో 93.19 శాతం సామర్థ్యాన్ని సాధించడం గొప్ప విషయమని తెలిపారు. ఈ రికార్డు ఒక్కరోజే సాధించడం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగానికి సాక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఘనత సాధించడంలో భాగస్వాములైన జెన్‌కో ఎ÷-లాంట్ల కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది, ఉన్నతాధికారులకు, శాఖా మంత్రికి, మొత్తం జెన్‌కో టీమ్‌కు సీఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వ 20 నెలల పాలనలో విద్యుత్ రంగం పుంజుకుని వెలుగులు జిమ్ముతోంది అనేందుకు ఈ ఘనత సాక్ష్యమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో జెన్‌కో సాధించే విజయాలు రాష్ట్రానికి మాత్రమే కాకుండా, దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఒకే రోజు 6160 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించటం జెన్‌కోకి చరిత్రాత్మక ఘనత అని వెల్లడించారు. ఈ విజయంతో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగం భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సృష్టించేందుకు సిద్ధమైందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

# ఏపీ సమాచార కమిషనర్‌తో పంజాబ్ సీఐసీ భేటీ

**ఆర్టీఐ అమలు, కేసుల పరిష్కారంపై ఇరువురి చర్చ**

**ఒకరినొకరు సత్కరించుకున్న పీఎస్ నాయుడు, ఇంద్రపాల్ సింగ్**

**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడును పంజాబ్ రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ (సీఐసీ) ఇంద్రపాల్ సింగ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు కమిషనర్లు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలు తీరుతెన్నులపై సుదీర్ఘంగా చర్చించారు. ఏపీ సమాచార కమిషన్ పనితీరు, కేసుల విచారణ ప్రక్రియ గురించి పంజాబ్ సీఐసీ ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పంజాబ్ రాష్ట్రంలో 'సెకండ్ అప్పీల్' (రెండో అప్పీలు) కేసులను వేగంగా ఎలా పరిష్కరిస్తున్నారో (డిస్పోజల్) ఇంద్రపాల్ సింగ్ వివరించారు. సమాచార హక్కు చట్టాన్ని మరింత సమర్థవంతంగా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో ప్రభుత్వాల సహకారం ఎంతో కీలకమని ఇరువురు అభిప్రాయపడ్డారు. ఈ భేటీ ద్వారా రెండు రాష్ట్రాల కమిషన్ల మధ్య పనితీరుపై అనుభవాల మార్పిడి జరిగిందని వారు పేర్కొన్నారు. సమావేశం అనంతరం, ఏపీ స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ పి.ఎస్. నాయుడు పంజాబ్ సీఐసీ ఇంద్రపాల్ సింగ్‌ను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అదేవిధంగా, పంజాబ్ సీఐసీ కూడా నాయుడును గౌరవపూర్వకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ కూడా పాల్గొన్నారు.




# అమరావతి నిర్మాణాలు మరింత వేగవంతం

మొదటి పేజీ తరువాయి

చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా 17 వేల మందికి కొత్తగా ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. దీనికోసం 3,500 సూక్ష్మ పరిశ్రమలకు రూ.300 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నారు. మహిళా ఉద్యోగుల కోసం 'సఖీ నివాస్' పేరుతో పిల్లల సంరక్షణ సౌకర్యాలు కలిగిన హాస్టళ్లను ఏర్పాటు చేయనున్నారు. పోలీసు శాఖలో 300 మంది హెడ్ కానిస్టేబుల్ పోస్టులను రిజర్వ్ సబ్ ఇన్ స్పెక్టర్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏపీ పబ్లిక్ ఎంఎ÷-లాయ్‌మెంట్ ఆర్డర్‌లో పోలవరం, మార్కాపురం జిల్లాలను చేర్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపనున్నారు. పోలవరం ప్రాజెక్టులో కీలకమైన పనుల కోసం దాదాపు రూ.48 కోట్లను అదనంగా కేటాయించారు. మే 15 నాటికి సాగునీరు విడుదల చేయాలని, ఆ లోపు కాలువలు, డ్రెయిన్ల మరమ్మతుల కోసం 'జలధార' కార్యక్రమాన్ని ఏప్రిల్ 2 నుంచి 90 రోజుల పాటు చేపట్టాలని సీఎం ఆదేశించారు. అమరావతి అభివృద్ధి, ఉపాధి సృష్టి, జలవనరులు, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, విద్యుత్ అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఆర్డీఏ నిర్ణయాలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. తిరుపతి, విజయవాడ, విశాఖ అప్పీల్ కార్యాలయాల పరిధిపై నిర్ణయం తీసుకున్నారు. ఏపీ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ చట్ట గెజిట్‌కు ఆమోదం పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్‌లో పోలవరం, మార్కాపురం జిల్లాలు చేర్చే ప్రతిపాదనలను కేంద్రానికి పంపే అజెండాకు అమోదం. పోలవరం ప్రాజెక్ట్ హెడ్ వర్క్సులో అదనపు గ్రానైట్ కొనుగోలు, లైనింగ్



పనులకు రూ.23.47 కోట్లు కేటాయింపు, పోలవరం ప్యాకేజ్-64 పనులకు రూ.24.51 కోట్లు మంజూరుకు అనుమతి లభించింది. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్‌లో అత్యవసర మరమ్మతు పనులకు నిధుల మంజూరు చేస్తూ ఆమోదించింది. క్యాబినెట్‌లో అజెండా అంశాలు ముగిసిన తర్వాత వివిధ అంశాలపై సీఎం చర్చించారు. గ్యాస్ కొరత రాకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. కొందరు గ్యాస్‌కు బదులుగా ఎలక్ట్రిక్ స్టవ్‌లు వాడుతున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఎలక్ట్రిక్ స్టవ్‌లతో విద్యుత్ డిమాండ్ పెరగడంతో పరిస్థితి పర్యవేక్షించాలని సీఎం సూచించారు. ఏప్రిల్ 2న శాఖల పనితీరుపై నివేదికలు ఇస్తానని, వాటి ఆధారంగా సమీక్ష చేసుకొని పురోగతి సాధించాలని సూచించారు. ఏప్రిల్ 2 నుంచి 90 రోజులపాటు జలధార కార్యక్రమం చేపట్టాలన్నారు. కాలువలు, డ్రెయిన్లు శుభ్రం చేయించి భూగర్భ జలాలను పెంచాలన్నారు. మే 15నాటికి సాగునీరు విడుదల చేయాలని ఆదేశించారు. చివరి ఎకరానికి కూడా నీరిచ్చేలా జలధార కార్యక్రమం జరగాలని ఆదేశించారు. కేబినెట్ అజెండా ముగిసిన తర్వాత సీఎం చంద్రబాబు గ్యాస్ సరఫరా, విద్యుత్ వినియోగంపై చర్చించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా గ్యాస్ కొరత ఏర్పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. గ్యాస్ కొరత వల్ల ప్రజలు ఎలక్ట్రిక్ స్టవ్‌ల వైపు మళ్లుతున్నారని, దీనివల్ల విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 2న ప్రభుత్వ శాఖల పనితీరుపై నివేదికలు విడుదల చేస్తానని.. ఆ ఆధారంగా మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని మంత్రులకు దిశానిర్దేశంచేశారు.

# అమరావతిలో దేశంలోనే తొలి 'ఏఐ' క్యాంపస్

- బిట్స్ పిలానీ కీలక నిర్ణయం
- మంత్రి లోకేశ్‌తో బిట్స్ ప్రతినిధుల భేటీ
- రూ. 1000 కోట్ల పెట్టుబడి.. 70 ఎకరాల్లో అత్యాధునిక నిర్మాణాలు..
- 7 వేల మంది విద్యార్థులకు అవకాశం

**అమరావతి:** రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న బిట్స్ పిలానీ దేశంలోనే మొట్టమొదటి పూర్తిస్థాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్యాంపస్‌గా అవతరించబోతోంది. శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌తో ఆ సంస్థ ప్రతినిధులు సమావేశమై క్యాంపస్ నిర్మాణ ప్లాన్లను వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం రాబోయే ఐదేళ్లలో రూ. 1000 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రతినిధులు వెల్లడించారు. అధునాతన సాంకేతికతతో పాటు వ్యవసాయం, వాతావరణం, ఆరోగ్య



సంరక్షణ వంటి రంగాల్లో ఏఐ వినియోగంపై ప్రత్యేక కోర్సులు ఇక్కడ అందుబాటులో ఉండనున్నాయి. మందడం, వెంకటపాలెం మధ్య సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన 70 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్యాంపస్ నిర్మాణం కానుంది. క్యాంపస్‌లో ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ వంటి నెక్స్ట్ జెనరేషన్ కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు ప్రతినిధులు తెలిపారు. రెండు దశల్లో సుమారు 7 వేల మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించేలా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. పర్యావరణహితంగా గ్రీన్ బిల్డింగ్, రెన్యువబుల్ ఎనర్జీ విధానాలను పాటిస్తూ ఈ నిర్మాణాలను చేపడుతున్నట్లు వారు వివరించారు. మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో క్యాంపస్‌ను సిద్ధం చేయాలని, సాధ్యమైనంత త్వరగా తరగతులు ప్రారంభించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణను కలిసిన ప్రతినిధులు, భవనాల డిజైన్లను చూపించారు. రెండున్నరేళ్లలో మొదటి దశ అడ్మిషన్లకు క్యాంపస్ సిద్ధమవుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. బిట్స్ ప్రతినిధులు సిద్ధార్థ బెనర్జీ, ఎన్. చెన్నవీర్, బీఎస్ సహాని తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# జువ్వలదిన్నె ప్రైవేటీకరణ కాలేదు..

- అదంతా వైసీపీ దుష్ప్రచారం!
- 7 ఎకరాల్లో మాత్రమే రక్షణ రంగ యూనిట్..
- హార్బర్ ప్రభుత్వ పరిధిలోనే: మంత్రులు
- రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా జగన్ కుట్రలు.. అడ్డుకుంటే ఉపేక్షించం

**అమరావతి, మార్చి 13:** నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ప్రైవేట్ పరం చేస్తున్నామంటూ ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న విమర్శల్లో ఎంతమాత్రం వాస్తవం లేదని రాష్ట్ర మంత్రులు బీసీ జనార్థన్ రెడ్డి, కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులను అడ్డుకోవడమే లక్ష్యంగా జగన్ అండ్ కో అసత్య ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. హార్బర్ ఇప్పటికీ ప్రభుత్వ మత్స్య శాఖ ఆధ్వర్యంలోనే ఉందని, మత్స్యకారుల ప్రయోజనాలకే కూటమి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని భరోసా ఇచ్చారు.




హార్బర్‌కు సంబంధించిన మొత్తం 114 ఎకరాల భూమిలో కేవలం 7 ఎకరాలను మాత్రమే 'సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ లిమిటెడ్'కు కేటాయించినట్లు మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి వివరించారు. ఈ సంస్థ ద్వారా సుమారు రూ. 2,500 నుంచి రూ. 3,000 కోట్ల పెట్టుబడి రాష్ట్రానికి వస్తుందని తెలిపారు. ఇది మత్స్యకారులకు ఆధునిక కమ్యూనికేషన్, ఉపగ్రహ సమాచారం మరియు వాతావరణ హెచ్చరికలను అందించడానికి ఉపయోగపడుతుందే తప్ప, వారి వేటను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకోదని స్పష్టం చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ బ్రాండ్‌లను చూసి అంతర్జాతీయ కంపెనీలు వస్తుంటే, పారిశ్రామికవేత్తలను జగన్ జైల్లో పెడతానని బెదిరించడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు.

**మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం**

మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో హార్బర్‌ను పూర్తి చేయని జగన్, ఇప్పుడు మత్స్యకారులను రెచ్చగొట్టడం సిగ్గుచేటని విమర్శించారు. జువ్వలదిన్నె వద్ద ఏర్పాటు కానున్న అటానమస్ షిప్ బిల్డింగ్ యూనిట్ దేశ రక్షణ రంగంలోనే విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని పేర్కొన్నారు. గతంలో మత్స్యకారుల పొట్టకొట్టేలా జీవో నెం. 217 తెచ్చిన చరిత్ర జగన్‌దని, కూటమి ప్రభుత్వం రాగానే వేటలో మరణించిన 95 మంది మత్స్యకారుల కుటుంబాలకు రూ. 4.75 కోట్లు చెల్లించామని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునే ఏ శక్తినైనా ఉపేక్షించేది లేదని, తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# జర్నలిస్ట్ మిత్రులకు ఉగాది పురస్కారాలు

**మరావతి :** జర్నలిస్ట్ మిత్రులకు ఉగాది పురస్కారాలు ఇవ్వనున్నట్లు రాష్ట్ర సమాచార సంబంధాల శాఖ కొలుసు పార్థసారథి చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలో జర్నలిస్టుల సంక్షేమానికి పలు పథకాలను ప్రభుత్వం ప్రకటిస్తుందని కొలుసు పార్ధ సారధి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం మంత్రిని మీడియా సెంటర్ లో కలసి జర్నలిస్టుల పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ త్వరలోనే తీపి కబురు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ యాదవ్ తో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ వెటరన్ జర్నలిస్టులు దూర ప్రాంతాల నుంచి విజయవాడ వచ్చి రాష్ట్ర కార్యాలయంలో బస్ పాసులు తీసుకోవడం వల్ల సొంత జిల్లాల్లో బస్సు సౌకర్యం కల్పించడం లేదని, వారికి సొంత జిల్లాలోనే పాసులు కేటాయించాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్రంలో పనిచేస్తున్న

- జర్నలిస్టు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- పరిశీలనలో జర్నలిస్ట్ పెన్షన్ స్కీమ్
- వెటరన్ జర్నలిస్ట్ లకు వారు కోరిన జిల్లాలో ఉచిత బస్ పాస్ సౌక్యం కల్పిస్తాం
- జర్నలిస్ట్ లకు త్వరలో శుభవార్త చెప్తాం
- ఏపీఎంపీఏ నేతలతో సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందిగా మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ వెటరన్ జర్నలిస్టులకు పనిచేసే చోటే బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని కమిషనర్ ను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్యాబినెట్ లో జర్నలిస్టుల సమస్యలపై చర్చించామని త్వరలోనే వారికి శుభవార్త చెబుతామని తెలిపారు. జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం అవార్డుల పంపిణీ తో పాటు ప్రమాద బీమా సౌకర్యం,20 లక్షలకు హెల్త్ కార్డుల పరిమితి పెంచడంతో పాటు పలు జర్నలిస్ట్ సంక్షేమ కార్యక్రమాలపై త్వరలోనే ఇది విధానము ప్రకటిస్తామని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఏ.పి.ఎం.పి. ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇస్కా రాజేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, విజయవాడ నగర అధ్యక్షులు టి అనిల్ కుమార్, జనరల్ సెక్రెటరీ జి శ్రీనివాసరావుతో పాటు పలువురు జర్నలిస్టులు ఉన్నారు.



# ఏపీ మాజీ డీజీపీ దొర మృతి

## అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి

## వివిధ హోదాల్లో పోలీస్ శాఖలో కీలక పదవుల నిర్వహణ

**హైదరాబాద్,మార్చి13:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్. జె. దొర మరణించారు. ఆయన వయస్సు 83 సంవత్సరాలు. గత కొంత కాలంగా ఆయన కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకున్నారు. అనంతరం ఇంటికి తిరిగి వెళ్లారు. ఇంట్లో బాత్‌రూమ్‌లో ఆయన పడిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు తెలుస్తోంది. 1965 ఐపీఎస్ బ్యాచ్ అధికారి హెచ్.జె.దొర.1996 నుంచి 2002 వరకు ఉమ్మడి ఏపీ డీజీపీగా దొర విధులు నిర్వహించారు. ఈ సమయంలో ఉమ్మడి ఏపీలో నక్సలైట్లను అణిచి వేయడంలో కీలకంగా వ్యవహరించారు. అలాగే సీఐఎస్ఎఫ్ డీజీగా, విజిలెన్స్ కమిషనర్‌గా సైతం దొర పని చేశారు. 943లో శ్రీకాకుళంలో హెచ్.జె.దొర జన్మించారు. తన సుదీర్ఘ జీవితకాలంలో దాదాపు 40 ఏళ్ల పాటు పోలీస్ విభాగంలో వివిధ హోదాల్లో ఆయన సేవలందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మొదట అడిషనల్ డీజీపీగా అనంతరం డీజీపీగా దొర బాధ్యతలు చేపట్టారు. 2002లో డిప్యూటేషన్‌పై దేశ రాజధాని న్యూఢిల్లీలో సీఐఎస్ఎఫ్ డీజీగా పని చేశారు. పోలీసు శాఖతోపాటు క్రీడారంగంలోనూ ఆయన చురుకైన పాత్ర పోషించారు. ఇండియన్ ఒలంపిక్స్, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. 1993లో పీపుల్స్ వార్ గ్రూపు లక్ష్యంగా చేసుకున్న 40 మంది పోలీసు అధికారుల జాబితాలో హెచ్.జె.దొర పేరు కూడా ఉంది. రాష్ట్రపతి చేతుల మీదుగా ఆయన పోలీస్ మెడల్ అందుకున్నారు.

## సిఎంలు, ప్రముఖుల సంతాపం

ఉమ్మడి ఆంధప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర మృతి పట్ల తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలీసుశాఖకు బ్రాండ్ క్రియేట్ చేయడంలో హెచ్‌జే దొర కీలక పాత్ర పోషించారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. నక్సల్స్ సమస్య పరిష్కరించడంలో సమర్థంగా వ్యవహించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా, డీజీపీగా హెచ్‌జే దొర సేవలను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. పోలీసు శాఖలో పలు సంస్కరణలు తీసుకురావడంలో, పోలీసు శాఖను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన ఎంతో కృషి చేశారన్నారు. దొర కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సీఎం రేవంత్ తెలియజేశారు. హెచ్.జె.దొర మృతి పట్ల వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సంతాపం తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, హైదరాబాద్ సీపీ సజ్జనార్, పోలీస్ సంక్షేమ సంఘం సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

# 33 కిలోల గంజాయి స్వాధీనం

## నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

**అల్లూరి,మార్చి13:** అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 33 కేజీల గంజాయిని పోలీసుల స్వాధీనం చేసి, నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో కొయ్యూరు మండలం చీడిపాలెం జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఆటో, బైక్‌పై అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని పట్టుకుని తనిఖీ చేయగా.. ఆటోలో రెండు గోనె సంచుల్లో ఉన్న 33.245 కేజీల గంజాయిని ఉన్నట్లు గుర్తించామన్నారు. గంజాయి రవాణా చేస్తున్న మసాడ బాబ్జి, పాంగి సింహాచలం, గంగుల సూర్య ప్రతాప్‌రెడ్డి, వంటాకుల రాజుబాబు అనే నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు వెల్లడించారు. నిందితులు ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి సామర్లకోట ప్రాంతానికి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. వారి వద్ద నుంచి ఆటో, బైక్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

# గ్యాస్ అక్రమ నిల్వలు స్వాధీనం



**తిరుపతి,మార్చి13 :** గ్యాస్ కొరత కలవరపెడుతున్న వేళ.. ఏపీలోని తిరుపతి నగర శివారులో భారీగా గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వలు బయటపడ్డాయి. అవిలాల పంచాయతీ పరిధిలో దాదాపు 400 గ్యాస్ సిలిండర్లను పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్యాస్ సిలిండర్లు అక్రమంగా నిల్వ చేసినట్లు సమచారం అందుకున్న జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచల రాజు తన సిబ్బందితో వెళ్లి సోదాలు నిర్వహించారు. గో గ్యాస్ పేరుతో గోదాముల్లో సిలిండర్లు నిల్వ చేసినట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వైకాపా హయాంలో గో గ్యాస్ పేరుతో తిరుమలకు అక్రమంగా గ్యాస్ సరఫరా అయినట్లు గుర్తించారు. గో గ్యాస్ సంస్థకు 2019 వరకే గ్యాస్ సరఫరా అనుమతులున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# భక్తులపైకి దూసుకెళ్లిన బొలెరో

**శ్రీశైలం,మార్చి13:** శ్రీశైల మహాక్షేత్రంలోని టోల్ గేట్ వద్ద భక్తులపైకి బొలెరో వాహనం అదుపుతప్పి దూసుకెళ్లింది. వాహనం బ్రేక్ ఫెయిలై కూడలి వద్ద కొందరు కన్నడ భక్తులను ఢీకొడుతూ ముందుకెళ్లింది. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. వీరిని దేవస్థానం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. ఉగాది మహోత్సవాలను పురస్కరించుకొని ఆలయానికి అధిక సంఖ్యలో కన్నడ భక్తులు వస్తున్నారు. ఈ క్రమంలో కొందరు గాయపడ్డారు. బొలెరో దూసుకు వస్తుండడం గమనించి భక్తులు పక్కకు తప్పుకోవడంతో ముప్పు తప్పింది.

# నేడు జనసేన ఆవిర్భావ దినోత్సవం

- అల్లూరు జిల్లా గిరిజనలతో నేడు పవన్ భేటీ




**అమరావతి, మార్చి 13 :** మార్చి 14న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ శ్రేణులు వేడుకలకు సిద్ధమయ్యారు. అయితే, ఈ ఏడాది పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని గిరిపుత్రుల మధ్య జరుపుకోవాలని పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్ణయించారు. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గంలోని నందిగరువు గ్రామంలో పవన్ కళ్యాణ్ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొంటారు. గిరిజనుల కష్టసుఖాలను తెలుసుకుంటూనే, వారి మధ్యే పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించనున్నారు. తొలుత ఓనూరు జంక్షన్ వద్ద జనసేన జెండాను పవన్ కళ్యాణ్ ఆవిష్కరిస్తారు. అనంతరం 'పీఎం జన్ మన్' (ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) పథకం కింద నిర్మించిన రోడ్లను ఆయన స్వయంగా పరిశీలిస్తారు. ఓనూరు జంక్షన్ నుంచి నందిగరువు వరకు నిర్మించిన 2.4 కి.మీ రహదారిని కాలి నడకన ప్రయాణిస్తూ పనుల నాణ్యతను తనిఖీ చేస్తారు. తర్వాత నిర్మాణం పూర్తయిన రహదారులను గిరిజనుల సమక్షంలో ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత నందిగరువు గ్రామ ప్రజలతో పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా భేటీ అవుతారు. వారి సమస్యలను అడిగి తెలుసుకునేందుకు 'మాటా-మంతి' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పర్యటన చివరలో గిరిజనులతో కలిసి పవన్ కళ్యాణ్ మధ్యాహ్న భోజనం చేస్తారు. అధ్యక్షుడి పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో జనసైనికులు సేవా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే పార్టీ ప్రధాన లక్ష్యమని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# రైతుల కోసం అనేక కార్యక్రమాలు

- పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణాకు తరలింపు
- అన్నదాత సుఖీభవ కింద రైతు ఖాతాలో ఏటా 20వేలు జమ
- సూరంపల్లిలో అన్నదాత సుఖీభవను ప్రారంభించిన సీఎం చంద్రబాబు




**విజయవాడ,మార్చి13 :** రాష్ట్రంలోని రైతులను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఒక్కో రైతుకు రూ. 6వేలు ఇస్తున్నామన్నారు. రైతు ఖాతాలో ఏటా రూ.20 వేలు జమ చేస్తున్నామని తెలిపారు. కేంద్రం రూ. 6 వేలు ఇస్తే.. మేం రూ.14 వేలు ఇస్తున్నామని చెప్పారు. శుక్రవారం కృష్ణాజిల్లా గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని సూరంపల్లిలో అన్నదాత సుఖీభవ, పీఎం సుఖీభవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని.. రైతుల ఖాతాల్లోకి ఈ పథకానికి సంబంధించిన నిధులు విడుదల చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రైతులు సైతం టెక్నాలజీ అందిపుచ్చుకుంటున్నారన్నారు. రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పంటలకు సమయానికి సాగునీరు ఇస్తున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా జలాలతో కలిపామని సీఎం చంద్రబాబు వివరించారు. ప్రధాని మోదీ అసోంలో ఉండి దేశంలోని రైతులందరి ఖాతాల్లో నగదు వేశారని.. ఇది టెక్నాలజీకి ఉండే మహిమ అని వివరించారు. అదే సమయంలో కేంద్రం ఇవ్వాల్సిన నగదు అక్కడ విడుదల చేస్తే.. మనం ఇక్కడ విడుదల చేశామని సీఎం చెప్పారు. అవన్నీ మీ ఖాతాల్లో ఇప్పుడు పరిశీలించుకునే పరిస్థితికి వచ్చిందంటే.. టెక్నాలజీ ఏ విధంగా పని చేస్తుందో మీరందరూ గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రోజు ఎన్నికల ముందు తాను, పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా తిరిగి మళ్ళీ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడంతోపాటు రైతుల్ని పూర్తిగా ఆదుకుంటామని మాట ఇచ్చామని చెప్పారు. అందుకే సూపర్ సిక్స్ పథకాలతోపాటు ఇంకొన్ని సంక్షేమ కార్యక్రమాలు హామీ ఇచ్చామని పేర్కొన్నారు. ఆ తర్వాత బీజేపీ కూడా కలిసి ఎన్డీఏ కూటమిగా ఏర్పాటయ్యామని సీఎం చంద్రబాబు వివరించారు. గడిచిన ప్రభుత్వం ఏ విధంగా దగా చేసిందనే విషయాలు కూడా మనం ఎప్పటికప్పుడు గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ?ఈ రోజు మూడో విడతలో 46,85000 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ. 6 వేలు డిపాజిట్ చేస్తున్నామని తెలిపారు. అటు కేంద్రం కానీ.. ఇటు రాష్ట్రం కానీ కలిపి మొత్తం రూ. 20 వేల అందిస్తున్నామన్నారు. ఈ విషయం రైతులందరూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. తాను రైతు బిడ్డనని.. మధ్యతరగతి కుటుంబంలో జన్మించి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. రైతు కుటుంబాలు ఇబ్బందుల్లో ఉండ కూదనే తన ఆలోచన, తపన అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సమైక్య ఆంధప్రదేశ్‌లోనే వ్యవసాయానికి ప్రత్యేక బ్జడెట్ పెట్టించామని చెప్పారు. కృష్ణాజిల్లాలో నీళ్లు ఆలస్యంగా రావడం వల్ల తుఫాన్‌తో రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు ఇవ్వడం ద్వారా పంటలను కాపాడామన్నారు. నేడు ఆంధప్రదేశ్ రాష్ట్రం అప్పుల సుడిగుండంలో ఉ ందన్నారు. ఏపీ ఇమేజ్ దెబ్బ తిందని.. పెట్టుబడులు పెట్టే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా నిలిచిపోయేలా చేశారన్నారు. ఇరవై నెలల్లో ఒక్కో సమస్యను పరిష్కారం చేసుకుంటూ వస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ఇన్ని సమస్యలు ఉన్నా.. మీకు న్యాయం చేసిన ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వమని ధైర్యంగా చెబుతున్నానన్నారు. 47లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు వేశామని పేర్కొన్నారు. ÷-రకృతి విపత్తుల సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామని.. రూ. 300 కోట్లు నష్ట పరిహారం, రూ.500 కోట్ల ధరల స్థిరీకరణకు కేటాయించామని గణాంకాలతో సహా సీఎం చంద్రబాబు వివరించారు. పక్కనే ఉన్న తమిళనాడు కానీ.. కర్ణాటక కానీ రైతులకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. కానీ ఏపీలో రైతుకు గిట్టుబాటు ధర ఇచ్చిన ఏకైక ప్రభుత్వం.. ఎన్డీఏ ప్రభుత్వమని స్పష్టం చేశారు. పొగాకు, ఉల్లి రైతులను ఆదుకునేలా ఆర్థిక సాయం అందించామని చెప్పారు. మోటా, కోకో పంటలు దెబ్బ తింటే.. మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకున్నామన్నారు. నష్టపోయిన రైతాంగానికి రూ.1,338 కోట్లు అందచేశామని గుర్తు చేశారు. మేము విజన్ 2047 తయారు చేశాం.. ప్రధాని నేతృత్వంలో వికసిత్ భారత్, ఏపీ ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 కల సాకారం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మనకు స్వాతంత్య్రం వచ్చి 2047 నాటికి వందేళ్లు అవుతుందన్నారు. ఆ సమయానికి మన దేశం, మన రాష్ట్రం అన్ని విధాలా అగ్రస్థానంలో ఉండాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

# వంటగ్యాస్ కొరతపై హోటల్స్ యజమానుల ఆందోళన



- ఆర్థిక మంత్రి పయ్యావులతో కలసి చర్చలు
- ఆంక్షలతో హోటల్స్ నడిపేందుకు సిద్ధమని వెల్లడి
- సోమవారం నిర్ణయం తీసుకుంటామన్న మంత్రి

**అమరావతి, మార్చి 13:** రాష్ట్రంలో వంటగ్యాస్ కొరత తీవ్రమవుతున్న నేపథ్యంలో విజయవాడ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అమరావతిలోని సచివాలయంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిశారు. గ్యాస్ కొరత కారణంగా హోటల్ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన పలు కీలక చర్యలపై చర్చించారు. విజయవాడ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమణ ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్యాస్ పొదుపు కోసం తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంటూ పలు ప్రతిపాదనలు మంత్రి ముందు ఉంచారు. గ్యాస్ వినియోగాన్ని తగ్గించేందుకు హోటళ్ల పనివేళలను కుదించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి సోమవారం హోటళ్లకు సెలవు దినంగా ప్రకటిస్తే గ్యాస్ పొదుపునకు అవకాశం ఉంటుందని సూచించారు. రెస్టారెంట్లలో లభించే మెనూను కుదించాలని, అలాగే ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ వ్యాపారాన్ని నియంత్రించడం ద్వారా గ్యాస్ వినియోగాన్ని అదుపు చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం రెస్టారెంట్లకు కేవలం 75శాతం మాత్రమే గ్యాస్ సరఫరా జరుగుతోందని, హోటళ్లకు ఇచ్చే కోటా గ్యాస్ మరో రెండు రోజుల్లో పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ ÷వ్ స్టార్ హోటల్స్ ప్రెసిడెంట్ స్వామి మాట్లాడుతూ, ÷వ్ స్టార్ హోటళ్లకు మరో 5 నెలల వరకు సరిపడా అఔఉ గ్యాస్ కనెక్షన్ ఉ ందని తెలిపారు. అయితే, సాధారణ హోటళ్లు మూతపడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉ ందన్నారు. హోటల్ యజమానుల సమస్యలను విన్న మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించారు. అన్ని హోటళ్లు ఒకేసారి కాకుండా, ప్రాంతాల వారీగా షెడ్యూల్ ప్రకారం తెరిచి ఉంచేలా ఆలోచన చేయాలని మంత్రి సూచించారు. గ్యాస్ కొరతపై చర్చించేందుకు సోమవారం తర్వాత మంత్రుల కమిటీ సమావేశం కానుందని, ఆ రోజు హోటల్ అసోసియేషన్ ప్రతినిధులను కూడా పిలిచి చర్చించి కీలక నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. బర్నర్ల వినియోగం తగ్గించడం, ఇతర పొదుపు చర్యలపై ప్రభుత్వం త్వరలోనే స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయనుందని మంత్రి పేర్కొన్నారు. కాగా, వంటగ్యాస్ కొరత ప్రభావం సామాన్యులతో పాటు హోటల్ పరిశ్రమపై తీవ్రంగా పడుతోంది. ప్రభుత్వం తీసుకునే 'సోమవారం నిర్ణయం' రాష్ట్రంలోని వేలమంది హోటల్ కార్మికులు, వినియోగదారులపై ప్రభావం చూపనుంది.

# పెద్దపులి కలకలం

## కాకినాడ జిల్లాలో శంఖవరం మండలంలో హై అలర్ట్!

**కాకినాడ, మార్చి 13:** ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి పెద్దపులి సంచారం ప్రజల్లో భయాందోళన రేపుతోంది. ముఖ్యంగా గోదావరి జిల్లాల పరిసర ప్రాంతాల్లో పెద్దపులి కదలిక ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కాకినాడ జిల్లా శంఖవరం మండలంలో పెద్దపులి సంచరిస్తున్న విషయం తెలుసుకొని ప్రజలు భయంతో వణికిపోతున్నారు. మండల పరిధిలోని గౌరవంపేట పంచాయతీ, రాజవరం - మాసంపల్లి గ్రామాల మధ్య ఉన్న సరుగుడు తోటల్లో పెద్దపులి కదలికలను గుర్తించడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం ఈ పెద్దపులి మెడలో జీపీఎస్ రేడియో కాలర్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీని సాయంతో పులి కదలికలను అటవీశాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్న అధికారులు, పులిని సురక్షితంగా బంధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పెద్దపులి ఎటువైపు వెళ్తోంది? ఎక్కడ ఆగుతోంది? అనే అంశాలను గమనించడానికి డ్రోన్లను, అత్యాధునిక కెమెరా ట్రాప్‌లను రంగంలోకి దించారు. పెద్దపులి సంచరిస్తున్న మార్గాల్లో ఇప్పటికే ఇనుప ట్రాక్ కేజ్‌లను(బోన్లను) అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. పలిని పట్టుకునేందుకు భారీ ఆపరేషన్ నిర్వహించే అవకాం ఉంది. రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ రంగంలోకి దిగాయి. నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ నుంచి నిపుణులైన బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన అవకాశం ఉంది. అవసరమైతే పశు వైద్యుల పర్యవేక్షణలో ట్రాంక్విలైజర్ గన్‌తో మత్తుమందు ఇచ్చి పులిని అదుపులోకి తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. శంఖవరం మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, ముఖ్యంగా తోటల్లో పనులు చేసేవారు, పశువుల కాపరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు, ఒంటరిగా అటవీ ప్రాంతాలకు, తోటల్లోకి వెళ్లవద్దని హెచ్చరించారు.



మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



సంపాదకీయం

# అపరిపక్వ విపక్షనేత రాహుల్ గాంధీ!

భారత ప్రజాస్వామ్యంలో విపక్ష నేత అంటే బురదజల్లే నేత అని అర్థం రూఢి అవుతోంది. అధికారంలో ఏ పార్టీ ఉన్నా విపక్షంలో ఉన్నవారు నాలుగు రాళ్లు వేయడం, బురద జల్లడం, ప్రభుత్వం ఏం చెబుతుందో తెలుసుకోకుండానే సభనుంచి నిష్క్రమించడం పరిపాటిగా మారింది. సరిగ్గా లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ ఇప్పుడు అదే పాత్రలో ఒదిగి పోయారు. పశ్చిమాసియా యుద్ధంతో ప్రపంచమంతా వణుకుతోంది. అమెరికా, ఇజ్రాయిల్ ఆయుధ బలంతో ఇరాన్‌ను ధ్వంసం చేయడం ద్వారా ప్రపంచంలోని మారుమూల పల్లె కూడా ప్రభావితం అవుతోంది. మనవద్ద గ్యాస్, ఇంధన కొరతలను ఎదుర్కొంటున్నాం. ఇదేమీ మోడీ తెచ్చుకున్న విపత్తు కాదు. లేదా కావాలని కోరుకున్నదీ కాదు. అధికారంలో కాంగ్రెస్ ఉండివుంటే ఇంతకన్నా దారుణంగా ఉండేది. ఎందుకంటే బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాతనే క్రూడాయిల్ దిగుమతి పెరిగింది. ఇంధన సామర్థ్యం పెరిగింది. దేశంలో రిఫనరీల సామర్థ్యం పెంచి వ్యాపారం చేసుకునే స్థాయికి ఎదిగింది. గ్యాస్ అందరికీ అందుబాటులోకి వచ్చింది. మారుమూల పల్లెలకు సైతం గ్యాస్ చేరుతోంది. ఇతర దేశాలకు కూడా ఇంధనం సరఫరా చేసే స్థాయికి భారత్ ఎదిగింది. వివిధ దేశాలతో సత్సంబంధాలే ఇందుకు నిదర్శనం. ఇంత సంక్షోభంలోనూ ఇరాన్ మనపట్ల సానుకూలంగా ఉందంటే, మనం అనుసరిస్తున్న విదేశాంగ విధానమే కారణం. రాహుల్ చెప్పటినట్లు నడుచుకుంటే దేశం ఏనాడో భ్రష్టు పట్టిపోయేది. ఇకపోతే ఈ సంక్షోభంలోనూ మనం బంగ్లాదేశ్‌కు ఇంధనం సరఫరా చేయగలిగాం. పార్లమెంటులో రాహుల్ చేసిన ప్రసంగం చిన్నపిల్లవాడికన్నా అధ్వాన్నంగా ఉంది. దేశంలో ప్రస్తుతం నెలకొన్న వంట గ్యాస్ కొరతకు, ఎప్‌స్టిన్ ఫైల్స్‌లో పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి పేరు ఉండ డానికి సంబంధం ఉందంటూ విపక్షనేత రాహుల్ లోక్‌సభలో గురువారం చేసిన ఆరోపణలు ఆయన అజ్ఞానానికి నిదర్శనంగా చూడాలి. రాజకీయ పరిపక్వత లేని నేత విపక్ష నేతగా ఉన్నందుకు సిగ్గుపడాలి. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా వంట గ్యాస్ కొరత ఏర్పడింది. అయినా కేంద్రం దానిని మానిటర్ చేస్తోంది. ఇంధన భద్రతపై ప్రభుత్వం రాజీ పడినందువల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని రాహుల్ చేసిన విమర్శలు దేశం పట్ల ఆయనకున్న అవగాహన ఇదేనని అర్థం చేసుకోవాలి. దేశ ఇంధన అవసరాలపై అమెరికా ఆంక్షలు విధించే స్థితికి తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. మనం ఆయిల్‌ను ఎవరి నుంచి కొనుగోలు చేయాలి, గ్యాస్‌ను ఎక్కడి నుంచి తీసుకురావాలి అన్న నిర్ణయాలను అమెరికాకు విడిచిపెట్టాం అనడంలో అర్థం లేదు. విదేశాల నుంచి వాణిజ్యానికి కూడా కొన్ని పరిమితులు ఉంటాయి. రష్యా నుంచి ఆయిల్ కొనాలా, వద్దా అన్నది కూడా వాణిజ్య ఒపపందాలకు ముడిపడి ఉన్న అంశం. ఈ మాత్రం తెలియని వ్యక్తి విపక్ష నేతగా ఎలా ఉంటున్నారో ప్రజలు తెలుసుకోవాలి. ఇకపోతే మాట్లాడేదంతా మాట్లాడిన అన్నా చెల్లెళ్లు రాహుల్, ప్రియాంకలు ప్రభుత్వం సమాధానం ఇచ్చే వరకు వేచి చూడకుండా సభ నుంచి నిష్క్రమించారు. ఇది చాలు..వారు ఎంత చిత్తశుద్ధిగా ఉన్నారో తెలియడానికి. బయటకు వెళ్లి ధర్నాలు చేయడం తప్ప రాహుల్‌కు తెలిసిందేమీ లేదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇరాన్ మన దేశం పట్ల చాలా సానుకూలంగా ఉండడంతో తొలి చమురు నౌక భారత్ చేరుకోగలిగింది. అలాగే రష్యా నుంచి మనం ఇంధన దిగుమతులకు అమెరికా తలూపింది. ఇవన్నీ కూడా విదేశాంగ నీతిలో ఓ భాగం. ఇకపోతే ఈ యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియదు. అందువల్ల దేశంలో ఉన్న ఇంధన వనరులను జాగ్రత్తగా వాడుకోవాల్సిందే. తమ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్ అక్రమంగా సాగిస్తున్న యుద్ధానికి సహకరిస్తున్న స్థావరాలను మూసివేయల్సిందిగా పొరుగున గల గల్ఫ్ అరబ్ దేశాలను ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ముజ్తబా ఖమేనీ కోరారు. లేనిపక్షంలో వాటిపై దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీంనేతగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంపై తీవ్రంగానే స్పందించారు. పూర్తిగా సాధించేవరకు ప్రతీకారానికి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. కీలకమైన హార్మూజ్ జలసంధిని గురువారం కూడా మూసివేయా లని ఆదేశించారు. ఇంత జరుగుతున్న ట్రంప్ ఇంకా తన వంకర బుద్ధిని మార్చుకోవడం లేదు. ముడి చమురు ధరల కన్నా కూడా ఇస్లామిక్ రిపబ్లిక్ 'దుష్ట సామ్రాజ్యాన్ని' నిలువరించడమే తమకు మరింత ముఖ్యమని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆయన దుర్మార్గాన్ని బయటపెడుతున్నాయి. చమురు ద్వారా లాభాలు ఆర్జించడం కన్నా ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోకుండా అడ్డుకోవాలన్నదే ప్రాధాన్యత అని చెప్పారు. ఇరాన్ అణుశక్తిని సమకూర్చుకోవడాన్ని అనుమతించేది లేదంటూ వ్యాఖ్యానించారు. 'పని పూర్తి చేయాలని' అమెరికా కృతనిశ్చయంతో ఉన్నదని ట్రంప్ తెలిపారు. యుద్ధంలో సమర్ధవంతంగా విజయాన్ని సాధించామని, అయినప్పటికీ సైనిక చర్యలు కొనసాగు తాయన్నారు. మనవరకు మనం ఇంధన అవసరాలు తీర్చుకోవడం ముఖ్యం. దేశంలో ఇంధన సంక్షోభ పెచ్చరిల్లుతున్న సమయంలో భారత్‌కు పెద్ద ఊరట లభించింది. భారత్ పతాకంతో ఉన్న నౌకలను హార్మూజ్ జలసంధిని దాటేందుకు ఇరాన్ అనుమతించింది. భారత్, ఇరాన్ విదేశాంగ మంత్రులు జైశంకర్, అబ్బాస్ అరాగ్చీ ఫోన్లో మాట్లాడిన అనంతరం మన దేశానికి ఈ ఉపశమనం దక్కింది. పుష్పక్, పరిమళ్ అనే రెండు భారతీయ నౌకలు క్షేమంగా హార్మూజ్ జలసంధిని దాటాయి. ఇంకా ఇలాంటి ప్రయత్నాలు ఉండనున్నాయి. ఇది ఓ రకంగా మనం అనుసరిస్తున్న విదేశాంగ విధాన విజయానికి సూచిక.

డాక్టర్ కంచర్ల అచ్యుత రావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక



# ఇరాన్ వ్యూహాత్మక అడుగులు

- అమెరికాపై పట్టుకు వేగంగా కదులుతున్న పావులు
- గల్ఫ్ దేశాలకు ప్రాణసంకటంగా ఇరాన్ దాడులు

**న్యూఢిల్లీ, మార్చి 13:** అమెరికా, ఇజ్రాయిల్ కలిసి చేస్తున్న యుద్ధంతో ఇప్పుడు ప్రపంచం యావత్తూ అతలాకుతలం అవుతోంది. ప్రధానంగా ఇంధన సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. ఈ యుద్ధం నుంచి వెన్నక్కి తగ్గలేక, ముందుకు వెళ్లలేక గింజుకుంటున్నాయి. ఈ యుద్ధంతో ఇజ్రాయిల్ పెద్దగా నష్టపోకున్నా, అమెరికా మాత్రం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతోంది. అలాగే ఇరాన్‌ను దెబ్బతీయాలన్న లక్ష్యం నెరవేరలేదు. అంతేగాకుండా ప్రజల మద్దతుతో ఇరాన్ మరింత బలంగా దాడులను తిప్పికొట్టడానికి సిద్ధం అవుతోంది. ఇది ఓ రకంగా అమెరికాకు పెద్ద నష్టం కానుంది. రష్యా ఉక్రెయిన్‌పై యుద్ధం చేసి కాళ్లూచేతులు కాల్చుకుంటోంది. ఇప్పుడు అమెరికాదీ అదే పరిస్థితి. ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ముజ్తబా ఖమేనీ ప్రస్తుత హెచ్చరికలు అమెరికాకు గుణపాఠం కావాలి. అమెరికా, ఇజ్రాయెల్... ఇరాన్‌ల మధ్య యుద్ధం తీవ్రస్థాయి ప్రాదేశిక రాజకీయ సంక్షోభంగా మారింది. ఈ పోరు ఇతర గల్ఫ్ దేశాలకూ, సముద్ర రవాణా మార్గాలకూ, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లకూ విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది. హార్మూజ్ జలసంధ వద్ద ఇరాన్ పట్టుతో ప్రపంచ దేశాలకు గమ్యం లేకుండా పోయింది. ఈ పరిస్థితిని అమెరికా అర్థం చేసుకునే స్థితిలో లేదు. ఇరాన్ అధినాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీని అమెరికా, ఇజ్రాయెల్‌లు హతమార్చడం ద్వారా ప్రత్యర్థి దేశపు బలాన్ని అంచనా వేయలేక పోయారు. అధినేతను తొలగిస్తే ఆ దేశాన్ని లొంగదీసుకోవాలన్న ఎత్తుగడలు దెబ్బతిన్నాయి. తమ అధినాయకుడి మరణం లేదా బలిదానం షియా వర్గాన్ని



మరింత భీకర ప్రతిఘటనకు పురిగొల్పుతుంది. తమ అధినేత మరణం ప్రజల్లో ప్రతీకారేచ్ఛను పెంచుతుంది. దేశాన్ని బలహీనపరచే బదులు ప్రభుత్వానికి ప్రజల మద్దతును మరింత విస్తృతం చేస్తుంది. సైనిక దాడుల్లో సాధారణ పౌరులు మరణించడం ద్వారా అమెరికా తలనొప్పులు తెచ్చుకుంది. పలుప్రాంతాల్లో ప్రజాగ్రహాన్ని పెంచుతోంది. బాధితుల వివరాలు సామాజిక మాధ్యమాల్లో, పత్రికలూ టీవీ ఛానళ్లలో వేగంగా ప్రసారమవుతూ అంతర్జాతీయ ప్రజాభిప్రాయాన్నీ, దౌత్య సంబంధాలనూ ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు, తనపై అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడి దాడికి సహకరించిన ఇతర గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టింది. ఖతార్, బహ్రెయిన్, కువైట్ తదితరాలపైనా... ముఖ్యంగా అక్కడి అమెరికా సైనిక స్థావరాలపైనా డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. ఇరాన్ నేరుగా అమెరికా భూభాగంపై దాడి చేయలేక పోవచ్చు కానీ, పశ్చిమాసియాలోని అమెరికా సైనిక వసతులను కకావికలం చేయగలదు. అందుకనే గల్ఫ్ దేశాలు ఇప్పుడు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఇలా జరుగుతందని అమెరికా ఊహించకపోవడం కూడా యుద్ధ వైఫల్యంగానే భావించాలి. ఓ రకంగా ఇరాన్ తెలివిగా అమెరికాను దెబ్బతీస్తోంది. అనేక గల్ఫ్ దేశాలు తమ విధానాలకు అనుగుణంగా అగ్రరాజ్య స్థావరాలకు ఆతిథ్యమిస్తున్నాయి. ఈ స్థావరాలు పశ్చిమాసియా అంతటా నిఘా కార్యకలాపాలు, నౌకాదళ మోహరింపులు, యుద్ధ విమానాల ప్రయాణాలకు వీలుకల్పిస్తున్నాయి. ప్రస్తుత యుద్ధంలో ఈ స్థావరాలపై ఇరాన్ గురిపెట్టడం ద్వారా అమెరికాను దెబ్బ కొట్టడంలో కృతకృత్యమయ్యిందనే చెప్పాలి. అందుకే ఇరాన్‌పై దాడి ద్వారా అమెరికా సాధించింది సున్నాయే కాక, ఈ యుద్ధంలో విజేత ఇరాన్ అనే చెప్పాలి. ఈ క్రమంలో తటస్థంగా ఉండాలని భావించిన దేశాలు కూడా ఇప్పుడు యుద్ధంలో ఇరుక్కుపోయే పరిస్థితి ఏర్పడింది. ఇంధన సరఫరా గొలుసులకు కేంద్రమైన పశ్చిమాసియా మొదటి నుంచీ అగ్రరాజ్యాల పోటీకి వేదికగా ఉంది. రష్యా, చైనాలకు ఇరాన్‌తో వ్యూహాత్మక సంబంధాలున్నాయి. అవి నేరుగా జోక్యం చేసుకోకున్నా- దౌత్య, ఆర్థిక మద్దతుతో ప్రభావితం చేస్తున్నాయి. హార్మూజ్ జలసంధి ఇరాన్ అదుపులో ఉండటం ఆ దేశానికి వ్యూహాత్మక బలంగా చూడాలి. అదే తమ ట్రంప్ కార్డు అని ఇరాన్ నూతన అధినేత కూడా వ్యాఖ్యానించారు. ఇకపోతే గల్ఫ్ పరిణామాలు భారతదేశంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతున్నాయి. ఇండియా ముడి చమురు కోసం పశ్చిమాసియాపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. హార్మూజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు అంతరాయం కలగడంతో అది భారతదేశ ఇంధన భద్రతను, ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తోంది. అయితే ఇవన్నీ ఇప్పట్లో కలొఇక్కి వస్తాయని అనుకోవడానికి లేదు. ప్రత్యమ్నాయాలు చూసుకోవాల్సిందే.

# టెహ్రాన్‌లో భారీ పేలుడు



**టెహ్రాన్:** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు సంభవించింది. అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా టెహ్రాన్ స్క్వేర్‌లో ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు అక్కడి అధికారిక మీడియా వెల్లడించింది. ఇరాన్‌లోని మరో నగరం ఖజ్విన్‌లోనూ భారీ పేలుడు సంభవించింది. ఈ దాడులు ఎవరు చేశారనే విషయం తెలియరాలేదు. అయితే, ఖజ్విన్, టెహ్రాన్‌లో పేలుళ్లు జరుపుతామని ఇజ్రాయెల్ ముందే హెచ్చరించింది. మరోవైపు.. దాడులు జరుగుతున్నప్పటికీ వేలాది మంది పౌరులు టెహ్రాన్ వీధుల్లోకి వచ్చి ఇజ్రాయెల్, అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండటం గమనార్హం.

- ఇరాన్‌కు ట్రంప్ మరో వార్నింగ్

### ఏం జరుగుతుందో చూడండి: ట్రంప్

ఇరాన్‌కు ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. మతి చెడిన నేతలకు ఇవాళ ఏం జరుగుతుందో మీరే చూస్తారన్నారు. "ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యింది. వైమానిక దళం కూడా ఇక ఉండదు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి. వారి నాయకులు తుడిచిపెట్టుకు పోయారు. 47 ఏళ్లుగా అమాయకులను పొట్టన పెట్టుకుంటున్నారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నా" అని సోషల్ మీడియాలో ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఇరాన్ త్వరలో లొంగిపోనుందని ఇటీవల జరిగిన జీ7 నేతల వర్చువల్ సమావేశంలో ట్రంప్ పేర్కొన్నట్లు యాక్సియోస్ వార్తా సంస్థ కథనం వెల్లడించింది.

### నలుగురు అమెరికా సైనికులు మృతి..

ఇక, అమెరికాకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 ట్యాంకర్ ఇరాక్‌లో కుప్పకూలిన ఘటనలో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు అమెరికా మిలటరీ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ప్రమాద సమయంలో విమానంలో ఆరుగురు సిబ్బంది ఉండగా.. అందులో నలుగురు చనిపోయినట్లు పేర్కొంది. సహాయక చర్యలు కొనసాగిస్తున్నామని, ఘటనకు దారితీసిన పరిస్థితులపైనా దర్యాప్తు చేస్తున్నామని తెలిపింది.

# చర్లపల్లికి మరో 'అమృత్ భారత్'

- అస్సాంలో ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభించిన ప్రధాని మోదీ
- తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు శుభవార్త



**అస్సాం:** తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు, ముఖ్యంగా హైదరాబాద్ వాసులకు దక్షిణ మధ్య రైల్వే ఒక తీపి కబురు అందించింది. అస్సాం రాజధాని గౌహతి సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కామాఖ్య నుంచి హైదరాబాద్‌లోని చర్లపల్లి టెర్మినల్ వరకు సరికొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాంలో ఈ రైలును ప్రారంభించారు. సికింద్రాబాద్, నాంపల్లి స్టేషన్లపై ఒత్తిడి తగ్గించేందుకు అభివృద్ధి చేసిన చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్‌కు ఈ రైలు రావడం విశేషం. వందే భారత్ రైళ్ల తరహాలోనే అత్యాధునిక సాంకేతికతతో.. తక్కువ ఖర్చుతో సామాన్యుల కోసం రూపొందించిన రైలే ఈ 'అమృత్ భారత్'. ఈ రైలుకు రెండు వైపులా ఇంజన్లు ఉంటాయి. దీనివల్ల వేగం పుంజుకోవడం సులభం అవుతుంది.. ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది. ఇందులో కేవలం స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు మాత్రమే ఉంటాయి. తక్కువ ధరలో సుదూర ప్రయాణం చేసే వారికి ఇది వరం అని చెప్పవచ్చు. సెన్సార్ వాటర్ ట్యాప్స్, మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు, మెరుగైన సీటింగ్, వెలుతురు వంటి ఆధునిక వసతులు ఇందులో ఉన్నాయి.

-- తెలుగు రాష్ట్రాల్లో స్టాపింగ్ పాయింట్లు ఇవే..

ఈ రైలు అస్సాం నుంచి బయలుదేరి పశ్చిమ బెంగాల్, ఒడిశా మీదుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ సాగుతుంది. మన రాష్ట్రాల్లో ప్రధానంగా శ్రీకాకుళం రోడ్, విజయనగరం జంక్షన్, పెందుర్తి, దువ్వాడ, సామర్లకోట జంక్షన్, రాజమహేంద్రవరం, తణుకు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, గుంటూరు రైల్వే స్టేషన్లలో ఆగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో నల్గొండ రైల్వే స్టేషన్ ఆగుతుంది. ఆ తర్వాత అక్కడ నుంచి చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుతుంది.

## నెలసరి సెలవులు తప్పనిసరి చేస్తే
# మహిళా ఉపాధికి విఘాతం

- నిబంధనలు విధిస్తే ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి యజమానులు వెనుకాడుతారు
- పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు
- ప్రభుత్వాలే నిర్ణయించాలని సూచన



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా మహిళా ఉద్యోగులకు, విద్యార్థినులకు నెలసరి సెలవులు (మెన్‌స్ట్రువల్ లీవ్) కల్పించేలా రాష్ట్రాలను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇటువంటి సెలవులను చట్టం ద్వారా తప్పనిసరి చేస్తే, అది మహిళల ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. నిబంధనలను కఠినతరం చేస్తే మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి యాజమాన్యాలు విముఖత చూపే అవకాశం ఉందని, ఇది వారి వృత్తిపరమైన ఎదుగుదలకు ఆటంకంగా మారుతుందని ధర్మాసనం పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని బెంచ్ ఈ పిటిషన్‌ను విచారిస్తూ.. ఈ అంశంలో ఉన్న సామాజిక, ఆర్థిక కోణాలను ప్రస్తావించింది. సెలవులు ఇవ్వడం వల్ల మహిళా ఉద్యోగులకు ప్రోత్సాహం లభిస్తుందన్న వాదన ఉన్నప్పటికీ, దానిని యజమానులపై బలవంతంగా రుద్దితే అది ప్రతికూల పరిస్థితులకు దారితీస్తుందని సీజేఐ వ్యాఖ్యానించారు. "చట్టం ద్వారా సెలవులను అనివార్యం చేస్తే, ప్రైవేట్ సంస్థలు మాత్రమే కాదు, ప్రభుత్వ రంగంలో కూడా మహిళలను తీసుకోవడానికి వెనుకాడుతారు. యాజమాన్యాల మనస్తత్వాన్ని మనం అర్థం చేసుకోవాలి" అని కోర్టు స్పష్టం చేసింది. నెలసరిని ఒక ప్రతికూల అంశంగా లేదా బలహీనతగా చిత్రీకరిస్తే అది మహిళలను ఆత్మన్యూనతకు గురిచేసే ప్రమాదం ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. కేరళ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే విద్యార్థినులకు కొంత మినహాయింపులు ఇస్తున్నారని, కొన్ని ప్రైవేట్ కంపెనీలు స్వచ్ఛందంగా సెలవులు ప్రకటిస్తున్నాయని కోర్టు గుర్తుచేసింది. అయితే, దేశవ్యాప్త విధానంపై కోర్టు ఆదేశాలు ఇవ్వడం కంటే, ప్రభుత్వం అన్ని వర్గాల (స్టేక్‌హోల్డర్ల) తో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవడమే సరైనదని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
# ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
శనివారం 14 - 03 - 2026 పేజీలు : 6

# రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడులు కీలకం

## జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి




**విజయనగరం , మార్చి 13 (మనసులో మాట) :** రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడులు కీలకమని, వాటిని ఆకర్షించడంలో జిల్లా కలెక్టర్లు చొరవ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. అమరావతి సచివాలయంలో కొనసాగుతున్న 6వ జిల్లా కలెక్టర్ల సమావేశం రెండో రోజున పెట్టుబడులు, పర్యాటకం, మౌలిక సదుపాయాలు, వైద్యారోగ్యం, సంక్షేమ పథకాలు, ఆదాయార్జన శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జిల్లాలను ప్రోత్సహిస్తూ పెట్టుబడులను ఆకర్షించేందుకు కలెక్టర్లు కమిట్మెంట్‌తో పని చేయాలని, పెట్టుబడిదారులను కన్విన్స్ చేసి వారికి పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఇందుకోసం కమిట్మెంట్ -కన్విన్స్ ,కోఆపరేట్ (3 సి) విధా నాన్ని అనుసరించాలని దిశానిర్దేశం చేశారు. పెట్టుబడులు వచ్చినపుడు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి ప్రజల తలసరి





ఆదాయం పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడానికి విశాఖ, అమరావతి, తిరుపతి ప్రాంతాలను ఎకనామిక్ రీజియన్ డెవలప్మెంట్ జోన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పెట్టుబడి ప్రతిపాదనలు వేగంగా గ్రౌండ్ అయ్యేలా అనుమతులు, భూకేటాయింపులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాల్లో పెట్టుబడులపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు.

### పర్యాటక రంగ అభివృద్ధిపై దృష్టి

రాష్ట్రంలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని సీఎం తెలిపారు. చారిత్రక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాలు, పురాతన కట్టడాలను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 50 వేల హోటల్ గదులు సిద్ధం చేయాలని, హోమ్ స్టేలు, కన్వెన్షన్ సెంటర్లు, మైస్ సెంటర్లు 8వ పేజీలో

## నర్సీపట్నంలో అట్టహాసంగా

# నూకాలమ్మ తల్లి గరగల తొలిజాగారం



**నర్సీపట్నం , మార్చి 13 (మనసులో మాట) :** నర్సీపట్నం పట్టణంలో వెలసిన శ్రీ నూకాలమ్మ తల్లి గరగల జాతర బుధవారం రాత్రి అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక సాగరంలో ప్రారంభమైంది. 'జాగారం' లో భాగంగా నిర్వహించిన మొదటి రోజు ఉత్సవం కనులపండువగా సాగింది. గౌరవ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పాత నివాసం వద్ద ఆయన సతీమణి చింతకాయల పద్మావతి గారు ప్రత్యేక పూజలు నిర్వహించి గరగలను ప్రారంభించారు. పద్మావతి మరియు వారి కుటుంబ సభ్యులు గరగలను నెత్తిపై ధరించి భక్తిశ్రద్ధలతో ఇంటి వద్ద నుండి ఊరేగింపుగా తీసుకు వచ్చారు. డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాల మధ్య సాగిన ఈ ఊరేగింపులో నర్సీపట్నం వీధులన్నీ భక్తి పారవశ్యంతో పులకించాయి. పాత ఇంటి నుండి ప్రారంభమైన ఈ యాత్ర రామాలయం వెనుక వీధి, చాకలి వీధి, ఐదు రోడ్ల జంక్షన్, వినాయక గుడి, తుని రోడ్డు, మెదరవీధి, సరస్వతి ప్రెస్ జంక్షన్, వేంకటేశ్వర స్వామి గుడి, తురకబడి, పాలగట్ సెంటర్, వెంకునాయుడు పేట, చిన్నమ్మవారి ఇల్లు, రామారావు పేట, కొత్తవీధి, గవర వీధి, కుమ్మరి వీధి మరియు కాపువీధి మీదుగా హరిజన కాలనీ వరకు తెల్లవార్లూ సాగింది. మార్గమధ్యలో మహిళలు గరగలపై పసుపు నీళ్లు పోస్తూ, ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గౌరవ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, శ్రీ నూకాలమ్మ తల్లి తమ ఇంటి ఇలవేల్పు అని, తమ కుటుంబం ప్రతి ఏటా ఈ పండుగను ఎంతో భక్తితో, అంగరంగ వైభవంగా నిర్వహిస్తోందని తెలిపారు. రెండవ జాగారం 14వ తేదీ, పెద్ద జాగారం 17వ తేదీ, 18వ తేదీన నూకాలమ్మ పండగ అంగరంగ వైభవంగా జరగనున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో టీడీపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, చింతకాయల రాజేష్ మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు ఆర్థిక భరోసా : సి.ఎం రమేష్



**అనకాపల్లి , మార్చి 13 (మనసులో మాట) :** రైతు సంక్షేమమే దేశ అభివృద్ధికి పునాది అన్న దృక్పథంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం రైతులకు గొప్ప ఆర్థిక భరోసాగా నిలుస్తోందని రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్,అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.యం రమేష్ పేర్కొన్నారు. ఎంపీ క్యాంప్ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడారు. పథకం ద్వారా ప్రతి సంవత్సరం రైతుల ఖాతాల్లోకి ఆరు వేలు నేరుగా జమ చేస్తూ రైతు కుటుంబాలకు ఆర్థిక మద్దతు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే మూడవ విడత కింద అనకాపల్లి జిల్లాలో కూడా ఈ పథకంద్వారా పెద్ద ఎత్తున రైతులు లబ్ధి పొందుతున్నారన్నారు. జిల్లాలో మొత్తం 2,42,536 మంది రైతులకు రూ.134.27 కోట్ల రూపాయలు జమ చేసినట్లు ఆయన వెల్లడించారు.ఇందులో అన్నదాత సుభిక్ష పథకం కింద రూ.97.01 కోట్లు, పీఎం కిసాన్ పథకం కింద రూ.37.26 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ అయ్యాయని తెలిపారు.రైతుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి పనిచేస్తోందని, రైతు సంక్షేమం కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతులకు ఆర్థికంగా బలం చేకూర్చుతోందని పేర్కొన్నారు. రైతులు సంతోషంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న పివిఎన్ మాధవ్

## - ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన కమిటీ అధ్యక్షుడు పీలా నాగ శ్రీను

**అనకాపల్లి,మార్చి 13 (మనసులో మాట) :** రాష్ట్రంలో పేరొందిన ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెంలో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం బిజెపి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆయనను ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. మాధవ్ దంపతులను దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను(గొల్ల బాబు), ఆలయ సహ కమిషనర్ యాళ్ళ శ్రీధర్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు అలాగే అమ్మవారు చరిత్రను మాధవ దంపతులకు పీలా నాగ శ్రీను వివరించారు. అనంతరం మాధవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ దేశంలో ఉన్న అన్ని దేవాలయం నిధులు ఇచ్చారన్నారు. కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్న దేవాలయాలకు సైతం అభివృద్ధి కోసం నిధులు ఇచ్చారన్నారు. నూతన గుడి పునర్నిర్మాణం సంబంధించి బాగా జరిగిందని సంతోషం



వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా బిజెపి అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పొన్నగంటి అప్పారావు, బొడ్డేడ నాగేశ్వరరావు, కొణతాల అప్పలరాజు, మారిశెట్టి భాస్కరరావు, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మిపైడిరాజు,యర్రవరపు సంతోషి కుమారి నాగేషి,కూటమి నేతలు, తదితరులుపాల్గొన్నారు.

## లోక్ అదాలత్లో కేసులు పరిష్కారమయ్యే విధంగా

# చర్యలు చేపట్టాలి : ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్

**విజయనగరం , మార్చి 13 (మనసులో మాట) :** లోక్ అదాలత్లో ఇరు వర్గాలు రాజీ అయ్యే విధంగా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ విజయనగరం జిల్లాలోని వివిధ న్యాయ స్థానాల్లో ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మార్చి 13న ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ ఈ నెల 14న జిల్లాలోని వివిధ న్యాయ స్థానాల్లో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్లో ఎక్కువ కేసులు పరిష్కారం (రాజీ) అయ్యే విధంగా సంబంధిత పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీసు స్టేషను పరిధిలో నమోదైన కేసుల్లో ఇరు వర్గాలు రాజీ అయ్యేందుకు అవకాశం ఉన్న కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, చిన్న క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, ఎక్సైజ్, రోడ్డు ప్రమాద కేసులు, పెండింగ్ ఈ చలాన్లు మరియు ఇతర కాంపౌండు కేసులను ముందుగా గుర్తించాలన్నారు. ఆయా కేసుల్లో ఇరు వర్గాలతో సంప్రదించి, సమావేశాలు నిర్వహించి, వారు రాజీ అయ్యే విధంగా మానవతా దృక్పదంతో వ్యవహరించాలన్నారు. ఇందుకుగాను పోలీసు స్టేషను స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. లోక్ అదాలత్ విజయ వంతం అయ్యేందు అధికారులు, సిబ్బంది ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలన్నారు. కేసుల్లోని ఇరు వర్గాలపై ఒత్తిడి లేకుండా, సహకారాత్మక వాతావరణంలో రాజీ అయ్యేలా వారిని ప్రోత్సహించాలన్నారు.



పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తే కేసులు త్వరగా, సానుకూలంగా రాజీ అయ్యే అవకాశాలు పెరుగుతాయన్నారు. ఎక్కువ కేసులు లోక్ అదాలత్లో పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపట్టడం వలన న్యాయ వ్యవస్థపై భారం తగ్గి, బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందని అన్నారు.లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులను ఆయా సబ్ డివిజన్లుకు చెందిన డిఎస్పీలు, సీఐలు పర్యవేక్షించాలని ఎ.ఆర్. దామోదర్ అధికారులను ఆదేశించారు.

# కూటమి ప్రభుత్వం తోనే రైతన్న కు మేలు

**- మూడవ విడత అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకం**

**- ముఖ్య అతిథిలుగా హజరైన శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాదవ్, ఏపీయుఎఫ్ఐడిసి చైర్మెన్ పీలా గోవింద సత్యనారాయణ**



**అనకాపల్లి , మార్చి 13 (మనసులో మాట) :** అనకాపల్లి గుండాల జంక్షన్ లోని ఆర్ ఏ ఆర్ ఎస్ లో శుక్రవారం అనకాపల్లి వ్యవసాయ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వ్యవసాయ సహాయ సంచాలకులు అధ్వర్యంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్, రైతన్న మీకోసం 2025-26 మూడో విడత పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిధిలు మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పి.వి.ఎన్ మాధవ్, మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, ఏపీయుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీష్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన స్టాల్స్ ని, వ్యవసాయ యంత్రాలను వారు పరిశీలించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గౌహుతి నుండి లైవ్ ప్రసంగాన్ని వీక్షించి తదనంతరం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గన్నవరం నుండి లైవ్ ప్రసంగం వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ రైతే రాజు కావాలన్నారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమం చేపట్టి , రైతులకు ఒక ఆధారం చూపించాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నా సరే ప్రతిష్టాకరంగా ఇటువంటి కార్యక్రమంలు చేపడుతున్నారన్నారు. సూపర్ 6 లో భాగంగా అన్ని కార్యక్రమంలు నెరవేరుస్తున్నా రు. రైతులకు అండగా ఈ ప్రభుత్వం నిలబడుతుం దన్నారు. సాగు భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి అటవీ భూమి సాగుదారు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 14000 రూపాయలు, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 6000 రూపాయలు కలిపి సంవత్సరానికి 20000 చొప్పున ఆర్థిక సహాయం రైతులకు అందజేస్తున్నా రన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 22 విడతలుగా పిఎం కిసాన్ నిధులు 2000 రూపాయలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ లచే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 4000 రూపాయలు కలిపి మూడవ విడతగా మొత్తం 6000 రూపాయలు వేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 46,85,838 మంది రైతులు ఖాతాల్లో 2675. 97 కోట్ల రూపాయలు జమ చేసారన్నారు. అన్నదాత సుఖీభవ మరియు పీఎం కిసాన్ కింద అనకాపల్లి జిల్లా లో 2,42,536 మంది లబ్ధిదారులు ఉండగా 134.27 కోట్ల రూపాయలు మరియు అనకాపల్లి నియోజకవర్గంలో 22,202 మంది లబ్ధిదారులుగాను 12.30 కోట్ల రూపాయలు చెక్కులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ఇతర సంస్థల చైర్మన్లు, వ్యవసాయ శాఖ సంబంధిత అధికారులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# అడవుల రక్షణ అందరి బాధ్యత




**పెదబయలు , మార్చి 13 (మనసులో మాట) :** అడవులను నాశనం చేయొద్దంటూ పెదబయలు అటవీ రేంజ్ పరిధిలోని మద్దిగరువు వారపుసంతలో అటవీ శాఖ రేంజర్ రవి బాబు సిబ్బంది అవగాహన ర్యాలీ చేశారు. అడవులను రక్షించడం మన బాధ్యత, వాటికి నిప్పు పెట్ట రాదన్నారు. అడవి వల్ల ఎన్నో ఉపయోగాలు మానవులకు ఉన్నాయని అడవి లేకపోతే మానవ మనుగడకే ముప్పు ఉందని అని వారన్నారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి సృజన, రుక్మిణి,అటవీ సిబ్బంది, పెసా కమిటీ సభ్యులు, బీట్ అధికారులు తదితరు పాల్గొన్నారు

# రైతన్నలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయూత : శాసనసభ్యులు బండారు

**కె. కోటపాడు , మార్చి 13 (మనసులో మాట) :** దేశానికి అన్నదాత అయిన రైతన్నలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నాయని మాజీ మంత్రి మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం ఎంపీడీవో ఆఫీసు ఆవరణలో అన్నదాత సుఖీభవ, అలాగే పిఎం కిసాన్ నిధులు 25 కోట్ల 25 లక్షల రూపాయల చెక్కు ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ దేశానికి వెన్నుముకైన రైతన్నను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక గుర్తింపుతో అత్యాధునిక సౌకర్యాలు రైతులకు అందజేసి, వ్యవసాయంపై రైతన్నలకు చేయూత నిస్తున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రతి రైతుకు 6 వేల రూపాయలు ఈరోజు విడుదల చేసే బృహత్తర కార్యక్రమం జరిగిందని అన్నారు. ఇటీవల కాలంలో అధిక మొత్తంలో ధాన్యం కొనుగోలు చేసి విను వెంటనే రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని అన్నారు.



గత వైసిపి ప్రభుత్వం లో రైతులను విస్మరించి కొనుగోలు చేసిన ధాన్యానికి సరైన ధర ఇవ్వకపోగా బకాయిలతో బ్యాంకులు ఆఫీసులు చుట్టూ తిప్పించుకున్నారని జగన్ ప్రభుత్వం పై విమర్శలు కురిపించారు. మాడుగుల నియోజకవర్గం నాలుగు మండలాలకు చెందిన 45,605 మంది రైతులకు 25 కోట్ల 25 లక్షల రూపాయలు విడుదల చేయడం జరిగిందని, దీనిలో 18.24 కోట్ల రూపాయలు అన్నదాత సుఖీభవ మూడవ విడత సంబంధించినదని, అలాగే 7.01 కోట్ల రూపాయలు 22వ విడత పిఎం కిసాన్ కు సంబంధించినవి అని వెల్లడించారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం రైతుకు అందించని సౌకర్యాలు కల్పించడంతో రైతు కుటుంబాల్లో ఆనందోత్సవాలు వెల్లువిరుస్తున్నాయని అన్నారు. దీనికి కారణ మైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలని బండారు అన్నారు. ఈ కార్యక్రమంలో చిరు వ్యాపారాల కు పలు స్టాల్స్ ను, వ్యవసాయ యాంత్రికరణ యంత్రా లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోప్పల వెలమ చైర్మన్ శ్రీ పి వి జి కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు పైలా ప్రసాద్ , టీడీపీ మండల్ అధ్యక్షులు రొంగళి మహేష్ , టీడీపీ నాయకులు జురెడ్డి రాము , కిలపర్తి భాస్కర రావు, కన్నూరు సూర్య నారాయణ, డొకల నరసింహామూర్తి, చౌడువాడ, కోడూరు కె. జె.పురం సర్పంచ్ లు టిడిపి ఎంపిటిసిలు , బీజేపీ అమ్మాజీ , జనసేన పార్టీ నాయకులు అంజి బాబు , కోటపాడు మరియు చౌడువాడ పి ఏ సి స్ చైర్మన్ లు, చోడవరం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీ రవీంద్రనాథ్ , కోటపాడు తహసీల్దార్, ఎం.డి.ఓ లు భుజంగరావు, సాంబశివరావు, నాలుగు మండలాల వ్యవసాయధికారులు, వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు







మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## 22న కాకినాడ లో జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు

**అనకాపల్లి , మార్చి 13 (మనసులో మాట) :** కాకినాడ జిల్లా ఆర్యవటం మండలం కాజులూరు లో ఈనెల 22న జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు జరగనున్నాయని రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు స్వామి రమేష్, వాడపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ది ఆంధ్రా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యం లో చందాల ఆదినారాయణ చారిటబుల్ ట్రస్ట్ సారధ్యం లో ఈ పోటీలు జరుగుతున్నాయని వారు తెలిపారు. ఈ పోటీలలో 7 జిల్లాలు విశాఖ, అనకాపల్లి, వెస్ట్ గోదావరి, ఈస్ట్ గోదావరి, ఏలూరు, కాకినాడ కోనసీమ జిల్లాలు మాత్రమే పాల్గొంటాయని వారన్నారు. అందువల్ల అనకాపల్లి జిల్లా కి సంబంధించిన బాడీ బిల్డర్స్ సిద్ధం కావాలని, ది అనకాపల్లి బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్నెస్ అసోసియేషన్ కార్యదర్శి, నేషనల్ బాడీ బిల్డర్ శిలపరశెట్టి బాబి, అధ్యక్షులు అమరపల్లి కృష్ణాజి, కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ పోటీల బాడి బిల్డింగ్ లో 55 కేజీల గ్రూప్ నుండి 85 కేజీల పైబడిన గ్రూప్ వరకు (7 కేటగిరీలో), అలాగే మెన్ ఫిజిక్ రెండు కేటగిరీలు,మాస్టర్స్ ఒక కేటగిరి ఉంటాయని తెలిపారు. ఓవరాల్ మొదటి ఛాంపియన్ కి 40,000 రూపాయలు,రెండవ ఛాంపియన్ కి 20,000 రూపాయలు ఉంటాయన్నారు. అలాగే ప్రతీ కేటగిరీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ 3 వేలు, 2 వేలు,1 వెయ్యి రూపాయలు బహుమతులు ఉంటాయన్నారు. బాడీ బిల్డర్స్ కీ శరీర బరువు అదే రోజు మధ్యాహ్నం 12 నుండి 3 గంటల వరకు మాత్రమే తీసుకుంటారని అలాగే రాష్ట్ర అసోసియేషన్ నియమ, నిబంధనలు, క్రమశిక్షణ పాటించి, పోటీలలో పాల్గొనాలని బాబి కోరారు.



## ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

**- జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్**

**అనకాపల్లి , మార్చి 13 (మనసులో మాట) :** ఇటీవల నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా గ్యాస్ సిలిండర్ల పంపిణీ, నిల్వలు మరియు ధరలపై ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన చాంబర్లో తాసిల్దార్లు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ల పంపిణీ, నిల్వలు మరియు ధరలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తాసిల్దార్లను, అధికారులను ఆదేశించారు. గ్యాస్ కొరత ఉందనే ఆందోళనతో వినియోగదారులు ముందుగానే బుకింగ్ చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రతి డిస్ట్రిబ్యూటర్ కార్యాలయం వద్ద "పానిక్ బుకింగ్స్ అవసరం లేదు" అని స్పష్టంగా తెలిపే ఫ్లెక్సీలను తెలుగులో ప్రదర్శించాలన్నారు. బుక్ చేసిన 72 గంటల్లోనే గ్యాస్ సిలిండర్ డెలివరీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్యాస్ ఏజెన్సీ వద్ద ఫోన్ నెంబర్లు, సేల్స్ ఆఫీసర్ మరియు సంబంధిత తాసిల్దార్ ఫోన్ నెంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, బిల్లులో ఉన్న ధర కంటే ఒక్క రూపాయి అదనంగా వసూలు చేసినా, లేదా టిప్స్ పేరుతో ఒత్తిడి చేసినా డెలివరీ బాయ్స్‌పై మరియు సదరు ఏజెన్సీలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓటీపీ లేకుండా ఎక్కడా సిలిండర్ డెలివరీ చేయకూడదని, పారదర్శకత పాటించాలని సూచించారు. నిల్వలను అక్రమంగా దాచడం లేదా ఇతర అవసరాలకు మళ్లించడం వంటివి చేస్తే ఈసీ యాక్ట్ 1955 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, దీనికోసం సివిల్ సప్లైస్ మరియు తాసిల్దార్ బృందాలు నిరంతరం తనిఖీలు చేస్తాయని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత డిస్ట్రిబ్యూటర్లపై ఉందని, నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సుల రద్దుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎస్ఓ కే వి ఎల్ ఎన్ మూర్తి, కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్ కుమార్, తాసిల్దార్లు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

# కొయ్యూరులో భారీగా గంజాయి పట్టివేత

**- 33 కేజీలకు పైగా స్వాధీనం**
**- నలుగురు అరెస్ట్**



**కొయ్యూరు,మార్చి 13 (మనసులో మాట):** అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను కొయ్యూరు పోలీసులు అరెస్ట్ చేసి భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 12న కొయ్యూరు ఎస్ఐ పి.కిశోర్ వర్మకు గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వారి పోలీస్ సిబ్బందితో కలిసి కొయ్యూరు మండలం లోని చీడిపాలెం జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించగా ఆ సమయంలో ఒక ఆటో, ఒక మోటార్ సైకిల్‌పై వచ్చిన వ్యక్తులు పోలీసులను చూసి అనుమానాస్పదంగా ప్రవర్తిస్తూ వాహనాలను వెనక్కి తిప్పి పారిపోవ డానికి ప్రయత్నించడంతో, వెంటనే అప్రమత్త మైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా ఆటోలో ఉన్న రెండు గోనె సంచుల్లో మొత్తం 33.245 కిలోల గంజాయి లభించింది. దీంతో గంజాయి రవాణా చేస్తున్న మసాడ బాబ్జి,పాంగి సింహాచలం (చింతపల్లి మండలం),గంగుల సూర్య ప్రతాప్ రెడ్డి (జి.మాడుగుల మండలం), వంటాకుల రాజుబాబు (అనకాపల్లి జిల్లా)అనే నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో నిందితులు ఒడిశా ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి సామర్లకోట ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.ఈ ఘటనలో నిందితుల వద్ద నుండి 33.245 కిలోలగంజాయి (విలువ సుమారు రూ.16,62,250), ఆటో (నెం.AP35W9214), ద్విచక్రవాహనం (నెం. AP39AX 2440),4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ చెప్పారు. నిందితులపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.అక్రమ మాదకద్రవ్యాల రవాణాపై కఠినచర్యలు తీసుకుంటామని, ఇటువంటి కార్య కలా పాలపై ప్రజలు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని కొయ్యూరు సీఐ కోరారు.

**జగనన్న కాలనిలో మంచినీరు,వీది లైట్లు వేయాలని కోరుతూ**

# విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం ధర్నా




**విజయనగరం , మార్చి 13 (మనసులో మాట) :** విజయనగరం అర్బన్ పరిధిలో ఉన్న ప్రభుత్వకాలనీ గుంకలాం జగనన్న కాలననీలో మంచినీరు, విధిలైట్లు వేయాలని కోరుతూ.విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ...రాష్ట్రంలోనే అతి పెద్ద మూడవ కాలనీగా పేరుగాంచిన విజయనగరం గుంకలాం జగనన్న కాలానీనీ ప్రభుత్వ కాలనీగా మార్చారు. కానీ కనీసం మౌలిక వసతులు లేవు. ప్రధాన రహదారి పాడాయి పోయింది, అంబులెన్సు రావాలన్న,ఆసుపత్రికి పోవాలన్నా నరక యాతన అనుభవిస్తున్నారు. ఈ కాలనీలో సుమారు 12 వేల పైగా ఇల్లు మంజూరు చేయగా, ప్రస్తుతం 879 మంది ఆరు బ్లాకుల్లో కలిపి నివాసం ఉంటున్నారని, ఇక్కడ చదువుకునేందుకు ఎలిమెంటరీ స్కూల్ లేదు, అంగన్వాడీ కేంద్రం లేదు, మంచినీరు ..సౌకర్యం లేదు, బోర్లు ఉన్నా వాటి హెడ్స్ లేవు.వీదిలైట్లులేవు విటన్నిటి తో పాటు దొంగల బెడద తీవ్రంగా ఉంది. కావున నైట్ పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్కు వినతి పత్రం సమర్పించారు. సమస్యలు రెండురోజుల్లో పరిస్కారం కాకపోతే పోరాటం ఉదృతం చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

# ఉపాధి వేతనదార్లు కు ఉచితంగా ఫలహారం, మజ్జిగ పంపిణీ



**ఎన్.రాయవరం , మార్చి 13 (మనసులో మాట) :** ఎండ తీవ్రత పెరుగుతుండటంతో మండలంలోని ధర్మవరం గ్రామంలో ఉపాధి పనుల్లో పాల్గొంటున్న వేతన దార్లుకు స్థానిక నేతలు ఫలహారం, మజ్జిగ నుశుక్రవారం ఉచితంగా పంపిణీచేసారు.

పాయకరావుపేట నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు అధ్వర్యంలో సుమారు రెండు వందల మందికూలీలుకు ఫలహారం అంద చేసారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ కె.మాణిక్యం, టిడిపినేతలు బండినేశ్వరావు, నగిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**పెదగుమ్ములూరు పదవతరగతి విద్యార్థులకు**

# ఉచితంగా అభ్యసన సామాగ్రి పంపిణీ



**ఎన్.రాయవరం , మార్చి 13 (మనసులో మాట) :** మండలంలోని పెదగుమ్ములూరు జిల్లాపరిషత్ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థుల కు అవసరమైన అభ్యసన సామాగ్రిని ఉచితంగా పాఠశాల పూర్వైవవిద్యార్థి సురేష్ అంద చేసారు.పాఠశాల పూర్వ విద్యార్థి అంగరాజు సురేష్ కుమార్ రాజు విద్యార్థులుకు అవసరమైన ప్లాంక్, పెన్ను ,పెన్సిల్, ఎరేజర్, షార్ప్నర్, స్కేల్ లను శుక్రవారం ఉచితంగా అందించారు . ఈ కార్యక్రమంలో సురేష్ కుమార్ రాజు మాట్లాడుతూ సంపద కంటే చదువు గొప్పదిఅని, సంపదను మనం కాపాడుకోవాలి అని, చదువు మనల్ని కాపాడు తుందిని అన్నారు. విద్య అంటే కేవలం పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడంకాదని, అదిజీవితాంతం కొనసాగే అభ్యాస ప్రక్రియ అని సద్గురు జగ్గీ వాసుదేవ్ వ్యాఖ్యలను విద్యార్థులకు వివరించారు. పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులందరూ మంచి ఫలితాలను సాధించాలని పెదగుమ్ములూరు పాఠశాల కీర్తి ప్రతిష్టతలను నలువైపుల వ్యాపింప చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయుని సుధామాధురి,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# కాంగ్రెస్ అధ్యక్షురాలు యాత్రను విజయవంతం చేయాలి : సుబ్బన్న



**ఎన్.రాయవరం , మార్చి 13 (మనసులో మాట) :** మహాత్మాగాంధీజాతీయ ఉపాధి హామిచట్ట పరిరక్షణ యాత్రలో భాగంగా 14వతేదీ శనివారం పాయకరావుపేట నియోజకవర్గంలోని కాగిత గ్రామంలో పర్యటించనున్న ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల యాత్ర ను విజయవంతంచేయాలని డిసిసి మాజీ అధ్యక్షుడు, సినీయర్ కాంగ్రెస్ నాయుకుడు మీసాలసుబ్బన్న విజ్ఞప్తి చేసారు. శుక్రవారం మండలంలోనిఅడ్డురోడ్డుజంక్షన్ లో ఆయన స్థానిక కాంగ్రెస్ నేతలుతో కలిసి పర్యటనవివరాలు వెల్లడించారు. కాగిత గ్రామంలో జరుగుతున్న ఉపాధిపనులను షర్మిల పరిశీలించి, స్థానిక వేతన దార్లుతో మాట్లాడతారని ఆయనతెలిపారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయుకులు,కార్యకర్తలు ఈ కార్యక్రమం లో పాల్గొనాలని ఆయన కోరారు. పిసిసి అధ్యక్షురాలు పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లుపూర్తిచేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ జి. గోవిందరావు, కాంగ్రెస్ నాయుకుడు మారుతిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# తొలి తెలుగు కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు నిర్వహణ



**శ్రీకాకుళం , మార్చి 13 (మనసులో మాట) :** తెలుగు సాహిత్యానికి విశిష్టమైన సేవలు అందించిన తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి వొల్లమాంబ (మొల్ల) జయంతి వేడుకలను జిల్లా పోలీసు కార్యాలయం లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి. రమణ పాల్గొని మొల్ల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

మొల్ల జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిం చిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మొల్ల కవిత్వం ప్రత్యేక స్థానం సంపాదించిందని, ఆమె రచనలు తెలుగు భాషకు అమూ ల్యమైన సంపదగా నిలిచాయని తెలిపారు. ఆమె రచనలు అనాటి మహిళల్లో చైతన్యం, జాగృతి కలిగించడంలో కీలకపాత్ర పోషించాయని కొనియాడారు. ప్రతి ఒక్కరూ సాహిత్యంపై ఆసక్తి పెంపొందించుకుని గొప్ప వ్యక్తుల ఆదర్శాలను అనుసరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏఓ గోపీనాథ్, సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐ నర్సింగరావు తదితర పోలీసు అధికా రులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.





**గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజల పై**

# గుదిబండ మోపిన మోడీ !

**- సిపిఐ విజయనగరం జిల్లా సహాయ కార్యదర్శి, నియోజకవర్గ కార్యదర్శి బుగత అశోక్ ఆగ్రహం**



**విజయనగరం , మార్చి 13 (మనసులో మాట) :** ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండగల్లో గ్యాస్ ధర పెంచి గిఫ్ట్ ఇచ్చిన మోడీకి 2029 ఎన్నికల్లో రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడానికి దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని సీపీఐ విజయనగరం జిల్లా సహాయ కార్యదర్శి, నియోజకవర్గ కార్యదర్శి బుగత అశోక్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంపుదల నిరసిస్తూ విజయనగరంలో భారత కమ్యూనిస్టు పార్టీ ( సీపీఐ ), అఖిల భారత యువజన సమాఖ్య ( ఎఐవైఎఫ్ ), అఖిల భారత విద్యార్థి సమాఖ్య ( ఎఐఎస్ఎఫ్ ), అఖిల భారత మహిళా సమాఖ్య ( ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ ) నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం విజయనగరంలో కన్యాకాపరమేశ్వరి ఆలయం జంక్షన్లో గ్యాస్ బండ తల మీద పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా బుగత అశోక్ మీడియాతో మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలకి గిఫ్ట్ గా మహిళపై భారం మోపెందుకే గ్యాస్ ధరలను అమాంతంగా పెంచారని, వంటగ్యాసు పై 60 రూపాయలు, కమర్షియల్ గ్యాస్ బండపై 115 రూపాయలు పెంచడం దుర్మార్గమన్నారు. ఎన్నికల ముందు ప్రజలకి ఇచ్చిన హామీలు మోడీ మరిచిపోయిన వచ్చే ఎన్నికల్లో మాత్రం మోడీకి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి కూడా రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడం మాత్రం ప్రజలు మరిచిపోరన్నారు. ఆంధ్రలో గ్యాస్ నిక్షేపాలు సమృద్ధిగా ఉన్న కూడా ధరలు పెంచి ఆదానీ అంబానీలకు కార్పొరేటర్ వ్యక్తులకు లాభం చేకూర్చే విధంగా మోడీ వ్యవహరిస్తున్నారని అశోక్ ఆరోపించారు. గ్యాస్ ధరలు పెంచడం అంటే సామాన్య ప్రజలపై భారం మోపడమేనని, పెంచిన గ్యాస్ ధర తక్షణమే తగ్గించాలని సిపిఐ ప్రజల పక్షాన డిమాండ్ చేస్తుందన్నారు. ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దాడి రష్యా నుండి ఆయిల్ కొనుగోలుపై ఆంక్షలు నేపథ్యంలో ఈ ధరల పెంపుదల ప్రజలపై శరాఘాతంగా మారిందని విమర్శించారు. ఈ యుద్ధాన్ని ఖండించి నిలుపుదల చేయడంలో మోడీ ప్రభుత్వం విఫలం అయిందని ఆయన అన్నారు. అదాని ఫైల్స్ ఎక్కడ బయట పడతాయో అని భయపడి మోడీ దేశ భవిష్యత్తుని ట్రంప్ కాళ్ళ దగ్గర పెట్టేసారని ఏద్దేవా చేశారు. నేడు ఆ భారాన్ని ప్రజలపై నెట్టడం ఘోరమని ఇప్పటికే నిత్యవసరుకుల ధరలు పెరిగి సతమతమవుతున్న సామాన్యులపై వంటగ్యాస్ ధర పెంపు ములిగే నక్కపై తాటిపండు పడ్డట్లు చందంగా ఉందన్నారు.

అలాగే ఉపాధి కోసం తోపుడు బళ్ళు ఇతర చిన్న చిన్న వ్యాపారాలతో గడుపుకుంటున్న చిరు వ్యాపారులను వాణిజ్య సిలిండర్ ధర పెంపు తీవ్ర నష్టం కలిగిస్తుందని అంతేకాకుండా అసంఘటిత రంగ కార్మికులు స్వల్ప ఆదాయాలు కలిగిన వారు కొనుక్కునే టిఫిన్, కర్రీ తదితర ఆహార ధరలు కూడా పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విధాలుగా ప్రజా జీవితాన్ని ఘోరంగా నష్టపరిచే గ్యాస్ ధర పెంపును తక్షణవే ఉపసంహరించుకోపోతే ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. నాగభూషణం, జిల్లా సహాయ కార్యదర్శి పి. గౌరీశంకర్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూర వాసు, జిల్లా ఉపాధ్యక్షులు వెలగాడ రాజేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు అలజంగి చరణ్, సిపిఐ నియోజకవర్గ సమితి సభ్యులు వద్దాది కొండలరావు, ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ నియోజకవర్గ సభ్యులు దేవిక, రత్నం, శైలజ మరియు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్ ఆవిష్కరించిన సినీ నటి రెజీనా కసాండ్రా



**శ్రీకాకుళం , మార్చి 13 (మనసులో మాట) :** శ్రీకాకుళం పాలకొండ రోడ్డులో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన సినీ నటి రెజీనా కసాండ్రాతో కలిసి మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం శ్రీకాకుళం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా "డ్రగ్స్ వద్దు బ్రో", "నారీ శక్తి", "శక్తి యాప్" పోస్టర్లను సినీ నటి రెజీనా కసాండ్రా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. సమాజంలో డ్రగ్స్ వినియోగాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అదేవిధంగా ఆపద సమయంలో శక్తి యాప్ ద్వారా పోలీసు వారి సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మి, పోలీసు సిబ్బంది , యువత పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## ప్రయత్నిస్తే ఫలితాలు అద్భుతం

- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎం.ఏ.రజాక్‌రి



**నక్కపల్లి , మార్చి 13 (మనసులో మాట) :** త్వరలో నిర్వహించనున్న పదవతరగతి పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా పరీక్షలు రాయాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాసనిపుణులు ఎం.ఏ.రజాక్ అన్నారు.శుక్రవారం పదవతరగతి విద్యార్థులను ఉద్దేశించి ఆయన స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని అందించారు ప్రతీవిద్యార్థీ పాజిటివ్ థింకింగ్ తో ఉండాలని,చదివిన అంశాలను ఎక్కువగా పునశ్చరణ చేయాలని అన్నారు ఏకాగ్రత అలవరచుకుంటూ చదవాలని, సమయపాలన పాటిస్తూ,ప్రణాళికా యుతంగా చదివితే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులందరికీ పరీక్షా సామగ్రిని ఆయన ఆర్థికసహకారంతో అందించారు. నంతరం ఉపాధ్యాయులను ఆయనచేతులమీదుగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఎస్.పాల్గుణరావు, ఎ.వి.ఎల్.ఎన్. కుమారి, రమేష్ బాబు,దవరశింగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## పదో తరగతి విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ పంపిణీ



**చీడికాడ , మార్చి 13 (మనసులో మాట) :** మండల కేంద్రమైన చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని చీడికాడ గ్రామ వైసిపి కన్వీనర్ పరవాడ మహేష్ సహకారంతో అందించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి బొంజు బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఇష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు భయం వద్దు అని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంతోపాటు మంచి మార్గంలో ముందుకు నడవాలని ప్రతి విద్యార్థినీ విద్యార్థులకు సూచించడం జరిగింది విద్యార్థులు క్రమశిక్షణతో మంచి మార్గంలో పయనించాలని, అలాగే ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్న మహేష్ ను ఆయన అభినందించారు ,ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ దుర్గ పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ పథకం కింద 39,302 మంది లబ్ధి



**కోటవురట్ల , మార్చి 13 (మనసులో మాట) :** పాయకరావుపేట నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం కింద 39,302 మంది లబ్ధి పొందినట్లు వ్యవసాయ శాఖ ఏడీ ఉమా ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కోటవురట్లలో జరిగిన కార్యక్రమంలో రైతులకు చెక్కు అందజేశారు. మూడవ విడతలో రూ.21.67 కోట్లు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసినట్లు తెలిపారు. ఖాతాల్లో డబ్బులు జమ కాని రైతులు సంబంధిత రైతు సేవ కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు టీడీపీ నాయకులు లాలం కాశీనాయుడు అన్నారు. రైతులు ఎరువులు పురుగుల మందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. సిఫార్సులకు మించి రసాయనికి ఎరువులు వినియోగిస్తే భూములు నిస్సారం అవుతా యన్నారు. ఈ విషయాన్ని రైతులు తెలుసుకోవాలన్నారు.టీడీపీ పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుం దన్నారు. నియోజకవర్గంలో అవసరానికి మించి ఎరువులను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. ఉద్యానవన పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వం కూడా తగిన ప్రోత్సాహం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. లింగన్నాయుడు, జానకి శ్రీను పాల్గొన్నారు.

# రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం



**హుకుంపేట , మార్చి 13 (మనసులో మాట) :** అన్నదాతల ఆర్థిక స్థిరత్వం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ (3వ విడత) నిధుల విడుదల కార్యక్రమం శుక్రవారం హుకుంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక వ్యవసాయ అధికారి (ఏవో) సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అరకు నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర, సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మోహన్‌రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతులకు చెక్కులు పంపిణీ చేసి, ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న సహాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు మోహన్‌రావు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ యంత్రీకరణ పరికరాలు, పనిముట్లు రాయితీపై అందజేస్తున్నామని తెలిపారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించి దిగుబడులను పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జరిగిన సమావేశంలో సియ్యారి దొన్ను దొర మాట్లాడుతూ రైతన్నల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందన్నారు. ప్రతి రైతు కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.14,000, కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎం కిసాన్ పథకం కింద రూ.6,000 కలిపి సంవత్సరానికి ఒక్కో రైతు కుటుంబానికి మొత్తం రూ.20,000 ఆర్థిక సహాయం అందజేస్తున్నామని వివరించారు. ఇప్పటికే ఆగస్టు 2న మొదటి విడతగా రూ.3174.43 కోట్లు, నవంబర్ 19న రెండో విడతగా రూ.3135.01 కోట్లు కలిపి మొత్తం రూ.6309.44 కోట్లు రాష్ట్రంలోని 46,85,838 మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇప్పుడు మూడో విడతగా మార్చి 13, 2026న రూ.2675.97 కోట్లు కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతు కుటుంబాల ఖాతాల్లో జమ చేస్తున్నామని పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెంచడం, వ్యవసాయ వ్యయాన్ని తగ్గించడం, పంటల ఉత్పాదకతను పెంచడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు.

రైతులు పంటల బీమా, ఎరువుల సబ్సిడీలు, వ్యవసాయ యంత్రాల రాయితీలు వంటి పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అరకు, డుంబ్రిగుడా అనంతగిరి, పెదబయలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, టిడిపి మండల అధ్యక్షులు ఎస్. బొంజు బాబు, ప్రధాన కార్యదర్శి బొడ్డ శ్యామ్, తెలుగు యువత అధ్యక్షులు సిదారి.లక్ష్మణ్, తెలుగు రైతు అధ్యక్షులు, ఎం అప్పలకొండ, స్థానిక నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- సభను ఉద్దేశించి మాట్లాడుతున్న
- అరుకు టిడిపి ఇన్‌చార్జ్. సియ్యారి దొన్ను దొర,
- రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న
- టిడిపి ఇన్చార్జి. దొన్ను దొర.వ్యవసాయ శాఖ అధికారులు సిబ్బంది తదితరులు





## తాడిచెట్టు పైనుండి పడి యువకుడు మృతి



**రావికమతం , మార్చి 13 (మనసులో మాట) :** తాడిచెట్టు పై నుండి జారీ పడి యువకుడు మృతి చెందిన దుర్ఘటన మండలంలో మర్రివలస శివారు గొల్లలపాలెం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మండలములో మచ్చవాని పాలెం గ్రామనికి చెందిన సబ్బి నాగేశ్వరరావు మృతి చెందారు. తాటి కమ్మలు నరికేందుకు చెట్టు ఎక్కి కాలు జారీ ప్రమాదవశాత్తు నాగేశ్వరరావు కింద పడ్డారు. హుటా హుటిన కొత్తకోట పిహెచ్ కి తరలించారు అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టానికై తరలించమని ఎస్ఐ శ్రీనివాస్ చెప్పారు. కుటుంబ యజమాని అకాల మరణంతో భార్య నాగలక్ష్మి కుమార్తె దిక్కులేనివారు అయ్యారు.

## ఎమ్మెల్యే బండారును కలిసిన పెందుర్తి నూతన ఎంపీపీ మాలతి నగేష్



**వి.మాడుగుల , మార్చి 13 (మనసులో మాట) :** తెదేపా సీనియర్ నేత,మాజీ మంత్రి,మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని పెందుర్తి మండల పరిషత్ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నిక కాబడిన గ.రెడ్డి మాలతి నగేష్ మర్యాదపూర్వకంగా.ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే బండారును వెన్నెలపాలెం లో గల ఆయన స్వగృహంలో ఎంపీపీ మాలతి నగేష్ కలిసి ఎంపీపీ ఎన్నికకు సహకరించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు,కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు ఎంపీపీ మాలతి నగేష్ కు స్వీట్ తినిపించి హర్షం వ్యక్తం చేస్తూ శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సుఖవాసి ప్రసాద్ గారు, వైస్ ఎంపీపీ చిరికి దేవుడు,ఎంపీటీసీలు గండి హిమబిందు భూషణ్, స్వప్న గిరి,మండల కో ఆప్షన్ సభ్యులు శివ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కరక దేవుడు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**చీడికాడ , మార్చి 13 (మనసులో మాట) :** మండలంలో ఈనెల 16 నుండి జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి బొంజు బాబు తెలిపారు

అయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మంచా మోడల్ స్కూల్ చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కోణం బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు చీడికాడ ప్రభుత్వంలో పాఠశాలలో 178 మంది విద్యార్థులు మంచాల మోడల్ స్కూల్లో 1086 మంది విద్యార్థులు కోణం బాలికల గురుకుల పాఠశాలలో 113 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు అన్నారు

పరీక్ష కేంద్రాలు వద్ద మంచినీరు వైద్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు అలాగే పరీక్ష కేంద్రాల వద్ద మాస్ కాఫింగు జరగకుండా ఉండేందుకు 144 సెక్షన్ ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి బొంజు బాబు తెలిపారు

## వంటగ్యాస్ సిలిండర్లకుకు ఆందోళన చదవద్దు : తాసిల్దార్ అంబేద్కర్



**రావికమతం , మార్చి 13 (మనసులో మాట) :** వంట గ్యాస్ సిలిండర్లకు వినియోగదారులు ఆందోళన చెందవద్దని తాసిల్దార్ అంబేద్కర్ తెలిపారు. శుక్రవారం స్థానిక సాయి చరిష్మా హెచ్పీ గ్యాస్ డీలర్ ఆఫీస్ ను ఎమ్మార్ రమణ బాబు సిఎస్‌డి టి భాస్కరరావుతో పాటు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. సిలిండర్ల అమ్మకా నికి గొడవన్ లో ఉన్న సిలిండర్లను సరి చూశారు . ప్రస్తుతం 10 రోజుల వరకు సరిపడా గ్యాస్ నిల్వ ఉన్నాయని వినియోగదారులు ఆందోళన చెందవద్దని తెలిపారు. సిలిండర్ పంపిణీలో అవకతవకలు గుర్తిస్తే 9490480825 నెంబర్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని చెప్పారు అనంతరం వివిధ హోటల్స్ దాబాలను తనిఖీ చేశారు. డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## కుసర్లిపూడి సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు సేవలకు ప్రశంసలు



**రోలుగుంట , మార్చి 13 (మనసులో మాట) :** రోలుగుంట మండలం కుసర్లిపూడి గ్రామ సర్పంచ్ శ్రీ మడ్డు అప్పలనాయుడు గత ఐదు సంవత్సరాలుగా గ్రామ అభివృద్ధితో పాటు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. ప్రతి సంవత్సరం కుసర్లిపూడి జెడ్‌పీహెచ్ పాఠశాలలో 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పెన్‌లు, పరీక్షలకు అవసరమైన ప్లాంకులు (ఎగ్జామ్ బోర్డులు) వంటి సామగ్రిని అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ గ్రామ ప్రగతికి కృషి చేస్తున్నారు. విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహం మరియు గ్రామ అభివృద్ధికి చేస్తున్న సేవలను గ్రామస్థులు అభినందిస్తున్నారు.

# రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడులు కీలకం

**ఐదు తరువాయి** ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పర్యాటకాన్ని పారిశ్రామిక హోదాతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అమరావతిలో క్రియేటివ్ సిటీ ఏర్పాటు చేసి కంటెంట్ క్రియేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫిలిం రంగాలకు ప్రోత్సాహం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అలాగే హిందూపూర్ సమీపంలో ఎలక్ట్రానిక్స్ సిటీ ఏర్పాటు చేసే ప్రతిపాదనపై కూడా సూచనలు చేశారు.

**అటవీ శాఖ వనీతీరు పీపుల్స్ ఫ్రెండ్లీగా ఉండాలి**

అభివృద్ధి కార్యక్రమాలకు అటవీ శాఖ సహకరించాలని సీఎం పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పర్యావరణ హిత ప్రాజెక్టులకు సహకరించాలని అధికారులకు సూచించారు. గ్రీన్ కవర్ పెంపు, బయోడైవర్సిటీ పరిరక్షణతో పాటు ప్రజలు పర్యటించేందుకు అనుకూల వాతావరణం కల్పించాలని తెలిపారు.

**వైద్యారోగ్యం, వడగాలులపై ముందస్తు చర్యలు**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో వైద్య పరీక్షలు నిర్వహించే వ్యవస్థలను అభివృద్ధి చేయాలని సూచించారు. 108 అంబులెన్స్ సేవలు మారుమూల ప్రాంతాలకు త్వరగా చేరేలా రూట్ ఆప్టిమైజేషన్ చేపట్టాలని ఆదేశించారు. రాబోయే వేసవిలో వడగాలుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.

**సంక్షేమ పథకాల అమలు**

సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా ఉండేందుకు లబ్దిదారులకు సంక్షేమ లేఖలు అందించాలని సీఎం సూచించారు. ప్రతి కుటుంబానికి అందుతున్న లబ్ధి స్పష్టంగా తెలియే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. త్వరలో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు తెలిపారు.

**ఆదాయార్జన శాఖలపై సమీక్ష**

పన్ను ఎగవేతలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. పరిశ్రమలు, సేవల రంగం అభివృద్ధి చెందితే ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కాంట్రాక్టర్లు ఇతర రాష్ట్రాల్లో కార్యాలయాలు పెట్టుకుని పనులు ఇక్కడ చేస్తే కూడా పన్నులు రాష్ట్రంలోనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ల సమావేశం రెండో రోజు వివిధ శాఖల కార్యక్రమాల అమలు, పెట్టుబడుల ప్రగతి, ఆరోగ్య సేవలు, వేసవి కార్యాచరణ ప్రణాళిక, సంక్షేమ పథకాల పురోగతి తదితర అంశాలపై విస్తృతంగా సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా సంబంధిత శాఖల ప్రధాన కార్యదర్శులు, కమిషనర్లు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ల ద్వారా వివరాలను సమర్పించారు.

**పెట్టుబడుల ప్రగతి**

రాష్ట్ర పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ కార్యదర్శి డా. ఎన్. యువరాజ్ మాట్లాడుతూ, జూన్ 2024 నుండి రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కాలంలో పార్టనర్‌షిప్ సమ్మిట్--2025 ఒప్పందాలు ఆమోదించిన ప్రాజెక్టుల ద్వారా మొత్తం 771 కంపెనీలు రూ.20,35,261 కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చినట్లు వెల్లడించారు. వీటి ద్వారా సుమారు 22,43,931 మందికి ఉపాధి అవకాశాలు కలుగనున్నాయని తెలిపారు. ఇందులో గ్రా-2025 ఒప్పందాల ద్వారా 538 కంపెనీలు రూ.11, 37,881 కోట్ల పెట్టుబడితో 13,95,210 ఉద్యోగాలు, (ఎస్. ఐ. పి. బి.) ఆమోదించిన 233 ప్రాజెక్టుల ద్వారా రూ.8,97,380 కోట్ల పెట్టుబడితో 8,48, 721 ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయని పేర్కొన్నారు.

**ఏరోస్పేస్, మారిటైమ్ ప్రాజెక్టులు**

మౌలిక వసతులు మరియు పెట్టుబడుల శాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి. కృష్ణబాబు మాట్లాడుతూ, (ఎ.పి.ఎ.డి.సి.ఎల్) పరిధిలో పార్టనర్‌షిప్ సమ్మిట్--2025 ద్వారా 13 కంపెనీలు రూ.32,782 కోట్ల పెట్టుబడులకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 66,171 మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయని చెప్పారు. విజయనగరం జిల్లాలో భోగాపురం విమానాశ్రయానికి ఆనుకుని ఉన్న 500 ఎకరాల భూమిని ఏవియేషన్ హబ్ అభివృద్ధి కోసం(జి.వు.ఐ.ఎ.ఎల్) కు అప్పగించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా(జి.ఎమ్.ఆర్)ఉ(జి.వి.ఐ.ఎ.ఎల్) పాజెక్టు రూ.20,000 కోట్ల పెట్టుబడి మరియు సుమారు 60,000 ఉపాధి అవకాశాలతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు పరిధిలో 36 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. రామాయపట్నం కార్గో రిసెప్షన్ టెర్మినల్ వంటి కీలక ప్రాజెక్టుల ద్వారా బల్క్ కార్గో నిల్వ, రవాణా సదుపాయాలు అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.

**సంజీవని ప్రాజెక్టు - ఆరోగ్య సేవలు**

వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారంతో సంజీవని ప్రాజెక్టు అమలు జరుగుతోందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎ.ఐ. ఆధారిత డయాగ్నోస్టిక్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మెడ్‌టెక్ పోర్టల్ ద్వారా ఆధునిక పరీక్షలు నిర్వహించే సదుపాయం కల్పించినట్లు చెప్పారు.

**108 అత్యవసర వైద్య సేవలు:**

ఆయుష్ డైరెక్టర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 768 అంబులెన్సులు సేవలందిస్తున్నాయని తెలిపారు. ఇందులో 540.బి.ఎల్.ఎస్, 63 నియోనేటల్,బ్యాకప్ అంబులెన్సులు ఉన్నాయని చెప్పారు.ట్రాకింగ్, అలర్ట్స్, వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా రిమోట్ వైద్య సలహా వంటి సాంకేతిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం అత్యవసర రోగులలో 95 శాతం మందిని గోల్డెన్ అవర్ లో ఆసుపత్రికి తరలించడం సాధ్యమవుతోందని పేర్కొన్నారు.

**హీట్‌వేవ్ - సమ్మర్ యాక్షన్ ప్లాన్**

ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి. వీరపాండ్యన్ మాట్లాడుతూ, హీట్‌వేవ్ ప్రభావాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రుల్లో హీట్ స్ట్రోక్ చికిత్స గదులు, ORS, IV ఫ్లూయిడ్స్ నిల్వలు, సిబ్బందికి శిక్షణ వంటి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. గ్రామీణ పనుల సమయాల మార్పు, తాగునీరు, నీడ సదుపాయాలు, పాఠశాల సమయాల సర్దుబాటు వంటి చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

**సూపర్ సిక్స్ పథకాల ప్రగతి**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' పథకాల పురోగతిపై కూడా సమావేశంలో వివరించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 46.85 లక్షల మంది రైతులకు రూ.6,309 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. మూడో విడతలో మరో రూ.2,675 కోట్లు 46.86 లక్షల మంది రైతులకు విడుదల చేయనున్నట్లు తెలిపారు.దీపం- 2 పథకం కింద ప్రతి విడతలో దాదాపు 90 లక్షలకు పైగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. మహిళల కోసం అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మార్చి 9 నాటికి 50 కోట్లకు పైగా ప్రయాణాలు నమోదైనట్లు పేర్కొన్నారు.

**తల్లికి వందనం:**

విద్యాశాఖ కార్యదర్శి కె. శశిధర్ మాట్లాడుతూ 'తల్లికి వందనం' పథకం కింద ఇప్పటికే 41 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.8,710 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. మొత్తం 67 లక్షల మందికి పైగా విద్యార్థులను అర్హులుగా గుర్తించి రూ.10,090 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు చెప్పారు.బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ హాస్టళ్లలో మరుగుదొడ్ల నిర్మాణం మే 31 నాటికి పూర్తి చేయాలని తెలిపారు. బాలికల భద్రత కోసం 368 హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు, ఉన్నతాధికారులు మరియు రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

## అనకాపల్లి బాలోత్సవ్ కమిటీ ఆధ్వార్యన డిఎస్పీ శ్రావణికి ఘన సత్కారం



**అనకావల్లి , మార్చి 13 (మనసులో మాట) :** అనకాపల్లి లో శుక్రవారం బాలోత్సవ కమిటీ అధ్వర్యంలో డి.ఎస్.పి ఎమ్.శ్రావణి ని ఘనంగా సత్కారించారు. కమిటీ కన్వీనర్ కడిమిశెట్టి త్రిమూర్తులు రెడ్డి చేతుల మీదుగా దుశ్శాలువా, జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా త్రిమూర్తులు రెడ్డి మాట్లాడుతూ ఇటీవల అనకాపల్లి బాలోత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా బాలోత్సవ్ ప్రథమ పిల్లల పండుగ విజయవంతంగా జరిగినందులకు డి.ఎస్.పి ఎమ్.శ్రావణి ఎంతో ప్రోత్సాహాన్ని అందించి సహకరించారని, అలాగే బాలోత్సవ్ కమిటీ 2026 కార్యక్రమ కరపత్రాలను కూడా డి.ఎస్.పి. శ్రావణి ఆవిష్కరించారు. ఈ బాలోత్సవ్ కమిటీ కార్యక్రమాలకు సహకరించి తమ ప్రోత్సాహాన్ని అందించారన్నారు. బాలోత్సవ్ కమిటీ ప్రచార కమిటీ కార్యదర్శి, సిద్దార్ధ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాగా ఏర్పడిన తరువాత మొట్ట మొదటిసారిగా అనకాపల్లి లో బాలోత్సవ్ ప్రథమ పిల్లల పండుగలో 1800 మంది జిల్లాలో గల విద్యార్థిని విద్యార్థులు 32 రకాల సాంస్కృతిక, సాంఘిక, సామాజిక అంశాలలో నిర్వహించారు. ఈ వినూత్న వివిధ పోటీలలో విద్యార్థులు తమ తమ ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించడం ఎంతో అభినందనీయ మైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమాలకు డి.ఎస్.పి. ఎమ్.శ్రావణి ముందు నుంచి కూడా తన ప్రోత్సాహాన్ని అందించినందులకు గాను బాలోత్సవ్ కమిటీ తరపున అభినందన సత్కారం అందించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో బాలోత్సవ్ కమిటీ కన్వీనర్ కడిమిశెట్టి త్రిమూర్తులు రెడ్డి, ఆర్గనైజింగ్ ప్రచార కార్యదర్శి , సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్, అధ్యక్షులు బల్లా నాగభూషణం, కార్యదర్శి బొప్పే ఉమామహేశ్వరరావు, కమిటీ మహిళా కన్వీనర్ కడిమిశెట్టి సుభాషిణి పాల్గొన్నారు.

## గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల
# అక్రమ సరఫరా దందా



**శృంగవరపుకోట , మార్చి 13 (మనసులో మాట) :** ప్రపంచ ఇంధన సరఫరా సంక్షోభం, వాణిజ్య ఎల్ పి జి కొరత కారణంగా వంట గ్యాస్ క్రమబద్ధమైన సరఫరాను నిర్ధారించడానికి కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల చట్టం (ఎస్మా) ను ప్రయోగించినా శృంగవరపు కోట పట్టణములో ఇది ఇంతవరకూ అమలు కాలేదు. వాణిజ్యం కంటే గృహ అవసరాలకే ప్రాధాన్యం ఇస్తున్నామని కేంద్రం చెప్పినా గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య వ్యాపారాలకు సరఫరా చేయడం ఏజెన్సీ ఆపలేదు. అక్రమ నిల్వలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీ.జీ.పి.లు, ముఖ్య కార్యదర్శులను కేంద్ర ప్రభుత్వం ఆదేశించినా ఆ ఆదేశాలు ఇక్కడ అమలు కావట్లేదు. శృంగవరపుకోటలో భారత్ గ్యాస్ ( బీపీసిఎల్ ) శ్రీ లక్ష్మీ ఏజెన్సీస్ ద్వారా సరఫరా చేయబడుతుంది. గతంలో ఈ ఏజన్సీని నడిపిన వారు సరఫరా విషయంలో చేసిన అక్రమాలకు చెక్ పెట్టేందుకు అప్పటి ఆర్. డీ. వో. ఢిల్లీ రావు స్వయంగా తనిఖీకి వచ్చిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం ఏజెన్సీని నిర్వహిస్తున్నవారు కూడా గత ఐదు సంవత్సరాలుగా అక్రమంగా గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు సరఫరా చేస్తున్న ఆధారాలున్నాయి. పౌర సరఫరాల డిప్యూటీ తహశీల్దార్ తమ పరిధిలోని హోటళ్ళు, రెస్టారెంట్లు, డాబాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, టీ సెంటర్లు, ఇతర వాణిజ్య కేంద్రాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. కానీ ఈ తనిఖీలు అసలు లేనేలేవనేందుకు పట్టణములో నడుస్తున్న సుమారు డెబ్భై వరకూ ఉన్న చిన్నా, పెద్ద సెంటర్లు, తోపుడు బళ్ళ వ్యాపారాలే సాక్ష్యాలు. వాణిజ్య సిలిండర్లకు బదులుగా గృహ అవసరాల గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తున్నట్లు గుర్తించిన పక్షంలో సంబంధిత వారిపై 6ఏ కేసులు నమోదు చేయాలి. సిలిండర్లను స్వాధీనం చేసుకోవాలి. ఎస్మా ప్రకటించాక కూడా ఇంతవరకూ ఏ తనిఖీలు చేపట్టక, వాణిజ్య అవసరాలకు అక్రమంగా వాడుతున్న గృహ వినియోగ సిలిండర్లను స్వాధీనం చేసుకోవడములో ఉపేక్షించడాన్ని బట్టి పౌర సరఫరా శాఖ పనితీరు అవగతమవుతుంది. ఈ వ్యవహారమంతా వ్యాపారుల అక్రమ వినియోగాన్ని, గ్యాస్ ఏజెన్సీ తప్పుడు లెక్కలను, పన్నుల ఎగవేతను, అధికారుల నిర్లక్ష్యాన్ని సూచిస్తుంది. గ్యాస్ ధర పెంపు భారం సామాన్యుడి మీద ఎందుకు పడుతుందో బహిర్గతం చేస్తుంది. అధికారుల తనిఖీలు ఉండనే ఉండవనే ధైర్యంతో ఏజెన్సీ నుండి ఇష్టారాజ్యంగా అక్రమంగా సిలిండర్లు తరలింపబడుతున్నాయి. పట్టణంలో ను, చుట్టుపక్కల గ్రామాల్లో ను అక్రమ సిలిండర్లు సరఫరా అంతా వాహనాల చోదకులు, డెలివరీ బోయ్స్ ద్వారానే జరుగుతుంది. గృహ వినియోగ సిలిండర్లను డెలివరీ బోయ్స్ బుక్ చేసినవారికి ఆలస్యం చేసి వాటిని వ్యాపారాలకు సర్దుబాటు చేయడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అరకు – విశాఖ రహదారిలో పందిరప్పన్న జంక్షన్ నుండి కొత్తూరు గ్రామశివారు వరకూ, విజయనగరం రహదారిలో దేవీ కూడలి నుండి సీతంపేట శివారు వరకూ అన్నిచోట్లా వ్యాపార వాణిజ్యాలకు, ఫంక్షన్లు, ఈవెంట్లకు గృహ వినియోగ సిలిండర్లే వాడుతున్నా ఇంతవరకూ నియంత్రణ లేదు. ఆర్.టి.సి.కాంప్లెక్స్ ఎదురుగా గల వీధిలో ఒక స్నానపు గదిలో అక్రమంగా ఒక వ్యాపారి గృహ వినియోగ సిలిండర్లను నిల్వ ఉంచుతున్నాడు. అదే వీధిలో మరో వ్యాపారి ఇంటికి డెలివరీ బాయ్ నెలకు సుమారు పది గృహ వినియోగ సిలిండర్లను యథేచ్ఛగా సరఫరా చేస్తున్నాడు. గౌరీ శంకర్ కాలనీలో పాడుబడిన ఇంటిలో చింతపండు గొడౌన్ ద్వారా గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు దగ్గరలోని టిఫిన్ సెంటర్లకు అక్రమ సరఫరా డెలివరీ బోయ్స్ సహకారంతో గుట్టు చప్పుడు కాకుండా జరుగుతుంది. ఇటువంటి నిల్వలు వలన ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆందోళనలో ప్రజలున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో ఏర్పడబోయే సిలిండర్ల కొరతను దృష్టిలో ఉంచుకొని ఇప్పుడైనా అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టి గృహ వినియోగ కొరత తలెత్తకుండా చొరవ చూపాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## సంచలన పోలీసు అధికారిగా పేరు తెచ్చుకున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డిజిపి హెచ్.జె దొర మరణ వార్త నన్ను తీవ్రంగా కలచి వేసింది

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం , మార్చి 13 (మనసులో మాట) :** 1965 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన అయన, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డిజిపిగా, సి.ఐ.ఎస్.ఎఫ్ డైరెక్టర్ జనరల్ గా, ఎపిఎస్ ఆర్టిసి ఎం.డి గా, ఇంటలిజెన్స్ అధికారిగా, హైదరాబాద్ పోలీస్ కమీషనర్ గా ఇలా పలు హోదాలలో పనిచేసి మెరుగైన పనితీరు కనబరిచారు. పదవి విరమణ అనంతరం 2006లో జీఎమ్మార్ సంస్థలో డిల్లీ ఎయిర్పోర్ట్ సెక్యూరిటి అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ గా పని చేసిన అవిశ్రాంతంగా సేవలందించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తి అయిన హెచ్.జె.దొర . నా తండ్రి







దివంగత ఎర్రన్నాయుడు తో అనుబంధంగా ఉండేవారు. మారుమూల ప్రాంతంలో పుట్టి.. పోలీసు శాఖలో పతాక స్థాయికి దొరగారు ఎదిగిన తీరు ఎప్పుడూ మాకు స్ఫూర్తిని అందిస్తుంది. పోలీసు శాఖలో అయన చేపట్టిన సంస్కరణలు ఎల్లప్పుడూ వారిని మననం చేయిస్తాయి. వారి మరణం దేశానికే తీరని లోటు.. వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతి తెలుపుతూ.. హెచ్.జె దొర గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.

## అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 3వ విడత నిధుల జమ

- అల్లూరి జిల్లాలో 1,03,864 మంది రైతులకు రూ.62.32 కోట్లు,
- రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట
- జగన్ పాలనలో రైతులు మోసపోయారు

: రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్



**అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు , మార్చి 13 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలోని కాఫీ హౌస్‌లో నిర్వహించిన అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. గత వైసీపీ పాలనలో రైతులు అనేక విధాలుగా మోసపోయారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం కింద మూడో విడతలో ఒక్కో రైతుకు రూ.6,000 చొప్పున అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 11 మండలాలకు చెందిన 1,03,864 మంది రైతుల ఖాతాల్లో మొత్తం రూ.62. 32 కోట్ల రూపాయలు జమ అయినట్లు ఆయన తెలిపారు. రైతులకు సాగు పెట్టుబడికి ఈ సాయం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.దేశానికి అన్నం పెట్టే రైతు సంతోషంగా ఉంటేనే సమాజం సుభిక్షంగా ఉంటుందని, అందుకే కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా సాయం అందిస్తూ రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి, మాజీ మంత్రి మణికుమారి, జీసీసీ డైరెక్టర్ నాగరాజు, ఏఎంసీ చైర్మన్ డప్పొడి వెంకట రమణ, దారేలా సర్పంచ్ పాండురంగస్వామి, మాజీ జడ్పీటీసీ సుబ్బారావు, ఏఎంసీ డైరెక్టర్ సుబ్బలక్ష్మి, మాజీ ఎంపీపీ విజయరాణి, లైసాపల్లి సర్పంచ్ పార్వతి వెంకట కుమారి, రాంబాబు, స్వాము తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ 'పై' దినోత్సవాన్ని పురస్కరించుకొని 'పై' డే వేడుకలు

- జరజాపు పేట ఉన్నత పాఠశాల హెచ్ ఎం కామేశ్వరి అధ్యక్షతన 'పై' డే గణిత ఉత్సవాలు నిర్వహణ



**నెల్లిమర్ల , మార్చి 13 (మనసులో మాట) :** గణితం అంటే కేవలం లెక్కలు మాత్రమే కాదు, అది ఒక అద్భుతమైన మేధాశక్తి అని నిరూపిస్తూ నగర పంచాయతీ పరిధి జరజాపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'పై' డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ 'పై' దినోత్సవాన్ని పురస్కరించుకుని, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. కామేశ్వరి అధ్యక్షతన ఈ గణిత ఉత్సవాలు నిర్వహించారు. ఏపీ మ్యాథమెటిక్స్ ఫోరం జిల్లా శాఖ, పాఠశాల రామానుజన్ గణిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. గణిత ఉపాధ్యాయుల, క్లబ్ ఇన్చార్జ్ శివుకు బంగారయ్య పర్యవేక్షణలో విద్యార్థులకు గణితంపై ఆసక్తి కలిగించేలా పలు ఆసక్తికరమైన పోటీలు నిర్వహించారు. ఆకట్టుకున్న ఆరు విభిన్న పోటీలు నిర్వహించారు. పై మెమరీ ఛాలెంజ్: 'పై' విలువలోని దశాంశ స్థానాలను గుర్తుంచుకునే సామర్థ్య పరీక్ష. పై ఆర్ట్ అండ్ పోస్టర్ క్రియేషన్: చిత్రలేఖనం ద్వారా గణిత భావనల ప్రదర్శన. రియల్ లైఫ్ ఇన్ మ్యాథమెటిక్స్: నిత్యజీవితంలో గణిత నమూనాల ప్రాముఖ్యతపై పోటీలు నిర్వహించారు. గణిత నాటిక: "ఒకవేళ ప్రపంచంలో 'పై' అనే విలువ లేకపోతే ఎలా ఉండేది?" అనే అంశంపై విద్యార్థులు వేసిన నాటకం అందరినీ ఆలోచింపజేసింది. ఈ వేడుకలు విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి, సబ్జెక్టుపై మక్కువ పెంచాయని ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది. అనంతరం విజేతలకు హెచ్‌ఎం కామేశ్వరి బహుమతులు ప్రదానం చేశారు.

## నియోజకవర్గలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- విఎంఆర్‌డిఏ కమిషనర్ తేజ్ భరత్
- దేవరాపల్లిలో రూ.75 లక్షలతో పార్కు ప్రారంభం
- ఇంటింటి కొళాయిలను ఎమ్మెల్యే బండారు



**దేవరాపల్లి , మార్చి 13 (మనసులో మాట) :** వీఎమ్ఆర్డిఏ పరిధిలో అన్ని నియోజకవర్గాలలో మౌలిక సదుపాయాల కల్పన ధ్యేయంగా పనిచేస్తుందని వీఎమ్ఆర్డిఏ కమిషనర్ తేజ్ భరత్ అన్నారు. మండల కేంద్రం దేవరాపల్లిలోని విఎంఆర్డిఏ నిధులతో రెండు ఎకరాలలో 25 లక్షలతో మినీ మల్టీపర్పస్ హాలు, రూ. 51 లక్షలతో పార్కు నిర్మాణాన్ని వీఎమ్ఆర్డిఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అంతకుముందు సచివాలయం సమీపంలో జలజీవ న్ మిషన్ పథకం కింద రూ. 5.62 కోట్ల నిర్మించిన ఇంటింటి కొలాయి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన దగ్గరనుంచి అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. విఎంఆర్డిఏ సహకారంతో ఇప్పటికే నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం 1.76 కోట్లు కేటాయించిందన్నారు. అలాగే దేవరాపల్లిలో పార్కులో పిల్లల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తామని కమిషనర్ ప్రకటించడం హర్షదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టిడిపి సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, మండల ప్రత్యేక అధికారిణి ఎస్.మంజుల వాణి, ఆర్ బ్ల్యూ ఎస్ డి ఈ జీవీఎస్ ప్రకాష్, తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎంపీడీవో ఎస్.కిరణ్ వరప్రసాద్, ఆర్ బ్ల్యూఎస్ ఏఈ కె చంద్రశేఖర్, విఎమ్ఆర్డిఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఇరిగేషన్ అధికారులు, మండల పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, పూడి సత్యారావు,శరఖాన సూర్యనారాయణ, సోమిరెడ్డి గోవింద, బంధం అప్పలరాజు, గొల్లపల్లి మురళీకృష్ణ, కర్రి నాయుడు, కర్రీ పుష్ప, మండల ఎస్సీ సెల్ అధ్యక్షురాలు కె. జ్యోలా, గుల్లిపల్లి అర్జున తదితరులు పాల్గొన్నారు.



## పేదవాడిపై గ్యాస్, ఇంధన ధరల భారానికి కేంద్రానిదే బాధ్యత

- సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్



**నెల్లిమర్ల , మార్చి 13 (మనసులో మాట) :** పెరుగుతున్న గ్యాస్ ఇంధన ధరలు, మార్కెట్‌లో ఏర్పడిన కృత్రిమ కొరత సామాన్యుడి వెన్ను విరుస్తున్నాయని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశంలో ఇంధన సంక్షోభం నెలకొందని ఆయన ఆరోపించారు. మండలంలోని కొత్తపేటలో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పనుల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో రామారావు మాట్లాడుతూ, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో గ్యాస్, ఇంధన కొరత సామాన్యుడిని మరింత ఇబ్బందుల్లోకి నెట్టివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ సిలిండర్ ధర రూ. 1000 నుండి ఏకంగా రూ. 1110కి చేరడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది మధ్యతరగతి, పేద కుటుంబాల బడ్జెట్‌ను తలకిందులు చేస్తోందని పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమెరికా వంటి దేశాల ప్రయోజనా లకు లొంగిపోతూ, దూరదృష్టి లేని నిర్ణయాలు తీసుకోవడం వల్లే నేడు దేశంలో చమురు, గ్యాస్ కొరత ఏర్పడిందని విమర్శించారు. సిలిండర్ల కొరత వల్ల హోటల్ పరిశ్రమ కుదేలైందని,వీధుల్లో చిరు వ్యాపారాలు చేసుకునే అసంఘటిత రంగ కార్మికులు తమ ఉపాధిని కోల్పోతున్నారని రామారావు తెలిపారు. ఒకపక్క ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరో పక్క కేంద్ర ప్రభుత్వం "ఎటువంటి కొరత లేదు" అని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా ప్రజలను మభ్యపెట్టడం మాని, గ్యాస్ మరియు చమురు కొరత లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి. సామాన్యుడిపై పడుతున్న ధరల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.

## నూతన సీసీ రోడ్ ప్రారంభం



**నక్కపల్లి ,మార్చి 13 (మనసులో మాట) :** నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు వెలగా సుధాకర్, తో పాటు కూటమి నాయకులు కలిసి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరైన చంద్రగిరి రమణ గ వీధిలో సి సి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని వెంకటేష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని హోంమంత్రి అనిత చొరవతోనే నిధులు మంజూరు అవుతున్నాయని దానితోనే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్దండపురం టిడిపి గ్రామశాఖ అధ్యక్షుడు కుర్ర బాబ్జి, జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు అమలకంటి హరికృష్ణ, జనసేన మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్యామ్ కిషోర్, హై స్కూల్ చైర్మన్ వెలగా శ్రీను, మాజీ ఉపసర్పంచ్ బొల్లం రమణ, సీనియర్ నాయకుడు కీర్తి గోవిందరావు, పొడగట్ల రాజు, జనసేన గ్రామ శాఖ సెక్రెటరీ ఆవాల గోవింద్, చంద్రగిరి రమణ, పేకేటి గోవిందరావు, పేకేటి రాము,పేకేటి చిన్న రాజారావు, కుర్ర సూరిబాబు, వెల్లంశెట్టి సోమరాజు, తదితర నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు



**వి.మాడుగుల , మార్చి 13 (మనసులో మాట) :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో తొలి తెలుగు రామాయణ కవయిత్రి మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా మొల్ల చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ జి జయలక్ష్మి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జి జయలక్ష్మి అధ్యక్షో పన్యాసం చేస్తూ రామాయణ కవయిత్రిగా మొల్ల చేసిన సాహిత్య కృషిని కొనియాడారు. తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ పులవర్తి పైడిరాజు మాట్లాడుతూ తెలుగులో రామాయణాన్ని సరళ సుందరంగా హృద్యంగా తీర్చిదిద్దిన మొల్ల గొప్పతనాన్ని కవిత్వ వైదుష్యాన్ని విద్యార్థులకు విశదీకరించారు. సంస్కృతంలో వాల్మీకి రచించిన రామాయణాన్ని తెలుగులో ఎందరో కవులు రచించినప్పటికీ మొల్ల రామాయణం ప్రత్యేకత కలిగిన కావ్యంగా చెప్పవచ్చును అన్నారు. మొల్ల కవిత్వంలో మహిళా దృక్పథాంశాలు ఎన్నో కనిపి స్తాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపన్యాసకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## 20 ఎకరాల్లో ఉన్న అకేసియా జీడి మామిడి తోటలో దగ్ధం



**రావికమతం , మార్చి 13 (మనసు లో మాట) :** మండలంలో గుడివాడ గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో 20 ఎకరాల్లో ఉన్న జీడి మామిడి, అకేసియా తోటలు దగ్ధమయ్యాయి ప్రమాదవార్తను ఆలస్యంగా గుర్తించిన యజమానులు డీఎస్ ఎన్ రాజు పిఎస్ఎన్ రాజు ఎం రాధ లు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ప్రమాద స్థలికి చేరుకునేందుకు సరైన మార్గం లేకపోవడంతో వాహనం మంటలు అదుపు చేయలేకపోయింది. దీంతో గ్రామానికి చెందిన యువకులు మంటలను ఆర్పారు. లేనియెడల పక్కనే ఉన్న మరొక 50 ఎకరాలు జీడి మామిడి తోటలు కాలి బూడిద అయ్యే ప్రమాదం తప్పిందని బాధితులు తెలిపారు. నష్టం కోటి రూపాయలు పైనే ఉంటుందని బాధితులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

## ముగిసిన ఆదివాసీ సత్యాగ్రహ యాత్ర



**పెదబయలు , మార్చి 13 (మనసులో మాట) :** గిరిజనులకు ఇచ్చిన హామీలను రాష్ట్రప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆది వాసీ జేఏసీ చేపట్టిన ఆదివాసీ సత్యాగ్రహ యాత్ర' పెదబయలులో ముగిసింది. 125 రోజుల పాటు సాగిన ఈ యాత్ర ముగింపు సందర్భంగా సీతగుంట నుంచి పెదబయలు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ కూడలి వద్ద జరిగిన ముగింపు సభలో జేఏసీ జిల్లా చైర్మన్ రామారావుదొర మాట్లాడారు. గత ఏడాది ఆగస్టు 9న పాడేరులో సీఎం ఇచ్చిన హామీ ప్రకారం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, నూరుశాతం ఉద్యోగాలు గిరిజనులకే కేటాయించాలని కోరారు. గత డీఎస్సీలో మైదాన ప్రాంత అభ్యర్థులను నియమించడం వల్ల గిరిజన నిరుద్యోగులు 95 శాతం ఉద్యోగాలు కోల్పోయారని మండిపడ్డారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్టేట్ క్యాడర్లో 30 శాతం, జోనల్ క్యాడర్లో 50 శాతం, లోకల్ క్యాడర్లో నూరుశాతం పోస్టులను గిరిజనులతోనే భర్తీ చేసేలా చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం గ్రామగ్రామాన ప్రజలను చైతన్యం చేస్తున్నామని, ప్రభుత్వం స్పం దించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెదబయలు మండల గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్య దర్శులు తలారి చక్రదర్, లకే అనిల్, ఉపాధ్యాయ సంఘాల నేతలు పలాసి తిరుపతిరావు, రెడ్డి కమల కుమారి, సూర్యకళ, చెండా బాలకృష్ణ, రామచంద్ర శేఖర్, రూడ చిన్నయ్య, మాలంనాయుడు, హనుమంతు. ప్రసాదరావు, అప్పన్న, మత్స్యలింగం, భగవాన్, అప్పలస్వామి, రాధాకృష్ణ, జేఏసీ సీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు బూడిదేమాధవరావు,మా నుగూరు బాబుజీ, పార్థసారధి, స్వామి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరుద్యోగులు పాల్గొన్నారు

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక

## పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ మూడవ విడత నిధుల విడుదల : కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్



**పాడేరు , మార్చి 13 (మనసులో మాట) :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న పీఎం కిసాన్ (22వ విడత), అన్నదాత సుఖీభవ (3వ విడత) నిధుల విడుదల రెండు జిల్లాల రైతులకు వ్యవసాయంలో పెట్టుబడిలో సాయంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఐటిడిఏ కాఫీ హౌస్ నందు అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ నిధులను అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,03,864 రైతులకు 62.32 కోట్లు, పోలవరం జిల్లాలో 40,358 రైతులకు 24.56 కోట్లు వెరసి మొత్తం రెండు జిల్లాల పరిధిలోని 1,44,222 మంది రైతులకు 86.88 కోట్ల రూపాయల నిధులను చెక్ రూపంలో రైతులకు అంద జేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడో విడత నిధులను పీఎం కిసాన్ నిధులతో కలిపి ప్రతి రైతు అకౌంట్ లో 6000 జమ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రధాన కేంద్రాలలో ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతు సంతోషంగా ఉంటేనే అందరం సంతోషంగా, సుభిక్షంగా ఉంటామన్నారు. జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం రైతు జీవితానికి నమ్మకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు, లగిశపల్లి సర్పంచ్ లకె. పార్వతమ్మ, మినుములూరు సర్పంచ్ చిట్టెమ్మ, పాడేరు ఎంపీపీ సునే. రత్నకుమారి, పాడేరు ఏఎంసీ చైర్మన్ యం. మంగ తల్లి, పాడేరు పిఎసిఎస్ చైర్మన్ దప్పోడి. వెంకటరమణ, పాడేరు మాజీ ఎంపిటిసి బొర్రా విజయ, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బి ఎస్ నంద్, జిల్లా ఉ ద్యాన శాఖ అధికారి బాలకర్ణ, పాడేరు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రభాకర్ రావు, పాడేరు మండల వ్యవసాయ అధికారి ఏరా. శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతు సోదరులు, రైతు ఉ త్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఆదర్శ రైతులు మరియు మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు

## రోలుగుంటలో హెచ్ పి వి టీకాలతో అమ్మాయిల భవిష్యత్తు సురక్షితం

**రోలుగుంట , మార్చి 13 (మనసులో మాట) :** మండల కేంద్రమైన రోలుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ కె.వి. శ్రావణి ఆధ్వర్యంలో హెచ్ పి వి టీకాల కార్యక్రమం జరిగింది. సర్వైకల్ క్యాన్సర్ నుండి మహిళలను రక్షించే ఈ టీకా 14-15 సంవత్సరాల అమ్మాయిలకు వేయారు. ఎంపి హెచ్ ఈ ఓ లు కృష్ణ గోవిందు, ఎచ్.ఎస్. షాజహాన్, ఎంఎల్ హెచ్ పి రమ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

**నబ్బవరం , మార్చి 13 (మనసులో మాట) :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిరుపేద రైతుల కోసం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి రైతులను తీసుకురాకపోవడంతో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెందుర్తి నియోజకవర్గం పరిధిలో సుమారు, 10,446 మంది రైతులకు ప్రభుత్వ సహాయం అన్నదాత సుఖీభవ అందించాల్సి ఉండగా కేవలం 200 మంది రైతులను సభకు తీసుకురాలేకపోయారని ఇది ముమ్మాటికి అధికారుల నిర్లక్ష్యమేనని ఎమ్మెల్యే మండిపడ్డారు. మరోసారి ఇలాంటి తప్పిదాలు జరిగితే వ్యవసాయ శాఖ అధికారులను ఎంత మాత్రం క్షమించేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గం పరిధిలో రైతులకు అన్నదాత సుఖీభవ సహాయం పంపిణీ సభను ఏర్పాటు చేయమంటే కేవలం మండల పరిషత్ మీటింగ్ హాల్లో సభ ఏర్పాటు చేసి "మమ" అనిపిద్దామని, అధికారులు చూశారని, కానీ పాడేరు నుంచి వస్తా రైతులు మధ్యలో సభ ఏర్పాటు చేయమని కోరినప్పుడుగంటల తరబడి సమయం తీసుకుని కూడా జనాన్ని మొదలై చేయలేకపోయారని అసహనం వ్యక్తం చేశారు. అంతకుముందు ఆసకపల్లి లో రైతులు రెండో పంటకు వేసిన వరి పొలాన్ని ఆయన సందర్శించి ప్రభుత్వ పథకాలు వ్యవసాయ అధికారులు





పనితీరుపై ప్రశ్నలు అడిగి రైతుల నుంచి జవాబులు రాబట్టారు. అనంతరం సభ వేదిక వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయంస్టాల్స్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధిలోరాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తుంటే అధికారులు నిర్లక్ష్యము ఆవ లంబించడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ,3 విడత అన్నదాత సుఖీభవ పథకంలో 18 వేల మంది రైతులకు 10,వేల కోట్ల, 46 లక్షల నలభై వేల రూపాయలు రూపాయలు వారి ఖాతాల్లో వేయటం ద్వారా పంపిణీ చేయటం జరిగిందని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెందుర్తి నియోజకవర్గం పరిధిలో 450 కోట్ల రూపాయల నిధులతో రోడ్ల అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వాలు వదిలిన భారాన్ని తట్టుకుంటూనే అభివృద్ధి సంక్షేమాన్ని రెండు చక్రాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోడీ సహాయ సహకారాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సభకు అసకపల్లి సర్పంచ్ కర్రీ నరసింగరావు అధ్యక్షత వహించగా, మండల వ్యవసాయ శాఖ అధికారి పోతల సత్యనారాయణ, బిజెపి నేతలు శరగడం శంకరరావు, సాలాపు వెంకటేశ్వరరావు,బలిరెడ్డి అప్పారావు,మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కర్రీ కనకరాజు, గొర్లి రాము నాయుడు, తాసిల్దార్ బి చిన్నికృష్ణ, ఎంపీడీవో బి పద్మజ, పెందుర్తి ఎంపీపీ గండ్రెడ్డి మాలతి నగేశ్, రోమాలచంద్రశేఖర్, బయలుపూడి దేవుడి బాబు, మిడతాడా మహాలక్ష్మీ నాయుడు,సీరం అప్పలరాజు, దుర్గినాయుడు, కోరాడ శ్రీనివాస్,గవర అప్పారావు , బంతి కోళ్ల పద్మ, పెద్దడా రవణమ్మ గొర్లి కుమార్ స్వామి, పల్లి మంగ రాజు, వాకాడ రవితేజ, ఎస్ రామకృష్ణ,ఎం.రాము, సుంకర శివ,వెంకీలు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మసాగరంలో ఘనంగా 'అన్నదాత సుఖీభవ..పీఎం కిసాన్'



**నర్సీపట్నం,మార్చి 13 (మనసులో మాట) :** మండలంలోని ధర్మసాగరంలో 'అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ. 20,000 చొప్పున ఆర్థిక సాయం అందించే ఈ పథకం మూడవ విడత నిధుల పంపిణీని స్థానికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై తన చేతుల మీదుగా రైతులకు లబ్ధిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వంఈ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని,వ్యవసాయ పెట్టుబడికి ఈ నగదు రైతాంగానికిఎంతో ఆసరాగా నిలుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ రామారావు, జడ్పీటీసీ రమణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, శ్రీరంగస్వామి, నర్సీపట్నం మండలం టీడీపీ ప్రెసిడెంట్ అప్పలనాయుడు, వ్యవసాయ అధికారులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓనూరు, నందిగారువు గ్రామాల్లో ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్



**పాడేరు , మార్చి 13 (మనసులో మాట) :** అల్లూరి జిల్లాలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని జిల్లా యంత్రాంగంతో కలసి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, సూపర్ ఇండెంటెంట్ ఆఫ్ పోలీస్ అమిత్ బర్దార్, జిల్లా అధికారుల తో కలిసి ఓనూరు మరియు నందిగారువు గ్రామాలను సందర్శించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఏర్పాటు పనులను స్వయంగా పరిశీలించారు. రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పర్యటించే మార్గాలను హెలిఫెడ్ ను,ఓనూరు గ్రామంలో అంగన్వాడి సెంటర్ ను, ఎంపీపీ స్కూల్ లో పిల్లలతో కలిసి ముచ్చటించే ప్రాంగణాన్ని పరిశీలించారు. అక్కడ నుండి నందిగారువు లో ప్రజలతో జరిగే మాటామంతి సభా స్థలాలను కలెక్టర్, ఎస్పి తో కలసి తనిఖీ చేశారు. ఉప ముఖ్యమంత్రి తో పాల్గొనే ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ప్రోటోకాల్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీరంతరం తాగునీరు,



సభ జరుగు ప్రాంతంలో విద్యుత్ సరఫరా మరియు పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ పర్యటనలో భాగంగా చేపట్టబోయే వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై స్థానిక జిల్లా అధికారులతో సమీక్షించి,పెండింగ్లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనపై అత్యంత ప్రాధాన్యత కలిగినదని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైలవరపు కృష్ణ తేజ, ఇంచార్జ్ ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్రావు, డీఎస్పీ అభిషేక్, ఇన్చార్జ్ ఆర్డిఓ లోకేశ్వరరావు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి నీలకంఠరావు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి,ఇరిగేషన్, విద్యుత్, పిడి డ్వామా,పిడి డిఆర్డిఏ, డి ఎల్ పి ఓ, రెవెన్యూ,పోలీస్,గ్రామ సర్పంచ్, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్ " లో వచ్చే వినతులకు సత్వర పరిష్కారం

**- ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోత్ బంగార్రాజు నిర్వహించే ప్రజాదర్బార్ లో వచ్చే వి నతులకు సత్వర పరిష్కార మార్గానికి చొరవ**



**భోగాపురం , మార్చి 13 (మనసులో మాట) :** మండలంలో గల పోలిపల్లి గ్రామంలో ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ ఉ నెల్లిమర్ల టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజు తన నివాసంలో ముఖ్యమంత్రి ఆదేశానుసారం "ప్రజా దర్బార్" అనే కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం పార్టీ కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేశారు. వీటిలో భాగంగా కార్యకర్తలు,ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులలో భూ సమస్యలు,సిసి రోడ్లు, కాలువలు, ఎలక్ట్రికల్, గత ప్రభుత్వంలో ఉపాధి కోల్పోయిన బాధితుల సమస్యలు గ్రామాల్లో మౌలిక వసతుల సమస్యలు,గత ప్రభుత్వంలో రీ-సర్వే వలన జరిగిన పొరపాట్లు సమస్యలు దరఖాస్తులు వినతుల్లో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ " ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలానుసారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని. అదేవిధంగా బాధితులు యొక్క సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి సత్వరమే పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధికార ప్రతినిధిని నీలాపు అప్పల రామిరెడ్డి, టీడీపీ నాయకులు కోరాడ తాతారావు,కంది వెంకటరమణ, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెట్టుపల్లి జడ్పీ హైస్కూల్లో విజయీభవ కార్యక్రమం



**నర్సీపట్నం , మార్చి 13 (మనసులో మాట) :** మండలంలోని చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "విజయీభవ" పేరిట ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈనెల 16వ తారీకు నుంచి ప్రారంభం కాబోతున్న పదో తరగతి పరీక్షలు తాలూకా హాల్ టికెట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయిని సరోజిని మాట్లాడుతూ, ఈ ఏడాది పాఠశాల నుంచి 65 మంది పరీక్షలకు హాజరు కాలు ఉన్నారని, అందులో 48 మంది ఇదే పాఠశాల లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదివిన వారన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివారని మంచి విజయాలు ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నర్సీపట్నం మండల విద్యాశాఖ అధికారి జి వి ఎస్ నాగేంద్ర మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు అనేది ఒత్తిడికి గురి కావాల్సిన అవసరం లేదని స్పష్టంగా ప్రచురణ చదివి వాటికి ఆన్సర్ రాయివచ్చని ఒక పేజీలో 18 లైన్లు వచ్చే విధంగా మంచి హ్యాండ్ రైటింగ్ తో రాయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున తల్లులు అదేవిధంగా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్ర అభివృద్ధి కి ప్రత్యేక ప్రణాళిక : విఎంఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



**కె.కోటపాడు , మార్చి 13 (మనసులో మాట) :** ఉత్తరాంధ్రాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రత్యేక ప్రణాళిక ద్వారా వెళు తున్నామని వి.ఎం.ఆర్.డి.ఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అన్నారు. మండల కేంద్రం ఎంపీడీవో ఆఫీసు ఆవరణలో విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ నిధులు రూ.99.50 లక్షల అంచనా వ్యయంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నిర్మించనున్న కన్వెన్షన్ బిల్డింగ్ నిర్మాణానికి మాడుగుల ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి వి.ఎం.ఆర్.డి.ఎ. చైర్మన్ ప్రణవ్ గోపాల్ తో శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ నా అభ్యర్థన మేరకు ఈ భవనం నిర్మాణానికి అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్ మరో కోటి రూపాయలు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు.మాడుగుల నియోజకవర్గంను అభివృద్ధి పదంలో నడిపించడమే నా ధ్యేయమన్నారు. చైర్మన్ ప్రాణం గోపాల్ మాట్లాడుతూ ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందేందుకు మరియు అభివృద్ధి పరిచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశ నిర్దేశం అధికారులకు చేస్తున్నారని అలాగే కూటమి ప్రభుత్వంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి పరిచేందుకు అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని ప్రణవ్ గోపాల్ అన్నారు.



స్థానిక అభ్యర్థన మేరకు మంచినీటి కోనేరు అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని ఆయన అన్నారు.ఈ విఎంఆర్డి ఏ కమిషనర్ తేజభరత్ మాట్లాడుతూ కన్వెన్షన్ బిల్డింగ్ అక్టోబరు రెండు నాటికి అందుబాటులో తేవడానికి సాయి శక్తుల కృషి చేస్తామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందు చూపుతో అన్ని ప్రాంతాల అభివృద్ధికి చొరవ చూపుతున్నారని అన్నారు.అధికారులు నాయకుల సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించినట్లు ఆయన తెలిపారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి.వి.జి.కుమార్, టీడీపీ మాడుగుల నియోజకవర్గం నేత పైలా ప్రసాదరావు, వి.ఎం.ఆర్.డి.ఎ. చీఫ్ ఇంజనీర్ వినయకుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ భవానిశంకర్, పలు శాఖల అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం అనుమతుల జీవోలు తక్షణమే రద్దు చేయాలి

**- పాడేరు పర్యటనకు వస్తున్న డిప్యూటీ సీఎం పవన్ హైడ్రోపవర్ ప్రాజెక్ట్ నిర్మాణ అనుమతులపై స్పష్టమైన వైఖరిని ప్రకటించాలి**
**- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పాడేరు వచ్చే ముందే హైడ్రో పవర్ ప్రాజెక్టు జీఓలు 2,13,51 రద్దు చేస్తూ ఉత్తర్వులుజారీ చేయాలి**

**అరకులోయ , మార్చి 13 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కు విచ్చేయుచున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాయ్ డ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణాల అనుమతుల జీవోను తక్షణమే రద్దు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఈ సందర్భంగా అరకులోయ గిరిజన సంఘ భవనంలో విలేకరుల సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాల్ దేవ్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి, చింతపల్లి, జికె వీధి, కొయ్యూరు, మండలాల పరిధిలో గుజ్జెని, చిట్టం వలస, పెదకోట, ఎర్రవరం, సీలేరు ఐదవ షెడ్యూల్ గిరిజన ప్రాంతంలో 6వేలవంద మెగావాట్ల కరెంటు ఉత్పత్తి సామర్థ్యంతో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం నవయుగ అధాని శిరిడి సాయి ఎలక్ట్రికల్ కాన్స్ట్రక్షన్ మెగా బడా కార్పొరేట్ కంపెనీలకు ఆదివాసుల హక్కులు చట్టాలు ఉల్లంఘిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందని హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే ఏజెన్సీ ప్రాంతంలోని 25 పంచాయితీలు 200 గ్రామాలు సుమారుగా 60 వేల మంది ఆదివాసులు వేల ఎకారాల కిరాయితి అటవీ భూములు మరియు కాఫీ తోటలు వన్యప్రాణులు దళా సమాధి అయ్యే రాష్ట్ర ప్రభుత్వ జీవో నంబర్ 2,13,51 లు తక్షణమే రద్దు చేస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా ప్రత్యేక డీఎస్సీతో ఆదివాసి ప్రాంతంలో కథ తాత ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులకు గతంలో కల్పించిన రిజర్వేషన్లను ప్రస్తుతం కూడా ఆ రిజర్వేషన్ను వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గతంలో పలుమార్లు చేసినవినతులపై నేటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోక పోగా స్పష్టమైన ఉత్తర్వులు దారి చేయకపోవడం వల్ల ప్రత్యేక డీఎస్సీలో 4వేల ఐదు వందలఉ పాధ్యాయ పోస్టులు ఆదివాసులు కోల్పోయారని రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 92 శాతం ఉపాధి పోస్టులు నాన్ లోకల్ తో భర్తీ చేశారని 2026 డీఎస్సీ నిర్వహణకు కూటమి ప్రభుత్వం సన్నతమవుతున్న నేపథ్యంలో కూడా జరిగాయని అయినా సత శాతం రిజర్వేషన్ ఉ త్తర్వులు జారీ కాకపోవడం వల్ల ఆదివాసుల్లో తీవ్ర నిరసన




నిస్పృహ పెరిగిందని 2026 డీఎస్సీలో ఆదివాసీ యువతకు న్యాయం చేయాలని అందుకు అనుగుణంగా సతశాతం రిజర్వేషన్ అమలుకు తక్షణవే ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. అలాగే ఐదవ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను జనరల్ డిఎస్సి లో విలీనం చేయవద్దని ఆదివాసి ప్రాంతంలో ప్రత్యేక ఆదివాసి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని పాడేరువంట్లమామిడి కు వచ్చే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులకు దారి చేసిన జీవోలను రద్దు చేస్తున్నట్లు ప్రకటన చేసి పాడేరు ప్రాంతంలో పర్యటించాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం అరకులోయ మండల కార్యదర్శి జి బుజ్జి బాబు, మండల ఉపాధ్యక్షులు మాజీ ఎంపిటిసిబురిడీదశరథ్ పాల్గొన్నారు.

**ఉద్యోగ ఉపాధ్యాయ 100% రిజర్వేషన్ పై ఎగ్జిక్యూటివ్ జారీపై స్పష్టమైన ప్రకటన చేసి ప్రత్యకడిఎస్సీ ఇవ్వాలి - ఆదివాసీ గిరిజన సంఘం**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాడేరు వస్తున్న నేపథ్యంలో ఆదివాసులకు జల సమాధి చేసే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు జీవో 2,13,51 రద్దు చేయాలని ఉ ద్యోగ ఉపాధ్యాయ నియామక 100% రిజర్వేషన్ పై ఎగ్జిక్యూటివ్ జారీ చేసి ఆదివాసులకు నియామకాలు చేపట్టాలని ఆదివాసీ ప్రత్యక డీఎస్సీ ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ డిమాండ్ చేస్తున్నది. అరకువేలి గిరిజన సంఘం భవనంలో మీడియా సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలాదేవ్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి, అరకువేలి,చింతపల్లి,జి కె వీధి, కొయ్యూరు మండలాల పరిధిలో గుజ్జెలి,చిట్టంవలస, పెదకోట,ఎర్రవరం,సీలేరు ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో 6100 మెగావాట్ల కరెంటు ఉత్పత్తి సామర్థ్యంతో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం నవయుగ, అదాని ,శిరిడి సాయి ఎలక్ట్రికల్ కన్స్ట్రక్షన్,మెగా బడా కార్పొరేట్ కంపెనీలకు ఆదివాసుల హక్కులు చట్టాలు ఉల్లంఘిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందని హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే 25 పంచాయితీలు 250 గ్రాములు సుమారు 60 వేల మంది ఆదివాసులు వేల ఎకరాల జిరాయితి అటవీ భూములు కాఫీ తోటలు వన్యప్రాణులు జల సమాధి అవుతాయని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్లు 2,13,51 తక్షణమే రద్దు చేస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేసి ఉత్తర్వులు జారీ చేయాలని మెగా డీఎస్సీలో ఆదివాసీ ప్రాంతాల్లో 100% ఉపాధ్యాయ పోస్టులకు గిరిజనులకు రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చారని నేటికీ స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయకపోవడం వల్ల మెగా డీఎస్సీలో సుమారు 4500 ఉపాధ్యాయ పోస్టులు ఆదివాసులు కోల్పోయారని ఒక్క అల్లూరి జిల్లాలోనే 92 శాతం పాధ్యాయ పోస్టులు నాన్ లోకల్ తోనే భర్తీ చేశారని 2026 డీఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్నా నేపథ్యంలో టెట్ పరీక్షలు కూడా జరిగాయని కానీ నూరు శాతం రిజర్వేషన్ ఉత్తర్వులు జారీ కాకపోవడం వల్ల ఆదివాసుల్లో తీవ్ర నిరసన నిస్పృహ పెరిగిందని 2026 డీఎస్సీలో ఆదివాసీ యువతకు న్యాయం చేయాలనీ ప్రభుత్వం 100% రిజర్వేషన్ అమలుకు తక్షణ ఉత్తర్వులు జారీ చేయాలని, అప్పటి వరకు 5 వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను జనరల్ డీఎస్సీలో విలీనం చేయవద్దని ఆదివాసీ ప్రత్యక డీఎస్సీ నోటిపికేషన్ విడుదల చేయాలని పాడేరు వంట్లమామిడి వచ్చే ముందే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ జారీ చేసిన జీవోలు 2,13,51 రద్దు చేయాలని ఆదివాసులకు ఉద్యోగ ఉపాధ్యాయ నూరు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఆదివాసీ ప్రత్యక డీఎస్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు .ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి జి బుజ్జిబాబు మండల ఉపాధ్యక్షులు మాజీ ఎంపిటిసి బురిడీ దశరథ్, పాల్గొన్నారు.

# రైతన్నకు అండగా..

## అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్

### - ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ వ్యవసాయానికి భరోసా కల్పిస్తున్నట్లు రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కార్యక్రమం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కడియం మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ యోజన ద్వారా రైతులకు ప్రతి సంవత్సరం రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద మొదటి విడతగా కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలుతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు కలిపి రూ.7 వేలు, రెండో విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్రం రూ.2 వేలు, మూడో విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.4 వేలు, కేంద్రం రూ.2 వేలు చొప్పున మొత్తంగా సంవత్సరానికి రూ.20 వేల సాయం అందిస్తున్నట్లు వివరించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.14 వేలుగా, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.6 వేలుగా ఉంటుందని తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో మూడవ విడత కింద 5,730 మంది రైతులకు రూ.11.29 కోట్ల సాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం ఎక్కడా వెనుకడుగు వేయలేదని ఎమ్మెల్యే తెలిపారు. పింఛన్లు, తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత బస్సు వంటి పథకాలను అమలు చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చుతోందని అన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కడియం వేదికగా మార్కెట్ కమిటీ చైర్మన్ మార్ని వాసు, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, జిల్లా ఉద్యానవన అధికారి మరియు మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున రావు, సహాయ వ్యవసాయ సంచాలకులు కే సూర్య రమేష్, మండల వ్యవసాయ అధికారి పీవీ శ్రీనివాస్, తహసీల్దార్ సునీల్ కుమార్, ఉద్యానవన అధికారి లావణ్య రైతులు పాల్గొన్నారు.



## గ్యాస్ కొరత లేదు..

### - పంపిణీదారులతో నిరంతర పర్యవేక్షణ
### - సోషల్ మీడియాలో వస్తున్న వదంతుల నేపథ్యంలో వినియోగదారులు ఆందోళన
### - డీఎస్ఓ వీ పార్వతి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గృహ అవసరాలు, అత్యవసర సేవలకు నిరంతరాయంగా ఎల్పీజీ సరఫరా జరిగేలా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలైన ఐఓసీఎల్, హెచ్పీసీఎల్, బీపీసీఎల్ సంస్థలతో పాటు ఎల్పీజీ పంపిణీదారులతో నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్ఓ) వీ పార్వతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న 52 ఎల్పీజీ గ్యాస్ పంపిణీదారుల ద్వారా సుమారు 8.67 లక్షల గ్యాస్ కనెక్షన్ దారులకు గ్యాస్ సరఫరా జరుగుతోందన్నారు. తూర్పు గోదావరి జిల్లాకు గోకవరం, విశాఖపట్నం, విజయవాడ ప్రాంతాల్లోని ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్ల నుంచి గ్యాస్ సరఫరా జరుగుతోందన్నారు. రాష్ట్రంలోని బాట్లింగ్ ప్లాంట్లు సాధారణంగా పనిచేస్తుండగా, ఎల్పీజీ సిలిండర్ల నిల్వ కూడా తగినంతగా ఉందన్నారు. అయితే సోషల్ మీడియాలో వస్తున్న పుకార్ల కారణంగా రీఫిల్ బుకింగ్‌లు తాత్కాలికంగా పెరిగాయని, అయినప్పటికీ డెలివరీలు ముందు వచ్చినదే ముందు వెళ్తుంది (ఎఫ్ఐఎఫ్ఓ) విధానంలో కొనసాగుతున్నాయన్నారు. ఈ కారణంగా కొన్నిచోట్ల తాత్కాలిక జాప్యం ఏర్పడినా, సరఫరా చేయడంలో ఎటువంటి ఇబ్బందీ లేదని తెలియజేశారు. పారిశ్రామిక, బల్క్ ఎల్పీజీ సరఫరాను మాత్రమే పరిమితం చేయగా, గృహ వినియోగదారులకు ఎల్పీజీ సరఫరా కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అదే సమయంలో తూర్పు గోదావరి జిల్లాలో గృహ వినియోగదారులకు ఎల్పీజీ సరఫరా సాధారణంగానే కొనసాగుతోందన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో జిల్లా యంత్రాంగం సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తూ పంపిణీదారులకు సూచనలు జారీ చేస్తున్నాయన్నారు. కాబట్టి వినియోగదారులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. వినియోగదారులు తప్పుడు సమాచారం వల్ల అధిక బుకింగ్‌లు చేయడం, హోర్డింగ్ చేయడం నివారించి అవసర మైనప్పుడు మాత్రమే సిలిండర్ బుక్ చేసుకోవాలన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం తూర్పు గోదావరి జిల్లా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఎల్పీజీ సంబంధిత ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 8074661259 ను సంప్రదించవచ్చునని చెప్పారు. ప్రతి గ్యాస్ ఏజెన్సీ తమ వద్ద ఉన్న ప్రస్తుత స్టాక్, పెండింగ్ బుకింగ్‌లు, గ్యాస్ డెలివరీ రోజులు వంటి వివరాలను వినియోగ దారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాల్సిందిగా సూచించారు. తూర్పు గోదావరి జిల్లాలో ప్రస్తుతం సుమారు 225.46 మెట్రిక్ టన్నులు గ్యాస్ (15,742 సిలిండర్లు) అందుబాటులో ఉన్నాయన్నారు.

**గ్యాస్ బుకింగ్ ప్రత్యామ్నాయ పద్ధతులు..**
వినియోగ దారులు ఒకే సారి ఎక్కువగా బుకింగ్‌లు చేయడం వల్ల కొన్ని చోట్ల కాల్స్ కనెక్ట్ కాకపోవడం వంటి సమస్యలు వస్తున్నందున క్రింది ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా కూడా గ్యాస్ బుకింగ్ చేసుకోవచ్చునని తెలిపారు.

**భారత్ గ్యాస్..**
వాట్స్ యాప్ 1800 22 4344 కు "హాయ్" పంపాలి. మిస్డ్ కాల్ 7710955555, ఐవీఆర్ఎస్ 7715012345, 7718012345.

**ఇండేన్ గ్యాస్..**
వాట్స్ యాప్ 7588888824 కు "హాయ్" పంపాలి. మిస్డ్ కాల్ 84549 55555, ఐవీఆర్ఎస్ 77189 55555.

**హెచ్పీ గ్యాస్..**
వాట్స్ యాప్: 9222201122 కు "హాయ్" పంపాలి. మిస్డ్ కాల్ 94936 02222, ఐవీఆర్ఎస్: 88888 23456, 96660 23456. అలాగే సంబంధిత ఆయిల్ కంపెనీల మొబైల్ యాప్‌ల ద్వారా కూడా గ్యాస్ బుకింగ్ చేసుకోవచ్చని డీఎస్ఓ వీ పార్వతి తెలిపారు.

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

### - కమిషనర్ రాహుల్ మీనా






**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** నగర పరిశుభ్రతలో మహిళా పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని.. వారి సేవలు సమాజానికి అమూల్యమైనవని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'నారీ లీడ్స్ స్వచ్ఛత' కార్యక్రమంలో భాగంగా నగర పాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ లో శుక్రవారం పలువురు మహిళా పారిశుద్ధ్య కార్మికులను గౌరవిస్తూ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రసంగిస్తూ.. సమాజం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రతి రోజూ కష్టపడి పనిచేస్తున్న ఈ మహిళా కార్మికులు నిజమైన సేవకులని కొనియాడారు. తెల్లవారుజాము నుండి వీధులన్నింటినీ శుభ్రం చేస్తూ.. ప్రజా శ్రేయస్సుకై ప్రతినిత్యం శ్రమిస్తున్న ఈ మహిళామణుల కృషిని గౌరవించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా అవసరమన్నారు. అలాగే మహిళలను కేవలం ఏడాదికి ఒక రోజు మాత్రమే కాకుండా ప్రతి రోజూ గౌరవించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని.. వారికి సరైన హక్కులు కల్పిస్తూ రక్షణగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అలాగే ప్రభుత్వం మహిళా సాధికారత కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్మికులకు శాలువాలు కప్పి, ప్రశంసా పత్రాలతో గౌరవించారు. అలాగే రంగోలీ పోటీలలో గెలుపొందిన మహిళలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ ఏ వినూత్న, శానిటరీ సూపర్ వైజర్ కే రామలింగారెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్లు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

### - బీజేపీ కార్యాలయంలో 'జనతా వారధి గోదావరి జోన్' - ఎమ్మెల్సీ సోము వీర్రాజుకి పలువురు వినతుల సమర్పణ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీజేపీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తెలిపారు. శుక్రవారం స్థానిక క్వారీ ఏరియాలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో 'జనతా వారధి గోదావరి జోన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సోము ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మీ సమస్యడ మా బాధ్యత' అనే నినాదంతో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా 'జనతా వారధి' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జనతావారధి ఒక వినూత్న కార్యక్రమంగా కొనసాగుతోందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు తెలిపారు. ప్రజాసేవే పరమావధిగా,ప్రతి సమస్యకు పరిష్కారం చూపే దిశగా నిరంతరం భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుందన్నారు. ఎప్పటికప్పుడు వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేలా చూస్తామని అన్నారు. అనంతరం ప్రజల నుండి ఎమ్మెల్సీ సోము వినతి పత్రాలు స్వీకరించారు. రాజానగరం మండలం వెలుగుబంద ఆర్టీసీ బస్సు సమస్య గురించి ప్రజలు విన్నవించారు. టిడ్కో నివాసాలకు డబ్బులు కట్టించుకుని ఇంకా ఇళ్ళు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పిడింగొయ్యి చెరువుగట్టు ఏరియా, హుకుంపేట రోడ్ల సమస్య గురించి విన్నవించారు. గోశాల షెడ్ల పథకం గురించి పలువురు విన్నవించారు. మొత్తం మీద 40 సమస్యలు 'జనతా వారధి'లో వచ్చాయి. కార్యక్రమంలో 'జనతా వారధి' జోన్ కన్వీనర్ బొమ్ముల దత్తు, జనతా వారధి జిల్లా కన్వీనర్ శివరామరాజు, కో కన్వీనర్ బండి సత్య ప్రసాద్, బీజేపీ రాష్ట్ర నాయకుడు రేలంగి శ్రీదేవి, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, వై మీనాక్షి, పార్టీ జిల్లా కార్యదర్శి స్వామి సూరి కిరణ్, కాలెపు సత్యసాయి రామ్, మీడియా కన్వీనర్ వీరా వీరాంజనేయులు, తగరం సురేష్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ బ్లాక్ చేస్తే కఠిన చర్యలు

### - గ్యాస్ పట్ల ఆందోళన అవసరం లేదు - గ్యాస్ సక్రమ సరఫరాలో చర్యలు తీసుకుంటున్నాం
### - దీనిపై సివిల్ సప్లైస్ అధికారులు... గ్యాస్ ఏజెన్సీ వారితో సమీక్ష చేస్తున్నాం - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** గ్యాస్ సిలెండర్ల డెలివరీ విషయంలో డీలర్లు... డెలివరీ బాయ్స్ బాధ్యతగా ఉండాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ఆదేశించారు. ఓటీపీ బేస్ గా జరుగుతున్న సిలెండర్ల డెలివరీలో తప్పులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బ్లాక్ మార్కెట్‌కు అవకాశం రాకుండా చూడాలని డీలర్లకు సూచించారు. గ్యాస్ సమస్యలు ఉన్నప్పటికీ... సివిల్ సప్లైస్ డిపార్ట్‌మెంట్, గ్యాస్ డీలర్లతో రోజూ సమీక్షలు జరుపుతూ ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన సివిల్ సప్లైస్, నగరంలో గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యాలతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. గ్యాస్ సరఫరా విషయంలో కావాల్సిన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. అంతర్జాతీయ పరిణామాల కారణంగా గ్యాస్ సిలిండర్ల కొరత ఆందోళనలు ఏర్పడుతున్నాయన్నారు. అయితే డీలర్ల వద్ద తగిన నిల్వలు ఉన్నాయని, బుకింగ్ సమస్యలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ప్రజల ఆందోళనలకు సమాధానం..**
అంతర్జాతీయ సమస్యల వల్ల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల కొరత భయంతో ప్రజలు ఎక్కువగా బుక్ చేసుకుంటున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. అయితే ప్రతి డీలర్ ఏజెన్సీలో తగిన నిల్వలు ఉన్నాయని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ దృష్టికి విషయం తీసుకెళ్లి, కంపెనీలతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**బుకింగ్ టైమింగ్, ఆన్‌లైన్ సమస్యలు..**
గ్యాస్ ఏజెన్సీల బుకింగ్ రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మాత్రమే ఉండటం వల్ల ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారని.. ఆన్‌లైన్ బుకింగ్ నెంబర్ ఓవర్‌లోడ్ కావడం వల్ల పని చేయకపోవటంపై ఎమ్మెల్యే అధికారులతో సమీక్షించినట్టు తెలిపారు. ప్రత్యామ్నాయ నెంబర్ ను త్వరలో అందుబాటులోకి తెచ్చి, ప్రతి ఏజెన్సీలో నంబర్ ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు.

**30 రోజుల నియమం... అధికారుల సంప్రదింపు..**
అర్బన్ ఏరియాలో ఒక సిలిండర్ డెలివరీ తర్వాత 30 రోజులు కొత్త సిలెండర్‌ను బుకింగ్ చేసుకోవాలనే అధికారులు చర్యలు చేపట్టారన్నారు. ఏదైనా సమస్య ఉంటే గ్యాస్ ఏజెన్సీలు, అధికారులను సంప్రదించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విజ్ఞప్తి చేశారు. వారి నుంచి సరైన స్పందన లేకపోతే తనను సంప్రదించాలన్నారు.



## కలెక్టరేట్ లో మహా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి..

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** మహా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ, ఇంచార్జి రాజమండ్రి ఆర్డీవో కే భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కే భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ 16వ శతాబ్దానికి చెందిన ప్రముఖ తెలుగు కవయిత్రి మొల్లమాంబ తన అపారమైన ప్రతిభతో తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం సంపాదించారని తెలిపారు. ఆమె రచించిన మొల్ల రామాయణం సరళమైన భాషలో ఉండి సామాన్య ప్రజలకు సైతం సులభంగా అర్థమయ్యే గొప్ప కావ్యమన్నారు. మహిళల ప్రతిభకు, పట్టుదలకు మొల్లమాంబ జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ ఇన్చార్జి అధికారి ముత్యాల సుబ్బారావు, కార్పొరేషన్ డైరెక్టర్లు యానాపు యేసు, యామన నారాయణ గౌడ్, షేక్ బాషా బిమ్రా, బీసీ సంక్షేమ వసతి గృహాల అధికారులు టీవీ ప్రసాద్, కేఆర్ విజయ, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను కలిసిన ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం మనసులోమాట మార్చి 13:** కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడలశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ను, కేంద్ర పౌర విమానయాన మంత్రి రామమోహన్ నాయుడు మరియు (సాప్) చైర్మన్ రవి నాయుడు లతో కలసి అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి మర్యాదపూర్వకంగా కలిశారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో తిరుపతిలో ప్రతిపాదించిన నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్పోర్ట్స్‌ను ప్రపంచ స్థాయి హై-పర్ఫార్మెన్స్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే అంశంపై చర్చించారు. అలాగే ఖేలో ఇండియా నిధులను త్వరిగతిన విడుదల చేయాలని విజ్ఞప్తి చేయాలని మరియు క్రీడా, పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు అరకు వ్యాలీలో అంతర్జాతీయ ట్రైల్ రన్ నిర్వహణను ప్రతిపాదించడం జరిగిందన్నారు. అదనంగా, డా. బి.ఆర్. అంబేద్కర్ కొనసీమ జిల్లా అమలాపురంలో జీఎంసీ బాలయోగి స్టేడియానికి ఖేలో ఇండియా పథకం ద్వారా మౌలిక వసతుల మంజూరు చేయాలని కోరడంతో పాటు, మాజీ లోక్‌సభ స్పీకర్ జి.ఎం.సి. బాలయోగి రానున్న 75వ జయంతిని గురించి చర్చించినట్లు ఎంపీ తెలిపారు. మంత్రి మన్సుఖ్ మాండవీయ సానుకూలంగా స్పందించి, ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యతతో సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎంపీ హరీష్ బాలయోగి వెల్లడించారు.

# కల్తీ పాల ఘటనలో మరో ఇద్దరు మృతి

### - 15 కు చేరిన మృతుల సంఖ్య
### - వివిధ ఆసుపత్రులలో అయిదుగురికి చికిత్స

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** రాజమహేంద్రవరం నగరంలో కల్తీ పాల ఘటనలో శుక్రవారం మరో ఇద్దరు మృతిచెందారు. డెల్టా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రెడ్డి అనంతలక్ష్మి (55) శుక్రవారం ఉదయం 9.18 గంటలకు మృతిచెందారు. అలాగే కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కడలి కృష్ణారావు (73) శుక్రవారం మధ్యాహ్నం 12.52 గంటలకు తీవ్ర మూత్రపిండ వైఫల్యంతో మృతిచెందారు. ఈ విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) కే వెంకటేశ్వరరావు మీడియాకు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. కాగా ప్రస్తుతం అయిదుగురు వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. కిమ్స్ ఆసుపత్రిలో ఇద్దరు, రెయిన్‌బో పిల్లల ఆసుపత్రిలో ఇద్దరు, రవి చైతన్య ఆసుపత్రిలో ఒకరు సంబంధిత వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్ఓ తెలిపారు. ఎన్ కొండబాబు, ఎంఆర్ఆర్ తార్వి, డీ రితిక్, పీ నాగేశ్వరరావు, జీ వెంకటేశ్వరరావు వైద్య సేవలు పొందుతున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని దగ్గరుండి పర్యవేక్షణ చేస్తున్నామని ఆయన తెలిపారు.

## సర్పంచ్ చంటి మనవరాలు చిన్నారి అతిరతో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ముచ్చట్లు...



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** సినీ రంగ నటులలో ప్రపంచ గుర్తింపు పొందిన గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి మనవరాలు చిన్నారి అతిరతో దుబాయ్ నుండి ముచ్చటించారు. చంటి తనయుడు మనీంద్ర, రాంచరణ్ మంచి స్నేహితులు. దుబాయిలో ఓ కార్యక్రమానికి హాజరైన రామ్ చరణ్ అతిర యోగక్షేమాన్ని ప్రత్యేకంగా మనీంద్రని అడిగి తెలుసుకున్నారు. చిన్నారి ఇంటి వద్ద ఉండటంతో వీడియో కాల్ లో సందేశం ఇచ్చారు. ఎదిగినా ఒదిగిన మనస్తత్వం కలిగిన రామ్ చరణ్ కు పసి పిల్లలంటే మహా ప్రాణం. ఇక స్నేహితులు, సుపరిచితులు పిల్లల పేర్లను ఆయన తలవకనే తలుస్తుంటారట. చిన్నారి అతిరతో ఆయన మాట్లాడిన తీరు రామ్ చరణ్ స్వచ్ఛమైన మనసుకు అద్దం పడుతుంది.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## నేడు జాతీయ లోక్ అదాలత్

**- కక్షిదారులు మధ్యవర్తిత్వం ద్వారా సద్వినియోగం చేసుకోండి**

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** నేడు (శనివారం) నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని రాజీమార్గంలో కేసులను పరిష్కరించు కోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలు, పోలవరం (రంపచోడవరం డివిజన్) పరిధిలో ఈ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడతగ్గ క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ప్రోనోటు బకాయి కేసులు, మోటారు వాహన ప్రమాదాల కేసులు, భార్యాభర్తల కుటుంబ తగాదాలు, గృహహింస, మనోవర్తి కేసులు, బ్యాంకు రుణ బకాయిలు, వివిధ సివిల్ కేసులను పరస్పర రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు. కేసులను త్వరగా పరిష్కరించు కోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడానికి న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది, మండల న్యాయ సేవల కమిటీ సిబ్బందిని సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

## జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**-కడియం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ముద్రగడ జమ్మి పిలుపు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** గత ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగించడానికి కీలకమైన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ క్యాడర్ కు కడియం మండల జనసేన అధ్యక్షుడు ముద్రగడ జమ్మి పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా స్థానిక ఎన్నికల్లో జనసేన క్యాడర్ సత్తా చాటిన విషయం అందరికీ విదితమే అన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కూడా జనసేన విజయబావుట ఎగురవేస్తుందన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిజాయితీ, నిబద్ధతతో రాష్ట్ర ప్రభుత్వాన్ని ముందుకు కొనసాగిస్తున్నారని, అధినేత బాటలో మనమంతా సైనికల్లా పని చేద్దామన్నారు. పవన్ కళ్యాణ్ కు నిజమైన వారసునిగా మన రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్ అందరి నోట శభాష్ అనిపించుకుంటూ స్వపరిపాలన కొనసాగిస్తున్నారని వెల్లడించారు. కడియపు లంకలో కేంద్ర మంత్రిగా మెగాస్టార్ చిరంజీవి శంకుస్థాపన చేసిన అభివృద్ధి కార్యక్రమాన్ని దుర్గేష్ కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్ర రాజకీయాలలో జనసేన సత్తా చాటిందని, అందుకు పార్టీ క్యాడర్ త్యాగం ఎంతో ఉందని జమ్మి అన్నారు. అదే ఒరవడితో భవిష్యత్తు రాజకీయాలను కూడా పవన్ కళ్యాణ్ శాసిస్తారు అనడానికి ఎలాంటి సందేహం లేదన్నారు. రేపు కడియంలో నిర్వహించనున్న పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి జనసేన నాయకులు, కార్యకర్తలు, పవన్ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఉద్ఘాటించారు.

# అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుంది

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - 2వ డివిజన్లో ప్రజా దర్బార్**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** ప్రజలు విన్నవించిన అన్ని సమస్యలకు తాము పరిష్కారం చూపిస్తామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక 2వ డివిజన్‌లో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి వివిధ అర్జీలు స్వీకరించిన ఆయన సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వ డివిజన్లో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన రూ. 3 కోట్ల అభివృద్ధి పనుల్లో కొన్ని ప్రారంభోత్సవం చేసుకోగా కొన్ని పనులు జరుగుతున్నాయన్నారు. మరో రూ. 2 కోట్ల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. పెన్షన్ కోసం అధికంగా దరఖాస్తులు వస్తున్నాయని, గత వైసీపీ పాలనలో ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేదని ఆయన గుర్తు చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పెన్షన్ ఇస్తామన్నారు. గత పాలకులు తీసేసిన పెన్షన్ లబ్ధిదారులు అందరికీ కూడా అర్హత బట్టి పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చారు. రైస్ కార్డుల విషయంలో కూడా ప్రభుత్వం చురుకుగా ఉందని చెప్పారు. "మేము రైస్ కార్డులు ఇచ్చాము, గత పాలకులు ఒక్కటి కూడా ఇవ్వలేదు" అని ఆయన విమర్శించారు. త్వరలో ఇళ్ల పట్టాలు, ఇళ్లు అందిస్తామని ప్రకటించారు. ఈ నెల 17 నుంచి టిడ్కో ఇళ్లు పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తాము నిర్వహించిన మీ భద్రత మా బాధ్యత మంచి ఫలితాలను ఇచ్చిందన్నారు. తప్పు చేసిన వారిని ఎవరినీ వదిలేది లేదని ఎమ్మెల్యే వాసు హెచ్చరించారు. తప్పు చేస్తే సొంత పార్టీ సభ్యులను కూడా వదలమని హెచ్చరించారు. శానిటేషన్ సమస్య పరిష్కారం కోసం 60 మంది కొత్త సిబ్బందిని నియమిస్తున్నామని, అన్ని అర్జీలకు త్వరలో పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, అధిక సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 20న శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్య స్మారక అవార్డు ప్రదానోత్సవం

**- మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కు అవార్డుతో సత్కారం**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్ర నేతాజీ మద్దూరి అన్నపూర్ణయ్య స్మారక అవార్డును ఈ ఏడాది మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కు అందజేస్తున్నట్లు సమితి ప్రధాన కార్యదర్శి బెజవాడ రంగారావు తెలియజేశారు. శుక్రవారం రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలను వివరించారు. మద్దూరి అన్నపూర్ణయ్య 127వ జయంతిని పురస్కరించుకుని ఈ స్మారక అవార్డును అందజేస్తున్నామన్నారు. 20వ తేదీన ఉదయం 10:30 గంటలకు జండా పంజా రోడ్డులో ఉన్న మద్దూరి అన్నపూర్ణయ పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారని తెలిపారు. అనంతరం ప్రకాశం నగర్ లోని శ్రీ ధర్మం చర కమ్యూనిటీ హాల్లో జయంతి సభ నిర్వహించి అవార్డుతో మాణిక్య వరప్రసాద్ ను సత్కరిస్తామన్నారు. అలాగే స్వతంత్ర సమరయోధులు అరవ ఆదినారాయణమూర్తి అవార్డును యోగ శిక్షకులు మన్యం శ్రీనివాస్ కు, ఉండవల్లి వెంకటసుబ్బారావు అవార్డును పొలసానపల్లి హనుమంతరావుకు, ఏసీవై రెడ్డి అవార్డును బుద్ధ శ్రీనివాస్ కు, చల్లా అప్పారావు అవార్డును డాక్టర్ పిల్లాడి పరమహంసకు, తులసి గంగాధర రామారావు అవార్డును అమీర్ పాషాకు, మద్దూరి అన్నపూర్ణయ్య పురస్కారాన్ని అడుసుమిల్లి వెంకట సూర్య సత్యనారాయణ బాబు చౌదరికి, మద్దూరి అన్నపూర్ణయ్య పురస్కారాన్ని అల్లు జయశ్రీకి అందజేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు అందరూ పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సమితి ఉపాధ్యక్షుడు కూరెళ్ళ హనుమంతరావు, న్యాయ సలహాదారుడు కూనపరెడ్డి శ్రీనివాస్, సభ్యులు కోడూరి సుబ్రహ్మణ్యం, జాన్సన్ చాలిసరి తదితరులు పాల్గొన్నారు.

# కడియం ప్రెస్ క్లబ్ ఆవిర్భవం - మిగిలిన వారికి స్ఫూర్తి





**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ కడియం ప్రెస్ క్లబ్ నూతనంగా ఆవిర్భవించింది. కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. జర్నలిజం అనేక రకాలుగా రూపాంతరం చెందుతూ.. పెద్ద చిన్న తారతమ్యాలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వర్గాలుగా చీలిపోతూ ఎవరికి వారు గొప్పలు చెప్పుకుంటున్న ప్రస్తుత తరుణంలో కడియం మండల విలేకరులు చాలా మంచి నిర్ణయం తీసుకున్నారు. 'మేమంతా ఒకటే..మాది పాత్రికేయ కులం' అనే భావనతో అందరూ ఒకే మాట, ఒకే నిర్ణయంతో 'ప్రెస్ క్లబ్' ఏర్పాటు చేయడం అభినందనీయం. కడియం పాత్రికేయ సోదరుల నిర్ణయం మిగిలిన మండలాల పాత్రికేయులకు ఆదర్శంగా నిలుస్తుంది. ఈ కార్యక్రమానికి అధికార అనధికార ప్రముఖులందరూ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం గమనార్హం. నిండు మనసుతో శుభాభినందనలు తెలిపారు. కడియం జీవీఆర్ కళ్యాణ మండపంలో ప్రముఖుల మధ్య ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షునిగా సీనియర్ జర్నలిస్ట్ చిక్కాల సూరిబాబు, ఉపాధ్యక్షునిగా యండమూరి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా పాలగుమ్మి శేషగిరి, బొమ్మిరెడ్డి బ్రహ్మాజీ, కార్యదర్శి గా అన్నందేవుల సూర్యచంద్ర రావు, కోశాధికారిగా కొప్పిశెట్టి సుబ్రహ్మణ్యం, సలహాదారునిగా పల్ల గిరి, కార్యవర్గ సభ్యులుగా దూడల అర్జున్, శెట్టి పోసిబాబు, వేపకాయల వీరభద్రరావు, ఎడ్ల నరేష్, అడ్డగళ్ళ దుర్గా ప్రకాష్, అడ్డగళ్ళ రాము, నేల రాజేష్, అబ్బూరి రామకృష్ణ, చెల్లుబోయిన శ్రీనివాస్ లు ప్రమాణ స్వీకారం చేశారు. జీ ఎస్ ఆర్ ఫౌండేషన్ ట్రస్టీ, టీడీపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ గోరంట్ల రవి కిరణ్ కడియం ప్రెస్ క్లబ్ లోగోను ఆవిష్కరించారు. జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత వైసీపీ రూరల్ కోఆర్డినేటర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ కడియం ప్రెస్ క్లబ్ ప్రమాణ స్వీకారోత్సవానికి విచ్చేసి జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు వెలుగుబంటి సత్యవర ప్రసాద్, వైసీపీ మండల శాఖ అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, జనసేన మండల శాఖ అధ్యక్షుడు ముద్రగడ జమ్మి, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు బొరుసు సుబ్రమణ్యం, టీడీపీ రాష్ట్ర నాయకులు అన్నందేవుల చంటి, బిజెపి నియోజకవర్గ నాయకుడు ఆకుల శ్రీధర్, ఐఎన్ఏ మాజీ అధ్యక్షుడు పల్ల సుబ్రమణ్యం, పీవీసీ నర్సరీ అధినేత తాడాల చక్రవర్తి, జనసేన నాయకుడు ఆదిమూలం సాయిబాబా, రాజమహేంద్రవరం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బోడపాటి గోపి, సత్యదేవ నర్సరీ యాజమాన్యం పుల్లా చిన సత్యనారాయణ, రాజశేఖర్, వీర్రాజు, వైసీపీ నాయకులు ఈలి గోపాలం, కొత్తపల్లి మూర్తి, సాధనాల బాబ్జీ, కూటమి నాయకులు గట్టి సుబ్బారావు, పుల్లా రామారావు, ప్రత్తిపాటి రామారావు చౌదరి, గుర్రపు కొండయ్య మాస్టారు, సూరపరెడ్డి భరత్, తూము శ్రీనివాసు, చెల్లుబోయిన శ్రీనివాస్, మినర్వా స్కూల్ అధినేత వెంకటేశ్వర రావు, ఫెర్టిలైజర్స్ సయోనియన్ అధ్యక్షుడు రావిపాటి రామకృష్ణ, సర్పంచ్ లు చెక్కపల్లి మురళి, కొండపల్లి పట్టియ్య, మారిశెట్టి పద్మావతి, జనసేన, వైసీపీ మహిళా నాయకులు బోడపాటి రాజేశ్వరి, ఊటుకూరి శైలజ, వైసీపీ నాయకులు తోకల శ్రీనివాస్, టేకి శ్రీనివాస్, ముసునూరి రాంబాబు, ధవళేశ్వరం సీఐలు వెంకటేశ్వరరావు, గణేష్ , పలువురు పంచాయతీ కార్యదర్శులు, సొసైటీ సీఈఓ లు, మండల అధికారులు హాజరయ్యారు.

# విద్యార్థి దశలో పదవ తరగతి అత్యంత కీలకం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** ప్రతీ వ్యక్తి విద్యార్థి దశలో పదవ తరగతి అత్యంత కీలకమైనదని లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ కందికొండ రమేష్ అన్నారు. స్థానిక లాలాచెరువు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరీక్షలు జరిగే ఈ రోజులన్నీ కేవలం పరీక్షల పైన దృష్టి పెట్టాలని, అత్యుత్తమ ర్యాంకు సాధించేందుకు తపనతో కృషి చేయాలని హితవు పలికారు. ఉన్నత భవితకు పదవ తరగతి పునాది వంటిదని, అందమైన భవిష్యత్తు నిర్మించుకోవాలంటే పునాది పటిష్ఠంగా ఉండాలన్నారు. విద్యార్థులందరూ పరీక్షలన్నీ బాగా రాసి చదివిన పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హాల్ టికెట్స్ అందజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని యూ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## దళిత సేవకుడు కప్పల సతీష్ ప్రసాద్ కు సత్కారం

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** మొట్ట మొదటి తెలుగు దళిత కవి కుసుమ ధర్మన్న జయంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం దళిత సేవకుడు కప్పల సతీష్ ప్రసాద్ ను ఘనంగా సత్కరించారు. అంబేడ్కర్ మెమోరియల్ ఫ్రెండ్ సర్కిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. గోకవరం బస్టాండు సమీపంలోని అంబేద్కర్ మెమోరియల్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బద్దె జార్జి ఆంటోనీ, అధ్యక్షుడు నక్కా సోమేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కుసుమ సాయిబాబు, జాయింట్ సెక్రెటరీ కూరగంట్ల శ్యామ్ కుమార్, కొంకి రమేష్, సరస్వతి రావు, యూ చంద్రరావు, సీహెచ్ కృష్ణరత్నం, సీహెచ్ ప్రభాకర్ రావు పాల్గొని కప్పల సతీష్ ప్రసాద్ ను సత్కరించారు. ఈ సందర్భంగా కుసుమ ధర్మన్న రచనలను జ్ఞాపకం చేసుకున్నారు. మాకొద్దీ నల్ల దొరతనం, హరిజన శతకం వంటి గొప్ప పుస్తకాలు ఆయన రచించారన్నారు. స్వతంత్ర సమరయోధులుగా ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు.

# 15న వయోజనులకు ఎఫ్ఎల్ఎన్ఏటీ పరీక్ష నిర్వహణ

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** తూర్పు గోదావరి జిల్లాలో వయోజనుల ప్రాథమిక స్థాయి భాషా, గణిత సామర్థ్యాలను అంచనా వేసేందుకు జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు ఎఫ్ఎల్ఎన్ఏటీ పరీక్షను ఈ నెల 15వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు వయోజన విద్య నోడల్ అధికారి అనిశెట్టి వెంకట్రావు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భారత దేశంలో అక్షరాస్యతలో 29వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మొదటి పది స్థానాల్లో నిలిపే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మార్గదర్శకంలో రాష్ట్ర వ్యాప్తంగా 81 లక్షల మంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా చేయడానికి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత సంవత్సరం 25 లక్షల మందిని అక్షరాసులుగా తీర్చిదిద్దేందుకు "అక్షరాంధ్ర" కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 88,647 మంది వయోజనులకు ఈ పరీక్ష నిర్వహించ బడనుందని వెల్లడించారు. పరీక్ష మొత్తం 150 మార్కులకు నిర్వహిస్తున్నట్లు అందులో 51 మార్కులు సాధించిన వారిని ఉత్తీర్ణులుగా ప్రకటిస్తారని, అదనంగా 5 గ్రేస్ మార్కులు కూడా కల్పించబడతాయని తెలిపారు. చదవడం, రాయడం, చిన్న లెక్కలపై మూడు విభాగాలుగా పరీక్ష ఉండి, ప్రతి విభాగానికి 50 మార్కులు చొప్పున నిర్వహించ బడుతుందన్నారు. గత సంవత్సరం సెప్టెంబరు 8న జరిగిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన "అక్షరాంధ్ర" కార్యక్రమంలో భాగంగానే ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్షరాస్యత కార్యక్రమం విజయవంతం కావడానికి విశేషంగా కృషి చేసిన వాలంటీర్లకు, అలాగే మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఏపీఎంలు, ఏపీవోలు, సీడీపీఓలు, ఎంఈఓ2 తదితర అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు వయోజన విద్య నోడల్ అధికారి తెలిపారు.

**సింగపూర్ తో ఇంటర్నేషనల్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ లో**

# మణీంద్ర భాగస్వామ్యం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కడియం మండలంలోని మాధవ రాయుడుపాలెంకు చెందిన యువ పారిశ్రామిక వేత్త, అన్నందేవుల మణీంద్ర భాగస్వామ్యంతో నెలకొల్పిన ఇంటర్నేషనల్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ (ఐజీపీఎల్) సంస్థ సింగపూర్ కు చెందిన అంతర్జాతీయ లివ్ గోల్ఫ్ లీగ్ తో ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం సింగపూర్ లో మణీంద్ర ఆధ్వర్యంలో ఒప్పందాలు జరిగాయి. మన దేశ ప్రొఫెషనల్ లీగ్‌లో ఉన్న అగ్రస్థాయి ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయిలో ఆడే అవకాశాలు కల్పించేందుకు ఈ ఒప్పందం దోహద పడతాయని మణీంద్ర తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం ఐజీపీఎల్ లో అగ్ర స్థానంలో ఉన్న గోల్ఫ్ ఆటగాళ్లు ఇంటర్నేషనల్ సిరీస్ టోర్నమెంట్‌లలో పాల్గొనే అవకాశం పొందుతారన్నారు. అలాగే వారు సింగపూర్ లివ్ గోల్ఫ్ లీగ్ లో చేరే అవకాశం కూడా పొందుతారన్నారు. మన దేశ టెన్నిస్ లెజెండ్ లెంనడర్ పాస్ తో కలసి తాను ఈ ఐజీపీఎల్ ను ఇటీవల ఏర్పాటు చేసినట్లు మణీంద్ర వివరించారు. దీనికి ప్రముఖ క్రికెటర్ యువరాజ్ సింగ్ బ్రాండ్ అంబాసిడర్ గా ఉంటారన్నారు. ఇప్పటికే ఇంటర్నేషనల్ ప్రైవేటు చార్టర్ ఫ్లైట్స్ అసోసియేషన్ సీఏవో గా మణీంద్ర ఉన్నారు. అలాగే పలు అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలలో సభ్యులుగా ఉన్నారు. మణింద్ర మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి కుమారుడు.

# సోమవారం నుండి ఒంటి పూట బడులు: డీఈఓ

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 2025-26 అకడమిక్ కాలెండర్ ప్రకారం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు ఈ నెల 16వ తేదీ సోమవారం నుండి ఒంటి పూట బడులు నిర్వహించాలని జిల్లా విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు ఒక ప్రకటన లో తెలిపారు. 1 నుండి 10 వ తరగతి వరకు ఉదయం 7.45 గంటల నుండి మధ్యాహ్నం 12-30 గంటల వరకు పాఠశాలలను నిర్వహించి, మధ్యాహ్న భోజన పథకం అమలు విషయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకుని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులని ఆదేశించారు. టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న పాఠశాలల్లో తరగతులు మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 5-30 గంటల వరకు నిర్వహించాలని, ఈ పాఠశాలలలో మధ్యాహ్నం 1 గంటకు మధ్యాహ్న భోజనం నిర్వహించి, తరగతులు ప్రారంభించాలన్నారు. పరీక్షలు లేని రోజు యథావిధిగా ఉదయం 7:45 నుండి 12:30 గంటల వరకు పాఠశాలలను నిర్వహించ వలసినదిగా ఆ ప్రకటనలో తెలిపారు.



# పొరుగువారి శ్రేయస్సే ఇస్లాం బోధించే ధర్మం

- రంజాన్ మాసం నాలుగో శుక్రవారం ప్రార్థనలు...
- అల్విదా జుమ్మా నమాజులు...
- పోటెత్తిన ముస్లింలు...
- మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు..

**మండపేట (మనసులో మాట ) మార్చ్ 13..** పొరుగువారి శ్రేయస్సే ఇస్లాం బోధించే ధర్మమని మండపేట కలువపువ్వు సెంటర్ లో ఉన్న ప్రాచీన హనీఫీ అహలే సున్నత్ వల్ జమాత్ జామియా మస్జిద్ ఇమామ్ ముహమ్మద్ గులామ్ ముర్షిద్ రజ్వీ ఆధ్యాత్మిక ప్రసంగం లో పేర్కొన్నారు. మండపేట లోని జామియా మస్జిద్,సైదల్లి పేట లోని హజరత్ హంజా మస్జిద్, గాంధీనగర్ లోని అల్ అమీనా మస్జిద్ విజయ లక్ష్మీ నగర్ లోని అక్సా మస్జిద్ లలో శుక్రవారం ప్రార్థనలు నిర్వహించారు.
రంజాన్ మాసం నాలుగో శుక్రవారం ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల లో చివరి శుక్రవారం(అల్విదా జుమ్మా) నమాజులు చేశారు. మండపేట లోని నాలుగు మసీదుల్లో ముస్లింలు శుక్రవారం ప్రార్థనలు కోసం పోటెత్తారు. ఇందు కోసం ఆయా మసీదు బాధ్యులు ఉపవాస దీక్షదారు (రోజే దార్)లకు మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ పవిత్ర రంజాన్ మాసంలో శుక్రవారం తో 23 రోజులు ఉపవాస దీక్షలు పూర్తి అయ్యాయి. గురువారం చంద్ర దర్శనం అయితే వచ్చే శుక్రవారం(మార్చి 20) రంజాన్ పండుగ నిర్వహిస్తారు. ఆ రోజు చంద్ర దర్శనం కాకపోతే వచ్చే శనివారం(మార్చి 21) రంజాన్ పండుగ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మండపేట జామియా మస్జిద్ లో ఇమామ్ ముహమ్మద్ గులామ్ ముర్షిద్ రజ్వీ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ మహనీయ మహా ప్రవక్త ముహమ్మద్ ముస్తఫా రసులుల్లాహ్ సల్లెలహు వ అలైహి వ సల్లెం వారి పై దివ్య ఖురాన్ ఈ నెల లోనే అవతరించబడిందన్నారు. దివ్య ఖురాన్ లో నమాజ్ ప్రస్తావన వచ్చిన ప్రతి చోటా జాకాత్ ( పేద వారికి ధన సాయం) చేయాలని అల్లాహ్ ఆదేశించినట్లు పేర్కొన్నారు. ప్రతి సంపన్న ముస్లిం తన సంపద లో 2.5 శాతం సొమ్ము లెక్క కట్టి పేదవారికి పంపిణీ చేయాలన్నారు. ఇది ప్రతి ఏడాది ప్రతి సంపన్న ముస్లిం తప్పక చేయాలని కోరారు. ఈ నెల 16 సోమవారం రాత్రి మండపేట జామియా మస్జిద్ లో జాగరణ నిర్వహిస్తారని చెప్పారు.అదే రోజు రాత్రి దివ్య ఖురాన్ ఈ భూమిపై అవతరించిందని పేర్కొన్నారు. రాత్రి ఆరాధనలో చాలా మహిమ ఉందన్నారు. రంజాన్ ఉపవాసదీక్ష క్రమశిక్షణ నేర్పుతుందని చెప్పారు. క్రమం తప్పకుండా రోజు ఐదు సార్లు నమాజ్ చేయడం, రాత్రి తరావి ప్రార్థనలు చేయడం తో ఆధ్యాత్మికత తో బాటు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం, ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి!

## నేడు గోకవరంలోఉదయం 07:00 గం.ల నుండి మధ్యాహ్నం 12:00 గం.ల వరకు విద్యుత్ నిలుపుదల

**గోకవరం (మనసులో మాట), మార్చి 13 :** ఏజెన్సీ ముఖద్వారం మండల కేంద్రమైన గోకవరం లో ఈనెల 14వ తేదీ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ వై వి ఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గోకవరం మండలం లోని 33/11 కె.వి గోకవరం సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతు నిర్వహణలో భాగంగా రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.పి.బి నటరాజన్ ఆదేశాల మేరకు శనివారము ఉదయం 07:00 గం.ల నుండి మధ్యాహ్నం 12:00 గం.ల వరకు గోకవరం మండలంలోని గోకవరం, వీర్లంకపల్లి, రంపయర్రంపాలెం, పెంటపల్లి, కృష్ణునిపాలెం, చిన్నూరు, వెంకటాపురం, కొత్తూరు, రామన్నపాలెం, రామానుజాపురం, ఆర్ అండ్ ఆర్ కాలనీ లకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

# రోడ్డు ట్యాక్స్ సమస్యను పరిష్కరిస్తాం

## పెంచిన గ్రీన్ టాక్స్ ను కూడా తగ్గించాలని ఎమ్మెల్యే అంజిబాబుకు వినతి పత్రాన్ని అందించిన జిల్లా టూరిస్ట్ బస్సు ఆపరేటర్స్ అసోసియేషన్ సభ్యులు



**భీమవరం, (మనసులో మాట) మార్చి 13 :** ఇటీవల ప్రతిపాదించిన రోడ్డు టాక్స్ పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని, పునః సమీక్షించాలని జిల్లా టూరిస్టు బస్సు ఆపరేటర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం జిల్లా టూరిస్ట్ బస్సు ఆపరేటర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. జిల్లా అధ్యక్షులు టిఎం నాగరాజు, కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో టూరిస్టు బస్సులపై ఇటీవల ప్రభుత్వం ప్రతిపాదించిన రోడ్డు టాక్స్ పెంపు చాలా ఇబ్బందిగా ఉందని, జిల్లాలో సుమారు 120 బస్సులు తిరుగుతూ యజమానులు, యజమాని కుటుంబాలు ఈ రంగంపై ట్రాన్స్పోర్టు వర్కర్స్ ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రూ 793 లుగా వున్న టాక్సు రూ 1,120 లుగా ఉందని, ప్రస్తుతం ప్రభుత్వం వారు రూ 1,120 లు స్థానంలో రూ 1,500 లుగా పెంచే ఆలోచనలో వున్నట్లు తెలిసిందన్నారు. కరోనా తరువాత పర్యాటక రంగం తీవ్రమైన నష్టాలను ఎదుర్కొంటుందనిఙ ప్రస్తుత సీటుకు రూ1,500 లకు పెంచే ఆలోచన వల్ల ట్రాన్స్పోర్టు రంగంపై ఆధారపడిన మాకు ఆర్థికంగా భారమై నిర్వహణ చాలా కష్టమవుతుందన్నారు. గ్రీన్ టాక్స్ 1 సంవత్సరానికి రూ 200 లు వున్నదానిని రూ 6 వేలు పెంచి తీవ్రమైన పెద్ద భారాన్ని ఈ రంగంపై మోపుతున్నారని, పెంచిన గ్రీన్ టాక్స్ ను కూడా తగ్గించాలని కోరుతున్నామని అన్నారు. పర్యాటక టూరిస్టు బస్సులపై టాక్స్ పెంపుదల విషయంలో తగు నిర్ణయం తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నామని అన్నారు. దీనిపై ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్ళి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కమ్మిలి పూర్ణచంద్రరావు, కారిచర్ల శ్యామ్, టి విజయ్, కోళ్ల సురేష్, డికేఆర్ ప్రసాద్, గన్నాబత్తుల శివ, నారిన సాయి శ్రీనివాస్, సిహెచ్ సోమేశ్వరరావు, జి అమృతరావు, ఎం చైతన్య పాల్గొన్నారు.

# మంచినీటికి ఎద్దడికి చెక్ పెట్టిన ఎమ్మెల్యే



**సామర్లకోట (మనసులో మాట) మార్చ్ 13;** ప్రస్తుత వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా నూతన బోర్వెల్ యూనిట్తో ఎమ్మెల్యే చినరాజప్ప చెక్ పెట్టారు. సామర్లకోట మండలం హుస్సేన్ పురంలో ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా నూతన బోర్వెల్ యూనిట్ను మంజూరు చేశారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాథ్ ఆదేశాల మేరకు యువ నేత చల్లా బుజ్జి ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు. వేసవిలో ప్రజలందరికీ జలజీవన్ మెషిన్ పథకం ద్వారా రక్షిత మంచినీటిని అందించేందుకు ఎమ్మెల్యే చినరాజప్ప కృషి చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే చినరాజప్ప కృషితోనే హుస్సేన్ పురంలో సమగ్ర అభివృద్ధి జరుగుతుందని చాలా బుజ్జి వివరించారు. స్థానిక గ్రామ పెద్దలు, యువకులు శంకుస్థాపన వేడుకల్లో పాల్గొన్నారు. త్వరలోనే బోర్వెల్ మంచినీటిని జలజీవన్ మిషన్ పథకం ద్వారా అందించేందుకు చర్యలు చేపట్టినట్లు బుజ్జి తెలిపారు

# విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి

## - ఎమ్మెల్సీ మూర్తి



**సామర్లకోట (మనసులో మాట)మార్చి 13;** పాఠశాల స్థాయి నుండి విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బుర్ర గోపి మూర్తి కోరా. సామర్లకోట మండలం మాధవపట్నం జడ్పీ పాఠశాలలో మేడిశెట్టి నాని ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సరస్వతీ పూజ, పది విద్యార్థులకు విద్యా కానుకల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఉన్నత విద్యకు, మంచి ప్రతిభావంతులకు ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని, పోటీ తత్వం, విద్యారంగంలో రాణించటం ద్వారా ఉజ్వల భవిష్యత్తు సాధించవచ్చునని ఎమ్మెల్సీ మూర్తి విద్యార్థులకు ఉద్బోధించారు. మేడిశెట్టి నాని ప్రసాద్ అందించిన విద్యా కానుకులను పదవ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్సీ మూర్తి పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు స్థానికులు యువత కూడా అండగా ఉంటూ విద్యారంగా అభివృద్ధికి, సమాజ సంకేమానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ మూర్తి కోరారు. మేడిశెట్టి నాని ప్రసాద్ సహకారం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు చిట్టిబాబు, రాయుడు సూరిబాబు, వెంకటేశ్వరరావు, పెద్దిరాజు శ్రీనివాస్ చౌదరి, అనుసూరి అప్పన్న, రెడ్డి సత్తిబాబు, ధనకొండ పెద్దిరాజు, అనుసూరి కామరాజు తదితరులు పాల్గొన్నారు

# బిసి కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన..



**మండపేట (మనసులో మాట ) మార్చ్ 13..** మండపేట నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట పట్టణం 13వ వార్డులో ప్రజల చిరకాల కోరికైన బిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి పుర పాలక సంఘం చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి అధ్యక్షత వహించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ జనరల్ నిధులు రూ.36.00 లక్షలతో ఈ కమ్యూనిటీ హాల్ ను నిర్మించనున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రతీ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, పాలచర్ల బ్రహ్మాజీ, పలివెల వెంకటేశ్వరరావు, సొసైటి అధ్యక్షులు కుక్కల రామారావు, పలివెల సత్యప్రకాష్, పలివెల జానకి రామన్న, చెలబోయిన వీర్రాజు, గీసాల సత్తిబాబు, శీలం జ్యోతి, కుక్కల బూరయ్య, కుక్కల భాస్కరరావు, కుక్కల నాగేష్, ముసిని వెంకటేష్, ముసిని సత్యనారాయణ, కుక్కల నాగబాబు, కుక్కల సత్యనారాయణ, సానబోయిన దుర్గారావు, సానబోయిన రాజు, అల్లక ప్రసాద్, ఆతపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ కొరతతో గ్రామాల నుంచి పట్టణాల వరకు ఇబ్బందులు

## - వినియోగదారులపై భారమైన పరిస్థితి



**కాజులూరు (మనసులో మాట) మార్చి 13..** ఇటీవలి కాలంలో వంటగ్యాస్ కొరత రాష్ట్రంలోని గ్రామాల నుంచి పట్టణాల వరకు తీవ్ర ప్రభావం చూపుతోంది. సాధారణ కుటుంబాల నుంచి హోటల్ యజమానులు, చిన్న వ్యాపారుల వరకు అందరూ ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లు సమయానికి అందకపోవడం వల్ల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సి వస్తోంది.
గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో చాలామంది మళ్లీ పాత పద్ధతులైన కట్టెల పొయ్యిలపై వంట చేయడం ప్రారంభించారు. దీంతో మహిళలు మళ్లీ పొగతో కూడిన వాతావరణంలో వంట చేయాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కట్టెల కోసం అదనపు ఖర్చు పెట్టాల్సి రావడం, అడవులపై ఒత్తిడి పెరగడం వంటి సమస్యలు కూడా తలెత్తుతున్నాయి.
ఇక పట్టణాల్లో పరిస్థితి కొంచెం భిన్నంగా ఉన్నప్పటికీ సమస్య మాత్రం అదే. గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేకపోవడంతో చాలా కుటుంబాలు ఇండక్షన్ స్టవ్‌లను ఉపయోగించడం ప్రారంభించాయి. అయితే విద్యుత్ ఖర్చు పెరగడం వల్ల నెలసరి ఖర్చులు మరింత పెరుగుతున్నాయి.
గ్యాస్ కొరత ప్రభావం అత్యధికంగా పడుతున్న వర్గం హోటల్ యజమానులు మరియు చిన్న ఆహార వ్యాపారులు. హోటళ్లలో వంటకు ప్రధానంగా గ్యాస్‌పై ఆధారపడాల్సి వస్తుంది. గ్యాస్ అందకపోవడంతో కొంతమంది హోటల్ యజమానులు వంట చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు వ్యాపారులు తాత్కాలికంగా హోటళ్లను మూసివేయాల్సిన పరిస్థితి కూడా ఎదుర్కొంటున్నారు.
ఇంకొంతమంది హోటల్ యజమానులు పెరిగిన ఖర్చులను తట్టుకోలేక ఆహార పదార్థాల ధరలను పెంచుతున్నారు. దీంతో హోటళ్లలో భోజనం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. సాధారణ ప్రజలు, రోజువారీ కూలీలు, ఉద్యోగులు ఈ పెరిగిన ధరలతో ఇబ్బందులు పడుతున్నారు.
ఈ పరిస్థితి వల్ల వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మరియు గ్యాస్ సరఫరా సంస్థలు వెంటనే చర్యలు తీసుకుని సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. గ్యాస్ సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించి, గ్రామాలు మరియు పట్టణాల్లో సమానంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం అత్యవసరం.
మొత్తంగా చూస్తే గ్యాస్ కొరత ఒక చిన్న సమస్యలా కనిపించినా, అది గ్రామీణ జీవన విధానాన్ని, పట్టణాల ఆర్థిక వ్యవస్థను మరియు వినియోగదారుల రోజువారీ జీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. ఈ సమస్యకు తక్షణ పరిష్కారం అవసరం ఉంది.



# నిరంతరం ప్రజల కోసమే పని చేయాలి

## - పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయలు చినరాజప్ప

సామర్లకోట (మనసులో మాట) మార్చి;; ప్రజా ప్రతినిధులు, నేతలు ప్రతినిత్యం ప్రజల కోసం మాత్రమే పని చేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయలు చినరాజప్ప ఆదేశించారు. సామర్లకోట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బడుగు శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో శుక్రవారం ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం ప్రజలకు సేవలు అందించాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించినప్పుడే ప్రజల్లో ప్రభుత్వానికి గుర్తింపు, నేతలకు ప్రాధాన్యతా లభిస్తుంది అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కూడా నేతలంతా అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే చినరాజప్ప ఆదేశించారు. బడుగు శ్రీకాంత్, యార్లగడ్డ రవిచంద్ర, అడబాల కుమారస్వామి, కంటే జగదీష్ మోహన్, గోల్టి సత్యనారాయణ పడాల వీరబాబు , వల్లూరి శివశంకర్ (దొరబాబు) కాపవరపు కుమార్ (కేకే) తదితరులు పాల్గొన్నారు.

# వారాహి దేవికి గూగుల్ అసిస్టెంట్ డైరెక్టర్ విశేష కానుకలు



**పెదపూడి, (మనసులో మాట) మార్చి 13;** పెదపూడి మండలం గొల్లల మామిడాడ ఆంధ్ర మణికంఠ క్షేత్రంలో కొలువైన వారాహిమాత విశిష్టతలు ఖ్యాతి ఖండాంతరాలకు దాటుతోంది. అమ్మవారి విశిష్టతను గుర్తించిన అమెరికా వాస్తవ్యులు గూగుల్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ శేష సతీష్, ఆశా కిరణ్ దంపతులు శుక్రవారం మామిడాడ క్షేత్రంలో వారాహిమాతను దర్శించారు. అమ్మవారికి 15 లక్షల ఇలువు కలిగిన బంగారు హారాన్ని సమర్పించారు. ఆలయ అర్చకులు నారాయణస్వామి నంబూద్రి, శుక్లా రాంబాబు విశేష పూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సత్తి భగవాన్ రెడ్డి,సబ్బెళ్ళ శ్రీనివాస్ రెడ్డి, మోహన్ రెడ్డి, డి ఆర్ కే రెడ్డి, ద్వారంపూడి యువ రాజారెడ్డి తదితరులు దాతలకు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అర్చక స్వాములు వేద ఆశీస్సులు అందించారు. అమ్మవారిని దర్శించడం ఆనందదాయకమని సతీష్ దంపతులు తెలిపారు.

# విద్యారంగంలో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు



**పెద్దాపురం మనసులో మాట మార్చి 13;** పాఠశాల స్థాయి నుండి విద్యారంగంలో రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని పెద్దాపురం కల్వరి మిరాకిల్ చర్చా వ్యవస్థాపకులు లంక పురుషోత్తమ దాస్ వివరించారు. పదవ తరగతి పరీక్షలకు వెళుతున్న 92 మంది విద్యార్థుల కోసం క్రైస్తవ మందిరంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరుతూ, విద్యార్థులకు ఆశీస్సులు అందిస్తూ విద్యా కానుకులను పంపిణీ చేశారు. ఉన్నత విద్యారంగానికి పదవ తరగతి పునాది వంటిదని, ఇక్కడినుండే భవిష్యత్తుకు నాంది పలకాలని పురుషోత్తము దాచకోరారు. ఈ కార్యక్రమంలో జీన్స్ నాగ శ్రీనివాస్ బిసఫ్ సుకుమార్ బిషప్ రవీంద్రబాబు, వై ఆర్ మన్న ఫాస్టర్ సుకుమార్ బ్రదర్ ప్రసాద్ రాజకుమారి లంక తదితరులు పాల్గొన్నారు

# దళితుల సంక్షేమానికే అధిక ప్రాధాన్యత

## - పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయలు చినరాజప్ప



పెద్దాపురం (మనసులో మాట) మార్చి 13; దళిత సామాజిక వర్గాల సంక్షేమానికి, దళితవాడల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. శుక్రవారం సామర్లకోట బలుసుల పేటలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే చినరాజప్ప పరిశీలించారు. సామాజిక భవన నిర్మాణం విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని, నిర్మాణం కోసం మరో 10 లక్షల నిధులను కూడా అందించడం జరిగిందని ఎమ్మెల్యే చినరాజప్ప తెలిపారు. నిర్మాణ పనుల్లో పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే చినరాజప్ప అధికారులను హెచ్చరించారు. పెద్దాపురం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే చినరాజప్ప తెలిపారు. నేతలు అధికారులు కూడా అభివృద్ధి కోసం పోటీ పడాలని ఎమ్మెల్యే చినరాజప్ప హితవ్ పలికారు. బడుగు శ్రీకాంత్, యార్లగడ్డ రవిచంద్ర, కంటే జగదీష్ మోహన్, అడబాల కుమారస్వామి, గోల్టి సత్యనారాయణ, బలుసు వాసు, మహిళ నేత రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## ధరణి రమణారావును సన్మానించిన ఎమ్మెల్యే కొండ బాబు

**కాకినాడ (మనసులో మాట) మార్చి 13..** ఎంతో ప్రతిష్టాత్మకమైన రోటరీ అసిస్టెంట్ గవర్నర్ గా ఎన్నికైన ఆధ్యాత్మిక చింతనాపరులు సమాజ సేవకులు ధరణి కన్స్ట్రక్షన్స్ అధినేత క్రేడాయ్ కాకినాడ బ్రాంచ్ కార్యదర్శి టీవీ రమణారావును కాకినాడ నగర శాసనసభ్యులు వనమాడి కొండబాబు దృశ్యాలువాతో సత్కరించి పుష్పకుచంతో అభినందించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ సమాజ అవసరాలకు అనుగుణంగా రోటరీ చేస్తున్న సేవా కార్యక్రమాల ద్వారా రమణ రావు ఎంతమందికి సేవలు అందించారని అన్నారు .కాకినాడ నగరంలో రోటరీ క్లబ్ ద్వారా నిర్వహించే అనేక కార్యక్రమాలలో తాను పాల్గొన్నా అని ఎంతో స్ఫూర్తిదాయకమనిపించింది అన్నారు. కాకినాడ రోటరీ క్లబ్ అధ్యక్షులుగా రమణారావు ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఆధ్యాత్మిక పరంగా కాకినాడ రామారావు పేట శివాలయానికి భక్తునిగా అనేక అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు తన వంతు కర్తవ్యాన్ని నెరవేర్చారని ఎమ్మెల్యే కొండబాబు కొనియాడారు .ప్రజా సంక్షేమానికి తాము నిర్వహించే అనేక కార్యక్రమాలలో భాగస్వామ్యం వహిస్తూ సమాజం పట్ల ఉన్న తన కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నారని అన్నారు.

ధరణి టీవీ రమణ రావు మాట్లాడుతూ అంతర్జాతీయ రోటరీ ప్రపంచంలోకి ఎల్ సత్యనారాయణ (టిక్కు )ఆహ్వానం మేరకు సభ్యత్వం స్వీకరించానని అన్నారు .రోటరీ అసిస్టెంట్ గవర్నర్ శిక్షణా తరగతుల్లో పిడిజి ఎం వీరభద్ర రెడ్డి (బాబి) సూచనల మేరకు అనేక విషయాలను అవగాహన చేసుకున్నానని చెప్పారు. తన పరిధిలో ఉన్న రోటరీ క్లబ్ కాకినాడ ,రోటరీ స్మార్ట్ సిటీ, రోటరీ ఎలైట్, రోటరీ సెంటర్ క్లబ్ రోటరీ క్లబ్ పెద్దాపురం సామ్రాజ్య లకు చెందిన అందరిని సమన్వయం చేసుకుంటూ రోటరీ గవర్నర్ గుత్తి కొండా శ్రీరామ్ సూచనలతో అనేక కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వివరించారు.

## విశ్వహిందూ పరిషత్ సత్సంగం





**ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 13..** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం, ఏలేశ్వరం నగరంలో ఈ రోజు ఆర్. టీ. సి కాంప్లెక్స్ ఆవరణలో గల శ్రీ కనక దుర్గ అమ్మ వారి ఆలయం లో ఏలేశ్వరం మండల విశ్వ హిందూ పరిషత్ వారు సత్సంగం శుక్రవారం నిర్వహించారు. రానున్న ఉగాది వేడుకలు శ్రీ రామనవమి ఉత్సవాల నిర్వహణ పైన గూర్చి తదనంతరం దేవాలయాల స్వయం ప్రతిపత్తి పైన, అన్య మతస్తులు హిందువులపై చేస్తున్న దౌర్జన్యాలా పైన, స్త్రీ లపై జరుగుతున్న అఘాత్యాలకి వ్యతిరేకం గా చర్చించుట జరిగింది. ఈ కార్యక్రమం లో పాల్గొన్నవారు.

విశ్వహిందూ పరిషత్ జిల్లా సాంస్కృతీ విభగ్ కన్వీనర్. కటకం కిరీటి బాబు,విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి. పి.దేవి, కోశాధికారి. జి.సత్య నారాయణ, శ్రీనివాస్, మహిళ గౌరవ అధ్యక్షురాలు పి.కుమారి.జి మహాలక్ష్మి, సహా కార్యదర్శులు. జి గిరిజ, దేవకి బేబీ, పి సత్యవతి,లక్ష్మి, మొదలగు వారు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణ... జ్ఞానం నేర్చుకునేది పాఠశాలలోనే

**- డాక్టర్ తాడి**



**రాజోలు మార్చి 13 మనసులోమాట:** ప్రతి విద్యార్థి క్రమశిక్షణ విజ్ఞానం నేర్చుకునేది పాఠశాలలోనే అని కోనసీమ జన చైతన్య వేదిక అధ్యక్షులు డాక్టర్ తాడి సత్యనారాయణమూర్తి అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం పొన్నమండ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కోనసీమ జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు పెన్నులు పరీక్ష అట్టలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కస్తూరి హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు అందరూ సెంట్ పెర్సెంట్ ఉత్తీర్ణతే లక్షంగా చదవాలని, చదువు తప్ప వేరొకటి ఉండకూడదని అన్నారు. కోనసీమ జనచైతన్య వేదిక అధ్యక్షులు తాడి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ విజ్ఞానం నేర్చుకునేది పాఠశాలని విద్యార్థిని విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించడమే కాక ఎక్కువ మార్కులు సాధించాలన్నారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. అనంతరం కోనసీమ జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో 63 మంది విద్యార్థిని విద్యార్థులకు రూ.14 వేల రూపాయలు విలువచేసే పరీక్ష అట్టలు పెన్నులు పెన్సిల్ ఎరేజర్ షార్ప్నర్ కిట్ లాంగ్ స్కేల్స్ మరియు హ్యాండ్ కర్చీఫ్ లను విద్యార్థిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ చావా వెంకటేష్, విద్యా కమిటీ చైర్మన్ పితాని వెంకటప్రసాద్ జన చైతన్య వేదిక దాతలు ఎం. శ్రీనివాసులు, రాజోలు గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కె. చిన్నారావు, అసిస్టెంట్ మేనేజర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏడీబీ రాజోలు వై. సందీప్, కంప్యూటర్స్ కంప్యూటర్ మేనేజర్ కడలి స్టాఫ్ సెక్రటరీ శ్రీ ఎన్ వి సత్యనారాయణ, గుబ్బల నాగేశ్వరరావు విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు వేదిక సభ్యులు పెద్దలు వేదిక సభ్యులు పాల్గొన్నారు.

## చదువును ఇష్టపడి చదవండి - మాజీ ఎమ్మెల్యే వేమ



**రాజోలు మార్చి 13 మనసులోమాట:** ప్రతి విద్యార్థి చదువును ఇష్టపడే చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు పట్టణంలో ఉన్న బాలుర ఉన్నత పాఠశాలలో విశ్రాంత ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేసానికి మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. పదో తరగతి విద్యార్థులకు రాజా కుమార్ ఆర్థిక సహాయంతో సమకూర్చిన పెన్నులను విద్యార్థులకు వేమ అందజేశారు. ఈ సందర్భంగా వేమా మాట్లాడుతూ విద్యార్థులు బాగా కష్టపడి, ఇష్టపడి చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. అదేవిధంగా పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయనీ కత్తుల సరస్వతి, విద్యా కమిటీ చైర్మన్ పెసింగి ఏసు, అడబాల సత్యనారాయణ, చెల్లింది త్రినాధరావు, చీకర మెల్లి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## మండపేట లో కుమ్మరి మొల్లమాంబ 576 వ జయంతి



**మండపేట (మనసులో మాట ) మార్చ్ 13..** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చ ఆద్వర్యంలో మండపేట లో కుమ్మరి మొల్లమాంబ 576 వ జయంతి శుక్రవారం నిర్వహించారు. గురజాపు శ్రీనువాస్ ఆద్యక్షతన ఉషాక్లినిక్ వద్ద ఈ కార్యక్రమం జరిగింది. జయంతి వేడుకులకు ముఖ్య అతిథులుగా బిజెపి సీనియర్ నాయకులు కోన సత్యనారాయణ, మండా వీర భద్రరావు లు హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కోన మాట్లాడుతూ ఈమె కడపజిల్లా గోపవరంలో నిరుపేద కుమ్మరి వృత్తిదారుడైన కేశవశెట్టి ఇంట్లో 14 వ శతాబ్దంలో జన్మించారన్నారు. చిన్నతనం నుండే దైవభక్తి రాముడు పట్ల తనభక్తిశ్రద్ధలతో సంస్కృతంలో ఉన్న వాల్మీకి రామాయణాన్ని తేనెలొలికే తెలుగు సాహిత్యంలో తొలికవయిత్రిగా కవితలల్లిన తొలి తెలుగు విదుషీమణి అని అన్నారు. రామాయణ కావ్య రచన రసధుని తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబని తెలిపారు. ఈమె అచ్చ తెలుగులో సరళమైన శైలిలో మొల్ల రామాయణాన్ని రచించి తెలుగు సాహిత్యం లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చ జిల్లా అధ్యక్షు రాలు యల్లాన శకుంతల,కోన ఉషాకుమారి, యశోద, రేణుక, శాలివాహన మండల అధ్యక్షులు వెల్లా శ్రీనివాసరావు,కార్యదర్శి రేలంగి వేణుగోపాల్ ,పసలపూడి జోగేశ్వరరావు, పేరూరు లక్ష్మణరావు, పసలపూడి శ్రీనువాస్, పసలపూడి వాసు,కాపా రామారావు, వీరవరపు శ్రీనువాస్,వెల్ల ప్రసాద్, రమణ బీసీనాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా కవయిత్రి మొల్ల మాంబ జన్మదిన ఉత్సవం..



**కాకినాడ (మనసులో మాట) మార్చి 13..** సంస్కృతంలోని రామాయణాన్ని తెలుగులోకి రచించిన తొలి తెలుగు కవయిత్రిగా కవిరత్న మొల్ల మాంబ ప్రసిద్ధికెక్కిందని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు.

కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ రూరల్ మండలం స్థానిక బోట్ క్లబ్ వద్ద గల ఆమె విగ్రహానికి జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్.. అధికారులు ఇతర కుమ్మరి, శాలివాహన సంఘాల నాయకులు పూలమాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో అసమాన ప్రతిభతో ఆమె రచించిన రామాయణం నేటికీ మనందరికీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. 15వ శతాబ్దంలో సమాజంలోని అసమానతులను ఎదిరించిన వీర వనితగా మొల్లమాంబ ప్రసిద్ధికిక్కరని జేసీ కొనియాడారు. సంస్కృతంలోని రామాయణాన్ని తెలుగులో రచించి సామాన్య ప్రజలకు రామాయణాన్ని చేరువ చేసిందని, ఆమె పాండిత్యంతో తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంచార్జీ బీసీ సంక్షేమ శాఖ అధికారి జి.శ్రీనివాసరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, సెట్రాజ్ సీఈవో కాశీవిశ్వేస్వరరావు, నైపుణ్య అధికారి, కుమ్మరి, శాలివాహన సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హోప్ ఫర్ చేంజ్ సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ అవగాహన సదస్సు



**కాకినాడ (మనసులో మాట ) మార్చి 13..** కాకినాడ రూరల్ గైగోలుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు హోప్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు లక్ష్మీ నాగేంద్ర ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ఎగ్జామ్ ప్యాడ్లు (అట్టలు) మరియు స్టేషనరీ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షల పట్ల భయం పోగొట్టి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసేలా అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చేయూత సంస్థ అధ్యక్షులు డా.రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన పాటిస్తూ, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పదో తరగతి అనేది విద్యార్థి జీవితంలో కీలక దశ అని, ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటరావు మాట్లాడుతూ పరీక్షల సమయంలో భయం పనికి రాదని, ఎలాంటి ఆందోళనలు పెట్టుకోకుండా, ప్రశాంతంగా ఉండి. పరీక్షలు బాగా రాయాలని కోరారు. మన లక్ష్యాన్ని సాధించడానికి పదవ తరగతి పరీక్షలు మొదటి మెట్టు అని అన్నారు. లక్ష్మి నాగేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు అందరికీ ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. తాను చదువుకున్న పాఠశాలకు రుణం తీర్చుకోవడం చాలా ఆనందంగా ఉందని, ఇక్కడ ఉపాధ్యాయ బృందం చాలా చక్కగా పాటలు బోధిస్తారని, తను శుక్రవారం ఈ స్థానంలో ఉండడానికి వారే కారణమని తెలిపారు. బాగా చదువుకుని సమాజానికి తమదైన శైలిలో ప్రతి ఒక్కరు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉత్తేజ పరిచేలా, స్కూల్ ఫస్ట్ వచ్చిన ముగ్గురు విద్యార్థులకు కాలేజికి వెళ్లడానికి వీలుగా తమ సంస్థ తరపున సైకిల్స్ ను బహుమతిగా అందిస్తామని అన్నారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు, అట్టలు మరియు ఇతర సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు రేవతి, స్వాతి, దీపికా, ప్రమీల, కిరణ్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా కు అంతరాయం

**కాజులూరు, మనసులో మాట, మార్చి 13** విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అవాంతరాలను తొలగించేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కాకినాడ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉదయభాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆర్యవటం సబ్ స్టేషన్ నందు ఉదయభాశ్వర్ ఒక ప్రకటనలో తెలుపుతూ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గం"ల వరకు 33/11 కే వీ ఆర్యవటశీ సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కే వీ ఫీడర్స్ లో గల ఏరియాలు అయిన ఆర్యవటం గొల్లపాలెం బందనపూడి మొగలి పాలెం శలపాక తనుకువాడ శీల ఒంటితాడి మంజేరు టి మామిడాడ గొర్రిపూడి పెనుమల్ల అంద్రశీగి తనుమల్ల పెడపాటి గరువు పెద్దాప్పురప్పాడు యండమూరు విజయరాయుడు పాలెం జగన్నాథ గిరి గ్రామాల గృహ విద్యుత్ వినియోగ దారులకు, ఆక్వా మరియు ఇండస్ట్రియల్ ఏరియా లకు సబ్ స్టేషన్ మరమ్మతులు భాగంగా సప్లై నిలిపివేయిదురు కావున విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించవలసిందిగా కోరారు.



## ఎమ్మెల్యే గారు యువత కోసం స్పందించండి

ఎమ్మెల్యే గారు యువత ఉజ్వల భవిష్యత్తు కోసం స్పందించండి సార్! అంటూ సామర్లకోటకు చెందిన టీం దళిత దర్బార్ యూత్ సభ్యులు కోరారు. శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే చినరాజప్ప గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీం దళిత దర్బార్ టీం సభ్యులు ఎమ్మెల్యే చినరాజప్పని కలిసి సామర్లకోట జూనియర్ కళాశాల ప్రాంగణంలో యువత కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే చినరాజప్ప కూడా సానుకూలంగా స్పందించినట్లు యూత్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీం దళిత బహుజన్ దర్బార్ యూత్ సభ్యులు నీలం మోహన్, పులప కూర ప్రవీణ్, దుగ్గాడ వెంకట్, సతీష్, రవితేజ, తదితర యూత్ సభ్యులు పాల్గొన్నారు

## దంతాల ఆరోగ్య సంరక్షణతప్పనిసరి



**కాకినాడ (మనసులో మాట) మార్చి 13..** మనం తీసుకునే ఆహారం జీర్ణం కావాలంటే దంతాల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం ముఖ్యమని ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దంతాలు దృఢంగా, పటిష్టంగా ఉంటేనే అన్ని రకాల ఆహార పదార్థాలను తీసుకోగలుగుతామన్నారు. తద్వారా పోషకాలు సక్రమంగా అంది రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. దంతక్షయం ఉంటే సరైన ఆహారాన్ని తీసుకోలేని పరిస్థితులు ఎదుర్కొంటారని అన్నారు. దంతాల మధ్య ఖాళీలు ఏర్పడితే దంత వైద్యులను సంప్రదించాలని తెలిపారు. రోజు ఉదయం, రాత్రి పడుకోబోయే ముందు బ్రష్ చేయాలని, ఏ ఆహారం తీసుకు న్నా మంచినీటితో నోటిని పుక్కులించాలని డాక్టర్ అడ్డాల తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, ఎస్. శ్రీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఏపీ లో జీడిపప్పు, కొబ్బరి, కోకో పంటల అభివృద్ధికి 2024-2027 లకు

## 708 కోట్ల రూపాయల తో కేంద్ర నిధులు

### ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నకు కేంద్ర లిఖితపూర్వక సమాధానం



**కాకినాడ (మనసులో మాట) మార్చి 13..** ఆంధ్రప్రదేశ్‌లో జీడిపప్పు, కొబ్బరి, కోకో వంటి అధిక విలువ కలిగిన తోటపంటల సాగు విస్తీర్ణం, ఉత్పాదకత మరియు రైతుల ఆదాయం పెంపుపై రాజ్యసభలో ఎంపీ ప్రకారం, 202425 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో జీడిపప్పు 2.01 లక్షల హెక్టార్లు, కొబ్బరి 1.08 లక్షల హెక్టార్లు, కోకో 47 వేల హెక్టార్లలో సాగులో ఉన్నాయి.

రాష్ట్ర మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో కొబ్బరి 3.86 శాతం జీడిపప్పు 0.45 శాతం కోకో 0.04శాతం వాటా కలిగి ఉన్నట్లు తెలిపారు. ఈ పంటల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మిషన్ ఫర్ ఇంటిగ్రాటెడ్ డెవలప్మెంట్ అఫ్ హార్టికల్చర్ పథకం ద్వారా మద్దతు అందిస్తోంది. 202425లో ఆంధ్రప్రదేశ్‌కు 108.33 కోట్లు కేటాయించారు. 202526లో 250 కోట్లు కేటాయించారు. 2025-26లో పంటల వారీగా జీడిపప్పు 3.86 కోట్లు 3,616 మంది రైతులు లబ్ధి కోకో 9.46 కోట్లు 3,394 మంది రైతులు లబ్ధి కొబ్బరి లక్ష్యంగా 11.31 కోట్లు, 7,153 మంది రైతులు లబ్ధి.అదనంగా కేంద్ర బడ్జెట్ 202627లో కొబ్బరి, జీడిపప్పు, కోకో వంటి ప్రత్యేక పంటల అభివృద్ధికి 350 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు.రాజ్యసభలో ఈ అంశాన్ని ప్రస్తావించిన ఎంపీ సానా సతీష్ బాబు, ఆంధ్రప్రదేశ్‌లో అధిక విలువ కలిగిన తోటపంటల విస్తరణకు, రైతుల ఆదాయం పెంపుకు కేంద్రం నుంచి మరింత మద్దతు అవసరమని కేంద్ర దృష్టికి తీసుకెళ్లారు.

## పరిమితడకలో ముద్రగడ గిరిబాబు పర్యటన



**ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 13..** ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు శుక్రవారం ఏలేశ్వరం మండలం పరిమితడక గ్రామంలో పర్యటించారు. గ్రామానికి చేరుకున్న గిరిబాబు కి వైసిపి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా తొలుత గ్రామంలోని వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటించారు. మోట్టుకుర్తి ధర్మరాజు నివాసంలో నాని శెట్టి లోవరాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో గిరిబాబు వైసీపీ శ్రేణులతో కలిసి పార్టీ బలోపేతం భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# కూటమి ప్రభుత్వ హయంలో అభివృద్ధి వేగవంతం

## నూకాలమ్మ ఆలయ నికి రూ.1.18 కోట్లతో నిర్మించిన రెండు రాజగోపురం

## వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట మనసులో మాట మార్చి 13..** ఉభయగోదావరి జిల్లాలో అత్యంత ప్రముఖమైన చింతలూరు నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశించారు. శుక్రవారం నూతనంగా నిర్మించిన రాజగోపురాలు, పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం చేశారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బండారు, జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, కొత్తపేట డిఎస్పీ సుంకర మురళి మోహన్, ఎంపిడీవో రాజు, ఎమ్మార్వో కేజే ప్రకాష్ బాబు తదితరులతో పాల్గొన్నారు. దాతల సహకారంతో రూ.80 లక్షల నిధులతో నిర్మించిన తూర్పు, పడమర రాజగోపురాలను, రూ.5లక్షల దేవస్థానం నిధులతో నిర్మించిన 5 షెడ్లను, రూ.9 లక్షల నిధులతో కొనుగోలు చేసిన జనరేటర్ , రూ.24 లక్షలతో స్వచ్ఛ భారత్ స్కీము ద్వారా నిర్మించిన 24 టాయిలెట్స్ ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ చింతలూరు నూకాలమ్మ ఆలయ నిధులు, దాతల సహకారంతో గత రెండేళ్లలో అభివృద్ధి జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా దాతల సేవలను కొనియాడారు. ఈ మధ్య ఆలయంలో నూతనంగా తీసుకుని వచ్చిన నెల రోజులు పాటల ద్వారా రూ.70 లక్షల వరకూ ఆదాయం లభించిందని,జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. భక్తులకు క్యూలైన్లు, త్రాగునీటి ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని, శానిటేషన్ విషయంలో శ్రద్ధ చూపించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దర్శనం సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని.అనంతరం నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించరు,రచయిత సూర్య ఆకుల అమ్మవారిపై రచించి, వీడియో గా రూపొందించిన గీతాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా మొల్లమాంబ జయంతి వేడుకలు



**తణుకు (మనసులో మాట)మార్చి 13.** తణుకు పట్టణంలో మొల్లమాంబా 586 వ.జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పశ్చిమగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ నరసాపురం పార్లమెంటరీ కుమ్మర సమితి కన్వీనర్ కుమ్మర శాలివాహన సంఘం నాయకులు చుంచుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తణుకు మండల తహసిల్దార్ అశోక్ వర్మ, తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చుంచుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మొల్లమాంబా కుమ్మరి శాలివాహన కుటుంబంలో జన్మించిన ముద్దుబిడ్డని ఆమె కడప ప్రాంతంలో గొప్ప కవయిత్రిగా జీవించిందని ఆమె చాలా సాధారణమైన కుటుంబంలో పుట్టినప్పటికీ తెలుగు భాష పై మక్కువ పెంచుకుని రామానాన్ని రచించిందని ఆయన అన్నారు. ఆమె వినయం ప్రతిభ కారణంగా ప్రజలు ఆమెను చాలా గౌరవించే వారిని ఇప్పటికీ తెలుగు సాహిత్యంలో మల్లమాంబ పేరు ఎంతో గౌరవంగా చెప్పబడుతుందని ఆయన అన్నారు. సామాన్య ప్రజలందరకు అర్థమయ్యేలా రామాయణ కథను తెలుగులో రాయాలని నిర్ణయించుకుంది ఆమె చాలా కష్టపడి రామాయణం అనే గ్రంథాన్ని రచించింది ఆమె రాసిన రామాయణంలో రాముడు, సీత మరియు హనుమంతుడు కథలు చాలా సులభంగా అందంగా ఉంటాయని అందరికీ అర్థమయ్యేలా ఈ రామాయణం ఉంటుందని ఆయన అన్నారు. అయితే ఇప్పటివరకు మొల్ల జయంతిని అధికారికంగా ప్రకటించలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొల్ల జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం ఎంతో అభినందనీయమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లకు కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా స్థానిక శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆయన ఆదేశాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఓటమి ప్రభుత్వం కుమ్మరి శాలివాహనులను ముందుకు తీసుకెళుతుందని రాజకీయంగా, ఆర్థికంగా ప్రతి విషయంలోనూ స్థానాన్ని కల్పించిందని ఈ సందర్భంగా సంఘ సభ్యులకు ఆయన వివరించారు. అంతేకాకుండా ఇప్పటివరకు తణుకు పట్టణంలో కుమ్మర శాలివాహనులకు కమ్యూనిటీ హాలు లేదని దానిని స్థానిక శాసనసభ్యులు ఏర్పాటు చేయాలని చుంచుల వెంకటేశ్వరరావు కోరారు. కూటమి ప్రభుత్వం కుమ్మరి శాలివాహనులను ఎంతో ముందుకు తీసుకెళ్లారని ఇకపై కూడా ఈ సామాజిక వర్గాన్ని ఆర్థికంగానూ రాజకీయంగాను ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. అనంతరం టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ మాట్లాడుతూ కుమ్మరి శాలివాహ నుల ముద్దుబిడ్డ కవయిత్రి మొల్ల మాంబ జయంతిని ఘనంగా నిర్వహించడం అభినందనీయ మన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొల్లమాంబా రామాయణాన్ని తెలుగులోకి రచించి సీతారాములకు సమర్పించారని ఆయన తెలిపారు. అనంతరం జనసేన పట్టణ అధ్యక్షులు కొమ్మిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కుమ్మరి శాలివాహనలు మట్టితో ఎటువంటి కళాకాండాలను అయినా తయారు చేయగలరని అదే కోవలో మొలమాంబ చాలా కష్టపడి ఎన్నో గ్రంథాలను రచించిందని అందులో మొల్ల రామాయణం ప్రసిద్ధికి ఎక్కిందని ఆయన తెలిపారు. అనంతరం తేతలి గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు నాగరాజు, ఈ కార్యక్రమంలో తమరాపు రమణమ్మ, తమరాపు సత్యనారాయణ, కడియాల సూర్యనారాయణ, గుబ్బల శ్రీనివాస్, తాతిపూడి మారుతీ రావు, జయం వెంకటేష్ ,గురుజుకోట నాగ సతీష్, యల్లా సుబ్రహ్మణ్యం, పెనుగొండ కృష్ణమూర్తి, చుంచుల శివయ్య, చుంచుల ధర్మారావు, పెనుగొండ మేరా సాహెబ్, కాసా నాగరాజు, బిరుదుకోట చింతన్న, తదితరులు తోపాటు కూటమి నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి కుమ్మరి శాలివాహన సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు పెన్నులు పంపిణీ





**అనపర్తి ( మనసులో మాట) మార్చి 13:** 2025- 26 విద్యా సంవత్సరమునకు పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న మండలము లోని పీర రామచంద్రపురం ,అనపర్తి, పొలమూరు ,రామవరము కుతుకు లూరు ,పులగుర్త గ్రామాలలో ఉన్న 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మరియు లక్ష్మీ నరసాపురం మల్లంపూడి గ్రామాలలో ఉన్న సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో 10వ తరగతి చదువుతూ, మార్చి 16 నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న 570 మంది విద్యార్థులకు, బిక్కవోలు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయము కార్య నిర్వహణ అధికారి, దాత ఆకెళ్ళ సూర్యనారా యణమూర్తి జ్ఞాపకార్థము వారి సతీమణి పద్మావతి ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు కు హాజరవుతున్న విద్యార్థులందరూ మంచి మార్కులతో, 100%ఉత్తీర్ణత సాధించాలి అని కోరుతూ బిక్కవోలు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరము, పెన్నులు ను అనపర్తి మండలంలోని ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలు రాస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అందరికీ పంపిణీ చేయమని మండల కేంద్రానికి పంపించడం జరిగింది. వారు పంపిన ఈ పెన్నులను మండల విద్యాశాఖ అధికారి, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ద్వారా విద్యార్థులకు పెన్నులను పంపిణీ చేయించినారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంచి మార్కులు తో ఉత్తీర్ణత సాధించాలని ఆశయంతో దాతలు పెన్నులు అందజేసిన ందుకు గాను, వారికి విద్యార్థులు తరపున ఉపాధ్యాయుల తరపు న మండల విద్యాశాఖ అధికారి నల్లమిల్లి సత్తిరెడ్డి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజే శారు. ఈ కార్యక్రమం లో బాలికలు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు కళ్యాణి వారు ఉపాధ్యాయ బృందము, విద్యార్థులు పాల్గొన్నారు.

# కిర్లంపూడిలో పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**- నియోజకవర్గంలో 30,820 మంది రైతులకు రూ.17 కోట్ల 42 లక్షల జమ - ఏవో సుధా మాధురి ఆధ్వర్యంలో లైవ్ వీక్షించిన రైతులు,నాయకులు**



**కిర్లంపూడి (మనసులో మాట) మార్చ్ 13..** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో రైతన్నా నీకోసం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కార్యక్రమం వ్యవసాయ శాఖ ఏడిఏ దైవకుమార్, మండల వ్యవసాయశాఖాధికారిణి సుధా మాధురి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట శాసనసభ్యుడు ,టిటిడి బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు.రైతులకు 17 కోట్ల 42 లక్షల రూపాయల నమూనా చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.గత వైసీపీ పాలనలో రైతులు అనేక విధాలుగా మోసపోయారని విమర్శించారు.ప్రధాని నరేంద్ర మోడీ,ముఖ్యమంత్రి చంద్రబాబు సభలను ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,రైతులు వీక్షించారు.పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద మూడో విడతలో ఒక్కో రైతుకు రూ.6,000 చొప్పున జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 30,820 మంది రైతుల ఖాతాల్లో మొత్తం రూ.17.42 కోట్ల రూపాయలు జమ అయినట్లు ఆయన తెలిపారు.రైతులకు సాగు పెట్టుబడికి ఈ సాయం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.దేశానికి అన్నం పెట్టే రైతు సంతోషంగా ఉంటేనే సమాజం సుభిక్షంగా ఉంటుందని,అందుకే కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తోందని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా సాయం అందిస్తూ రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు.ఏలేరు ఆధునీకరణకు కట్టుబడి ఉన్నానని దాన్ని పూర్తి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు మండల పార్టీ అధ్యక్షుడు వీరంరెడ్డి కాశి బాబు,కిర్లంపూడి టౌన్ నాయకుడు చదరం చంటిబాబు,గుడాల శ్రీలత రాంబాబు,తూము కుమార్,కుర్ల చిన్నబాబు,కాళ్ళ వెంకటేష్,బిజెపి నాయకులు శరకణం రాజబాబు,గండే చల్లారావు,పట్టు చంటిబాబు,గరగ గోవింద్, బొజ్జపు శ్రీనివాస్,గోడే బాల,ఇంటి చెల్లారావు కందుల చిట్టిబాబు,పోతుల మోహనరావు,కొత్త కొండబాబు,పిల్లా చంటిబాబు,అడబాల భాస్కరరావు,జనసేన నాయకులు,నైదాన రఘు,మూడు మండలాల వ్యవసాయ శాఖాధికారులు ఎస్ నరసింహ,జయలక్ష్మి,పి రాజేశ్వరి,ఏఈవోలు ఆకుల సురేష్,వి ఏలు,అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతిఒక్క రైతుకి అన్నదాత సుఖీభవ పథకం

**- కలెక్టర్**

**అమలాపురం (మనసులోమాట) మార్చి 13:** అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ మూడో విడత, 22వ పీఎం కిసాన్ పథకం క్రింద అర్హులైన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూర్చడం జరుగుతుందని. జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు.2025-26 ఆర్థిక సంవత్సరంలో మూడో విడత అన్నదాత సుఖీభవ 22 వ విడత పిఎం కిసాన్ నిధులు జిల్లా వ్యాప్తంగా 1, 34,829 అన్నదాతల కు టుంబాలకు రూ. 77.01 కోట్లు జమ కాబడి లబ్ధి చే కూరిందని జిల్లాకలెక్టర్ తెలిపారు. అన్నదాతలు ఈ యొక్క నిధులను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ కింద ప్రస్తుత మూడో విడత లో1,34,829 రైతు కుటుం బాలకు రూ.4 వేలు చొప్పున రూ 53.93 కోట్లు మేర లబ్ధి చేకూరిందని అదేవిధంగా 22 విడత పిఎం కిసాన్ కింద రూ. 2 వేలు చొప్పున జిల్లావ్యా ప్తంగా1,15,400 రైతు కుటుంబాలకు రూ 23.08 కోట్లు మేర నిధులు జమ కాపడ్డాయన్నారు. అమలాపురం నియోజకవర్గం లో అన్నదాత సుఖీభవ కింద 13,403 రైతు కుటుంబా లకు రూ 4 వేలు చొప్పున రూ.5.36 కోట్లు, పీఎం కిసాన్ కింద రూ2 వేలు చొప్పున 12,432 రైతు కుటుంబాలకు రూ 2.49 కోట్లు జమ కాబడ్డాయ న్నారు, కొత్తపేట నియోజ కవర్గంలో అన్నదాత సుఖీ భవ కింద 23,085 రైతు లకు రూ 9.23 కోట్లు, పీఎం కిసాన్ కింద 18,546 రైతులకు రూ.3.71 కోట్లు, మండపేట నియోజకవర్గం లో అన్నదాత సుఖీభవ కింద 18,282 రైతులకు రూ.7.31 కోట్లు, పీఎం కిసాన్ కింద 16,339 రైతులకు రూ 3.71 కోట్లు, ముమ్మిడివరం నియోజక వర్గంలో అన్నదాత సుఖీ భవ కింద 19,519 రైతులకు రూ.7.81 కోట్లు, పీఎం కిసాన్ కింద 14,615 రైతులకు రూ 14,615 రైతులకు రూ 2.92 కోట్లు, పి గన్నవరం నియోజక వర్గంలో అన్నదాత సుఖీ భవ కింద 23,796 రైతు కోట్లు రూ 9.52 కోట్లు, పీఎం కిసాన్ కింద 21,483 రైతులకు రూ 4.30 కోట్లు, రామచంద్రపురం నియో జకవర్గంలో అన్నదాత సుఖీభవ క్రింద 15,272 రైతులకు రూ 6.11 కోట్లు, పీఎం కిసాన్ కింద 14,402 రైతులకు రూ2.88 కోట్లు, రాజోలు నియోజకవర్గం లో అన్నదాత సుఖీభవ కింద 21,472 రైతులకు రూ.8.59 కోట్లు, పీఎం కిసాన్ కింద 17,583 రైతులకు రూ.3.52 కోట్లు జమ కాపడ్డాయన్నారు.

అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు అందుతున్న ఆర్థిక సహాయం రైతుల ఆర్థిక స్థిరత్వానికి, వ్యవసాయ రంగ బలోపేతానికి దోహదం చేస్తుందన్నారు. రైతులు పంటలు వేసే నాటికి అవసరమైన పెట్టుబడి సాయం. అందించడం ద్వారా అన్నదాతల క్షేమం సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. రైతులకు రుణభారం లేకుండా చేయడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించ డంలోనూ ప్రభుత్వం కీలకంగా వ్యవహరిస్తోందని వివరించారు. వ్యవసాయ యోగ్యమైన సొంత భూమి కలిగి ఉన్న రైతు కుటుంబా లకు భూవిస్తీర్ణంతో సంబంధం లేకుండా , అటవీ హక్కుల గుర్తింపు భూములు సాగు చేస్తున్న రైతు కుటుంబానికి పెట్టుబడి సాయంగా సంవత్సరానికి మూడు విడతలుగా కేంద్ర ప్రభు త్వం అందిస్తున్న రూ.6000తో పాటు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతు కుటుంబానికి రూ. 14,000 చొప్పున మొత్తంగా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కింద ఏడాదికి మొత్తం రూ.20,000 చొప్పున ఆర్థిక మద్దతు కల్పిస్తు న్నట్లు వివరించారు. ఈ పథకం ద్వారా అందుతున్న ఆర్థిక సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో మహర్దశ



**పిఠాపురం, (మనసులో మాట) మార్చి 13:** స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి డిప్యూటీ సీఎం, స్థానిక శాసనసభ్యులు పవన్ కళ్యాణ్ చొరవతో రూ. 50 లక్షల నిధులు కేటాయించినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ నిధులతో పెండింగ్లో ఉన్న కళ్యాణ మండప పనులను పూర్తి చేయడంతో పాటు, భక్తుల సౌకర్యార్థం ప్రదక్షిణ పథం, ఆలయ ముఖద్వారం , మరమ్మత్తులు,రంగులు ప్రహరీ గోడ వంటి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

ఈ మేరకు దేవస్థాన ఏఈ రమేష్, అసిస్టెంట్ నాగేశ్వరరావు ఇతర అధికారుల సమక్షంలో పనులకు సంబంధిత అంచనాలు శుక్రవారం సేకరించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్యనిర్వహణ అధికారిణి ధనలక్ష్మిని అర్చకులు విజయ జనార్ధనాచార్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# నదీ కోత నివారణకు పటిష్ఠ చర్యలు

## సంబంధిత శాఖ మంత్రితో మాట్లాడి గ్రోయన్ల నిర్మాణానికి కృషి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**కొత్తపేట మనసులో మాట మార్చి 13..** ఆత్రేయపురం మండలం రాజవరంలో గోదావరి నదీ కోతకు గురవుతున్న లంక పొలాలను శుక్రవారం ఎమ్మెల్యే బండారు పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. గతంలో ఇక్కడ మట్టి తవ్వకాలు జరగడం వల్ల నేల వదులై పొలాలన్నీ కోతకు గురవుతున్నాయని రైతులు ఆయన వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయల విలువచేసే భూములు గోదావరిలో కలిసిపోతున్నాయన్నారు ఎమ్మెల్యే మాట్లాడుతూ నదీ కోతను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. గ్రోయిన్ల నిర్మాణానికి రూ.38 కోట్లు 50 లక్షలు అవసరమవుతాయని అధికారులు తెలిపారు. ఈ అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదనలు ఆమోదం పొందగానే గ్రోయన్ల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు,ముళ్ళపూడి భాస్కరరావు, నాగిరెడ్డి సత్యనారాయణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**- హాజరుకానున్న 1495 మంది విద్యార్థులు**



**తాళ్లరేవు (మనసులో మాట) మార్చి 13:** ఈ నెల 16వ తేదీనుంచి జరుగనున్న పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈఓలు ఏ.మంగాయమ్మ, ఎం.ఉమ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన విద్యార్థులు మండల పరిధిలోని 5 కేంద్రాలతోపాటు యానాంలోని 2 కేంద్రాలలో పరీక్షలు వ్రాయనున్నట్లు తెలిపారు. మండలంలోని 5 కేంద్రాలలో 1035 మంది విద్యార్థులు, అలాగే యానాంలోని 2 కేంద్రాలలో 460 మంది పరీక్షలు వ్రాయనున్నారు. మండల కేంద్రమైన తాళ్లరేవు కేంద్రంలో 280 మంది. పటవల 242, బొడ్డు చినవెంకటాయపాలెం 120, పి.మల్లవరం 177, ఇంజరం 216. అదేవిధంగా యానాంలోని రీజెన్సీ ఎ కేంద్రంలో 240, రీజెన్సీ బి కేంద్రంలో 220 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు యూనిఫాం కాకుండా సివిల్ డ్రెస్ వేసుకుని పరీక్షలకు హాజరుకావాలని, నిర్ణీత సమయం కంటే గంట ముందుగా పరీక్షా కేంద్రంలోకి చేరుకోవాలన్నారు. దూర ప్రాంత విద్యార్థులు టెన్త్ హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించవచ్చని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# "జాతీయ పశు వ్యాధి నియంత్రణ" పథకానికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



**అనపర్తి (మనసులో మాట) మార్చి 13:** గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పాడి పశువుల పాత్ర కీలకమని, వాటిని వ్యాధుల బారి నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకానికి సంబంధించిన గోడ పత్రికను రామవరంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత టీకా కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గాలికుంటు వంటి సీజనల్ వ్యాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారులు,అనపర్తి మండల,రామవరం,కుతుకులూరు గ్రామాల కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాడపల్లి ఆలయ నిత్య అన్న దాన పథకానికి

# రూ 50 వేలు విరాళం



**కొత్తపేట మనసులో మాట మార్చి 13..** ఏడువారాల వెంకన్నగా పేరుపొందిన కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి విజయవాడ కృష్ణలంక చెందిన పాలిశెట్టి ఆదినారాయణ రావు, సునీత, దంపతులు కుటుంబ సభ్యులు రూ,50 వేలు116, విరాళాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, చైర్మన్ ముదునూరి వెంకటరాజు కు అందజేశారు అర్చకులు దాతలకు స్వామి ప్రత్యేక దర్శనం చేయించి వేద ఆశీర్వచనం తీర్థప్రసాదాలు స్వామి చిత్రపటాన్ని అందజేశారు.



# రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో గబ్బిలాల కంపు

- నాలుగుగా చీలిన పాత్రికేయులు - పండుగ చేసుకుంటున్న మీడియా బ్రోకర్లు
- పుష్కరాల వరకూ ఎన్నికలు జరపకుండా..రకరకాల నాటకాలు
- గోడమీద పిల్లి వాటంలా అధికార అనధికారులు
- ప్రక్షాళన దిశగా నిర్ణయాలు తీసుకునేందుకు మీన మేషాలు లెక్కించడం దేనికి?
- ఎన్నికలు నిర్వహిస్తారా?..ప్రెస్ క్లబ్ ను స్వాధీనం చేసుకుంటారా?..
- జిల్లా కలెక్టర్ కు అధికార్లు ఎందుకు వాస్తవాలు వివరించటం లేదు?

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** ఛీ..ఛీ..దరిద్రపు కంపు..రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్ లో గబ్బిలాల కంపు అట. ఈ మాట పాత్రికేయులు ఏ ఉద్దేశంతో అన్నా.. గత కొన్ని నెలలుగా క్లబ్ లో ఎటువంటి సమావేశాలూ నిర్వహించకపోవటం, నిర్వాహణ లోపించడం ఒక కారణం ఏమో. ఏళ్ళ తరబడి..అనధికారికంగా, నిబంధనలకు విరుద్ధంగా 'నేనే రాజు, నేనే మంత్రి' అన్నట్టు వ్యవహరిస్తూ..పాత్రికేయులను ఎన్ని వర్గాలుగా చీల్చాలో అన్ని వర్గాలుగా చీల్చి..సంబరాలు చేసుకోవడం మెజారిటీ పాత్రికేయుల ఆగ్రహానికి కారణం. ఈ కారణాన్ని దృష్టిలో పెట్టుకుని 'గబ్బిలాల కంపు' పదం వాడి ఉండవచ్చు. ఏదేమైనా ప్రెస్ క్లబ్ బైలా ప్రకారం.. ఏటా ఎన్నికలు నిర్వహించాలి. గత ఆరేడేళ్ళుగా ఏవేవో కారణాలను కుంటి సాకులుగా చూపి వాయిదా వేస్తూ పబ్బం గడుపుకోవటాన్ని ఎవరూ హర్షించడం లేదు. ఈ నేపథ్యంలోనే రాజమండ్రిలో పాత్రికేయులు రెండు వర్గాలుగా చీలిపోయారు.

ఒకటి ఏళ్ళ తరబడి కొనసాగుతున్న వర్గానికి కొమ్ము కాసే వర్గమైతే, రెండవది..ప్రెస్ క్లబ్ కు నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని డిమాండు చేస్తున్న 'వర్కింగ్ జర్నలిస్టుల జేఏసీ'. ఈ రెండు వర్గాలూ చాలా సంవత్సరాలు ఒకే గూటికింద కలిసి సహవాసం చేసినవే. తమ అజమాయిషీ, పెత్తనం కోసం..అధికార దర్పం చూపిస్తూ.. ప్రశ్నించే నోళ్ళను నొక్కే పనిలో భాగంగా అర్హతలేని..కాలం చెల్లిన 'పాలక వర్గం' ముసుగులో 'సభ్యులను తొలగించే ప్రక్రియ' చేపట్టటం వివాదానికి ఆజ్యం పోసినట్లయింది. నిజానికి ప్రెస్ క్లబ్ నుంచి సభ్యులను తొలగించే అధికారం ఎవరికీ లేదు. ఎందుకంటే ఎవరూ అధికారంలో లేరు కాబట్టి. ఇంకా చెప్పాలంటే.. రాజమండ్రి, రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్..ఈ రెండు పేర్లూ మనగడలో లేవు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం రెన్యువల్ చేయకుండా..'రాజమండ్రి ప్రెస్ క్లబ్' అధికారులను, ప్రజాప్రతినిధులను, నగర వాసులను, వివిధ సంస్థలను, ప్రభుత్వ వ్యవస్థలను, ప్రైవేటు వ్యాపార రంగాల నిర్వాహకులను..ఆఖరికి జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులను 'మేమే పాలకవర్గం' అంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారంటే..మోసమే అనాలి. దీనినే 'ఛీటింగ్' అంటారని ఒక సీనియర్ న్యాయవాది వివరించారు. న్యాయవాదులే కాదు..సీనియర్ పాత్రికేయులు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**పదే పదే విచారణలు దేనికి?..**

కళ్ళ ముందు స్పష్టంగా ఎన్నికలు జరపకపోవటం తప్పని తెలుస్తున్నా..ఇది అన్యాయం, దారుణం, ఘోరం, మోసం, దోపిడీ.. అని తెలుస్తున్నా జిల్లా అధికారులు పదే పదే విచారణలు, వివరాలు, అభిప్రాయాల పేరుతో కాలయాపన ఎందుకు చేస్తున్నారనేది సమాధానం లేని ప్రశ్న. కావాలనా, అవగాహన లేకనా. లేకుంటే కొందరు పాత్రికేయులు, అధికారులు జిల్లా స్థాయి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారా?. చాలామందికైతే..తప్పుడు సమాచారంతో వాస్తవాలను కప్పి పుచ్చుతున్నారనే అంటున్నారు. జిల్లా కలెక్టర్ తలచుకుంటే ఇదేమంత పెద్ద సమస్య కాదు. పరిపాలనా పరంగా తలకు మించిన పనుల వత్తిడి కారణంగా కింది స్థాయి అధికారులకు ఆదేశాలిస్తే..అక్కడా 'కొందరు' అధికారులు పనికట్టుకుని వచ్చి సమస్యను 'రాంగ్ ట్రాక్'లోకి తీసుకు వెళుతున్నారనేది కొందరు పాత్రికేయుల ఆరోపణ. మరి వారి నివేదికలలో ఏమి పేర్కొన్నారో ఏమో..సమస్య అయితే పరిష్కారం కాలేదు. ఇంకా శృతిమించుతోంది. ఆ సమస్య మరింత జటిలం అయ్యే వరకూ..దారం తెగే వరకూ.. ఇలానే కింది స్థాయి అధికారులు వ్యవహరిస్తే..భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి ఉంటుంది.

**రిలే నిరాహార దీక్షలు చేసినా..**

వర్కింగ్ జర్నలిస్టుల జేఏసీ ఆధ్వర్యంలో 'రిలే నిరాహార దీక్షలు' చేసినా అధికారులలో స్పందన నామ మాత్రమే. ఈ ఉద్యమంతో కదలిక ఉందని జేఏసీ సభ్యులు సంబరపడ్డారు. సమస్య ఒక కొలిక్కి వస్తోందని భావించారు. ఉద్రిక్తతను శాంతింపజేయటానికి అధికారులు 163 నోటీసులు, ఉభయ వర్గాలతో విడివిడిగా సమావేశాలు, అభిప్రాయ సేకరణలతోనే కాలం గడిపేశారు. అంతే కానీ..ప్రెస్ క్లబ్ వద్దకు విచారణకు వచ్చిన రెవెన్యూ అధికారిపై ఒంటి కాలిపై వీరంగం చేసిన పాత్రికేయులపై చర్యలు తీసుకుంటే పరిస్థితి ఇంత వరకూ వచ్చి ఉండేది కాదనేది నగరంలోని కొందరు పాత్రికేయుల అభిప్రాయం. అధికారుల విధులకు ఆటంకం కల్గించడం అంటే నేరమే. అది ఎవరైనా ఒకటే. మరెందుకు ఆ విషయంలో ఉన్నతాధికారులు సంయమనం పాటించారో అర్థం కాలేదు. సదరు అధికారి తన పై అధికారులు ఆదేశించిన పనిని అమలు చేయకుండా ఇరువర్గాలతో చర్చించడం అనేది కూడా పద్ధతి కాదని అంటున్నారు. నిజానికి ఆ రోజు డిప్యూటీ తహసీల్దారు వచ్చింది.. ప్రెస్ క్లబ్ కార్యాలయానికి తాళం వేసేందుకు అని టాక్. ఇది తెలిసి కొంతమంది 'మా ప్రెస్ క్లబ్ కు తాళం వేసే అధికారం మీకెక్కడిది?' అని ప్రశ్నించే సరికి..సదరు అధికారి మారు మాట్లాడలేదు.

**పేరుకు ప్రెస్ క్లబ్..నిజానికి కమ్యూనిటీ హాలు..**

రాజమండ్రి ప్రెస్ క్లబ్ భవనం..నిజానికి కమ్యూనిటీ హాలు. స్థలం ప్రభుత్వానిది. ఆ భవనం నిర్మించింది ప్రభుత్వ నిధులతో. కేవలం పాత్రికేయుల కార్యకలాపాల కోసం ఇచ్చారు. అటువంటిది.. "మా ప్రెస్ క్లబ్..మాది భవనం" అంటున్నారంటే..కబ్జా చేసినట్టు ఉందంటున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ యంత్రాంగం సీరియస్ గా పరిగణించకుంటే అది అధికారుల అసమర్థతే అవుతుంది. ప్రభుత్వ అధికారులపై ఆవేశంతో విరుచుకుపడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోకుంటే చేతకానితనం అవుతుంది. ప్రభుత్వ భవనాన్ని తమ అడ్డాగా మార్చుకుని, ఇష్టం వచ్చినట్లు వాడుకుంటూ.. పైపెచ్చు అధికార యంత్రాంగంపైనే ఫైర్ అవడం చూస్తుంటే..పాత్రికేయ వ్యవస్థ కొందరి చర్యల కారణంగా..మొత్తం ఆ వ్యవస్థకే కళంకం తెచ్చేదిగా తయారైంది. జర్నలిజం అంటే, దాని లక్ష్యం..ఆశయం తెలియని వారి వల్ల మాయని మచ్చగా తయారవుతోందని పలువురు సీనియర్ పాత్రికేయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని వ్యవస్థలలో ఉన్నట్లే..జర్నలిజం రంగంలో కూడా 'విలేకరుల' ముసుగులో మాఫియా చొచ్చుకువచ్చి దోపిడీలకు, బ్లాక్ మెయిల్ తో..వచ్చిన సొమ్ము వాటాలేసుకుని అడ్డంగా దోచుకు తినేస్తున్నారనేది ఆరోపణ. ఈ విమర్శ అందరికీ వర్తించదు. అలా వ్యవహరించే వారికే. కొందరు పాత్రికేయులు నీతి నిజాయితీ నిబద్ధతతో జర్నలిజం విలువలను కాపాడుతున్నారు. కానీ మెజారిటీ సంఖ్య నకిలీ గాళ్ళేనట. వీళ్ళ వల్ల మొత్తం జర్నలిస్టులు అందర్నీ 'దందా బాబులు' గానే చూస్తున్నారని, ఇది బాధాకరమని సిన్సియర్ గా పనిచేసే పాత్రికేయుల ఆవేదన.

**పుష్కరాల వరకూ ఇలానే...**

వచ్చే సంవత్సరం పుష్కరాల వరకూ ప్రెస్ క్లబ్ సమస్య ఒక కొలిక్కి వచ్చేలా కనబడటం లేదు. ఏదో ఒక రకంగా కాలం గడిపేయడానికి 'స్వయం ప్రకటిత నేతలు' రకరకాల వ్యూహాలతో పావులు కదుపుతున్నారనే ప్రచారం వినిపిస్తోంది. నిజంగా ఎటువంటి స్వార్థం లేకుంటే.. ప్రెస్ క్లబ్ ఎన్నికల వ్యవహారంలో అడ్డుకోవాల్సిన పనిలేదు. ఎక్కడ తమకు వచ్చే ముడుపులకు గండిపడుతుందో అనే ఆందోళనతో..కొందరు అడ్డుపడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. పైకి 'ప్రస్టేజ్' అని చెబుతున్నా అవినీతి అక్రమ ఆర్థిక లావాదేవీలకు తెరపడుతుందని, అసలు గుట్టురట్టు అవుతుందనే భయంతో..పైకి మేక పోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ 'ప్రెస్ క్లబ్ విలువలను కాపాడేటందుకే' అన్నట్టు వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. ఎప్పుడైతే జర్నలిస్టులు రెండుగా చీలారో, ఒకరిపై ఒకరు పోలీసు స్టేషన్లలో కేసులు పెట్టుకున్నారో, వివిధ అక్రమ వ్యాపార మాఫియాలతో చేతులు కలిపారో..అప్పుడే ప్రెస్ క్లబ్ విలువలు పతనమయ్యాయి. జర్నలిస్టులకు ఉన్న గౌరవం మంట కలిసిందన్నది మాత్రం వాస్తవం.

**గోడమీద పిల్లి వాటంలా..**

సమాజంలో జరిగే మంచీ చెడు పత్రికల ద్వారా సమాజానికి తెలియాల్సిన ఫోర్త్ ఎస్టేట్ (జర్నలిజం)..ప్రస్తుతం విలువలు కోల్పోయింది. దీనికి ఒక విధంగా అధికార అనధికారులే కారణం. తప్పు చేసిన విలేకరులకు కొమ్ము కాయడం. వారి అవసరాలకు తగ్గట్టు వినియోగించుకోవటం. ఆ తరువాత కరివేపాకులా తీసి అవతల పారేయడం. అందువల్లే విలేకరులను చులకనగా చూస్తున్నారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ వివాదం గత కొద్ది నెలలుగా నడుస్తున్నా..సమస్య పరిష్కారానికి తమ వంతు బాధ్యతగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయకపోవడానికి అసలు కారణం ఇదే. ఎవరికీ మద్దతివ్వలేరు. ఎవర్నీ మందలించలేరు. ఏమంటే..తమ గుట్టు బయట పెడతారో అనే భయం ఒకటి, జర్నలిస్టుల విషయంలో తల దూరిస్తే మొదటికే మోసం అన్న ఆలోచనతో..ఎవరికి వారు తప్పించుకుని..''మాట్లాడతా..చెబుతా..చూస్తా'' అంటూ కాలయాపన చేయటం వల్లే పరిస్థితి ఇంత వరకూ వచ్చిందంటున్నారు. నిజానికి ప్రక్షాళన దిశగా నిర్ణయాలు తీసుకునేందుకు ఇంత కాలం అవసరం లేదు. నగరంలో సీనియర్ నేతలు కూర్చుని చర్చిస్తే సమస్య పరిష్కారం అవుతుందనేది అందరి అభిప్రాయం.

**ఎన్నికలు నిర్వహిస్తారా..స్వాధీనం చేసుకుంటారా?!**

జిల్లా యంత్రాంగం స్పందించి సరైన నిర్ణయం తీసుకుంటే..ఎప్పుడో ప్రెస్ క్లబ్ సమస్య ఒక కొలిక్కి వచ్చేది. ఎన్నికలైనా జరిగేవి. లేదా ఏదో ఒకటి తేలే వరకూ "ప్రెస్ క్లబ్ కార్యాలయానికి" తాళమైనా పడేది. ఈ విషయంలో అనంతపురం జిల్లా అధికారుల చర్యలు అభినందనీయం. అక్కడిలానే ఇక్కడా ప్రెస్ క్లబ్ కార్యాలయానికి తాళాలు వేసి, తమ ఆధీనంలోకి తీసుకుంటే.. సమస్య పరిష్కారం కూడా ఎప్పుడో అయిపోయేది.

**విలేకరుల సమస్యలే తీర్చలేని..**

పాలకులు, అధికారులు విలేకరుల సమస్యలనే తీర్చలేకపోతున్నారు..ఇక సామాన్య ప్రజల సమస్యలను ఏమి పరిష్కరించగలరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎక్కడైనా చిన్న లోపం ఉంటే..భూతద్దంలో ఇంతను అంతగా చూపించే పాత్రికేయులు.. ఇప్పుడు మీ సమస్యపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. అలాగే వాస్తవాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళకుండా అధికారులు ఇంత వరకూ ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారో అర్థం కావడం లేదని అంటున్నారు. వర్కింగ్ జర్నలిస్టులు రిలే దీక్షలు చేసిన విషయాన్ని కూడా కలెక్టర్ కు తెలియజేయకుండా..గోప్యంగా ఉంచారని అంటున్నారు. ఇంతకూ పాత్రికేయుల సంక్షేమాన్ని చూడాల్సిన జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులు..జర్నలిస్టుల సమస్యలు, డిమాండ్ల పరిష్కారం విషయంలో చేపట్టిన ఆందోళనపై కనీస మాత్రంగా కూడా స్పందించకపోవటాన్ని ఏమనాలి?. ఎవరికి వత్తాసు పలుకుతున్నట్టు?. ఈ వ్యవహారం ఏ దిశగా మలుపు తిరుగుతుందో చూడాలి.

# రైతుల ఖాతాల్లో రూ.75.66 కోట్లు జమ

## -అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం - జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకాల కింద గణనీయమైన ఆర్థిక సహాయం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శుక్రవారం రైతుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ అయ్యాయి. వివిధ నియోజక వర్గాల పరిధిలో స్థానిక శాసన సభ్యులు, ప్రజా ప్రతినిధులు సమక్షంలో, అదే విధంగా రైతు సేవా కేంద్రాల స్థాయిలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి మండలంలో 3,342 మంది రైతులకు రూ.1.34 కోట్లు, బిక్కవోలు మండలంలో 5,932 మంది రైతులకు రూ.2.37 కోట్లు, రంగంపేట మండలంలో 8,321 మంది రైతులకు రూ.3.33 కోట్లు చొప్పున అన్నదాత సుఖీభవ పథకం కింద మొత్తం 17,595 మంది రైతులకు రూ.7.04 కోట్లు జమయ్యాయి. అలాగే పీఎం కిసాన్ యోజన కింద అనపర్తి మండలంలో 3,289 మంది రైతులకు రూ.0.66 కోట్లు, బిక్కవోలు మండలంలో 5,218 మంది రైతులకు రూ.1.04 కోట్లు, రంగంపేట మండలంలో 6,714 మంది రైతులకు రూ.1.34 కోట్లు చొప్పున మొత్తం 15,221 మంది రైతులకు రూ.3.04 కోట్లు జమ చేశారు. ఈ రెండు పథకాల ద్వారా కలిపి అనపర్తి నియోజకవర్గంలోని రైతులకు మొత్తం రూ.10.08 కోట్ల ఆర్థిక సహాయం అందింది. రాజమహేంద్రవరం (రూరల్) నియోజకవర్గంలో కడియం మండలంలో అన్నదాత సుఖీభవ పథకం కింద 4,392 మంది రైతులకు రూ.1.76 కోట్లు జమ కాగా, పీఎం కిసాన్ యోజన కింద 3,846 మంది రైతులకు రూ.0.77 కోట్లు జమయ్యాయి. ఈ రెండు పథకాల ద్వారా కలిపి రూ.2.53 కోట్ల ఆర్థిక సహాయం రైతులకు అందింది. రాజమహేంద్రవరం (అర్బన్) నియోజకవర్గంలో పీఎం కిసాన్ కింద 74 మంది రైతులకు రూ.0.01 కోట్లు జమయ్యాయి. రాజనగరం నియోజకవర్గంలో గోకవరం మండలంలో 7,705 మంది రైతులకు రూ.3.08 కోట్లు, కోరుకొండ మండలంలో 9,420 మంది రైతులకు రూ.3.77 కోట్లు, సీతానగరం మండలంలో 6,848 మంది రైతులకు రూ.2.74 కోట్లు చొప్పున అన్నదాత సుఖీభవ పథకం కింద మొత్తం 26,227 మంది రైతులకు రూ.10.49 కోట్లు జమయ్యాయి. పీఎం కిసాన్ యోజన కింద గోకవరం మండలంలో 5,485 మంది రైతులకు రూ.1.10 కోట్లు, కోరుకొండ మండలంలో 7,893 మంది రైతులకు రూ.1.58 కోట్లు, సీతానగరం మండలంలో 6,113 మంది రైతులకు రూ.1.22 కోట్లు చొప్పున మొత్తం 22,359 మంది రైతులకు రూ.4.47 కోట్లు జమయ్యాయి. ఈ రెండు పథకాల ద్వారా కలిపి రాజనగరం నియోజకవర్గంలోని రైతులకు మొత్తం రూ.14.96 కోట్ల ఆర్థిక సహాయం అందింది. జగ్గంపేట నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ కింద 7,705 మంది రైతులకు రూ.3.08 కోట్లు జమ కాగా, పీఎం కిసాన్ కింద 5,485 మంది రైతులకు రూ.1.10 కోట్లు జమయ్యాయి. ఈ రెండు పథకాల ద్వారా కలిపి రూ.4.18 కోట్ల ఆర్థిక సహాయం అందింది.

గోపాలపురం నియోజకవర్గంలో దేవరపల్లి మండలంలో 6,769 మంది రైతులకు రూ.2.71 కోట్లు, గోపాలపురం మండలంలో 7,886 మంది రైతులకు రూ.3.15 కోట్లు, నల్లజర్ల మండలంలో 8,827 మంది రైతులకు రూ.3.53 కోట్లు చొప్పున అన్నదాత సుఖీభవ పథకం కింద మొత్తం 23,482 మంది రైతులకు రూ.9.39 కోట్లు జమయ్యాయి. పీఎం కిసాన్ యోజన కింద దేవరపల్లి మండలంలో 5,703 మంది రైతులకు రూ.1.14 కోట్లు, గోపాలపురం మండలంలో 6,935 మంది రైతులకు రూ.1.39 కోట్లు, నల్లజర్ల మండలంలో 7,134 మంది రైతులకు రూ.1.43 కోట్లు చొప్పున మొత్తం 19,772 మంది రైతులకు రూ.3.96 కోట్లు జమయ్యాయి. ఈ రెండు పథకాల ద్వారా కలిపి గోపాలపురం నియోజకవర్గంలోని రైతులకు రూ.13.35 కోట్ల ఆర్థిక సహాయం అందింది. కొవ్వూరు నియోజకవర్గంలో కొవ్వూరు మండలంలో 4,940 మంది రైతులకు రూ.1.98 కోట్లు, చాగల్లు మండలంలో 5,463 మంది రైతులకు రూ.2.19 కోట్లు, తాళ్లపూడి మండలంలో 4,481 మంది రైతులకు రూ.1.79 కోట్లు చొప్పున అన్నదాత సుఖీభవ పథకం కింద మొత్తం 14,884 మంది రైతులకు రూ.5.96 కోట్లు జమయ్యాయి. అలాగే పీఎం కిసాన్ యోజన కింద కొవ్వూరు మండలంలో 4,058 మంది రైతులకు రూ.0.81 కోట్లు, చాగల్లు మండలంలో 4,586 మంది రైతులకు రూ.0.92 కోట్లు, తాళ్లపూడి మండలంలో 3,500 మంది రైతులకు రూ.0.70 కోట్లు చొప్పున మొత్తం 12,144 మంది రైతులకు రూ.2.43 కోట్లు జమయ్యాయి. ఈ రెండు పథకాల ద్వారా కలిపి కొవ్వూరు నియోజకవర్గంలోని రైతులకు రూ.8.39 కోట్ల ఆర్థిక సహాయం అందింది.

నిడదవోలు నియోజకవర్గంలో ఉండ్రాజవరం మండలంలో 4,581 మంది రైతులకు రూ.1.83 కోట్లు, నిడదవోలు మండలంలో 7,748 మంది రైతులకు రూ.3.10 కోట్లు, పెరవలి మండలంలో 7,039 మంది రైతులకు రూ.2.82 కోట్లు చొప్పున అన్నదాత సుఖీభవ పథకం కింద మొత్తం 19,368 మంది రైతులకు రూ.7.75 కోట్లు జమయ్యాయి. అలాగే పీఎం కిసాన్ యోజన కింద ఉండ్రాజవరం మండలంలో 3,954 మంది రైతులకు రూ.0.79 కోట్లు, నిడదవోలు మండలంలో 6,409 మంది రైతులకు రూ.1.28 కోట్లు, పెరవలి మండలంలో 4,630 మంది రైతులకు రూ.0.93 కోట్లు చొప్పున మొత్తం 14,993 మంది రైతులకు రూ.3.00 కోట్లు జమయ్యాయి. ఈ రెండు పథకాల ద్వారా కలిపి నిడదవోలు నియోజకవర్గంలోని రైతులకు రూ.10.75 కోట్ల ఆర్థిక సహాయం అందింది.

అదేవిధంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని మండపేట నియోజకవర్గంలో కూడా రైతులకు గణనీయమైన ఆర్థిక సహాయం అందింది. అన్నదాత సుఖీభవ పథకం కింద మండపేట మండలంలో 5,711 మంది రైతులకు రూ.2.28 కోట్లు, కపిలేశ్వరపురం మండలంలో 7,467 మంది రైతులకు రూ.2.99 కోట్లు, రాయవరం మండలంలో 5,105 మంది రైతులకు రూ.2.04 కోట్లు చొప్పున మొత్తం 18,282 మంది రైతులకు రూ.7.31 కోట్లు జమయ్యాయి. అలాగే పీఎం కిసాన్ యోజన కింద మండపేట మండలంలో 5,147 మంది రైతులకు రూ.1.03 కోట్లు, కపిలేశ్వరపురం మండలంలో 6,667 మంది రైతులకు రూ.1.33 కోట్లు, రాయవరం మండలంలో 4,525 మంది రైతులకు రూ.0.91 కోట్లు చొప్పున మొత్తం 16,339 మంది రైతులకు రూ.3.27 కోట్లు జమ చేశారు. ఈ రెండు పథకాల ద్వారా కలిపి మండపేట నియోజకవర్గంలోని రైతులకు మొత్తం రూ.10.58 కోట్ల ఆర్థిక సహాయం అందింది. మొత్తంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో పీఎం కిసాన్ యోజన కింద 1,11,689 మంది రైతులకు రూ.22.34 కోట్లు, అన్నదాత సుఖీభవ పథకం కింద 1,33,273 మంది రైతులకు రూ.53.32 కోట్లు జమ కాగా, ఈ రెండు పథకాల ద్వారా కలిపి రైతులకు మొత్తం రూ.75.66 కోట్ల ఆర్థిక సహాయం అందినట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.




# పంచాయతీల పునర్వ్యవస్థీకరణ

## - నాలుగు గ్రేడ్లుగా విభజన
## - కాజులూరు రూర్బన్ పంచాయతీగా గుర్తింపు

**కాజులూరు (మనసులో మాట) మార్చి 13..** గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా పంచాయతీల పునర్వ్యవస్థీకరణ ప్రభుత్వం చేపట్టినట్లు ఎంపీడీవో జే రాంబాబు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఈ ప్రక్రియలో పంచాయతీలను అభివృద్ధి స్థాయి, జనాభా, మౌలిక వసతులు మరియు పరిపాలనా సౌలభ్యాలను ఆధారంగా తీసుకుని నాలుగు గ్రేడ్లుగా విభజించారు. ఈ పునర్వ్యవస్థీకరణలో కాజులూరు పంచాయతీని రూర్బన్ పంచాయతీగా గుర్తించారు. గ్రామీణ మరియు పట్టణ లక్షణాల సమ్మేళనంగా ఉండే రూర్బన్ పంచాయతీలలో మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు మరియు ప్రజా సేవలను మరింత బలోపేతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుంది.

అభివృద్ధి ప్రమాణాలను బట్టి ఇతర పంచాయతీలను మూడు గ్రేడ్లుగా విభజించారు. అందులో గ్రేడ్1 పంచాయతీలు 8, ఆర్యవటం దుగ్గుదుర్రు గొల్లపాలెం కుయ్యేరు కోలంక మంజేరు పల్లిపాలెం శీల, గ్రేడ్2 పంచాయతీలు 6 అంద్రంగి బంధనపూడి అయితపూడి జగన్నాథగిరి పెనుమల్ల శలపాక, గ్రేడ్3 పంచాయతీలు 11 చేదువాడ మతుకుమిల్లి నామవానిపాలెం ఒంటి తాడి పెదలంక తిప్పరాజుపాలెం తణుకువాడ తనుమల్ల తర్లంపూడి తిప్పరాజుపాలెం ఉప్పుమిల్లి గుర్తించారు. ఈ విభజన ద్వారా ప్రతి పంచాయతీకి అవసరమైన వనరులు, నిధులు మరియు అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా కేటాయించడం సులభమవుతుందని అధికారులు తెలిపారు. పునర్వ్యవస్థీకరణతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడి ప్రజలకు ప్రభుత్వ సేవలు త్వరగా అందుతాయని చెప్పారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగా అమలు అవుతూ, స్థానిక సంస్థలు మరింత బలోపేతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ చర్యల ద్వారా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతాయని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అధికారులు పేర్కొన్నారు.

# ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు మహిళలు సద్వినియోగం చేసుకోవాలి




**ఏలూరు, మార్చి 13(మనసులో మాట)..** స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనమునందు శుక్రవారం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాదు మాట్లాడుతూ మహిళలు జీవితములో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని ఏ విధంగా ఎదుర్కొనాలి, పనిచేసే ప్రదేశాలలో లైంగిక వేధింపులు ఎదురైనప్పుడు అనుసరించిన వలసిన విధివిధానాలు పైన అవగాహన కల్పించారు. మహిళా అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పథంలో పయనించాలని అన్నారు. మహిళలు అభివృద్ధి చెందినప్పుడే కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు.

## సామర్లకోటలో కోలాహలంగా
# అన్నదాత సుఖీభవ లైవ్ షో



సామర్లకోట, (మనసులో మాట) మార్చ్ 13; సామర్లకోట రైతు భవన్ లో శుక్రవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం నిధులు పంపిణీ కార్యక్రమా లైవ్ షో కోలాహలంగా జరిగింది. సామర్లకోట మండల వ్యవసాయ అధికారి మురళీధర్ రావు ఆధ్వర్యంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన లైవ్ షో నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని, భారత ప్రధాని నరేంద్ర మోడీ పిఎం కిసాన్ పథకంలో రైతులకు నిధుల పంపిణీ కార్యక్రమ లైవ్ షో ఘనంగా జరిగింది. రైతుల సంక్షేమానికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వివరించారు. రైతుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు కోరారు. పెద్దాపురం నియోజకవర్గంలో రైతులకు మంజూరు చేయబడిన పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. నేతలు సరోజ్ వాసు, కంటే జగదీష్, యార్లగడ్డ రవిచంద్ర, కుమార్ స్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, తదితరులు పాల్గొన్నారు

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి
# 15 రోజుల జైలు శిక్ష
## - అమలాపురం కోర్టు సంచలన తీర్పు

**అమలాపురం( మనసులోమాట) మార్చి13:** మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల పోలీసులు, న్యాయస్థానం కఠినంగా వ్యవహరిస్తున్నాయి. అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి బైక్ నడిపిన ఒక వ్యక్తికి న్యాయస్థానం 15 రోజుల జైలు శిక్ష విధించింది. అమలాపురం టౌన్ ఎస్.ఐ. ఎన్.ఆర్. కిషోర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. 2025లో నమోదైన క్రైమ్ నంబర్ 339/2025 కేసులో, అమలాపురం రూరల్ ఏ వేమవరం గ్రామానికి చెందిన కమ్మొజు శ్రీను (48) మద్యం సేవించి బైక్ నడుపుతూ పట్టుబడ్డారు. ఈ కేసును శుక్రవారం అమలాపురం కోర్టు లో విచారించిన ముమ్మిడివరం ాజీఖీజవీ కోర్టు ఇన్-చార్జ్ మేజిస్ట్రేట్ వీణ రహీమ్ తుల్లా ముద్దాయికి 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టినట్లవుతుందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక



# గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లకు ఎటువంటి కొరత లేదు

- గ్యాస్ వినియోగదారులు ఎటువంటి ఆందోళన చెందవద్దు
- బ్లాక్ మార్కెట్ కు తరలకుండా ప్రత్యేక నిఘా
- జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్
- జాయింట్ కలెక్టర్ డా . ఎం. జె.అభిషేక్ గౌడ

**ఏలూరు, మార్చి, 13(మనసులో మాట)..** జిల్లాలో గృహ వినియోగదారులకు వంటగ్యాస్ కొరత లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం జె అభిషేక గౌడ చెప్పారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో, సోషల్ మీడియాలో గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్లకు కొరత ఏర్పడనుందంటూ కొన్ని నిరాధారమైన వదంతులు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు వాటిని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలు మరియు గ్యాస్ వినియోగదారులు ఇటువంటి అవాస్తవాలను నమ్మి ఎలాంటి భయాందోళనలకు గురికావద్దన్నారు. . జిల్లాలో గ్యాస్ సిలిండర్ల నిరంతర సరఫరాను నిర్ధారించడానికి పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గ్యాస్ సరఫరా సక్రమంగా జరిగేలా చూడటానికి మరియు ప్రజల గందరగోళాన్ని నివారించడానికి, ఏలూరు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు, ఏలూరు లోని జిల్లా పౌరసరఫరాల అధికారి (ఐజూూ) వారి కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక "జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్" ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్యాస్ సరఫరాలో ఏదైనా సమస్యలు ఎదురైనా, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించినా వినియోగదారులు వెంటనే కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు. ఈ కంట్రోల్ రూమ్ ప్రతిరోజూ ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 10:00 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

కంట్రోల్ రూమ్ సిబ్బంది వివరాలు మరియు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:

1. అసిస్టెంట్ సప్లై ఆఫీసర్ (ఊూూ), ఏలూరు- 8919887013
2. శ్రీమతి ఎం. సంధ్యా కుమారి (జూనియర్ అసిస్టెంట్, ఐజూూ కార్యాలయం)- 9652892425
3. శ్రీమతి పి. నాగ దుర్గ (సీనియర్ అసిస్టెంట్, ఐజూూ కార్యాలయం) - 7981222542

వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్ద ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే ఈ పై నంబర్లను సంప్రదించి తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవాలని జేసి అభిషేక్ గౌడ తెలియజేసారు.

## రైల్వే గ్రూప్ డీ పరీక్షలకు అర్హులైన వారికి ఉచిత శిక్షణకు ఆహ్వానం



**ఏలూరు, మార్చి 13(మనసులో మాట)..** వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, విజయవాడ వారి ఆదేశాలు మేరకు రైల్వే రిక్రూట్మెంటు (గ్రూపు-డి 2026 పరీక్షలకు అర్హులైన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బిసి,ఎస్.సి. మరియు ఎస్ టి కులమునకు చెందిన అభ్యర్థులు నుండి ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏలూరు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమధికారి వి.నాగరాణి, శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ధరఖాస్తులను ఈ నెల 23వ తేదీ లోగా బిసి స్టడీ సర్కిల్ ఏలూరు వారికి ధరఖాస్తు చేసుకొనవలసి ఉంటుందని అన్నారు. 100 మంది అభ్యర్ధులకు 2 నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టయిపెండు మరియు స్టడీ మెటీరియల్ ఏర్పాటు చేయునున్నట్లు తెలిపారు. రైల్వే రిక్రూట్మెంటు (గ్రూప్-డి 2026 కి అప్లై చేసిన అభ్యర్థులు మాత్రమే ఈ ఉచిత శిక్షణకు అర్హులని, 10వ తరగతిలో వచ్చిన మార్కులు మెరిట్ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీ నుండి ఈ ఉచిత శిక్షణ తరగతులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు 10వ తరగతి మార్కు లిస్టులు, కుల ధృవీకరణపత్రము, ఆదాయ ధృవీకరణ పత్రము (రీసెంట్ గా జారీ చేయబడిన) ( తల్లి దండ్రుల వార్షిక ఆదాయము రూ. 1,00,000/-లోపు మాత్రమే) ఆధారు మరియు బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ , రైల్వే రిక్రూట్మెంటు గ్రూప్-డి కి అప్లై చేసిన ఆన్లైన్ జిరాక్స్, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, జతపరచి అభ్యర్థులు ఈ నెల 23వ తేదీలోగా వెన్నవల్లివారి పేట లోని బిసి స్టడీ సర్కిల్, ఏలూరు కార్యాలయానికి ధరఖాస్తు చేసుకోవలసి ఉంటుందని తెలిపారు. ఇతర వివరములకు బిసి స్టడీ సర్కిల్ ఎ/శీ డా.బి.ఆర్. అంబేద్కర్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంగ్లీష్ మీడియం భూ స్కూలు వెన్నవల్లివారి పేట, ఏలూరు నందు గాని లేదా ఫోను నెంబరు: 8686180018, 9030211920 ద్వారా సంప్రదించగలరని కోరారు.

# అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన

### అన్నదాత సుఖీభవ, ఇన్పుట్ సబ్సిడీలు, ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే నగదు జమతో వ్యవసాయాన్ని పండగగా మార్చాం..

### రూ.12.94 కోట్ల నమూనా చెక్కును రైతులకు అందించిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట మనసులో మాట మార్చి 13 ..** అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ మూడవ విడత పంపిణీలో భాగంగా ఆత్రేయపురంలో ప్రసంగించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం నిధుల విడుదల సందర్భంగా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాలను తిలకించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని, గోదారమ్మ దయవల్ల మన ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ మూడవ విడతలో భాగంగా కొత్తపేట నియోజకవర్గంలో 23,085 మంది అన్నదాతల ఖాతాల్లో రూ. 12.94 కోట్లను ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు.కొత్తపేట, ఆత్రేయపురం, రావులపాలెం, ఆలమూరు మండలంలో పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ మొదటి విడతలో భాగంగా నియోజకవర్గంలో రూ. 16.11 కోట్లు, రెండవ విడతలో భాగంగా రూ. 15.26 కోట్లు రైతులు ఖాతాల్లో జమ అయ్యాయని . రైతులు సేంద్రియ వ్యవసాయం మీద, డిమాండ్ ఆధారిత పంటల సాగు మీద దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో రైతులు కష్టాలు పడ్డారని . రైతు భరోసా పేరుతో ఏడాదికి ఒకే దఫాలో రూ.12,500 ఇస్తామని హామీ ఇచ్చి 3 దఫాల్లో కలిపి రూ. 7,500 మాత్రమే ఇచ్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో పీఎం కిసాన్ కింద ఏడాదికి రూ. 6వేలు అందిస్తుంటే.. దేశంలో ఎక్కడా లేని విధంగా కూటమి ప్రభుత్వం రూ. 14వేలు కలిపి మొత్తం ఏడాదికి రూ. 20,000 ఇచ్చి తమది రైతు పక్షపాత ప్రభుత్వమని నిరూపించుకున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 46,85,838 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగాదన్నుగా ఉంటుందన్నారు. రాయితీలపై వ్యవసాయ పరికరాలు ఇచ్చి సాగు రంగంలో సాంకేతికత జోడిస్తున్నామని తెలిపారు రైతు కల్లంలో ధాన్యం అమ్మగానే బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామన్నారు.గత వైసీపీ ప్రభుత్వంలో ఈ డబ్బులు రావడానికి సుమారు ఆరు నెలలు పట్టేదని గుర్తు చేశారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్ లో వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 53,752.12 కోట్లు కేటాయించి ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ ముదునూరి వెంకటరాజు ముదునూరు రాంబద్ర రాజు ముళ్ళపూడి భాస్కరరావు, కంఠశెట్టి శ్రీనివాస్ వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్కరూ వినియోగదారుల హక్కులు తెలుసుకోవాలి

### - డీఎస్వో పార్వతి




**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 13:** సురక్షితమైన ఉత్పత్తులు విశ్వసనీయమైన వినియోగదారులు నేపథ్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని శుక్రవారం రాజమహేంద్రవరం నగరంలోని ఎస్కేవీటీ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వీ పార్వతి మాట్లాడుతూ వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసే సమయంలో వాటి ధర, నాణ్యత, పరిమాణం, తయారీ తేదీ, గడువు తేదీ వంటి వివరాలను తప్పని సరిగా పరిశీలించాలని సూచించారు. ప్రతి కొనుగోలుకు బిల్ తీసుకోవడం ద్వారా మోసపూరిత వ్యాపార పద్ధతుల నుండి రక్షణ పొందవచ్చని తెలిపారు. నాసిరకం వస్తువులు విక్రయించినా లేదా సేవలలో లోపాలు ఉన్నా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చు అన్నారు. వినియోగదారుల హక్కులను రక్షించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. జిల్లాలో వినియోగదారుల హక్కులపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తూ, ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్లు ప్రశాంత్ కుమార్, నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ తూకం, కొలతలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. తూకాల్లో జరిగే మోసాలను ఎలా గుర్తించాలో ధర్మకాటా, ఎలక్ట్రానిక్ కాటాల ద్వారా వివరించారు. జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ వినియోగ దారుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. 1915, 1967 హెల్ప్లైన్ నెంబర్లతో పాటు ఎన్సీహెచ్ యాప్ ద్వారా ఫిర్యాదులు ఎలా చేయాలో వివరించారు. వినియోగ దారుల పరిరక్షణ చట్టం 2019పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్వో నాగాంజనేయులు, అడిషనల్ డీఎంహెచ్వో బీ ప్రకాశరావు, పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం, డీసీపీసీ సభ్యులు సుంకర వీరశేఖర్, రాఘవేంద్రరావు, మధు వరప్రసాద్, విజిలెన్స్ కమిటీ సభ్యులు ధర్నాలకోట వెంకటేశ్వర రావు, కేవీ రమణ, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు బీ సత్యనారాయణ, ఎస్ ఉదయ భాస్కర్, పాండురంగ, సివిల్ సప్లై అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని వినియోగదారుల సంఘాల ప్రతినిధులను డీఎస్వో సన్మానించారు.

# రైతుల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట



**కాజులూరు (మనసులో మాట) మార్చి 13..** రైతులు సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు శుక్రవారం మండలంలోని శీల రైతు సేవ కేంద్రం నందు 2026 పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ కు సంబంధించి కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి కీలకమైన నిర్ణయం తీసుకుంటూ పలు ఆర్థిక సహాయాలను రైతుల ఖాతాల్లో జమ చేశారు. పీఎం కిసాన్ పథకం 22వ విడతగా రూ. 2000 మరియు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం 3వ విడతగా రూ. 4000 మొత్తంగా ఒక్కో రైతుకు రూ. 6000 వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరిగింది ఈ సందర్భంగా కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడటానికి ఈ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. కాజులూరు మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల్లో సాయంత్రం 4 గంటల నుండి ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడం జరిగిందన్నారు. కాజులూరు మండలంలోని శీల రైతు సేవ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ హాజరై రైతులతో మాట్లాడి వారికి జమ అయిన నిధుల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా కాజులూరు మండలానికి గణనీయమైన ఆర్థిక సహాయం అందిందనీ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 8,864 మంది రైతులకు రూ. 4000 చొప్పున మొత్తం రూ. 3.55 కోట్లు జమ చేయబడిందనీ అదే విధంగా పీఎం కిసాన్ పథకం ద్వారా 7,730 మంది రైతులకు రూ. 2000 చొప్పున మొత్తం రూ. 1.55 కోట్లు జమ చేయబడిందన్నారు.

ఈ రెండు పథకాల ద్వారా కలిపి కాజులూరు మండలంలోని రైతులకు మొత్తం రూ. 5.10 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు .ఈ ఆర్థిక సహాయం రైతులకు వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించడానికి మరియు పంటల పెట్టుబడులకు ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు.రైతుల సంక్షేమం కోసం కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఈ పథకాల పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతు సేవ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో తహసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ ఎంపీడీవో జే రాంబాబు స్థానిక సర్పంచ్ కోమలి వెంకటరమణ మండల వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు ప్రశాంత్ శ్రీనివాస్ వర్మ రైతులు, అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 16వ వసంతంలోకి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ

- అనపర్తిలో ఘనంగా ఆవిర్భావ వేడుకలు - మరోసారి విజయదుందుభి మోగిస్తాం జగన్ పాలనే మళ్ళీ వస్తుంది
- అనపర్తిలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ వేడుకల్లో డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి



**అనపర్తి( మనసులో మాట) మార్చి 13:** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 15 ఏళ్లు పూర్తి చేసుకుని 16వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భాన్ని పురస్కరించుకుని గురువారం అనపర్తిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేస్తూ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రస్థానం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని జగ్గంపేట వేదికగానే ప్రారంభమైన విషయాన్ని గుర్తుచేశారు. ఆవిర్భావం నుంచి పార్టీ సృష్టించిన చరిత్రను వివరిస్తూ, 2019-24 మధ్య కాలంలో ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ మోహన్ రెడ్డి కులమతాలకు, వర్గాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందించారని కొనియాడారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదల సంక్షేమమే ధ్యేయంగా సాగిన జగన్ పాలన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని, రానున్న రోజుల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తిరిగి విజయదుందుభి మోగిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఈ సందర్భంగా సూర్యనారాయణ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనపర్తి మండల పార్టీ కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), అనపర్తి వైయస్ఆర్సీపీ టౌన్ అధ్యక్షులు నల్లమిల్లి మురళి మోహన బాలకృష్ణారెడ్డి (మురళి), గ్రామ సర్పంచ్ వారా కుమారి, తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్సీపీ మహిళా విభాగ ఉపాధ్యక్షురాలు నందిక ప్రమీల, సత్తి వెంకట రెడ్డి, సత్తి గంగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్, ఏడుకొండలు, వార్డు సభ్యులు వాసంశెట్టి కోటేశ్వరరావు, మల్లిడి కృష్ణారెడ్డి, యాసిడ్ రాము, సుమన్, పార్టీ నాయకులు తిరగట్టి శివ, మండా శ్రీను, అబ్రహం, చింతా శ్రీనివాస్ రెడ్డి, గుంటూరు శ్రీను, కరెంటు రవి, బుల్లయ్య, కానూరి కృష్ణ, ర్యాలీ కృష్ణ, మల్లీశ్వరరావు, సూర్యనారాయణ, చిన్న పులి, సత్తి శ్రీనివాస్ రెడ్డి, షేక్ అబ్రహం, షేక్ జాఫర్, బీరువాల ధర్మారెడ్డి, వెంకట రెడ్డి, బాబురావు, సంగీత్, చిట్టూరి పుండరీవాసు, సత్యనారాయణ రెడ్డి, మరియు వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



### ఈనెల 14వ తేదీ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా సంబంధిత అధికారులు,

# న్యాయవాదులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

### - జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్ శ్రీదేవి

**ఏలూరు, మార్చి 13(మనసులో మాట)..** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాలు ప్రకారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్లో శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ ను ఈనెల 14వ తేదీన నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్.శ్రీదేవి విలేకరులు సమావేశంలో తెలియజేశారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్.శ్రీదేవి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం మొదటి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ఈ జాతీయ లోక్ అదాలత్ నందు రాజీ యోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్, వాహన ప్రమాద భీమా కేసులు, కుటుంబ వివాదాలు, చిట్ ఫండ్ కేసులు మరియు ప్రీ లిటిగేషన్ రాజీ చేయడం జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరం డిసెంబరు నెలలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ నందు 10,798 కేసులను రాజీ చేయడం జరిగిందని, అందులో 2,517 పెండింగు కేసును రాజీ చేయడం జరిగిందని అన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు 9,345 కేసులు రాజీయోగ్యమైనవి గుర్తించడం జరిగిందని కావున ఈ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కక్షి దారులు సౌకర్యార్థం హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయడం జరిగిందని, కేసులు పరిష్కారంలో సందేహాలు ఉన్న 08812 22455కు ఫోను చేయవచ్చని సూచించారు.

# ఏలూరు లో ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు

- తెలుగులో తొలి కావ్యం రచించిన రచయిత్రి మొల్ల మాంబ..
- యువతకు, విద్యార్థులకు కవయిత్రి మొల్ల మాంబ జీవితం ఆదర్శం..
- మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ ..



**ఏలూరు,మార్చి 13(మనసులో మాట)..** కవయిత్రి మొల్ల మాంబ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువత విద్యార్థిని విద్యార్థులు స్ఫూర్తి పొందాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎంజే. అభిషేక్ గౌడ అన్నారు. శుక్రవారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశ మందిరంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కవయిత్రి మొల్లమాంబ చిత్రపటానికి జేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొల్లమాంబ జయంతిని అధికారంగా నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. రామాయణాన్ని సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యేలా తక్కువ వ్యవధిలో రచించిన గొప్ప కవయిత్రి అని కొనియాడారు. ఆనాటి పరిస్థితులను ఎదుర్కొని సాహసోపేతంగా రామాయణం రచించారన్నారు. మారుమూల ప్రాంతం నుండి నుండి వచ్చిన కవియత్రి అని ఆమె పేరుతో ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ కూడా విడుదల చేసిందన్నారు.

## అన్నదాతలకు ముందే వచ్చిన ఉగాది పండుగ

# అన్నదాత సుఖీభవ 3వ విడత నిధులు విడుదల




**కోటనందూరు( మనసులో మాట) మార్చి 13..** పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ మూడవ విడత నిధులు రైతన్న ఖాతాలో జమ అయ్యాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ పెట్టుబడులకు ఏడాదికి 20వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది. ఈఏడాది ఇప్పటికే రెండు విడతలుగా 14 వేలు అన్నదాతలకు ఆర్థిక సాయం అందించిన కూటమి ప్రభుత్వం ఇవాళ 3వ, విడత మిగతా 6వేలు అన్నదాతల ఖాతాల్లో జమ చేసింది. కాకినాడ జిల్లా,తుని మండల పరిషత్ కార్యాలయంలో పీఎం కిసాన్ యోజన అన్నదాత సుఖీభవ మూడవ విడత నిధులు పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ విఫ్ యనమల దివ్య , ప్రధానమంత్రి మోదీ, సీఎం చంద్ర చంద్రబాబు పీఎం కిసాన్ లాంచింగ్ కార్యక్రమాన్ని వీక్షించారు. అన్నదాత సుఖీభవ నిధులకు సంబంధించిన చెక్కును ఆవిష్కరించారు. ఈసందర్భంగా యనమల దివ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందని ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసారని కొనియాడారు. తుని నియోజకవర్గం పరిధిలో తుని, కోటనందూరు, తొండంగి మండలాలకు చెందిన 27,759 మంది రైతులకు 54కోట్ల 34లక్షల 40 వేలు మూడో విడత నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఇందులో తుని మండలంలో 11,427మందికి22కోట్ల,29లక్షల 40వేలు తొండంగి మండలంలో 8,564 మందికి 16కోట్ల 59లక్షల 62 వేలు, కోటనందూరు మండలంలో 7,876 మందికి 15కోట్ల 62లక్షల 88 వేలు ఆర్థిక ప్రయోజనం కల్పించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి,యినుగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, ఆత్మ చైర్మెన్ నరహరిశెట్టి సూర్యప్రకాష్,ఎంపీపీ బొప్పన రాము ,కుర్రా వెంకట రమణ, అరిగెల నర్సింహమూర్తి, అప్పన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## 16వ శతాబ్ధపు తెలుగు రచయిత్రి మొల్లమాంబ

- సామాన్యులకు అర్థమయ్యే రీతిలో రామాయణం రచించిన మొల్ల
- మొల్ల జయంతి అధికారికంగా నిర్వహించుకోవడం అభినదనీయం
- జయంతి వేడుకల్లో తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ

**తణుకు (మనసులో మాట) మార్చి 12 ..** కుమ్మరి శాలివాహన కులంలో ఆణిముత్యంగా జన్మించిన మొల్లమాంబ 16వ శతాబ్దపు తెలుగు కవిత్రి అనీ తెలుగులో మొల్ల రామాయణాన్ని రచించి సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో తీర్చి దిద్దారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మొల్ల రచించిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రసిద్ధి గాంచిందని తెలిపారు. కవయిత్రి మొల్లమాంబ 586 జయంతి పురస్కరించుకుని తణుకు సొసైటీ రోడ్డులోని మున్సిపల్ పార్కు వద్ద మొల్లమాంబ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ నరసాపురం పార్లమెంటరీ కుమ్మర సమితి కన్వీనర్, కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర నాయకులు చుంచుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ పాల్గొని మాట్లాడారు. మొల్ల శ్రీకృష్ణదేవరాయులు కాలానికి చెందిన వారని, రామాయణాన్ని ఆరు భాగాలుగా 20 అధ్యాయాలుగా రచించి ఆంధ్ర ప్రజలకు అందించారన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కవిత్రి మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించుకోవడం అభినందనీయమని అన్నారు.
సమావేశానికి అధ్యక్షత వహించిన చుంచుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మొల్లమాంబ కుమ్మరి శాలివాహన కుటుంబంలో జన్మించిన ముద్దుబిడ్డని ఆమె కడప ప్రాంతంలో గొప్ప కవయిత్రిగా జీవించిందని ఆమె చాలా సాధారణమైన కుటుంబంలో పుట్టినప్పటికీ తెలుగు భాషపై మక్కువ పెంచుకుని రామాయణాన్ని రచించిందని చెప్పారు. ఆమె వినయం, ప్రతిభ కారణంగా ప్రజలు ఆమెను చాలా గౌరవించే వారిని ఇప్పటికీ తెలుగు సాహిత్యంలో మల్లమాంబ పేరు ఎంతో గౌరవంగా చెప్పబడుతుందని అన్నారు. సామాన్య ప్రజలందరకీ అర్థమయ్యేలా రామాయణ కథను తెలుగులో రాయాలని నిర్ణయించుకుని ఆమె చాలా కష్టపడి రామాయణం రచించారని గుర్తు చేశారు. అయితే ఇప్పటివరకు మొల్ల జయంతిని అధికారికంగా ప్రకటించలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొల్ల జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం ఎంతో అభినందనీయమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తేతలి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌వర్మ, మున్సిపల్ డీఈ ఈశ్వరరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ, జనసేన పట్టణ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి శ్రీనివాస్, బిజెపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు తమరాపు రమణమ్మ, తమరాపు సత్యనారాయణ, కడియాల సూర్యనారాయణ, గుబ్బల శ్రీనివాస్, తాతిపూడి మారుతీరావు, జయం వెంకటేష్, గురుజుకోట నాగసతీష్, యల్లా సుబ్రహ్మణ్యం, పెనుగొండ కృష్ణమూర్తి, చుంచుల శివయ్య, చుంచుల ధర్మారావు, పెనుగొండ మీరా సాహెబ్, కాసా నాగరాజు, బిరుదుకోట చింతన్న, తదితరులు తోపాటు కూటమి నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి కుమ్మరి శాలివాహన సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గా గుల్లా ఏడుకొండలు నియామకం



**గోకవరం (మనసులో మాట), మార్చి 13 :** వైస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గా గుల్లా ఏడుకొండలు నియామకం అయ్యారు. శుక్రవారం గోకవరం మండల ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏడుకొండలు మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గానికి సీనియర్ నాయకుడు కావడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గా నియమితులైనట్లు తాడేపల్లి సెంట్రల్ ఆఫీసు నుండి పత్రికా ప్రకటన విడుదల చేశారని గుల్లా ఏడుకొండలు తెలిపారు. పార్టీ పట్ల నిబద్ధత, ప్రజలతో ఉన్న అనుబంధాన్ని, సీనియారిటీని గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించారన్నారు. పదవి అందించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, జగ్గంపేట నియోజకవర్గ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తోట నరసింహం కి, కాకినాడ జిల్లా వైస్సార్ పార్టీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజాకి, వైస్సార్ పార్టీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కోఆర్డినేటర్ బొచ్చ సత్యనారాయణకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్లు గుల్లా ఏడుకొండలు తెలిపారు

## ప్రతి ఉద్యోగి ఆరోగ్య పట్ల బాధ్యత తీసుకోవాలి - జెసి టి నిశాంతి




**అమలాపురం(మనసులో మాట) మార్చి 13:** ఉద్యోగస్తులు తమ దైనందిన జీవితంలో బీపీ, షుగర్ వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, సరైన ఆహారం, వ్యాయామం, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షల ద్వారా వాటిని నియంత్రించు కోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ టి నిశాంతి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ లో శుక్రవారం రెవెన్యూ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి ఉద్యోగులు విధి నిర్వహణ తమ దైనందిన జీవితంలో వ్యాధుల గుర్తింపు నివారణ చర్యలపై ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ కారం రవితేజ జిల్లా వైద్య శాఖ అధికారి దుర్గారావు దొరలతో అవగాహన కార్యక్రమం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక జీవనశైలిలో పని ఒత్తిడి, శారీరక శ్రమ లేక పోవడం ఆహారపు అలవాట్ల వల్ల రక్తపోటు, చక్కెర వ్యాధి వంటి వ్యాధులు కాని వ్యాధులు ప్రతి కుటుం బంలోనూ కని పిస్తున్నాయ న్నారు.. ఈ వ్యాధుల బారి నుండి మనల్ని మనం కాపాడుకోవడానికి జీవ నశైలిలో మార్పులు తప్పనిస రన్నారు రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వేగంగా నడవడం, యోగా లేదా సైక్లింగ్ వంటివి వ్యాయామం చేయడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడి, చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయ న్నారు.ధ్యానం తగి నంత నిద్ర మానసిక ఒత్తిడిని తగ్గించి, రక్తపోటు పెరగకుండా చూస్తాయన్నారు. ఆహారంలో ఉప్పు వాడ కాన్ని తగ్గించడం వల్ల రక్తపోటు అదుపులో ఉం టుందన్నారు. నిల్వ ఉంచిన పచ్చళ్ళు, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని, పండ్లు, పచ్చని ఆకుకూరలు, తృణధాన్యా లు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగ కుండా ఉంటుందన్నారు. ముందస్తు గుర్తింపు పరీక్షలు తప్పు నిసరిగా చేయించుకోవా లన్నారు.30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కనీసం ఆరు నెలలకు ఒకసారి రక్తపోటు, షుగర్ లెవల్స్ పరీక్షించుకోవా లన్నారు. ఈ వ్యాధులు ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలను చూపవు కాబట్టి, పరీక్షలే వీటిని గుర్తించే ఏకైక మార్గమన్నారు.. శరీర బరువు సాధారణ స్థాయిలో ఉంచుకోవడం ద్వారా ఈ వ్యాధుల తీవ్రతను తగ్గించుకోవచ్చు నన్నారు.ఈ వ్యాధు లు ఒక్కసారి వచ్చా యంటే పూర్తిగా నయం కాకపోవచ్చునన్నారు కానీ క్రమ శిక్షణతో కూడిన జీవనశైలి ద్వారా వీటిని ఖచ్చితంగా నియంత్రించవచ్చునని నివారణే మేలు అనే సూత్రాన్ని పాటిస్తూ ఆరోగ్యకరమైన సమా జాన్ని నిర్మించవచ్చునన్నారు. ఉద్యోగస్తుల జీవనశైలి సుదీర్ఘంగా కూర్చోవడం, ఒత్తిడి కారణంగా రక్తపోటు, షుగర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుం దన్నారు కాబట్టి వీటిని ప్రాథమిక దశలో గుర్తించడం నివారణ చర్యలు తీసుకోవడం చాలా ముఖ్య మన్నారు. క్రమం తప్పకుండా పరీక్షలు ప్రతి 6 నెలలకు ఒకసారి బీపీ షుగర్ టెస్ట్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి కే కాశీ విశ్వేశ్వరరావు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సెల్ ఫోన్లు పై దృష్టి మానండి

### పది పరీక్షలపై దృష్టి పెట్టాలి - చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి




**మండపేట (మనసులో మాట ) మార్చ్ 13..** భవిష్యత్ కు ఎంతో కీలయమైన పదవ తరగతి పరీక్షలని,విద్యార్థులు సోషల్ మీడియా కు దూరంగా ఉండి పరీక్షలపై దృష్టి సారించాలని మండపేట పుర పాలక సంఘం చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి పేర్కొన్నారు. మండపేట పట్టణం లో గల గౌతమి మున్సిపల్ హై స్కూల్ జవహర్ లాల్ మున్సిపల్ హై స్కూల్ లో 10వ తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి మాట్లాడుతూ పరిక్షలు సమయంలో ప్రతి ఒక విద్యార్థి ఏకాగ్రత వహించాలన్నారు.పరీక్షలు జరుగుతున్న కాలంలో టీవీ, ఫోన్లు,సోషల్ మీడియా కు దూరంగా ఉండాలని తెలిపారు. ఎటువంటి అలసత్వం లేకుండా పరీక్షా కేంద్రాలకు సమయానికి చేరేలా చూసుకో వాలన్నారు.శ్రద్ధ గా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించి తాము చదువుతున్న స్కూల్ కు పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కాళ్లకూరి లక్ష్మీ స్వరాజ్య భవాని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు పునరావస కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ




**రౌతులపూడి, ( మనసులో మాట) మార్చ్ 13:** మండలంలోని సార్లంక గ్రామంలో అగ్ని ప్రమాద బాధితులకు ఆంధ్రు మినరల్స్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ రాజా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా సార్లంక గ్రామ ప్రజలు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభకు పూలతో ఘన స్వాగతం తెలిపారు. అనంతరం గిరిజన మహిళలు ఎమ్మెల్యే సత్య ప్రభ ను దుస్సాలువ తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్య ప్రభ మాట్లాడుతూ అగ్ని ప్రమాద బాధితులకు ఇచ్చిన మాట ప్రకారం అంధ్రు మినరల్స్ మినరల్స్ వారి సహకారంతో బాధితులకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని అలాగే ప్రతి ఒక్కరు పూర్తిస్థాయి గృహాలను అందిస్తామని అలాగే కుల ధ్రువీకరణ పత్రాలు భూపట్టాలు అందజేస్తామని స్వర్గీయ వరుపుల రాజా ను ఎంతో అభిమానించే ఈ గిరిజనుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఈ కార్యక్రమం లో రౌతులపూడి మండల అధ్యక్షురాలు గంట్టి మల్ల రాజ్యలక్ష్మి తెలుగుదేశం పార్టీ రౌతులపూడి మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, రౌతులపూడి మండలం తెలుగుదేశం నాయకులు పైల వేణుగోపాల్, ఇట్టంశెట్టి అశోక్, జట్ల రాజా, కత్తిపూడి సత్రం చైర్మన్ చంద్రమౌళి, లెక్కల రాము, ఈగల సత్తిబాబు, యాళ్ల జగదీష్, మండల తహసీల్దార్ ఎస్. వి నరేష్, ఎమ్ పి డి ఓ శివరామయ్య కృష్ణ మరియు రౌతులపూడి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ గంగమ్మ తల్లి గావు సంబరానికి ఎమ్మెల్యే నెహ్రూ కు ఆహ్వానం



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 13..** జగ్గంపేట మండలం ఇర్రిపాక శివ కేశవుల ఆలయం వద్ద జగ్గంపేట ఎమ్మెల్యే , తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూకు వైభోగుల వారి ఆడపడుచు శ్రీ గంగమ్మ తల్లి గావు సంబరం కు ఆహ్వానం పలికిన శ్రీ వైభోగుల, పెద్ద గొల్ల అప్పారావు, వైభోగుల నారాయణమూర్తి, వైభోగుల వీరపండు, వైభోగుల సత్తిబాబు, వైబోగుల గంగరాజు ఈ సందర్భంగా శ్రీ గంగమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ జగ్గంపేట కాకినాడ రోడ్ లో గల కో-ఆపరేటివ్ బ్యాంక్ పక్కన పెద్ద గొల్ల గారి వీధి లో వైభోగుల వారి ఆడపడుచు శ్రీ గంగమ్మ తల్లి గావు సంబరం మార్చి 15వ తేదీ ఆదివారం నుండి మార్చి 16వ తేదీ సోమవారం వరకు ఘనంగా నిర్వహిస్తున్నామని మా సాంప్రదాయ ఆట తప్పిడి గుళ్ళు తో గంగమ్మ తల్లికి నీరాజనం పలుకుతామని 16వ తేదీ సోమవారం ఉదయం 11 గంటల నుండి భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే ,టిటిడి బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూని ఆహ్వానం పలికేందుకు వచ్చామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి యావన్మంది భక్తులు కూడా విచ్చేసి ఆ గంగమ్మ అమ్మ వారి తీర్థప్రసాదాలు స్వీకరించి ద,ి రి ం చ వ ల ని ం ది గా కోరుచున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైభోగుల శ్రీనివాస యాదవ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ వైభోగుల కొండబాబు యాదవ్, జగ్గంపేట శ్రీకృష్ణ యాదవ్ సంఘం అధ్యక్షుడు మొరుకుర్తి రాజు యాదవ్, వైభోగుల వీరపండు, వైభోగుల సతీష్, వైభోగుల వీరబాబు అధిక సంఖ్యలో యాదవ్ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వన హామీలను కూడా నెరవేరుస్తుంది



**ఏలూరు, మార్చి 13(మనసులో మాట)..** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేరుస్తూ సంక్షేమ పాలన అందిస్తోందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. గత ఐదేళ్ల వైసిపి విధ్వంస పాలన నుంచి వికాసం వైపు ఆంధ్రప్రదేశ్ అడుగులు వేస్తోందని, ఈ రెండేళ్లలో ఎంతో ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. ఏలూరు పవర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగానే వైసీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించుకోవడాన్ని ఎద్దేవా చేసిన ఆయన ఆ పార్టీపై నిప్పులు చెరిగారు. సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగి, ఈ రెండు సంవత్సరాల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల చేత అనిపించుకున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని బడేటి చంటి పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి వివిధ కార్యక్రమాలు అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్రంలో 2019 నుంచి 2024 వరకు వైసిపి చీకటి పాలన సాగిందని, వైసిపి నియంత పాలన పట్ల విసుగు చెందిన ప్రజలు ఆ పార్టీని ఇంటికి సాగనంపి, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వానికి గత ఎన్నికల్లో పట్టం కట్టారని ఆయన గుర్తు చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి విధ్వంసకర పాలన వల్ల అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, ముఖ్యంగా యువత నాసిరకం మద్యం తాగి తమ జీవితాలను సర్వనాశనం చేసుకోవడంతో పాటు ఎంతోమంది మృతి చెందారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఇప్పుడు ప్రజాభిమానాన్ని పొందడానికి గారడీ మాటలు మాట్లాడుతున్నారని వాటిని నమ్మి మళ్ళీ అగాధంలో పడే పరిస్థితి తెచ్చుకోవద్దని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. 2019 నుండి 2024 వరకు రాష్ట్రంలో ఒక భూతం పాలన కొనసాగిందని, దానివల్ల రాష్ట్రం వంద సంవత్సరాల వెనక్కి వెళ్లిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. 2024లో ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పుతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పట్టాలెక్కించిందన్న విషయాన్ని మరువ వద్దని ఆయన హితవు పలికారు.



## ఉత్తమ సేవా పురస్కార గ్రహీత తాళ్ళ సుశీల కు ఘన సత్కారం

కపిలేశ్వరపురం (మనసులో మాట ) ఫిబ్రవరి 13
కపిలేశ్వరపురం మండలం తాతపూడి గ్రామానికి చెందిన తాళ్ళ సుశీల పాన్ ఇండియా వారి ప్రతిష్టాత్మక అవార్డు ఉత్తమ ఎమ్ పి హెచ్ ఏ (ఎఫ్) గా అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతులు మీదుగా అందుకున్న విషయం విదితమే. ఈ సందర్భంగా మండల కేంద్రం కపిలేశ్వరపురం లో శుక్రవారం పాన్ ఇండియా అవార్డు గ్రహీత తాళ్ళ సుశీల ను పలువురు ఘనంగా సత్కరించారు. తాళ్ళ సుశీల అంగర పి.హెచ్.సి వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వర్తిస్తూ... పలు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నట్లు వక్తలు కొనియాడారు. విధి నిర్వహణలో నిబద్ధత, సేవా దృక్పథం కలిగిన తాళ్ళ సుశీల కు ఉత్తమ సేవా పురస్కారం దక్కడం అభినందనీయం అని పేర్కొన్నారు. తాళ్ళ సుశీల తన ఉద్యోగ నిర్వహణలో మరిన్ని అవార్డులు అందుకోవాలని వక్తలు ఆకాక్షించారు.అనంతరం ఉత్తమ సేవా అవార్డు గ్రహీత తాళ్ళ సుశీల ను శాలువా, పూలమాలలు ,జ్ఞాపికలు , పట్టు వస్త్రాలు తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎంపిడిఓ భానూజీ, ఏ. ఓ రాజేంద్ర ప్రసాద్, జుత్తుక మల్లిఖార్జున్, కార్యదర్శి శివ చక్రవర్తి, అంగాని నూక రాజు, వెంకట్ మాస్టర్, డిప్యూటీ ఎంపిడిఓ శ్రీ రామ మూర్తి,పిప్పర సంపత్ రావు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది,అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకే ప్రజాదర్బార్




**కిర్లంపూడి (మనసులో మాట) మార్చి 13..** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. కిర్లంపూడి మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రజల నుంచి వినతులు, అభ్యర్థనలు స్వీకరించారు. పలు సమస్యలపై వినతులు అందగా అందులో పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ప్రజల నుంచి అందిన ప్రతీ వినతి పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా దర్బార్ ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## నూకలమ్మ రాజ్యలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం హుండీలు లెక్కింపు



**అమలాపురం (మనసులోమాట) మార్చి13 :**అమలాపురం సుబ్బాలమ్మ వీధిలో వేంచేసియున్న నూకాలమ్మ, రాజ్యలక్ష్మి అమ్మవార్ల ఉండి లెక్కింపు శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు రామలింగేశ్వర రావు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. 8 నెలలకు గాను నాలుగు లక్షల 90 వేల 997 రూపాయలు ఆదాయం సమకూర్నట్లు రామలింగేశ్వర తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ చైర్మన్ అప్పన వీరన్న ఈఓ ఆర్ శ్రీనివాస్ సేవా సమితి సభ్యులు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

## పశు సంపద పెంపుతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం( మనసులోమాట) మార్చి 13:** పశుసంపదతోనే ఆరోగ్యమైన సమాజాన్ని పొందగలమని పాడి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అమలాపురం ఎమ్మెల్యే అయితావత్తుల ఆనందరావు పేర్కొన్నారు శుక్రవారం అమలాపురం రూరల్ మండలం సాకుర్రు గ్రామంలో నిర్వహించిన జాతీయ కృత్రిమ గర్భాధారణ అవగాహన సదస్సు లేగ దూడల అందాల పోటీల కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లేగ దూడల ప్రదర్శన ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పశు సంపదను కాపాడుకోవడం ద్వారానే స్వచ్ఛమైన పాలు పొంది, కల్తీని నివారించవచ్చునన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతను కొనియాడుతూ, పశు పోషణను లాభసాటిగా మార్చేందుకు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పశువులకు గోశాల వంటి పథకాల గురించి ప్రజలకు వివరించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న మన కూటమి ప్రభుత్వం, పశువుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని కొనియాడారు. అలాగే సాకుర్రు గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు వెచ్చించి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం, లేగ దూడల అందాల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే పురస్కారాలు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఐజమీా చైర్మన్ చంద్రమౌళి, మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, పొలమూరి ధర్మపాల్ స్థానిక ప్రజాప్రతినిధులు, పశుసంవర్ధక శాఖ అధికారులు, కూటమి నాయకులు రైతులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప


# తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ





**ఉమ్మడి అనంతపురం, మార్చి 13 ( మనసులో మాట):** జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో శుక్రవారం తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వడ్డే వెంకట్, పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనరసింహమూర్తి, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూ కొఠారి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ ఏ.మలోల మాట్లాడుతూ మొల్ల జీవితం నేటి తరం మహిళలకు స్ఫూర్తిదాయక మని కొనియాడారు. సహజ కవయిత్రిగా ఎటువంటి రాజపోషణ లేకుండా, కేవలం తన భక్తి మరియు ప్రతిభతో రామాయణాన్ని తేటతెలుగులో అందించిన మహనీయురాలు మొల్లమాంబ అందరికీ మార్గదర్శకంగా నిలిచిందన్నారు. దైవభక్తితో వాల్మీకి రచించిన రామాయణాన్ని సంస్కృతము నుండి సరళంగా అందరికి అర్థమయ్యే రీతిలో తెలుగు భాషలోకి కేవలం 5 రోజులోనే అనువదించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ అని అన్నారు. మొల్లమాంబ అద్భుతమైన సాహిత్యం వెలకట్టలేనిదన్నారు. సంస్కృత పదాల కంటే తెలుగు నుడికారానికే ప్రాధాన్యతనిచ్చి, సామాన్యులకు సైతం రామాయణాన్ని అర్థమయ్యేలా చేసిన ఘనత మొల్లమాంబకే దక్కుతుందన్నారు. అధికారికంగా మొల్లమాంబ జయంతి మహోత్సవం నిర్వహించామన్నారు. మొల్లమాంబ లాంటి గొప్పవారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. శనివారం, ఆదివారం గుత్తి కోట ఉత్సవాలను నిర్వహించడం జరుగుతోందని, ఇందులో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు రాష్ట్ర పండుగగా అధికారికంగా మొల్లమాంబ జయంతి మహోత్సవం నిర్వహించడం జరుగుతోందని, ఇది కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. సీఎం చంద్రబాబు వచ్చిన తరువాతనే ఇలాంటి కార్యక్రమాలు జరుపుకోవడం జరుగుతోందన్నారు. భావితరాలు మహిళా కవయిత్రి మొల్లమాంబను ఆదర్శంగా తీసుకోవాలని, బాలికలు అందరూ బాగా చదువుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అరె కటిక వెల్ఫేర్ హరిక్రిష్ణరావు, కుమార శాలివాహన ఉద్యోగ సంఘం నాయకులు ఓబులపతి, కుమార శాలివాహన సంఘం రాష్ట్ర ప్రెసిడెంట్ పోతులయ్య, కుమార సంఘం జిల్లా జనరల్ సెక్రెటరీ కెవి.రమణ, కుమ్మర మహిళా నాయకురాలు రామంజినమ్మ, కుమ్మర సంఘం యువ నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.













# ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

**పలమనేరు మార్చి 13 ( మనసులో మాట):** శ్రీ వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కవయిత్రి మొల్ల జయంతిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశులు అధ్యక్షతన తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... నేటితరం స్త్రీలకు విద్యార్థులకు ఆమె ఆదర్శమని చదువు ప్రాధాన్యత లేని రోజుల్లోనే మొల్ల గొప్ప కావ్యమైన రామాయణంను రచించడం స్త్రీ జాతి గర్వించదగ్గ విషయమని కాబట్టి మీరు ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని పేర్కొన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నందీశ్వరయ్య మాట్లాడుతూ... కుమ్మరి కులంలో జన్మించిన మొల్ల తండ్రి చదువుకోకపోయినా కుటుంబ పరిస్థితులు సరిగా లేకపోయినా తాను రామాయణ కావ్యాన్ని రచించాలనే సంకల్పంతో ముందుకు సాగారు. కాబట్టి కొద్ది రోజులలోనే ఈ కావ్యాన్ని రచించారు. ఆమె జీవితం ద్వారా నేటి యువత తెలుసుకోవలసింద న్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా మనం సాధించాలనే సంకల్పం ఉంటే ఎవరైనా సాధించవచ్చును. దీనికి నిదర్శనం మొల్ల జీవితమని తెలిపారు. అనంతరం తెలుగు విభాగధిపతి డాక్టర్ ఇ వాసు మాట్లాడుతూ... చిన్నతనములోనే తల్లి మరణించిన తండ్రి సంరక్షణలో పెరుగుతూ చదువు అంతంత మాత్రమే నైనా తమ కులదైవం శ్రీ గోపురపు శ్రీ కంఠ మల్లేశ్వర స్వామి అనుగ్రహముతో రామాయణ కావ్యాన్ని రచించారు. ఆమె ఆరు రోజుల్లో871 పద్యాలతో 6 ఖండాలతో పూర్తి చేశారు. పట్టుదల ఉంటే ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఏమైనా సాధించవచ్చును. అనటానికి మొల్ల జీవితం మనకు ఆదర్శం అన్నారు. కాబట్టి విద్యార్థులు నేడు చిన్నచిన్న కష్టాలకు కృంగిపోకుండా ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ సురేష్ బాబు, అధ్యాపకులు డాక్టర్ వెంకటేష్ బాబు, కిరణ్ బాబు, ఇంతియాజ్ తోపాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది పురస్కారాలు అందుకొన్న విద్యార్థులు




గంగవరం మార్చి 13 ( మనసులో మాట): పరాభవనామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని గంగవరం జిల్లా పరిషత్ హైస్కూల్ లో శుక్రవారం తెలుగు పద్యాలు చెప్పడం వ్రాయడం నందు విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సబ్ జూనియర్స్ విభాగం (1,2తరగతులు)లో ప్రధమ బహుమతి స్వరూప - నల్లగుట్లపల్లి,ద్వితీయ బహుమతి జయకృష్ణ - కీలపట్ల, తృతీయ బహుమతి తనుశ్రీ - సరమట్లపల్లి విద్యార్థులుగెలుపొందారు. జూనియర్స్ విభాగం నందు(3,4,5 తరగతులు) ప్రదమస్థానం తన్మయి - నల్లగుట్ల పల్లి, ద్వితీయస్థానం చరణ్ - జి.ఎల్.ఎస్.ఫారం, తృతీయ స్థానంలో ధనన్ సాయి - నల్లగుట్లపల్లి,చతుర్ద స్థానం ధరణి - పత్తికొండ గెలిపొందారు. అలాగే వ్యాసరచన పోటీలలో సీనియర్స్ విభాగం (6,7,8 తరగతులు) ప్రథమ ద్వితీయ తృతీయ చతుర్ధ స్థానాలుగా బిందుశ్రీ - కె.జి.బి.వి. పాఠశాల, భావన - గంగవరం హై స్కూల్, జాహ్నవి - జి.ఎల్.ఎస్.ఫారం, సుప్రియ - గంగవరం హై స్కూల్ విద్యార్థులు గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ - 2 శ్రీనివాసులు, హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు చంగల్ రెడ్డి చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు,మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జరుగగా అధ్యక్ష కార్యదర్శి లు తులసీనాధం నాయుడు,పుష్పలు కార్యక్రమ నిర్వాహకులుగా వ్యవహించి సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో 100 మంది విద్యార్థులు పాల్గొనగా పలువురు ఉపాధ్యాయ బృందం న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

# సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

## - 47 మందికి రూ. 48 లక్షలు అందజేత



**పెనుమూరు, మార్చి 13 (మనసులో మాట):** ఆపదలో ఉన్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని, బాధితులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ మరియు గంగాధరనెల్లూరు శాసనసభ్యులు డాక్టర్ వి.ఎం. థామస్ అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ అధ్యక్షులు షణ్ముగ రెడ్డితో కలిసి ఆయన గంగాధర నెల్లూరులో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 47 మంది బాధితులకు సుమారు రూ. 48 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను నేరుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం. థామస్ మాట్లాడుతూ.. అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతూ, భారీ ఖర్చులతో వైద్యం చేయించుకున్న నిరుపేద కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యంగా ఈ నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. షణ్ముగ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ట్రాక్టర్ డ్రైవర్లకు ప్రమాదాలపై అవగాహన

## - సీఐ మోహన్ రెడ్డి

పలమనేరు మార్చి 13 (మనసులో మాట) : చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడే ఆదేశాల మేరకు పలమనేరు డి.ఎస్.పి దేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో పలమనేరు అర్బన్ సీఐ కె. మోహన్ రెడ్డి పలమనేరు మండలంలో ఉన్న ట్రాక్టర్లు డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా శుక్రవారం యాక్సిడెంట్లు జరగకుండా చూడాలని ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లను అమర్చడం గురించి తెలియజేశారు. ట్రాక్టర్ డ్రైవర్లకు, ఓనర్లకు రోడ్ యాక్సిడెంట్లు జరగకుండా వాటిపైన అవగాహనను కల్పించడం జరిగినదన్నారు. ఇందులో ప్రధానంగా ట్రాక్టర్ డ్రైవర్ కు లైసెన్స్ తప్పకుండా ఉండాలన్నారు. రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ట్రాక్టర్ క్రాస్ చేసేటప్పుడు డ్రైవర్ ముందర వెనుక చూసిన తర్వాత నెమ్మదిగా క్రాస్ చేయాలన్నారు. ప్రమాదాలు నివారించడమే పోలీసుల బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం



**పలమనేరు మార్చి 13( మనసులో మాట) :** పలమనేరు మండలంలో నిర్వహించనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.ఈ పరీక్షలు మార్చి16, 2026 నుంచి ఏప్రిల్ 1,2026 వరకు నిర్వహించబడతాయి. మండలంలోని 8 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1493 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. కేంద్రాల వారీగా విద్యార్థుల వివరాలు ఇలా జడ్పీహెచ్ఎస్, పెంగరగుంట-221 జడ్పీహెచ్ఎస్, కొలమాసనపల్లి -213, జడ్పీహెచ్ఎస్, ఉర్దూ పలమనేరు-141, జి హెచ్ ఎస్, పలమనేరు -223, జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పలమనేరు- 197 ఎలెనా బెట్టిని ఈ.ఎం స్కూల్ -180 ఓ ఎల్ ఎల్ ఈ.ఎం స్కూల్ -170 వాణి విద్యాశ్రమం ఈ.ఎం స్కూల్-149 మంది.
పరీక్షా కేంద్రాల్లో తాగునీరు విద్యుత్ దస్కులు టాయిలెట్ వంటి ఏర్పాట్లు చేశారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది ఇన్విజిలెటర్స్ పోలీసు భద్రత ఫ్లైయింగ్ స్క్వాడ్లు సిట్టింగ్ స్కోడ్ చీఫ్ సూపరేండెంట్,డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, ఆరోగ్య సిబ్బందిని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని విద్యార్థులు సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరగేందుకు అందరూ సహకరించాలని ఎంఈఓ లీలారాణి,ఎంఈఓ 1 బాలసుందరంకోరారు.

# భూ ఆక్రమణల తొలగింపు





**పెనుమూరు, మార్చి 13 (మనసులో మాట):** కార్వేటినగరం మండలం పొన్నగల్లు గ్రామంలో ఆక్రమణ గురైన కాలువ పరంబోకు భూములను సర్వే చేసి ఆక్రమణలను తొలగించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని పొన్నగల్లు గ్రామ రెవెన్యూ సర్వేనెంబర్ 163 లో కాలువ పరుంబోకు భూములకు సంబంధించి ఆక్రమణకు గురైన0.91 సెంట్ల భూమి ఆక్రమణలను తాసిల్దార్ నాగరాజు మరియు ఎస్సై తేజస్విని ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించారు. పొన్నగల్లు గ్రామ సమీపంలో రోడ్డు ప్రక్కనే కాలు పరంబోకుగా నమోదు కాబడిన సర్వే నెంబర్ 163 లో పది మంది రైతులు 0.91 భూమిని ఆక్రమించుకున్నారు. దీంతో తాసిల్దార్ సర్వే సిబ్బందితో కలిసి రోవర్ ద్వారా ఆక్రమణలను గుర్తించి ఆక్రమణకు గురైన భూములను జెసిబి ల ద్వారా తొలగించారు. ఆక్రమణకు గురైన కాలవ పరంబోకు భూములను గుర్తించి తొలగించడం పట్ల గ్రామస్తులు తాసిల్దార్ నాగరాజు కృషిని అభినందించారు. ఇందులో ఎస్సై తేజస్విని హెడ్ కానిస్టేబుల్ యువరాజు, ఆర్ ఐ నరసింహులు,వీఆర్వో భరత్ సాయి, సర్వేయర్ మురళి, వీఆర్ఏ మురుగయ్య గ్రామస్తులు పాల్గొన్నారు

మనసులో మాట — KANCHARLA — సంచలన తెలుగు దిన పత్రిక



# ఆకస్మిక దాడులు

**ఉమ్మడి అనంతపురం, మార్చి 13 ( మనసులో మాట):** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని కాలేజ్ సర్కిల్ ప్రాంతంలో పలు హోటళ్లపై ఆర్డీవో రామసుబ్బయ్య ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార అవసరాలకు ఉపయోగిస్తున్న 11 గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కొత్తపేటలోని అమరావతి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ రామ సుబ్బయ్య మీడియాతో మాట్లాడుతూ, అమరావతి ఏజెన్సీ నందు ఉదయం 360 సిలిండర్లు స్టాక్ వచ్చినప్పటికీ రిజిస్టర్ లో ఎక్కడ నమోదు చేయలేదని కనీసం లోడు వివరాలు కూడా తెలియజేయలేదని గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా అనధికారికంగా గ్యాస్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్లను గోదాముకు తరలించి నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఈ తనిఖీల్లో సి.ఎస్.డీ.టి రమణబాబు, గురు ప్రసాద్,టౌన్ వీఆర్ఓ రవి శేఖర్ రెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు.

# హెచ్పీవీ వ్యాక్సిన్

**ఉమ్మడి అనంతపురం,** అనంతపురం జిల్లా రాయదుర్గంలో ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు పట్టణంలో గల ప్రభుత్వ వైద్యాశాలలో హెచ్పీవీ వ్యాక్సిన్ కార్యక్రమనీ ప్రారంభించడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు మాట్లాడుతూ భవిష్యత్తులో సర్వేకాల్ క్యాన్సర్ రాకుండా దాదాపు పదివేల రూపాయల విలువ చేసే ఈ వ్యాక్సిన్ కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ ఉచిత హెచ్పీవీ ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. నియోజకవర్గంలోని గాల 14- 15 సంవసరళ లోపు బాలికలు 2907 మందికి దసలవారీగా ఈ వాక్సిన్ కార్యక్రమం చెప్దాతారు అని తెలిపారు.

# ఇంటి వంట గ్యాస్ సిలిండర్ లను సీజ్ చేసిన అధికారులు



**ధర్మవరం మార్చి 13 (మనసులో మాట)..** కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఆదేశాల మేరకు పట్టణములోని హోటల్లు రెస్టారెంట్లు ఇతర అంగడులు లను, ఆర్డీవో రామసుబ్బయ్య, తాసిల్దార్ సురేష్ బాబు, పౌరసరఫరాల డిప్యూటీ తాసిల్దార్ ధర్మవరం, చెన్నె కొత్తపల్లి, రామగిరి, తాడిమర్రి,పుట్టపర్తి, గ్రామ రెవెన్యూ అధికారులు ఆధ్వర్యంలో తీవ్రంగా తనిఖీలు చేపట్టడం జరిగింది. అనుమతి లేని గ్యాస్ సిలిండర్లు 11 సీజ్ చేయడం జరిగిందని, కేసు నమోదు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. సదరు తనిఖీయందు స్టాకు వివరాలు కూడా లేదు అని తెలిపారు. అదేవిధంగా గోడౌన్ నందు కూడా ఎటువంటి స్టాక్ రిజిస్టర్ లేదు అని వారు స్పష్టం చేశారు. సదరు నివేదికను జిల్లా కలెక్టర్కు పంపుతున్నట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని లక్ష్మీ ఎంటర్ప్రైజెస్ గ్యాస్ ఏజెన్సీ, మేనేజర్ వారికి గ్యాస్ లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం సూచించిన గడువు లోపల గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేయాలని తెలపడం జరిగిందన్నారు. ఇక హోటల్లు ,రెస్టారెంట్లు, వ్యాపారం చేసే వారు ఎవరైనా సరే ఇంటి గృహానికి ఉపయోగపడే సిలిండర్లు వాడరాదని కేవలం కమర్షియల్ సిరిండర్స్ మాత్రమే ఏజెన్సీ ద్వారా బుక్ చేసుకుని రసీదు పొంది వినియోగించాలని తెలిపారు. అట్లు లేని యెడల క్రిమినల్ కేసు బుక్ చేసి జరిమానా విధించబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్డి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

## 30వేల కోట్లతో గ్లోబల్ ఉద్యాన హబ్ గా రాయలసీమ జిల్లాల అభివృద్ధి

# కూటమి రైతు పక్షపాతి ప్రభుత్వం

- అన్నదాత సుఖీభవ మూడో విడత కార్యక్రమంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి
- 38,368 రైతులకు రూ. 21.71 కోట్ల చెక్కు పంపిణీ




**పలమనేరు మార్చి 13( మనసులో మాట):** దేశానికి అన్నం పెట్టే రైతు సంతోషంగా ఉంటేనే అందరం సంతోషంగా సుభిక్షంగా అన్నదాత సుఖీభవ ద్వారా ప్రభుత్వం వారిని ఆదుకునే బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. గంగవరం మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ మూడో విడత నేతల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.... సాగు భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 14000 పిఎం కిసాన్ లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా 6000 కలిపి ఏడాదికి 20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఇప్పటికే రెండు విడతలలో రైతులకు ఈ నిధులను జమ చేయడం జరిగిందని మూడో విడతలో భాగంగా నియోజకవర్గంలోని 38,368 మంది రైతులకు 21.71 కోట్లను జమ చేస్తుండడం ఆనందదాయకమన్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలను గ్లోబల్ ఉద్యాన హబ్ గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాయలసీమ హార్టికల్చర్ ఇంటిగ్రేటెడ్ పథకం కింద 30 వేల కోట్లతో అభివృద్ధి చేయనున్నామని వివరించారు. దీంతో ఈ ప్రాంతంలో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని ఎనిమిది లక్షల నుంచి 14 లక్షల హెక్టార్లకు రాబోయే మూడేళ్లలో సంవత్సరానికి రెండు లక్షల హెక్టార్ల చొప్పున పెంచడమే గాక ఉద్యాన పంటల ఉత్పత్తిని 2.21 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 4.25 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచడం వల్ల రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఇక కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వమని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అన్ని కార్యక్రమాలను అమలు చేయడమే గాక 90 శాతం సబ్సిడీపై బిందు సేద్యం పరికరాలను ఉద్యాన రైతులకు రాయితీలు,ప్రకృతి వ్యవసాయనికి ప్రోత్సాహకం, వ్యవసాయ యాంత్రీకరణ, పాడి రైతులకు ప్రోత్సాహం, పంటల సాగులో ఏఐ డిజిటల్ సేవలు వంటి కార్యక్రమాలతో రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. వీటితోపాటు రైతులకు రవాణా మరియు మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించి వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సాగుకి అవసరమైన అన్ని అవకాశాలను కల్పిస్తున్నట్లు వివరించారు. రాబోవు రోజుల్లో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటిని పూర్తిస్థాయిలో 100కు 100 శాతం అమలు చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తూ తమ అభిప్రాయాలు వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో గంగవరం,బైరెడ్డిపల్లి , పలమనేరు,పెద్దపంజాణి, మండలాల ఏవోలు రఖీభా, గీతా, సంధ్య, హేమలత, పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రామచంద్ర నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, మండల నాయకులు సోమశేఖర్ గౌడ్,ప్రతాపరెడ్డి, ప్రసాద్ నాయుడు, బత్తి గౌడు, వెంకట మునిరెడ్డి,నాగరాజు, ఆర్.బి.సి కుట్టి, హరిబాబు, రవి, దీపికా కృష్ణమూర్తి, సురేష్,లతో పాటు జనసేన నాయకులు దిలీప్ కుమార్,నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న నిరాహార దీక్షలు..

## 15వ రోజుకు చేరుకున్న దీక్షలు - జయకృష్ణ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ కుళ్లాయప్ప యాదవ్



**ధర్మవరం మార్చి 13 (మనసులో మాట)..** మా సమస్యలు పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం చొరవ చూపాలని, అంతవరకు రిలే నిరాహార దీక్షలు ఆపేది లేదని, దేవాలయాలు ప్రభుత్వ ఆధీనంలో ఉండరాదని జయకృష్ణ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ వివేక్ కుళ్లాయప్ప యాదవ్ తెలిపారు. పట్టణంలోని హిందువులు కూడా రోజురోజుకు దీక్షకు మద్దతు పలుకుతూ నాటికి 15వ రోజుకు చేరుకుంది. అనంతరం డాక్టర్ వివేక్ మాట్లాడుతూ ఈ దీక్షలకు పట్టణంలోని న్యాయవాదులు, విశ్రాంతి ఉద్యోగుల సంఘం, తదితరులు మద్దతు పలికారు. మద్దతు పలికిన వారిలో వెంకటరమణ, మృత్యుంజయ చలపతి, ముత్యాలప్ప, ఆదినారాయణ, దుర్గన్న, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు చలపతి, చిన్నప్ప, సుధాకర్, ఉపాధ్యక్షులు కొండయ్య, శ్రీరాములు, బార్ అసోసియేషన్ వారు, న్యాయవాదులు అయిన రామకృష్ణారెడ్డి, అంజన్ రెడ్డి, కృష్ణమోహన్, బిల్లే రవి, వెంకటేశ్వర్లు, అశోక్ కుమార్, రామాంజనేయులు, రామానాయుడు, బాబు, వెంకటస్వామి, భాస్కర్ మద్దతు పలికినందులకు డాక్టర్ వివేక్ కృతజ్ఞతలను తెలియజేశారు. అనంతరం డాక్టర్ జయ కృష్ణ మాట్లాడుతూఆనాటి నుండి ఈనాటి వరకు హిందూ దేవాలయాలలో జరుగుతున్న అన్యాయాలు, పరిష్కరించని సమస్యలపై హిందూ సమ్మేళనా కమిటీ పోరాటం చేస్తుందని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా తాము హిందూ ధర్మం కాపాడడం కోసం అనేక పోరాటాలు సల్పడం జరిగిందని, సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఈ నిరాహార దీక్షల చేస్తున్నామని తెలిపారు. దేవాలయాలను ప్రభుత్వ ఆధీనం నుండి తొలగించాలని, స్వతంత్ర హిందూ సనాతన బోర్డు ఏర్పాటు చేయాలని, విద్యా సంస్థలలో హిందూ ధర్మ బోధన అనుమతించాలని, దేవాలయ మాన్యాలు ఆక్రమణలు తొలగించాలని, హిందూ మైనారిటీ విద్యాసంస్థలు ఏర్పాటుకు అనుమతించాలని, పూజారులకు 15వేల రూపాయలు నెలసరి వేతనం ఇవ్వాలని, పల్లెటూరు లలో ప్రజల ప్రాణాలు కాపాడడానికి పల్లెటూరు హాస్పిటల్ లో 24 గంటల పాటు ఎంపీపీ ఎస్ డాక్టర్ అందుబాటులో ఉండాలని, ప్రతి పీహెచ్సీ లో ముగ్గురు ఎంపీపీ ఎస్ డాక్టర్లను ప్రభుత్వం వెంటనే నియమించాలని వారు డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి మా లక్ష్యం..

## - ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు



**ధర్మవరం మార్చి 13 (మనసులో మాట)..** ప్రభుత్వ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేయడమే మా లక్ష్యము అని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్డెంట్ తిప్పేంద్ర నాయక్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ నరసింహులు, డాక్టర్ సోనియా, డాక్టర్ సుబ్బారావు, కమిషనర్ వెంకట రమణయ్య, పుల్లయ్య, ఇంజనీర్లు పాల్గొని తమ యొక్క అమూల్యమైన సలహాలను తెలియజేశారు. తదుపరి ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓపి ముందర రోగుల సంఖ్య అధికం కావడంతో షెడ్డు వేయాలని నిర్ణయం చేయడం జరిగింది అన్నారు. రోగులతో వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయి అన్న విషయాలను వారు ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రికి ఆరోగ్య శాఖ మంత్రి వివిధ పరికరాలకు గాను ఒక కోటి 69 లక్షలు ఇవ్వడం పట్ల కమిటీ కృతజ్ఞతలను తెలియజేసింది.

# సజావుగా జరిగిన ప్రజావేదిక బహిరంగ సభ

## - పిడి విజయ ప్రసాద్




**ధర్మవరం మార్చి 13 (మనసులో మాట)..** పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో 19వ విడత సామాజిక తనిఖీ నిర్వహణలో భాగంగా ప్రజా వేదిక బహిరంగ సభ సజావుగా జరిగిందని పిడి విజయప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 01.04.2024 నుండి 31. 3. 2025 మధ్యకాలంలో ధర్మవరం మండలంలో జరిగిన వివిధ పనులకు సామాజిక తనిఖీ బృందములు అన్ని గ్రామ పంచాయతీలలో తనిఖీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. వీటిలో ఆడిట్ నిర్వహించగా 2 లక్షల 30,500 తేలిందని దీనిని రికవరీ చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఈ రికవరీలో పంచాయితీలలో 17,520 సిసి రోడ్ల కింద తేలిందని, మిగిలింది ఉపాధి హామీ పథకాలలో తేలిందని తెలిపారు. 20 పంచాయితీలకు గాను 12 కోట్ల 24 లక్షలు ఖర్చు చేయడం జరిగిందన్న రు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్ మెన్ వెంకట శివారెడ్డి, ఎంపీడీవో వెంకటేశు, ఏపీవో అనిల్ కుమార్, సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎస్ఆర్పి మూర్తి, డిఆర్పీలు పాల్గొన్నారు.



## జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం

# విజయవంతం చేయండి

## జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి

**ధర్మవరం మార్చి 13 (మనసులో మాట)..** పట్టణంలో మార్చి 14వ తేదీ జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం ఉదయం 8:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయం నుండి పట్టణంలోని వివిధ కూలీలలో బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించి, కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా

# ఇఫ్తార్ విందు

- భారీగా పాల్గొన్న మైనారిటీ సోదరులు
- అల్లా దయతో అందరూ బాగుండాలని కోరుకున్న ఎమ్మెల్యే
- నియోజకవర్గ ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



పలమనేరు మార్చి 13 ( మనసులో మాట):పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక నమాజులో ఆయన పాల్గొన్నారు. ఆ అల్లా దయతో అందరూ కలసి మెలసి ఆనందంగా ఉండాలని కోరుకున్నారు. ఇలా ఉండగా నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున మైనారిటీ సోదరులు ఈ కార్యక్రమానికి విచ్చేసి ఆయన్ను ఆత్మీయంగా కలసి సన్మానించారు. అనంతరం నియోజకవర్గంలోని ముస్లిం సోదర సోదరీమణులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో పలువురు ముస్లిం మత పెద్దలతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒక్క రూపాయికే రుచికరమైన భోజనం

## నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త గోళ్ళ రాజేష్



**నంద్యాల జిల్లా..,మార్చి 13 (మనసులో మాట)..** నంద్యాల పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సంఘమిత్ర బాలుర గృహం పక్కన సలీం నగర్ వెళ్లే దారిలో నాలుగు నెలలుగా ఒక్క రూపాయికే ప్లేట్ పుల్కా,కర్రీ, పప్పు, ఒక్క రూపాయికే కలర్ రైస్,కర్రీ, 1రూపాయికే జొన్న రొట్టె, పప్పు నిరంతరాయంగా కొనసాగుతా ఉన్న నేపథ్యంలో ఈరోజు వినూత్నంగా కేవలం ఒక్క రూపాయికే రుచికరమైన భోజనం ప్రారంభించారు. నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త గోళ్ళ రాజేష్. ఎంతో మంది ప్రజలు నంద్యాల జిల్లా లోని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలకు తమపని కొరకు ఎంతోమంది వస్తూ ఉంటారు అలాంటి సమయంలో వారందరికీ కమ్మని రుచికరమైనటువంటి భోజనం అతి తక్కువ ధరలో అందించాలని అటువంటి సదుద్దేశంతో ఇప్పటికే పుల్కాలు,కలర్ రైస్ జొన్న రొట్టెలు అందిస్తున్న విషయం నంద్యాల నియోజకవర్గ ప్రజలందరికీ తెలిసిన విషయమే ఈరోజు నుండి కేవలం ఒక్క రూపాయికే రుచికరమైన భోజనం అందించాలని సంకల్పంతో ఒక్క రూపాయికే భోజనం ప్రారంభించారు. ఈ విషయాన్ని నంద్యాల నియోజకవర్గంలోకి తెలియజేయడం చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నాము.

ఈ కార్యక్రమాలన్ని సజావుగా ముందుకు వెళ్లడానికి నంద్యాల నియోజకవర్గ పెద్దలు,మా శ్రేయోభిలాషులు,స్నేహితులు,ప్రజలు అందరూ మాకు అన్ని వివరాలు మాకు సహకరిస్తున్నందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

తెలంగాణ

| | | | | |
|---|---|---|---|---|
| హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ |
| నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం |

శనివారం 14 మార్చ్ 2026



# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు.. వెండి కూడా డౌన్

**హైదరాబాద్ మార్కెట్‌లో దిగివచ్చిన పసిడి రేట్లు**

**మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడమే కారణం**



**హైదరాబాద్, మార్చి 13 (మనసులో మాట):**

దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మళ్ళీ తగ్గుముఖం పట్టాయి. గురువారంతో పోలిస్తే శుక్రవారం నాటి మార్కెట్‌లో పసిడి రేట్లు కాస్త దిగివచ్చాయి. తాజా సమాచారం ప్రకారం హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో బంగారం ధరలు తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో పాటు స్థానిక మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం ధరల తగ్గుదలకు కారణమైంది.

**బంగారం ధరల వివరాలు**

24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై 980 రూపాయలు తగ్గి 1,61,240 రూపాయలకు చేరింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 900 రూపాయలు తగ్గి 1,47,800 రూపాయల వద్ద ట్రేడవుతోంది. నిన్నటి వరకు ఆకాశాన్ని తాకిన ధరలు నేడు కాస్త దిగిరావడంతో సామాన్య వినియోగదారులకు కొంచెం ఊరట లభించినట్లయింది.

**స్వల్పంగా తగ్గిన వెండి**

బంగారంతో పాటే వెండి ధర కూడా స్వల్పంగా తగ్గింది. క్రితం రోజుతో పోలిస్తే కిలో వెండిపై 100 రూపాయలు తగ్గింది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో వెండి ధర 2,79,900 రూపాయలుగా ఉంది. గత కొన్ని రోజులుగా స్థిరంగా ఉన్న వెండి ధర నేడు స్వల్పంగా కిందకు దిగింది. ధరలు గరిష్ఠ స్థాయిలకు చేరిన సమయంలో మదుపర్లు తమ వద్ద ఉన్న నిల్వలను అమ్మి లాభాలను స్వీకరించడం వల్ల ఈ తగ్గుదల కనిపిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో మార్కెట్ పరిస్థితులను బట్టి ధరల్లో మరిన్ని మార్పులు ఉండే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు.

# హాల్ టిక్కెట్ ఉంటే బస్సు ప్రయాణం ఫ్రీ

## నేటి నుంచి పదో తరగతి పరీక్షలు..

**రాష్ట్రవ్యాప్తంగా 5.28 లక్షల మంది విద్యార్థులు హాజరు**

**5 నిమిషాల ఆలస్యానికే అనుమతి.. నిబంధనలు కఠినం**

**సాధారణ దుస్తుల్లోనే రావాలని అధికారుల సూచన**



**హైదరాబాద్, మార్చి 13 (మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం నుంచి మొదలవుతున్నాయి. ఇందుకోసం విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ ఒక గొప్ప అవకాశం కల్పించింది. విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపిస్తే చాలు.. పరీక్షా కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణించవచ్చు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ సకాలంలో సెంటర్లకు చేరుకోవాలని అధికారులు కోరారు. కేవలం 5 నిమిషాల ఆలస్యాన్ని మాత్రమే అధికారులు పరిగణనలోకి తీసుకుంటారు. ఆ తర్వాత వస్తే పరీక్షకు అనుమతించరు.

**పరీక్షా కేంద్రాల వివరాలు**

ఈ ఏడాది మొత్తం 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 5,17,727 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా.. గతంలో తప్పిన వారు 10,512 మంది ఉన్నారు. ప్రైవేటు పాఠశాలల నుండి అత్యధికంగా 2,50,015 మంది, ప్రభుత్వ పాఠశాలల నుండి 2,07,573 మంది పరీక్షలు రాస్తున్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 1,582 ప్రభుత్వ పాఠశాలలు, 1,094 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి.

**నిఘా నీడలో పరీక్షలు**

విద్యార్థులు తమ పాఠశాల పేరు తెలియకుండా ఉండేలా సాధారణ దుస్తుల్లోనే పరీక్షకు రావాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ కోరారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 144 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు తెలిపారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతాయి. ఇప్పటికే హాల్ టిక్కెట్లు అన్ని పాఠశాలలకు పంపించామని, పరీక్షలు సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన వివరించారు.

**విద్యార్థులకు నిపుణుల సలహాలు**

పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏకాగ్రతతో, సరైన ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని చెబుతున్నారు. సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని.. సందేహాలు ఉంటే ఉపాధ్యాయులు లేదా స్నేహితులను అడిగి నివృత్తి చేసుకోవాలని కోరారు. ఇంట్లో పిల్లలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించి, వారికి తగినంత నిద్ర, పౌష్టికాహారం అందేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో రెండు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు భయం పోగొట్టామని అధికారులు వెల్లడించారు.

# తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్

- అధికారులకు నోటీసు ఇచ్చిన జేఏసీ
- సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు: కార్మిక సంఘాల హెచ్చరిక
- 30 శాతం ఫిట్‌మెంట్ తో పాటు బకాయిలు చెల్లించాలని డిమాండ్



**హైదరాబాద్, మార్చి 13 (మనసులో మాట):**

తెలంగాణ ఆర్టీసీలో మళ్ళీ సమ్మె సెగ మొదలైంది. టీజీఎస్ ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు శుక్రవారం నాడు సమ్మె నోటీసులు అందజేశారు. బస్ భవన్ లోని ఉన్నతాధికారులతో పాటు లేబర్ కమిషనర్ కార్యాలయంలో ఈ నోటీసులు ఇచ్చారు. తమ డిమాండ్ల మీద ప్రభుత్వం స్పందించకపోతే 14 రోజుల తర్వాత సమ్మె తేదీని ప్రకటిస్తామని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. పరిష్కారం లభించకపోతే పోరాటం ఖాయమని వారు తేల్చి చెప్పారు.

**ఉద్యోగుల విలీనం.. వేతన సవరణపై పట్టు**

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో కలిపే ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని నేతలు డిమాండ్ చేస్తున్నారు. 2021 వేతన సవరణకు సంబంధించి 30 శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలని కోరుతున్నారు. మహాలక్ష్మి పథకం కోసం ప్రతి నెలా 350 కోట్ల రూపాయలు ఎలాంటి కోత లేకుండా విడుదల చేయాలని అధికారులకు విన్నవించారు. గతంలో ఉన్న 2,500 కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

**యూనియన్ ఎన్నికలు.. పనిభారం తగ్గింపు**

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని నేతలు కోరారు. ట్రేడ్ యూనియన్ల మీద ఉన్న ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అన్ని విభాగాల్లో పనిచేసే సిబ్బంది మీద పనిభారం విపరీతంగా పెరిగిపోయిందని.. దానిని తగ్గించి ఉద్యోగుల హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

# గ్యాస్ సరఫరాకు ఆటంకం ఉండదు

- అత్యవసర సేవల కోసం ప్రత్యేక కమిటీలు.. కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ఇంధన, గ్యాస్ కొరతపై మంత్రి ఉత్తమ్ కీలక సమీక్ష



**హైదరాబాద్, మార్చి 13 (మనసులో మాట):**

దేశవ్యాప్తంగా నెలకొన్న ఇంధన, గ్యాస్ సరఫరా ఇబ్బందులపై తెలంగాణ ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగింది. అత్యవసర సేవలకు ఎటువంటి ఆటంకం లేకుండా గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరా అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని గుర్తు చేస్తూ.. ప్రస్తుత పరిస్థితులపై ఆయన అధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. మార్కెట్‌లో కొంత మేర గ్యాస్ కొరత ఉందని కేంద్రమే ప్రకటించిన నేపథ్యంలో.. రాష్ట్రాలకు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పక్కాగా ముందుకెళ్తున్నట్లు మంత్రి తెలిపారు.

**ప్రత్యేక కమిటీల పర్యవేక్షణ**

గ్యాస్ ఉత్పత్తిని పెంచామని కేంద్రం తెలిపిందని.. ఈ క్రమంలో ఆయిల్ కంపెనీలతో సమన్వయం కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసిందని మంత్రి వివరించారు. రాష్ట్రానికి 1740 కిలో లీటర్ల కిరోసిన్ సరఫరా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో సివిల్ సప్లై కమిషనర్, పోలీస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రతి జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, వైద్యాధికారులు, కంపెనీ ప్రతినిధులతో కూడిన కమిటీలు నిరంతరం సరఫరాను పర్యవేక్షిస్తాయని స్పష్టం చేశారు.

**హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్**

సరఫరాలో ఎలాంటి అవాంతరాలు కలగకుండా చూసేందుకు హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హోటల్, రెస్టారెంట్ యజమానుల విజ్ఞప్తిపై కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. తమను కూడా అత్యవసర సేవల కింద గుర్తించి సిలిండర్లు సరఫరా చేయాలని వారు కోరగా.. ఆ విషయాన్ని పరిశీలిస్తున్నట్లు మంత్రి హామీ ఇచ్చారు.

**ధైర్యంగా ఉండండి.. కొరత ఉండదు**

ప్రజలు గ్యాస్ కొరత గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. అత్యవసర సేవలకు గ్యాస్ కొరత లేకుండా చూసే పూర్తి బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన చెప్పారు. అక్రమాలకు తావు లేకుండా సరఫరా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కమిటీలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తాయని ఆయన వివరించారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతాం

**కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి**

**రంగారెడ్డి జిల్లా, మార్చి 13 (మనసులో మాట):**

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని వెల్లడించారు. జల్ పల్లి, ఫహాడిషరీఫ్, షహీన్ నగర్ వంటి ప్రాంతాలను హైదరాబాద్ నగరం తరహాలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు.



**సంక్షేమ పథకాలు ఇంటింటికీ..**

ఒక మీడియా ఇంటర్వ్యూలో కిచ్చెన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికే ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. వీటితో పాటు అర్హులైన ప్రతి పేదవాడికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, సన్న బియ్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని కాపాడుకుంటామని పేర్కొన్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని ఆయన కోరారు. స్థానిక సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని చెప్పారు. పాత జల్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ పనులను వేగవంతం చేసి ఆ ప్రాంత ముఖచిత్రాన్ని మారుస్తామని వివరించారు.

# నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు ప్రయాణికుల మృతి
- ఇందల్వాయి గన్నారం వద్ద బోల్తా పడిన టూరిస్ట్ బస్సు
- నిద్రమత్తులో డ్రైవర్.. 36 మంది ప్రయాణికులతో వెళ్తుండగా విషాదం



**నిజామాబాద్, మార్చి 13 (మనసులో మాట):**

నిజామాబాద్ జిల్లాలో అర్ధరాత్రి వేళ పెను ప్రమాదం సంభవించింది. ఇందల్వాయి మండలం గన్నారం శివారులోని బ్రహ్మంగారి గుడి దగ్గర 44వ జాతీయ రహదారిపై ఒక టూరిస్ట్ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. బస్సు హైదరాబాద్ నుండి నాగ్‌పూర్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

**డ్రైవర్ నిద్రమత్తు వల్లే ప్రమాదం..**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు అతివేగంగా వెళ్తుండగా డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో ఈ ఘోరం జరిగిందని ప్రాథమికంగా భావిస్తున్నారు. బస్సు ఒక్కసారిగా బోల్తా పడటంతో లోపల ఉన్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గాయపడిన వారి కేకలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

**సహాయక చర్యలు.. ఆసుపత్రికి తరలింపు**

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. పోలీసులు, సహాయక బృందాలు గంటల తరబడి శ్రమించి బస్సులో ఇరుక్కుపోయిన వారిని వెలికి తీశారు. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే దగ్గరలోని ఆసుపత్రులకు తరలించారు. కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆసుపత్రులకు పంపారు. ప్రస్తుతం వైద్యులు బాధితులకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు.

**ట్రాఫిక్ పునరుద్ధరణ.. కేసు నమోదు**

ఈ ప్రమాదం వల్ల జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు కొంతసేపు అంతరాయం కలిగింది. పోలీసులు క్రేన్ సహాయంతో బస్సును పక్కకు తొలగించి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. మృతుల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందా లేక ఏదైనా సాంకేతిక లోపం ఉందా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# గ్యాస్ కష్టాలు.. హోటళ్ల మూత

- పెరిగిన సిలిండర్ల బుకింగ్‌లు
- యుద్ధ ప్రభావంతో పెరిగిన ఇంధన కొరత.. ఆందోళనలో ప్రజలు
- సిలిండర్ బుకింగ్‌లపై కొత్త ఆంక్షలు విధించిన కంపెనీలు



**నిజామాబాద్, మార్చి 13 (మనసులో మాట):**

ప్రపంచ యుద్ధ పరిస్థితుల ప్రభావం ఉమ్మడి జిల్లాలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ సరఫరాపై పడుతోంది. మార్కెట్ లో కమర్షియల్ సిలిండర్ల కొరత రోజురోజుకూ తీవ్రమౌతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే హోటళ్లు మూసివేయక తప్పదని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిమాండ్ కు తగ్గట్టుగా సరఫరా లేకపోవడంతో ఇప్పటికే పలు హోటళ్లు మూతపడ్డాయి. దీనివల్ల వందలాది మంది కార్మికులు తమ ఉపాధిని కోల్పోయి రోడ్డున పడుతున్నారు.

## ముందు జాగ్రత్తగా బుకింగ్‌ల జోరు

గ్యాస్ కొరత వస్తుందనే భయంతో వినియోగదారులు సిలిండర్లు ఖాళీ కాకముందే బుక్ చేసుకునేందుకు పోటీ పడుతున్నారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే రోజుకు 25 వేలకు పైగా బుకింగ్స్ అవుతున్నట్లు ఏజెన్సీలు చెబుతున్నాయి. రద్దీని తగ్గించేందుకు గ్యాస్ కంపెనీలు కొత్త నిబంధనలు తెచ్చాయి. ఒక సిలిండర్ కనెక్షన్ ఉన్నవారు 21 రోజుల తర్వాతే బుక్ చేసుకోవాలని, రెండు సిలిండర్లు ఉన్నవారు 30 రోజుల తర్వాతే బుక్ చేయాలని ఆంక్షలు పెట్టారు. ఈ నిర్ణయం పెద్ద కుటుంబాలకు తీరని ఇబ్బందిగా మారింది.

## ధరల భారం.. ఏజెన్సీల అక్రమ వసూళ్లు

వారం క్రితం 928.50 రూపాయలుగా ఉన్న గ్యాస్ ధర ఇప్పుడు ఏకంగా 988 రూపాయలకు చేరింది. ఇంటికి సిలిండర్ అందాలంటే వెయ్యి రూపాయలకు పైగానే ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇదే అదనుగా భావిస్తున్న కొన్ని ఏజెన్సీలు కొరత పేరుతో అదనంగా 50 నుండి 100 రూపాయల వరకు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఆన్ లైన్ పేమెంట్స్ తీసుకోకుండా కేవలం నగదు మాత్రమే అడుగుతుండటం అనుమానాలకు తావిస్తోంది. అదనపు డబ్బులు ఇస్తేనే సిలిండర్ పంపిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

## మళ్ళీ కట్టెల పొయ్యి కాలం

గ్యాస్ దొరకకపోవడంతో చాలామంది గృహస్థులు, హోటల్ నిర్వాహకులు కట్టెల పొయ్యిని ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో విందు భోజనాల వంటల కోసం కట్టెల వాడకం భారీగా పెరిగింది. డిమాండ్ పెరగడంతో కట్టెల ధరలకు కూడా రెక్కలు వచ్చాయి. అటు పరిశ్రమల్లో కూడా డీజిల్ కొరత సెగలు పుట్టిస్తోంది. పరిస్థితి ఇలాగే ఉంటే మరో వారం రోజుల్లో వాహనాల రాకపోకలపై కూడా ఈ ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మెట్‌పల్లిలో నగల షాపులో దొంగతనం.. 30 గ్రాముల బంగారం చోరీ

**తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడిన దుండగులు**

**లాకర్ పగులగొట్టలేక వెనుదిరిగిన దొంగలు**



**జగిత్యాల, మార్చి 13 (మనసులో మాట):**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో దొంగలు బరితెగించారు. రాత్రి వేళల్లో గస్తీ లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఒక ఆభరణాల షాపులో చోరీకి పాల్పడ్డారు. పట్టణ కేంద్రంలోని నగల దుకాణం తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు బీభత్సం సృష్టించారు. ఉదయం షాపు యజమాని వచ్చి చూసేసరికి తాళాలు విరిగి ఉండటంతో విషయాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. షాపులోకి చొరబడిన దొంగలు అక్కడ ఉన్న సుమారు 30 గ్రాముల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత షాపులోని ప్రధాన లాకర్‌ను తెరిచేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే లాకర్ రాకపోవడంతో దొంగల ప్రయత్నం విఫలమైంది. ఒకవేళ లాకర్ తెరిచి ఉంటే భారీ మొత్తంలో ఆభరణాలు చోరీకి గురయ్యేవని, ఆ ప్రమాదం తప్పిందని యజమాని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు. ఇటీవల కాలంలో మెట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లు, షాపులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో గస్తీని మరింత పెంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. పాత నేరస్థుల వివరాలను సేకరిస్తున్నామని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని పోలీసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# జేఈఈ దరఖాస్తుదారులకు మరో లక్కీ ఛాన్స్

**రిజిస్ట్రేషన్ కోసం గవాక్షాన్ని తెరిచిన అధికారులు**

**నేటి రాత్రి 9 గంటల వరకు దరఖాస్తుకు ఆఖరి గడువు**

**హైదరాబాద్, మార్చి 13 (మనసులో మాట):**

జేఈఈ మెయిన్ సెషన్ 2 పరీక్షలకు దరఖాస్తు చేయాలనుకునే వారికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఒక శుభవార్త చెప్పింది. దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం ఇస్తున్నట్లు తాజాగా వెల్లడించింది. చాలా మంది విద్యార్థుల నుండి వచ్చిన విన్నపాలను దృష్టిలో ఉంచుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియను మళ్ళీ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ఈ వెసులుబాటు ద్వారా ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఈ ప్రత్యేక అవకాశం నిన్నటి నుండి అందుబాటులోకి వచ్చింది. ఆసక్తి గల విద్యార్థులు శుక్రవారం రాత్రి 9 గంటల లోపు తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే దరఖాస్తులు పంపిన వారికి అందులో మార్పులు చేసుకునేందుకు (కరెక్షన్) ఈసారి అవకాశం లేదని అధికారులు ఖచ్చితంగా చెప్పారు. విద్యార్థులు దరఖాస్తు చేసేటప్పుడే తమ వివరాలన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలని సూచించారు. జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఏప్రిల్ 2 నుండి ప్రారంభమై 9 వరకు జరుగుతాయి. అర్హులైన విద్యార్థులు సకాలంలో దరఖాస్తు ప్రక్రియను ముగించి పరీక్షకు సిద్ధం కావాలని అధికారులు కోరారు. చివరి నిమిషంలో సర్వర్ ఇబ్బందులు రాకుండా వీలైనంత త్వరగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ అదనపు అవకాశం వల్ల దరఖాస్తు చేసుకోలేకపోయిన వేలాది మంది విద్యార్థులకు పెద్ద ఊరట లభించనుంది.

# మావోయిస్టు అగ్రనేత సభకు వెళ్లిన వారికి ఎన్ఐఏ షాక్

**230 మందికి నోటీసులు.. ఉమ్మడి జిల్లాల్లో కలకలం**

**పాత సంబంధాల పేరుతో విచారణకు రంగం సిద్ధం**

**కరీంనగర్, మార్చి 13 (మనసులో మాట):**

ఇటీవల మావోయిస్టు అగ్రనేత రామచంద్రారెడ్డి (వికల్ప్) అంత్యక్రియలు, సంస్మరణ సభకు హాజరైన వారిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తన దృష్టి సారించింది. ఈ క్రమంలో సుమారు 230 మందికి ఒకేసారి నోటీసులు జారీ చేయడం ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో పెద్ద చర్చకు దారితీసింది. దశాబ్దాల క్రితమే ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిసిపోయిన మాజీ మావోయిస్టులకు ఇప్పుడు నోటీసులు రావడం కలకలం రేపుతోంది.

## కోహెడ సభపై నిఘా

గతేడాది అక్టోబరు 18న హుజూరాబాద్ నియోజకవర్గంలోని కోహెడలో మావోయిస్టు అగ్రనేతలు రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణ రెడ్డిల జ్ఞాపకార్థం 'నారాయణపూర్ అమరుల సంస్మరణ సభ' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుండి మాజీ మావోయిస్టులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సభలో పాల్గొన్న వారు నిషేధిత సంస్థల భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారా అనే కోణంలో లోతైన విచారణ చేపట్టడానికి ఎన్ఐఏ సిద్ధమైంది.

## ప్రముఖుల హాజరుతో ఆరా

ఈ సంస్మరణ సభలో జస్టిస్ చంద్రకుమార్, సోనీ సోరి, పినాకపాణి వంటి ప్రముఖులు పాల్గొనడం దర్యాప్తు సంస్థల దృష్టిని ఆకర్షించింది. సభలో కొందరు నాయకులు ప్రభుత్వ వ్యతిరేక, వివాదాస్పద వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా గాదె ఇన్నయ్య వంటి వారిపై ఇప్పటికే దేశద్రోహం కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో సభకు వచ్చిన వారందరి వివరాలను సేకరించిన అధికారులు.. నిషేధిత సంస్థలతో సంబంధాల గురించి ఆరా తీస్తున్నారు.

## ఆందోళనలో మాజీల కుటుంబాలు

నోటీసులు అందుకున్న వారిలో మెజారిటీ వ్యక్తులు హుజూరాబాద్, సైదాపూర్, భీమదేవరపల్లి, ముల్కనూరు, కమలాపూర్, పరకాల వంటి ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు. ఎప్పుడో పాత జీవితాన్ని వదిలేసి ఇప్పుడు ప్రశాంతంగా బతుకుతున్న తమకు.. మళ్ళీ పాత సంబంధాల పేరుతో నోటీసులు రావడంపై మాజీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల విచారణ పేరుతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారి కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు.

# నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో సర్వం సిద్ధం
- 37 వేల మంది విద్యార్థుల భవిష్యత్తుకు తొలి మెట్టు
- ఒక్కో పరీక్షకు 3 నుంచి 5 రోజుల గడువు.. కొత్త విధానం అమలు
- సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని అధికారుల సూచన



**నిజామాబాద్, మార్చి 13 (మనసులో మాట):**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నుండి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యార్థుల భవిష్యత్తుకు అత్యంత కీలకమైన ఈ పరీక్షలు శనివారం మొదలై ఏప్రిల్ 13 వరకు కొనసాగుతాయి. ప్రతిరోజూ ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 37 వేల మంది విద్యార్థులు ఈసారి పరీక్షలకు హాజరు కానున్నారు. నిజామాబాద్ జిల్లాలో 12,244 మంది బాలురు, 12,155 మంది బాలికలు పరీక్ష రాయనుండగా.. కామారెడ్డి జిల్లాలో 6,451 మంది బాలురు, 6,703 మంది బాలికలు కలిపి మొత్తం 13,154 మంది విద్యార్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

## పరీక్షల షెడ్యూల్ - కొత్త మార్పులు

ఈ ఏడాది పరీక్షల నిర్వహణలో అధికారులు కీలక మార్పులు చేశారు. గతంలో వరుసగా జరిగే పరీక్షల మధ్య ఈసారి విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా 3 నుండి 5 రోజుల వరకు గడువు ఇచ్చారు. మార్చి 14న మొదటి భాష, 18న రెండో భాష, 23న ఇంగ్లిష్, 28న గణితం పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 2న భౌతిక శాస్త్రం, 7న జీవశాస్త్రం, 13న సాంఘిక శాస్త్రం పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే 15, 16 తేదీల్లో ఒకేషనల్ కోర్సుల పరీక్షలు ఉంటాయి. ఈ విరామ సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలని అధికారులు కోరుతున్నారు.

## నిఘా నీడలో కేంద్రాలు.. సహాయం కోసం కంట్రోల్ రూమ్

పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు వెల్లడించారు. విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ఫిర్యాదు చేసేందుకు 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్ నంబర్లను ఏర్పాటు చేశారు. కామారెడ్డి జిల్లా వారు 99596 70118 నంబర్ కు, నిజామాబాద్ జిల్లా వారు 90302 82993 నంబర్ కు ఫోన్ చేయవచ్చు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వెలుతురు వంటి కనీస వసతులు ఉండేలా చర్యలు తీసుకున్నారు.

## మునుపటి వైభవం కోసం అధికారుల కసరత్తు

గతంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉత్తీర్ణతలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండేది. అయితే గడిచిన రెండేళ్లుగా ఫలితాల్లో వెనుకబడటంపై విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా కామారెడ్డి జిల్లా ఫలితాలు దారుణంగా ఉండటంతో ఈసారి ఎలాగైనా మంచి ర్యాంకులు సాధించాలని యంత్రాంగం పట్టుదలతో ఉంది. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, నిర్ణీత సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు కూడా నిర్వహించామని డీఈఓ పేర్కొన్నారు.

# చందానగర్ ఫర్నీచర్ షాపులో భారీ అగ్నిప్రమాదం.. ఐదు అంతస్తులు దగ్ధం

**7 ఫైర్ ఇంజన్లు, 11 వాటర్ ట్యాంకర్లతో మంటల అదుపు**

**కాలి బూడిదైన సోఫాలు, మంచాలు.. కోట్లలో ఆస్తి నష్టం**

**హైదరాబాద్, మార్చి 13 (మనసులో మాట):**



నగరంలోని చందానగర్ ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి దాటాక ఒక ఫర్నీచర్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దుకాణానికి చెందిన 5 అంతస్తుల్లో ఉన్న ఫర్నీచర్ అంతా కాలి బూడిదైంది. మంటలు ఒక్కసారిగా ఎగసిపడటంతో స్థానికులు భయంతో వణికిపోయారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. లోపల పరుపులు, సోఫాలు, ఇతర చెక్క సామాగ్రి ఉండటంతో మంటలు చాలా వేగంగా భవనం అంతటా విస్తరించాయి.

## సిబ్బంది పోరాటం.. మంటల అదుపు

సమాచారం అందిన వెంటనే 7 ఫైర్ ఇంజన్లు, 11 వాటర్ ట్యాంకర్లతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఐదు అంతస్తుల భవనం కావడంతో మంటలను అదుపులోకి తీసుకురావడం సిబ్బందికి పెద్ద సవాలుగా మారింది. సుమారు గంటల తరబడి శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణాపాయం కలగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆస్తి నష్టం మాత్రం చాలా భారీగా ఉంటుందని, కోట్లాది రూపాయల విలువైన సామాగ్రి కాలిపోయిందని యజమాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## షార్ట్ సర్క్యూటే కారణమా?

అగ్నిప్రమాదానికి అసలు కారణం ఏంటనేది ఇంకా తెలియాల్సి ఉంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. లేదంటే గ్యాస్ లీకేజీ లాంటి ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక అధికారులు కలిసి ఘటన స్థలంలో ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ ప్రమాదం వల్ల చందానగర్ పరిసర ప్రాంతాల్లో కొంత సమయం విద్యుత్ సేవలకు ఆటంకం కలిగింది. అధికారులు కేసు నమోదు చేసి పూర్తి వివరాల కోసం విచారణ జరుపుతున్నారు.

# 84 కోట్ల జీఎస్టీ కుంభకోణం.. నిందితుడు అరెస్ట్

**నకిలీ బిల్లులతో ప్రభుత్వానికి భారీ టోకరా**




**హైదరాబాద్, మార్చి 13 (మనసులో మాట):**

తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ 84.15 కోట్ల రూపాయల భారీ జీఎస్టీ మోసాన్ని బయటపెట్టింది. నకిలీ బిల్లుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు గండికొట్టిన ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ యజమాని సందీప్‌ను అధికారులు అరెస్ట్ చేశారు. ఎటువంటి వ్యాపారం చేయకుండానే తప్పుడు ఇన్వాయిస్‌లు సృష్టించి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు అధికారులు గుర్తించారు.

## నిందితుడికి రిమాండ్

ఈ అక్రమాలకు సహకరించిన ఇతర సంస్థల రిజిస్ట్రేషన్లను కూడా అధికారులు రద్దు చేశారు. పన్ను ఎగవేతపై లోతైన విచారణ జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం నిందితుడు సందీప్‌కు న్యాయస్థానం జ్యుడిషియల్ రిమాండ్ విధించింది.

# మూసీ ప్రక్షాళనను ఎప్పుడూ వ్యతిరేకించలేదు

- ఇళ్ల కూల్చివేతలపైనే మా అభ్యంతరం
- పేదల జీవితాలతో చెలగాటం ఆడితే ఊరుకోం: రామచందర్ రావు
- సబర్మతి అభివృద్ధిని చూసి నేర్చుకోండి.. ముందు పునరావాసం కల్పించండి
- దేశంలో ఇంధన కొరత లేదు.. ప్రజల్లో భయం వద్దు



హైదరాబాద్, మార్చి 13 (మనసులో మాట):

మూసీ ప్రాజెక్టును బిజెపి ఎప్పుడూ వ్యతిరేకించలేదని, కేవలం పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రమే తాము అడ్డుకుంటున్నామని తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన విమర్శలకు ఆయన ధీటుగా బదులిచ్చారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుండి కృష్ణా నదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని, ఆ నీరు రైతులకు మేలు చేసేలా ఉండాలని తమ పార్టీ కోరుకుంటోందని తెలిపారు. ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదని హితవు పలికారు.

## ఇళ్లను కూల్చకుండానే శుద్ధి చేయవచ్చు

మూసీ ప్రక్షాళనకు బిజెపి మొదటి నుండి అనుకూలమేనని రామచందర్ రావు గుర్తు చేశారు. అయితే 'గాంధీ సరోవరం' పేరుతో మధుబన్ పార్క్, విష్ణుశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో ఏళ్ల తరబడి నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం అన్యాయమని మండిపడ్డారు. చట్టబద్ధంగా నిర్మించుకున్న ఇళ్లను దెబ్బతీయకుండానే నదిని శుభ్రం చేసే మార్గాలు ఉన్నాయని సూచించారు. గాంధీ విగ్రహాన్ని వెయ్యి అడుగులైనా, రెండు వేల అడుగులైనా ఆకాశాన్ని తాకేలా నిర్మించుకోవచ్చని, దానికి తమకు అభ్యంతరం లేదని.. కానీ పేదల గూడు చెడగొడితే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు.

## మోదీ పాలనలో సబర్మతి అభివృద్ధిని చూడండి

సబర్మతి నదిని ఉదాహరణగా చూపే కాంగ్రెస్ నేతలు, గుజరాత్ లో ఆ ప్రాజెక్టు ఎలా చేపట్టారో తెలుసుకోవాలని రామచందర్ రావు సూచించారు. ఒకప్పుడు సబర్మతి కూడా మూసీలాగే కాలుష్యంతో ఉండేదని, నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నదుల అనుసంధానం ద్వారా దానిని శుభ్రపరిచారని చెప్పారు. అక్కడ అభివృద్ధి పనుల కంటే ముందే సుమారు 4 వేల కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఇళ్లు ఇచ్చి, వారిని సురక్షితంగా తరలించిన తర్వాతే ప్రాజెక్టు మొదలుపెట్టారని గుర్తు చేశారు. ప్రజల జీవితాలు దెబ్బతినకుండా చేసేదే నిజమైన అభివృద్ధి అని ఆయన పేర్కొన్నారు.

## ఇంధన కొరతపై అబద్ధాలు ప్రచారం చేయకండి

దేశంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత వస్తుందంటూ రాహుల్ గాంధీ వంటి నేతలు ప్రజలను భయపెట్టడం బాధ్యతారాహిత్యమని రామచందర్ రావు విమర్శించారు. ప్రపంచంలో యుద్ధ పరిస్థితులు ఉన్నప్పటికీ, దేశానికి చమురు సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జై శంకర్ అన్ని చర్యలు తీసుకున్నారని తెలిపారు. భారతదేశం కేవలం ఒక ప్రాంతం పైనే ఆధారపడకుండా విదేశాల నుండి ముడి చమురు దిగుమతి చేసుకుంటోందని వివరించారు. దేశంలో సరిపడినంత నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. నాయకులు ప్రజల్లో ధైర్యం నింపాలి తప్ప భయాందోళనలు కలిగించకూడదని ఆయన హితవు పలికారు.

# ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత

### అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన 1965 బ్యాచ్ అధికారి

హైదరాబాద్, మార్చి 13 (మనసులో మాట):



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్. జె. దొర శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 83 ఏళ్లు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుని ఇంటికి వెళ్లారు. అయితే ఇంట్లో బాత్‌రూమ్‌లో ఒక్కసారిగా పడిపోవడంతో కుటుంబ సభ్యులు మళ్ళీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆయన మృతి పట్ల పోలీస్ విభాగం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

## పోలీస్ శాఖలో సుదీర్ఘ ప్రస్థానం

దొర 1965 బ్యాచ్ కు చెందిన ఐపీఎస్ అధికారి. 1996 నుండి 2002 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డీజీపీగా ఎంతో సమర్థవంతంగా పనిచేశారు. ఆ సమయంలో రాష్ట్రంలో నక్సలైట్ల ప్రాబల్యాన్ని తగ్గించడంలో ఆయనది కీలక పాత్ర. ఉమ్మడి రాష్ట్రంలో అడిషనల్ డీజీపీగా బాధ్యతలు నిర్వహించి పోలీస్ వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తెచ్చారు. 2002లో ఢిల్లీకి వెళ్లి సీఐఎస్ఎఫ్ డీజీగా పనిచేశారు. ఆ తర్వాత విజిలెన్స్ కమిషనర్‌గా కూడా సేవలందించి అవినీతి రహిత పాలనకు కృషి చేశారు.

## శ్రీకాకుళం నుండి ఢిల్లీ వరకు..

1943లో శ్రీకాకుళం జిల్లాలో జన్మించిన దొర, సుమారు 40 ఏళ్ల పాటు పోలీస్ విభాగంలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రతిష్టాత్మక పోలీస్ మెడల్ అందుకున్నారు. 1993లో పీపుల్స్ వార్ గ్రూపు టార్గెట్ చేసిన అధికారుల జాబితాలో ఆయన పేరు ఉన్నప్పటికీ.. ఏమాత్రం వెనకడుగు వేయకుండా నిబద్ధతతో విధులు నిర్వహించారు. నిక్కచ్చిగా వ్యవహరించే అధికారిగా ఆయనకు పోలీస్ శాఖలో మంచి పేరుంది.

# పోలీస్ స్టేషన్లలో గ్రంథాలయాలు.. ప్రారంభించిన ఎస్పీ

- విపంచి ఫౌండేషన్ వినూత్న ఆలోచన.. 20 స్టేషన్లలో లైబ్రరీల ఏర్పాటు
- పుస్తక పఠనంతోనే మనిషిలో నిజమైన మార్పు



నల్లగొండ, మార్చి 13 (మనసులో మాట):

నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ, విపంచి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'స్టార్ట్ లైబ్రరీ - సేవ్ లైబ్రరీ' అనే నినాదంతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లా ఎస్పీ కార్యాలయంతో పాటు నల్లగొండ సబ్ డివిజన్ పరిధిలోని 20 పోలీస్ స్టేషన్లలో గ్రంథాలయాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జి. రమేష్, డీఎస్పీ శివరాం రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ గాదె వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్లకు బదులు పుస్తక పఠనం

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుతం చాలామంది ఖాళీ సమయం దొరికితే మొబైల్ ఫోన్లలో మునిగిపోతున్నారని, వారికి పుస్తక పఠనం ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. చదువు వల్ల జ్ఞానం పెరగడమే కాకుండా సమాజ అభివృద్ధికి తోడ్పడుతుందని చెప్పారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా ఉండాలంటే ఇలాంటి గ్రంథాలయాలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. విద్య ద్వారానే మనిషిలో నిజమైన పరివర్తన వస్తుందని వెల్లడించారు.

## అర్జీదారులు, సిబ్బందికి ఉపయోగకరం

పోలీస్ స్టేషన్లకు వచ్చే అర్జీదారులు తమ సమస్యల పరిష్కారం కోసం వేచి ఉన్న సమయంలో ఈ పుస్తకాలను చదవవచ్చని నిర్వాహకులు తెలిపారు. సైబర్ నేరాల పట్ల అవగాహన, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు, గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు వంటి ఎన్నో అంశాలపై పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా అంబేడ్కర్, గాంధీ, స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం జీవిత చరిత్రలతో పాటు భారత రాజ్యాంగం, వ్యక్తిత్వ వికాసం, నీతి కథల పుస్తకాలు ఇక్కడ ఉన్నాయి.

## విపంచి ఫౌండేషన్ సభ్యులకు అభినందనలు

పోలీస్ స్టేషన్లలో లైబ్రరీలను ఏర్పాటు చేసిన విపంచి ఫౌండేషన్ సభ్యులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు అనుముల శ్రీనివాస్, అందోజు నాగభూషణం, గడ్డం సత్యనారాయణ, బావన ఋషి, నడిగోటి శ్రీనివాస్, పోలోజు వెంకటాచారి పాల్గొన్నారు. సిబ్బంది, ప్రజల్లో చదివే అలవాటు పెంచడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు.

# పదో తరగతి విద్యార్థులకు గవర్నర్ శుభాకాంక్షలు

### పరీక్షలను జ్ఞానాన్ని ప్రదర్శించే అవకాశంగా భావించాలి

### ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పిలుపు

హైదరాబాద్, మార్చి 13 (మనసులో మాట):

తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



పరీక్షలను ఒక భారంగా లేదా ఒత్తిడిగా భావించవద్దని ఆయన కోరారు. వీటిని తమ జ్ఞానాన్ని, ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పే ఒక మంచి అవకాశంగా చూడాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా, సానుకూల దృక్పథంతో పరీక్షా కేంద్రాలకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎంతో ప్రశాంతంగా ఉండాలని గవర్నర్ పేర్కొన్నారు. సమయాన్ని సరిగ్గా వాడుకుంటూ తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరచాలని హితవు పలికారు. మనిషి విజయానికి ఆత్మవిశ్వాసం అనేది చాలా ముఖ్యమని, దానిని కోల్పోకుండా పరీక్షలు రాయాలని చెప్పారు. విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవడానికి ఈ పరీక్షలు ఒక పునాది లాంటివని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలుస్తూ వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. పిల్లల్లో ధైర్యాన్ని నింపుతూ వారిని పరీక్షలకు సిద్ధం చేయడంలో వీరి కృషి ఎంతో ఉందని కొనియాడారు. పరీక్షలకు హాజరవుతున్న ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవాలని గవర్నర్ ఆకాంక్షించారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కళ్లెం నవజీవన్ రెడ్డి




ఎల్బీనగర్, మార్చి 13 (మనసులో మాట):

హయత్ నగర్‌లోని జీ స్కూల్‌లో అరోరా లీగల్ సైన్స్ ఇన్‌స్టిట్యూషన్ ఆధ్వర్యంలో జరిగిన చట్టపరమైన అవగాహన కార్యక్రమంలో హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తో పాటు ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొనాలంటే యువత చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

## డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు తమకు ఉన్న చట్టపరమైన రక్షణల గురించి తెలుసుకోవడం ద్వారా సమాజంలో ధైర్యంగా ముందుకు సాగగలరని నవజీవన్ రెడ్డి తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల వ్యక్తిగత జీవితాలే కాకుండా కుటుంబాలు, సమాజం కూడా చితికిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, మంచి విలువలు, చట్టాల పట్ల అవగాహన ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజల్లో చైతన్యం నింపేలా ఈ కార్యక్రమం నిర్వహించినందుకు అరోరా లీగల్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అరోరా కాలేజీ ప్రిన్సిపాల్ యాదగిరి, హైకోర్టు రిజిస్ట్రార్ మంజుల, జీ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణ దేవి శ్రీవాస్తవ్ పాల్గొన్నారు. అలాగే డైరెక్టర్లు డాక్టర్ సామ సురేందర్ రెడ్డి, డాక్టర్ అనంతరెడ్డి, డాక్టర్ నాగేంద్ర బాబు, పాఠశాల సిబ్బంది హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చట్టాలపై అవగాహన కల్పించడం సమాజ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు.



# నిస్వార్థ నాయకుడు కొండిగారి రాములు ఇక లేరు

- రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా నిరుపేదగానే సామాన్య జీవితం
- ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మృతి పట్ల సిపిఐ నేతల నివాళి

రంగారెడ్డి జిల్లా, మార్చి 13 (మనసులో మాట):

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుండి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ఎలాంటి స్వార్థం లేకుండా నిస్వార్థంగా జీవించిన గొప్ప వ్యక్తి కామ్రేడ్ కొండిగారి రాములు అని సిపిఐ రాష్ట్ర నేతలు ఆందోజు రవీంద్ర చారీ, ముత్యాల యాదిరెడ్డి కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే రాములు శుక్రవారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో రావి నారాయణ రెడ్డి కాలనీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ఎమ్మెల్యే అయినా సామాన్యుడిలాగే..

చిన్నప్పటి నుండే కమ్యూనిస్టు భావాలు కలిగిన రాములు, పదవుల కోసం ఎప్పుడూ ఆశపడలేదని రవీంద్ర చారీ గుర్తు చేసుకున్నారు. సర్పంచ్ గా గెలిచిన వారే ఆస్తులు కూడబెట్టుకుంటున్న నేటి కాలంలో.. రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసి కూడా ఆయన ఎలాంటి ఆస్తులు సంపాదించలేదు. ఎమ్మెల్యే హోదాలో ఉండి కూడా బస్సుల్లో ప్రయాణం చేస్తూ, సైకిల్ తొక్కుతూ ప్రజల్లో తిరిగిన నిరుపేదల నాయకుడు రాములు అని పేర్కొన్నారు. తన నియోజకవర్గంలోని ఎన్నో తండాలకు రోడ్లు వేయించి, కరెంటు సౌకర్యం కల్పించిన ఘనత ఆయనదేనని తెలిపారు.

## కుల వివక్షపై రాజీలేని పోరాటం

వెనుకబడిన కులాలపై జరిగే దాడులను ఖండిస్తూ, కుల వివక్షకు వ్యతిరేకంగా రాములు పోరాటం చేశారని నేతలు తెలిపారు. బాల్యంలోనే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తనవంతు పాత్ర పోషించారని ముత్యాల యాదిరెడ్డి గుర్తు చేశారు. కోట్ల రూపాయల సంపాదనే లక్ష్యంగా పనిచేస్తున్న నేటి ప్రజా ప్రతినిధులు రాముల జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బ్రతికినంత కాలం ప్రజల కోసమే జీవించిన ఆయన మృతి పార్టీకి, నియోజకవర్గానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.

## కడసారి వీడ్కోలు పలికిన సిపిఐ శ్రేణులు

ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహా, సిపిఐ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ పాల్గొన్నారు. వీరితో పాటు ప్రసాద్, అరుణ, నవనీత, మధు, రాములు, గణేష్, యాదగిరి, నిరంజన్, గోపి, వీరేష్, శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు. నీలా, వీణ, కావేరి, రేణుక వంటి పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొని ఆయనకు జోహార్లు అర్పించారు. నేటి తరం యువత రాములు వంటి నాయకుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వక్తలు అభిప్రాయపడ్డారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# దట్నూర్ లో తీరిన విద్యుత్ కష్టాలు.. విజయవంతంగా 'ప్రజా బాట'

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో 5 లక్షల నిధుల మంజూరు**

**ఇళ్లపై నుండి వెళ్లే ప్రమాదకర తీగల తొలగింపుతో గ్రామస్తుల హర్షం**



**గొల్లపెల్లి, మార్చి 12 (మనసులో మాట):**

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వకోడూరు సెక్షన్ పరిధిలోని దట్నూర్ గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజా బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇళ్లపై నుండి వెళ్తున్న విద్యుత్ లైన్లను మార్చేందుకు ప్రభుత్వం 5 లక్షల రూపాయలను మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టిన పనులన్నీ ఇప్పుడు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ సమస్య పరిష్కారం కోసం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేకంగా సహకరించి నిధులు మంజూరు చేయించడంతో గ్రామ ప్రజలకు పెద్ద ఊరట లభించింది.

### ప్రమాదాల ముప్పు తప్పింది

గతంలో ఇళ్లపై నుండి విద్యుత్ తీగలు వెళ్లడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేసేవారు. ఇప్పుడు ఆ లైన్లను సురక్షిత ప్రాంతాలకు మార్చడం వల్ల ప్రమాదాల ముప్పు పూర్తిగా తప్పింది. దీనిపై గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి లక్ష్మణ్ కుమార్ తో పాటు విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ప్రజల భద్రతే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

### పనుల పర్యవేక్షణలో నాయకులు.. అధికారులు

ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ రాకేష్ కుమార్, సబ్ ఇంజనీర్ మహేష్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు. వీరితో పాటు సర్పంచ్ బెక్కం గంగయ్య, ఉపసర్పంచ్ జక్కుల తిరుపతి, వార్డు సభ్యులు కూడా హాజరై పనులను పర్యవేక్షించారు. ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే స్పందించిన ప్రభుత్వానికి గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు.

# బడ్జెట్‌లో చేనేతకు 4 వేల కోట్లు కేటాయించాలి

**మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి**

**ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేత**

**నిలిచిపోయిన త్రిఫ్ట్ నిధులు.. అమలుకు నోచుకోని భరోసా పథకం**



**హైదరాబాద్, మార్చి 13 (మనసులో మాట):**

రాబోయే రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు నేతృత్వంలో ఒక బృందం శుక్రవారం సచివాలయంలో ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసింది. చేనేత రంగానికి 2 వేల కోట్లు, పవర్ లూమ్ రంగానికి మరో 2 వేల కోట్లు కలిపి మొత్తం 4 వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.

### తొమ్మిది నెలలుగా ఆగిన త్రిఫ్ట్ నిధులు

చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఉద్దేశించిన త్రిఫ్ట్ పథకం నిధులు గత తొమ్మిది నెలలుగా విడుదల కావడం లేదని చెరుపల్లి సీతారాములు ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్మికులు తమ వంతు వాటాగా బ్యాంకుల్లో డబ్బులు జమ చేస్తున్నా.. ప్రభుత్వం మాత్రం తన వంతు నిధులను డిపాజిట్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల వేలాది మంది కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

### అమలుకు నోచుకోని చేనేత భరోసా

రెండేళ్ల క్రితం ప్రభుత్వం ప్రకటించిన 'చేనేత భరోసా' పథకం నేటికీ అమలు కావడం లేదని నేతలు విమర్శించారు. ఈ పథకం ప్రకారం చేనేత కార్మికుడికి నెలకు 2 వేల రూపాయలు, అనుబంధ కార్మికుడికి 500 రూపాయలు నేరుగా వారి ఖాతాల్లో వేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా అందలేదని మంత్రికి వివరించారు. అలాగే నేతన్న బీమా పథకం కింద చనిపోయిన కార్మికుల కుటుంబాలకు అందాల్సిన ఎక్స్ గ్రేషియా కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు.

### నిధుల కొరతతో కుంటుపడుతున్న పథకాలు

గత బడ్జెట్‌లో చేనేత రంగానికి కేవలం 200 కోట్లు మాత్రమే కేటాయించడం వల్లే ఈ సమస్యలన్నీ వచ్చాయని నేతలు అభిప్రాయపడ్డారు. నిధులు లేక హ్యాండ్ లూమ్ టెక్స్ టైల్ విభాగం పథకాలను సరిగ్గా అమలు చేయలేకపోతోందని అన్నారు. అందుకే 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో తప్పనిసరిగా 4 వేల కోట్లు కేటాయించి చేనేత రంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, కార్యదర్శి ముషం నరహరి, ఉపాధ్యక్షులు వర్కాల చంద్ర శేఖర్ పాల్గొన్నారు.





# మియాపూర్ పరిధిలోని చెరువులను ఆహ్లాదంగా తీర్చిదిద్దుతాం

**పెద్ద కుడి చెరువు పునరుద్ధరణ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్**

**మురుగు నీరు చేరకుండా ప్రత్యేక కాలువ.. వాకింగ్ ట్రాక్ నిర్మాణం**

**శేరిలింగంపల్లి, మార్చి 13 (మనసులో మాట):**

ఉమ్మడి మియాపూర్ డివిజన్ల పరిధిలోని చెరువులను ఎంతో అందంగా, ఆహ్లాదకరంగా మారుస్తామని మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ చెప్పారు. శుక్రవారం మక్త మహబూబ్ పేట్ డివిజన్ లోని పెద్ద కుడి చెరువు సుందరీకరణలో భాగంగా జరుగుతున్న పునరుద్ధరణ పనులను మల్లిగవాడ్ ఫౌండేషన్ సభ్యులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. పెద్ద కుడి చెరువు పునరుద్ధరణతో ఈ ప్రాంత ముఖచిత్రం మారుతుందని, చెరువులను స్వచ్ఛంగా ఉంచడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

చెరువు కట్ట చుట్టూ పెద్ద ఎత్తున చెట్లు పెంచి కాలనీల వాసులకు చక్కటి వాతావరణం కల్పిస్తామని శ్రీకాంత్ హామీ ఇచ్చారు. మురుగు నీరు చెరువులోకి కలవకుండా చుట్టూ ప్రత్యేక మురుగు నీటి కాలువ నిర్మాణం, అలుగు మరమ్మతులు, కట్ట బలోపేతం పనులు వేగంగా పూర్తి చేస్తామన్నారు. ప్రజల సౌకర్యం కోసం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతో పాటు చెరువు రక్షణ కోసం చుట్టూ కంచె నిర్మిస్తామని తెలిపారు. ఈ అభివృద్ధి పనులన్నీ త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మల్లిగవాడ్ ఫౌండేషన్ సభ్యులు రామ్, చైతన్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రైవేట్ మెడికల్ విద్యార్థులకు స్టైఫండ్ ఇవ్వాల్సిందే

- మంత్రి దామోదర రాజనర్సింహకు విద్యార్థి సంఘాల వినతి
- నిబంధనలు అతిక్రమిస్తున్న కళాశాలలపై చర్యలకు డిమాండ్



**హైదరాబాద్, మార్చి 13 (మనసులో మాట):**

రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో చదువుతున్న హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులకు వెంటనే స్టైఫండ్ చెల్లించాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను శుక్రవారం మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణలోని 27 ప్రైవేట్ మెడికల్ కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తక్షణమే కళాశాలల వివరాలు సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, విద్యార్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

### పెంచిన స్టైఫండ్ ఎగ్గొడుతున్న యాజమాన్యాలు

ప్రభుత్వం జూన్ 28, 2025న విడుదల చేసిన జీవో నంబర్ 90 ప్రకారం పెంచిన స్టైఫండ్ అందించడంలో ప్రైవేట్ యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని నేతలు మండిపడ్డారు. హౌస్ సర్జన్లకు 29,792 రూపాయలు, మొదటి సంవత్సరం పీజీ విద్యార్థులకు 67,032 రూపాయలు ఇవ్వాల్సి ఉండగా.. కొన్ని కళాశాలలు కేవలం 2,000 నుండి 5,000 రూపాయలు మాత్రమే ఇస్తూ రికార్డుల్లో మాత్రం ఎక్కువ మొత్తం ఇస్తున్నట్లు చూపిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రైవేట్ కళాశాలల్లో ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఏటీఎం కార్డులు, చెక్కులు లాక్కుంటూ వేధింపులు

నిబంధనల నుండి తప్పించుకోవడానికి విద్యార్థుల ఏటీఎం కార్డులు, బ్యాంకు పాస్ బుక్కులు, సంతకం చేసిన ఖాళీ చెక్కులను యాజమాన్యాలే తమ వద్ద ఉంచుకుంటున్నాయని.. ఇది చట్ట విరుద్ధమని నేతలు తెలిపారు. తమ హక్కుల గురించి అడిగితే ఇంటర్నల్ మార్కులు తగ్గించడం, హాజరు లేదని పరీక్షలకు కూర్చోనివ్వకపోవడం, అదనపు డ్యూటీలు వేయడం వంటి వేధింపులకు పాల్పడుతున్నారని వివరించారు. దీనిపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులైన యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

### ఖాతాల్లోనే నేరుగా నగదు జమ చేయాలి

స్టైఫండ్ నేరుగా విద్యార్థుల ఖాతాల్లో పడేలా బయోమెట్రిక్ హాజరును ప్రభుత్వ పోర్టల్ కు అనుసంధానించాలని నేతలు సూచించారు. అప్పులు చేసి చదువుకుంటున్న విద్యార్థుల శ్రమను దోచుకుంటున్న తీరును అరికట్టాలని కోరారు. అలాగే ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని, సొంత భవనాలు లేని చోట మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేత రజనీకాంత్, ఏఐఎస్ఎఫ్ నేత మణికంఠ రెడ్డి, డివైఎఫ్ఐ నేతలు కోట రమేష్, అనగంటి వెంకటేష్ తో పాటు పలువురు విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఒకేసారి మూడు అరుదైన శస్త్రచికిత్సలు విజయవంతం

**వైద్య బృందాన్ని అభినందించిన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్**



**పెద్దపల్లి, మార్చి 13 (మనసులో మాట):**

పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి నిపుణులైన వైద్యులతో క్లిష్టమైన ఆపరేషన్లకు వేదికగా మారుతోంది. పెద్దకల్వలకు చెందిన 51 ఏళ్ల మహిళ తీవ్రమైన కడుపునొప్పితో ఆసుపత్రిలో చేరారు. ఆమెను పరీక్షించిన వైద్యులు గర్భసంచిలో మూడు గడ్డలు ఉండటంతో పాటు మూత్రాశయం వద్ద ఒక పెద్ద గడ్డ ఉన్నట్లు గుర్తించారు. ఎంతో జాగ్రత్తగా వ్యవహరించి వైద్యులు ఈ ఆపరేషన్ ను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం ఆ మహిళ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు.

### అత్యాధునిక పద్ధతుల్లో ఎముకల ఆపరేషన్లు

మరో రెండు కేసుల్లో ఎముకల నిపుణులు తమ ప్రతిభను చాటుకున్నారు. చందపల్లికి చెందిన 45 ఏళ్ల మహిళకు కుడి భుజం నరం పాక్షికంగా తెగిపోగా.. ఆర్థ్రోస్కోపిక్ విధానంలో దానిని సరిచేశారు. అలాగే రామగుండానికి చెందిన 19 ఏళ్ల యువతికి మోకాలి నరం (ఏసీఎల్) పూర్తిగా చిట్లిపోవడంతో.. అత్యాధునిక పరిజ్ఞానంతో ఆ నరాన్ని పునర్నిర్మించారు. ఈ ఆపరేషన్లలో గైనకాలజిస్ట్ డాక్టర్ అనసూయ, ఎముకల నిపుణులు డాక్టర్ శశికాంత్, డాక్టర్ వినయ్ కుమార్, సర్జన్ డాక్టర్ విష్ణుచంద్రిక, మత్తు మందు నిపుణులు డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ స్వాతి, డాక్టర్ భవాని పాల్గొన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ కూడా ఈ ప్రక్రియలో పాలుపంచుకున్నారు.

### ఆధునిక వైద్య సేవలను ఉపయోగించుకోవాలి

ఈ మూడు ఆపరేషన్లు చేసిన వైద్య బృందాలను సూపరింటెండెంట్ శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశు కేంద్రం, గుండె పరీక్షలు (2డి ఎకో), అత్యాధునిక లాప్రోస్కోపిక్ సర్జరీలు, యూరాలజీ, పంటి చికిత్సలు (రూట్ కెనాల్) వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రజలందరూ ఈ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనను కలవచ్చని పేర్కొన్నారు.

### అక్రమాలకు తావులేదు.. అప్రమత్తంగా ఉండాలి

ఆసుపత్రిలో పారిశుధ్యం గురించి గానీ, మరుగుదొడ్ల శుభ్రత విషయంలో ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. నర్సింగ్ సూపరింటెండెంట్ లేదా ఆర్ఎంఓ కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని, లేదంటే ఫిర్యాదుల పెట్టెలో తమ సమస్యలను తెలపవచ్చని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు ఉచితమని, ఎవరికీ లంచాలు ఇవ్వవద్దని ఆయన స్పష్టం చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తమ యంత్రాంగం సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు.




# ఇందిరమ్మ ఇళ్లు తక్షణమే మంజూరు చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వంపై శేరిలింగంపల్లి బీజేపీ శ్రేణుల సమరభేరి
- పీఎం ఆవాస్ యోజన నిధులతోనైనా ఇళ్లు కట్టించాలి: ఎమ్మెల్సీ అంజి రెడ్డి
- హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చడంపై బీజేపీ ధ్వజం

**శేరిలింగంపల్లి, మార్చి 13 (మనసులో మాట):**
పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని ఇచ్చిన హామీలను మరిచి, కేవలం ఓట్ల రాజకీయాలకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని బీజేపీ నాయకులు మండిపడ్డారు. అర్హులైన లబ్ధిదారులకు తక్షణమే ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శేరిలింగంపల్లి బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మార్ఓ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజి రెడ్డితో పాటు రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్, పెద్ద ఎత్తున బీజేపీ కార్యకర్తలు, దరఖాస్తుదారులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తారు. ప్రజలను పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు వైఖరిని ఈ సందర్భంగా వారు తీవ్రంగా నిరసించారు.

### గత పదేళ్ల వంచన.. కాంగ్రెస్ అసమర్థత

ధర్నాలో ఎమ్మెల్సీ అంజి రెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో పేదలను మోసం చేసిందని విమర్శించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి 50 వేల మంది దరఖాస్తు చేసుకుంటే, కేవలం 350 ఇళ్లు మాత్రమే కట్టించారని మండిపడ్డారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి మరీ దారుణంగా ఉందని.. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా ఇళ్లు ఇచ్చే ఆలోచనే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా ఇళ్లు కట్టించడం పక్కన పెట్టి, హైడ్రా పేరుతో ఉన్న ఇళ్లను కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన కింద నిధులు ఇస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను ఎటు మళ్లిస్తోందని ఆయన ప్రశ్నించారు.

### ప్రజా సమస్యలు గాలికి.. వసూళ్లపైనే ధ్యాస

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి ప్రాంతం నుండి ప్రభుత్వానికి సగం ఆదాయం వస్తున్నా, ఇక్కడి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే పార్టీలు మారడంపై ఉన్న ధ్యాస అభివృద్ధిపై పెట్టడం లేదని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో కొత్తగా ఒక్క ఆసుపత్రి గానీ, పాఠశాల గానీ నిర్మించలేదన్నారు. టీఎస్ఐఐసీ పేరుతో హెచ్ సీయూ భూములను వేలం వేయాలని ప్రభుత్వం చూస్తోందని.. 400 ఎకరాలను కుదువ పెట్టి 10,000 కోట్ల రూపాయల అప్పు తీసుకోవడం దారుణమని విమర్శించారు. గతంలో ప్రైవేటు వ్యక్తులు భూములను కబ్జా చేసేవారని, ఇప్పుడు ప్రభుత్వమే కబ్జాలకు పాల్పడుతోందని ఆరోపించారు.




### ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు పోరాటం

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు బీజేపీ పోరాడుతూనే ఉంటుందని రవికుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వానికి రెండు ఏళ్లకు పైగా సమయం ఇచ్చామని.. ఇకపై ప్రతి హామీ అమలు కోసం వీధికెక్కి పోరాడుతామని హెచ్చరించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో తదుపరి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు.



# 99 రోజుల యాక్షన్ ప్లాన్‌తో రాఘవపట్నంలో 'ప్రజా పాలన' పనులు

**ఊర చెరువు వద్ద పారిశుధ్య పనులు చేపట్టిన గ్రామ పంచాయతీ**

**ఇంటింటికీ వెళ్లి 'ఫ్రైడే - డ్రై డే' పై అవగాహన కల్పించిన సర్పంచ్**

**గొల్లపెల్లి, మార్చి 12 (మనసులో మాట):**
జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలంలోని రాఘవపట్నం గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన ఉ ప్రగతి ప్రణాళిక" పనులు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా 99 రోజుల యాక్షన్ ప్లాన్ పనులను గ్రామ పంచాయతీ యంత్రాంగం వేగవంతం చేసింది. శుక్రవారం గ్రామంలోని ఊర చెరువు పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. గ్రామ సర్పంచ్ కాసారపు భవాని అరవింద్ గౌడ్ నేతృత్వంలో సిబ్బంది ఈ పారిశుధ్య పనుల్లో పాల్గొన్నారు.

### నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు

గ్రామంలో పారిశుధ్యంతో పాటు ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ 'ఫ్రైడే - డ్రై డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ స్వయంగా గ్రామస్థుల ఇళ్లకు వెళ్లి నిల్వ ఉన్న నీటి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పాత టైర్లు, కుండలు, కొబ్బరి చిప్పలు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగి రోగాలు వ్యాపించే అవకాశం ఉన్నందున, ఎప్పటికప్పుడు పరిసరాలను ఎండబెట్టుకోవాలని అవగాహన కల్పించారు.

### పరిశుభ్రతలో అందరూ భాగస్వాములు కావాలి

గ్రామాన్ని అందంగా, ఆరోగ్యంగా తీర్చిదిద్దుకోవడంలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని సర్పంచ్ భవాని అరవింద్ గౌడ్ పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులకు ప్రజలు తోడ్పాటు అందించాలని కోరారు. ఇళ్ల ముందు చెత్త వేయకుండా, మురుగు కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు వేయకుండా జాగ్రత్త పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నరేష్, ఉప సర్పంచ్ సిరవేణి రవి, వైద్య సిబ్బంది బుజ్జక్క, ఆశా వర్కర్లు మల్లీశ్వరి, రాధ, గ్రామ నాయకులు బూత్కూరి కనుకరాజు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.




# పట్టణ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే విజయ రమణారావు
- పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో నూతన పాలకవర్గం తొలి సమావేశం
- వార్డుల సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశం

**పెద్దపల్లి, మార్చి 13 (మనసులో మాట):**
పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ నుగ్గిళ్ల మల్లయ్య అధ్యక్షతన నూతన పాలకవర్గం తొలి సర్వసభ్య సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. సభ ప్రారంభంలో నూతన సభ్యులందరినీ ఎమ్మెల్యే గౌరవించి శుభాకాంక్షలు తెలిపారు.

పట్టణంలోని అన్ని వార్డులను సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పాలకవర్గం పని చేయాలని ఎమ్మెల్యే విజయరమణ రావు సూచించారు. పట్టణ అభివృద్ధే ధ్యేయంగా అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రగతిలో కౌన్సిలర్లు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటుతో పాటు రోడ్ల మరమ్మతు పనులను మొదటి ప్రాధాన్యతగా చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పనుల్లో నాణ్యత పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, వైస్ చైర్మన్ ముస్తాన్ నజ్ నయ్యర్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# గృహ అవసరాల గ్యాస్ సరఫరాలో నిర్లక్ష్యం వద్దు

**అదనపు కలెక్టర్ నగేష్**

**జిల్లా గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో అదనపు కలెక్టర్ సమీక్ష**

**గ్యాస్ కొరత లేదు.. వినియోగదారులు ఆందోళన చెందవద్దు**



**మెదక్, మార్చి 13 (మనసులో మాట):**
మెదక్ జిల్లాలో గృహ అవసరాలకు వాడే గ్యాస్ సిలిండర్ల సరఫరా విషయంలో ఏజెన్సీ నిర్వాహకులు ఎంతో చిత్తశుద్ధితో పని చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలోని చాంబర్ లో జిల్లా గ్యాస్ ఏజెన్సీలు, పౌరసరఫరాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో గ్యాస్ సరఫరా తీరును అడిగి తెలుసుకున్నారు. గృహ అవసరాలకు వాడే ఎల్పిజి గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత లేదని, వినియోగదారులు అనవసరంగా ఆందోళన చెందాల్సిన పని లేదని ఆయన స్పష్టం చేశారు.

### సకాలంలో డెలివరీ చేయాలి..

గ్యాస్ బుక్ చేసుకున్న రెండు మూడు రోజుల్లోనే వినియోగదారులకు సిలిండర్లు అందేలా చూడాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఏజెన్సీలు సీనియారిటీని పాటిస్తూ గ్యాస్ పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. కమర్షియల్ సరఫరాలో ఉన్న చిన్నపాటి ఇబ్బందులను అధిగమించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లాలో సరిపడినంత గ్యాస్ నిల్వలు ఉన్నాయని, ప్రజలు కంగారు పడి అనవసరంగా బుకింగ్స్ చేసుకోవద్దని కోరారు.

### అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు..

ఇళ్లలో వాడే గ్యాస్ సిలిండర్లను ఎవరైనా వ్యాపార అవసరాలకు (కమర్షియల్ గా) ఉపయోగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగేష్ హెచ్చరించారు. ఏజెన్సీ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. గ్యాస్ బుకింగ్ కు సంబంధించి సర్వర్ సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ఇప్పటికే ఏజెన్సీలతో మాట్లాడామని వెల్లడించారు. త్వరలోనే ఈ సర్వర్ సమస్య పరిష్కారం అవుతుందని, దీనిపై ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.



### అధికారుల పర్యవేక్షణ ఉండాలి..

జిల్లాలో గ్యాస్ సరఫరా సక్రమంగా జరిగేలా పౌరసరఫరాల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్, వివిధ గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# సీతారామాంజనేయ స్వామి ఆలయంలో వైభవంగా మహాకుంభాభిషేకం

**భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**

**శేరిలింగంపల్లి, మార్చి 13 (మనసులో మాట):**
శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని హుడా ట్రేడ్ సెంటర్ లో ఉన్న శ్రీశ్రీశ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం మహాకుంభాభిషేకం కన్నుల పండువగా జరిగింది. బ్రహ్మశ్రీ కన్నేపల్లి శివరామచంద్రమూర్తి గురువు పర్యవేక్షణలో శ్రీరామ తారక పంచాయతన దేవతా యజ్ఞ అష్టోత్తర మహాకలశ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకకు శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన దైవ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయంలో జరిగిన ఈ విశేష పూజలకు పరిసర ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రాంగణంలో భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# ఏయే అనారోగ్య సమస్యలను తగ్గించుకునేందుకు నెయ్యిని ఇంటి చిట్కాల్లో ఎలా ఉపయోగించాలి..?

భారతీయులు ఎంతో పురాతన కాలంగా నెయ్యిని తమ ఆహారంగా ఉపయోగిస్తున్నారు. నెయ్యిని వంటల్లో వేయడమే కాకుండా నేరుగా కూడా తింటుంటారు. నెయ్యిలో అనేక ఔషధ గుణాలు ఉంటాయని ఆయుర్వేదంలో ఏనాడో చెప్పారు. అనేక రకాల ఔషధాల తయారీలోనూ దీన్ని ఉపయోగిస్తారు. నెయ్యిలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. నెయ్యిలో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఎ, బ్యుటీరిక్ యాసిడ్, ఇతర ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవి మన శరీరానికి పోషణను అందించి మనల్ని ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. ఆయుర్వేదంలో నెయ్యిని పలు రకాల చికిత్సల్లోనూ ఉపయోగిస్తారు. అయితే నెయ్యి ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తుందని చాలా మందికి తెలుసు. కానీ అనారోగ్య సమస్యలను తగ్గించుకునేందుకు దీన్ని ఎలా వాడాలి, ఏయే చిట్కాల్లో నెయ్యిని ఎలా ఉపయోగించాలి అని చాలా మందికి తెలియదు. నెయ్యిని పలు రకాలుగా ఉపయోగించడం వల్ల మనకు ఎంతో మేలు జరుగుతుంది. ఆయా చిట్కాల్లో నెయ్యిని వాడడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు.



**మలబద్ధకం తగ్గేందుకు..**

రోజూ రాత్రి పూట నిద్రకు ముందు ఒక కప్పు గోరు వెచ్చని పాలలో ఒక టీస్పూన్ నెయ్యి కలిపి తాగాలి. ఇలా రోజూ చేస్తుంటే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. మలబద్ధకం తగ్గుతుంది. పేగుల్లో ఉండే వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. నెయ్యిలో ఉండే బ్యుటీరిక్ యాసిడ్ పేగులను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆహారం సరిగ్గా జీర్ణం అయ్యేలా చేస్తుంది. దీంతో అజీర్తి తగ్గుతుంది. మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో పోషకాహార లోపం నుంచి బయట పడవచ్చు.

జలుబు, దగ్గు, ముక్కు దిబ్బడ వంటి శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నవారికి కూడా నెయ్యి ఎంతో మేలు చేస్తుంది. ఈ సమస్యలను తగ్గించుకునేందుకు గాను స్వచ్ఛమైన దేశవాళీ ఆవునెయ్యిని తీసుకుని కాస్త వేడి చేయాలి. అనంతరం ఆ నెయ్యిని రెండు చుక్కల చొప్పున రెండు ముక్కు రంధ్రాల్లోనూ వేయాలి. రాత్రి పూట ఇలా చేయాలి. దీని వల్ల ముక్కులో ఉండే కఫం కరిగిపోతుంది. ముక్కు దిబ్బడ, జలుబు, దగ్గు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే ఆస్తమా, సైనస్ వంటి సమస్యలు ఉన్నవారికి కూడా మేలు జరుగుతుంది. అయితే ఈ సమస్యలు మరీ అధికంగా ఉంటే ఈ చిట్కాను ఉదయం కూడా పాటించవచ్చు. ఇలా ఎంతో ఉపశమనం పొందవచ్చు.

**బరువు తగ్గేందుకు..**

పొట్ట దగ్గరి కొవ్వు కరిగి అధిక బరువు తగ్గేందుకు కూడా నెయ్యి పనిచేస్తుంది. నెయ్యిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు మన శరీరంలోని కొవ్వు కణాలను యాక్టివేట్ చేస్తాయి. దీంతో కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. నెయ్యిలో ఉండే ఒమెగా 3, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు కొవ్వును కరిగించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ఇందుకు గాను రోజూ ఉదయాన్నే పరగడుపునే ఒక టీస్పూన్ నెయ్యిని తీసుకోవాలి. ఇలా రోజూ చేస్తుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. అలాగే షుగర్ ఉన్నవారికి కూడా నెయ్యి మేలు చేస్తుంది. సాధారణంగా షుగర్ ఉన్నవారు అన్నంకు బదులుగా గోధుమ రొట్టెలను లేదా చిరుధాన్యాలను తింటుంటారు. అయితే వాటికి తోడు నెయ్యిని వాడాలి. దీని వల్ల ఆయా ఆహారాలకు చెందిన గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ తగ్గుతుంది. దీంతో ఆయా ఆహారాలు మన శరీరంలో వెంటనే గ్లూకోజ్‌గా మారవు. కాస్త సమయం పడుతుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఈ విధంగా నెయ్యిని ఉపయోగించి లాభం పొందవచ్చు.

**చర్మ సౌందర్యానికి..**

చర్మ సంరక్షణకు కూడా నెయ్యి ఎంతగానో పనిచేస్తుంది. నెయ్యిలో ఉండే ఫ్యాటీ యాసిడ్లు చర్మాన్ని సంరక్షిస్తాయి. చర్మం కాంతివంతంగా, మృదువుగా మారి మెరిసేలా చేస్తాయి. వృద్ధాప్య ఛాయలు తగ్గి యవ్వనంగా కనిపిస్తారు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు, మొటిమలను తగ్గించుకోవచ్చు. ఇందుకు గాను ఫేస్ ప్యాక్‌ను తయారు చేసి వాడాల్సి ఉంటుంది. నెయ్యిలో కాస్త శనగపిండి, పసుపు, తగినన్ని నీళ్లు పోసి కలిపి మెత్తని పేస్ట్‌లా మార్చి ఈ మిశ్రమాన్ని ముఖానికి ఫేస్ ప్యాక్‌లా వేసుకోవాలి. 20 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. తరచూ ఇలా చేస్తుంటే ఎంతో మేలు జరుగుతుంది. ముఖం కాంతివంతంగా మారి అందంగా కనిపిస్తారు. అలాగే శిరోజాలకు కూడా నెయ్యి ఎంతో మేలు చేస్తుంది. నెయ్యిలో ఆలివ్ ఆయిల్ కలిపి జుట్టుకు రాసి 20 నిమిషాలు అయ్యాక తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తుంటే అన్ని రకాల శిరోజాల సమస్యలను తగ్గించుకోవచ్చు. ఈ విధంగా నెయ్యితో ఆయా చిట్కాలను పాటించడం వల్ల అనేక అనారోగ్య సమస్యలను నయం చేసుకోవచ్చు.

# రక్త నాళాల్లో రక్తం గడ్డ కట్టే సమస్య ఉందా..?

## అయితే రోజూ వీటిని తినండి.. ఎంతో మేలు జరుగుతుంది..!

గాయాలు అయినప్పుడు ఎవరికైనా సరే సహజంగానే కాసేపట్లో రక్తం గడ్డకడుతుంది. ఇది శరీరం నిర్వర్తించే సహజసిద్ధమైన ప్రక్రియ. దీని వల్ల తీవ్ర రక్త స్రావం అవకుండా ప్రాణాంతకం అవకుండా శరీరం తనను తాను రక్షించుకుంటుంది. అయితే కొందరికి రక్త నాళాల్లో రక్తం గడ్డ కడుతుంది. ఇది తీవ్రమైన అనారోగ్య సమస్య అని చెప్పవచ్చు. రక్త నాళాల్లో రక్తం గడ్డ కట్టడాన్ని డీప్ వీన్ థ్రాంబోసిస్ అంటారు. ఈ సమస్య వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. హిమోగ్లోబిన్ స్థాయిలు అధికంగా ఉండడం, రక్తం లేదా ఎర్ర రక్త కణాలు మోతాదుకు మించి ఉత్పత్తి అవడం, కొవ్వు అధికంగా ఉండే ఆహారాలను అతిగా తినడం, శరీరం లోపల రక్త నాళాలకు గాయాలు అవడం వంటి కారణాల వల్ల రక్త నాళాల్లో రక్తం గడ్డ కడుతుంది. అయితే ఈ సమస్యకు వైద్యులు మందులను ఇస్తారు. వాటిని క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది. రక్తాన్ని పలుచగా చేసే మందులను వైద్యులు ఇస్తారు. అయితే ఆ మందులతోపాటు ఆహారం విషయంలోనూ పలు మార్పులు చేసుకుంటే ఈ సమస్య నుంచి సురక్షితంగా ఉండవచ్చు. ఫలితంగా గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది.



**పసుపు..**

రక్త నాళాల్లో రక్తం గడ్డ కట్టే సమస్య ఉన్నవారు ఆహారాలను ఆచి తూచి తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా కొన్ని రకాల ఆహారాలకు దూరంగా ఉండాలి, కొన్నింటిని తీసుకోవాల్సి ఉంటుంది. బ్లడ్ క్లాట్‌లను తగ్గించేందుకు పసుపు బాగా పనిచేస్తుంది. పసుపులో కర్‌క్యుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది రక్త నాళాల్లో రక్తం గడ్డ కట్టకుండా చూస్తుంది. పసుపు వల్ల రక్త నాళాల వాపులను సైతం తగ్గించుకోవచ్చు. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. పసుపులో యాంటీ థ్రాంబోటిక్, యాంటీ కోఆగులంట్ లక్షణాలు ఉంటాయి. కనుక శరీరం లోపలి భాగంలో బ్లడ్ క్లాట్స్ ఏర్పడవు. పసుపును గోరు వెచ్చని నీటిలో కలిపి రోజుకు ఒకసారి తాగాలి. రాత్రి పూట ఇలా చేస్తుండాలి. దీని వల్ల ఎంతగానో ఫలితం ఉంటుంది.

**వెల్లుల్లి, ఎండు మిర్చి..**

రక్త నాళాల వాపులను తగ్గించడంతోపాటు రక్త నాళాల్లో బ్లడ్ క్లాట్స్‌ను కరిగించేందుకు గాను వెల్లుల్లి కూడా ఎంతగానో పనిచేస్తుంది. ఇందులో ఉండే సల్ఫర్ సమ్మేళనాలు బ్లడ్ క్లాట్స్‌ను కరిగిస్తాయి. రోజూ ఉదయం పరగడుపునే రెండు పచ్చి వెల్లుల్లి రెబ్బలను తింటుండాలి. దీని వల్ల బ్లడ్ క్లాట్స్ కరిగిపోతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. వెల్లుల్లిలో ఉండే ఔషధ గుణాలు రక్త నాళాలను వెడల్పుగా చేసి ప్రశాంతంగా మారేలా చేస్తాయి. దీని వల్ల హైబీపీ తగ్గుతుంది. రక్త సరఫరా మెరుగు పడి గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే బ్లడ్ క్లాట్స్ ఏర్పడకుండా చూసుకోవచ్చు. అదేవిధంగా పండు మిర్చి లేదా ఎండు మిర్చిని కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిలోనూ రక్తాన్ని పలుచగా చేసే గుణాలు ఉంటాయి. వీటిల్లో సాలిసిలేట్స్ అధికంగా ఉంటాయి. ఇవి రక్తం గడ్డ కట్టకుండా చూస్తాయి. వీటిల్లో ఉండే క్యాప్సెయిసిన్ అనే సమ్మేళనం రక్త నాళాల్లోని క్లాట్స్‌ను కరిగించి రక్త సరఫరా మెరుగు పడేలా చేస్తుంది. రక్త నాళాల్లో కొవ్వు చేరకుండా ఉంటుంది. దీంతో గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది.

**అర్జున చెట్టు బెరడు..**

రక్త నాళాల్లో రక్తం గడ్డ కట్టే సమస్య ఉన్నవారు అర్జున చెట్టు బెరడును ఉపయోగిస్తుంటే మేలు జరుగుతుంది. ఈ బెరడును కొద్దిగా తీసుకుని ఒక గ్లాస్ నీటిలో వేసి రాత్రంతా నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం పరగడుపునే ఆ నీళ్లను తాగాల్సి ఉంటుంది. ఇలా రోజూ చేస్తుండాలి. దీని వల్ల గుండె కండరాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. వాపులు తగ్గిపోతాయి. రక్త నాళాల్లో ఉండే క్లాట్స్ కరుగుతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అర్జున చెట్టు బెరడు మనకు మార్కెట్‌లో పొడి రూపంలోనూ లభిస్తుంది. దాన్ని కూడా ఉపయోగించవచ్చు. అలాగే రోజూ గుప్పెడు అవిసె గింజలను కాస్త పెనంపై వేయించి తింటున్నా ఉపయోగం ఉంటుంది. ఈ గింజల్లో అధికంగా ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు బ్లడ్ క్లాట్స్ ఏర్పడకుండా చూస్తాయి. రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇలా ఆయా ఆహారాలను తీసుకోవడం వల్ల రక్త నాళాల్లో బ్లడ్ క్లాట్స్ ఏర్పడకుండా చూసుకోవచ్చు. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

# సైనస్ సమస్య ఉన్నవారు పాటించాల్సిన అద్భుతమైన చిట్కాలు.. ఎంతో రిలీఫ్ లభిస్తుంది..

వాతావరణం చల్లగా ఉన్నప్పుడు లేదా చల్లని ఆహారాలను తీసుకున్నప్పుడు సైనస్ సమస్య ఉన్నవారికి తీవ్ర ఇబ్బందులు కలుగుతాయి. సైనస్ ఉంటే విపరీతమైన నొప్పి వస్తుంది. దీని వల్ల తీవ్రమైన అవస్థలను ఎదుర్కొంటారు. సైనస్ సమస్య ఉన్నవారు సహజంగానే వైద్యులు ఇచ్చే మందులను వాడుతారు. యాంటీ బయాటిక్స్‌తోపాటు నొప్పిని, కఫాన్ని తగ్గించే మందులను వాడుతారు. సైనస్ సమస్య వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. డస్ట్ అలర్జీ, రసాయనాలు లేదా ఇతర పదార్థాల వల్ల సైనస్ వస్తుంది. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు లేదా చల్లని ద్రవాలను తాగినప్పుడు కూడా సైనస్‌ను ఎదుర్కొంటారు. ఈ క్రమంలో నాసికా మార్గాలు, శ్వాస నాళాలు వాపులకు గురవుతాయి. దీంతో ఇన్‌ఫెక్షన్ వస్తుంది. గొంతులో, తలలో నొప్పి, ముఖం నొప్పి, ముక్కు, చెవులు, దంతాల్లో నొప్పిగా ఉండడం, జ్వరం, ముఖం వాపులకు గురవడం, ముక్కు దిబ్బడ, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే సైనస్ ఉన్నవారు డాక్టర్ల ఇచ్చే మందులను వాడడంతోపాటు పలు ఇంటి చిట్కాలను పాటించడం వల్ల ఎంతగానో ఉపయోగం ఉంటుంది.



**పుదీనా ఆకుల నీళ్లు..**

సైనస్ ఉన్నవారు చల్లని ద్రవాలను తాగకూడదు. చల్లని వాతావరణంలో ఉన్నప్పుడు ముక్కు, చెవులు, తల భాగాలను కవర్ చేసేలా క్యాప్‌లను ధరించాలి. వేపుళ్లు, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ తినకూడదు. విటమిన్ ఎ అధికంగా ఉండే ఆహారాలను తింటుంటే ఉపశమనం లభిస్తుంది. విటమిన్ ఎ ఎక్కువగా క్యారెట్లు, యాపిల్స్, టమాటా, బ్రోకలీ, పాలు, నారింజ, అవకాడో, పనీర్ వంటి ఆహారాల్లో లభిస్తుంది. వీటిని తినడం వల్ల సైనస్ ఉన్నవారికి ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. అలాగే సైనస్ ఉన్నవారు ద్రవాహారాన్ని ఎక్కువగా తీసుకోవాల్సి ఉంటుంది. శరీరంలో ద్రవాలను సమతుల్యంలో ఉండేలా చూసుకోవాలి. దీంతో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. తలనొప్పి, సైనస్ రాకుండా అడ్డుకోవచ్చు. ఇక సైనస్ సమస్య ఉన్నవారు పుదీనా ఆకుల నీళ్లను ఆవిరి పడుతుంటే ఎంతో ఉపశమనం లభిస్తుంది. ఒక పాత్రలో బాగా మరుగుతున్న నీటిని తీసుకుని అందులో కొన్ని పుదీనా ఆకులను వేయాలి. అనంతరం దాని నుంచి వచ్చే ఆవిరిని బాగా పీల్చాలి. ఇలా రోజుకు 2 సార్లు చేస్తుంటే ఫలితం ఉంటుంది.

**జలనేతి..**

సైనస్ ఉన్నవారు వేడి వేడి సూప్‌లను తరచూ తాగుతుండాలి. నాన్ వెజ్ తినేవారు అయితే చికెన్ సూప్ తాగాలి. వెజిటేరియన్లు వెజిటబుల్ సూప్‌ను తాగాలి. దీని వల్ల కఫం కరిగిపోతుంది. ముక్కు దిబ్బడ, తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. శ్వాస సరిగ్గా పీల్చుకుంటారు. ఇక సైనస్ ఉన్నవారు జలనేతి అనే ప్రక్రియను అనుసరించాలి. దీని వల్ల సైనస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. జలనేతి అనేది ఒక యోగా ప్రక్రియ. ఇందులో భాగంగా అర లీటరు నీటికి ఒక టీస్పూను సైంధవ లవణం గానీ అయోడిన్ లేని సముద్రపు ఉప్పును గానీ బాగా కలిపి బాగా మరిగించి గోరువెచ్చగా అయిన తరువాత జలనేతి కోసం ప్రత్యేకంగా తయారు చేసిన పరికరం (జల నేతి పోట్) ను ఉపయోగించి ముక్కులోని ఒక రంధ్రం ద్వారా నీటిని పంపితే ముక్కు మరొక రంధ్రం ద్వారా ఆనీరు బయటకు వచ్చేస్తుంది. దీంతో ముక్కులో ఉండే మలినాలన్నీ బయటకు వస్తాయి. శ్వాస ఇబ్బందులు తొలగిపోతాయి. సైనస్ నుంచి ఉపశమనం పొందుతారు. ముక్కు రెండు రంధ్రాలనూ ఇదే ప్రక్రియలో శుభ్రపరుచుకోవాలి. సాధారణంగా ముక్కు ద్వారా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగినపుడు, ముక్కు దిబ్బడ లేదా ఆస్తమాతో బాధ పడుతున్నప్పుడు, సైనసైటిస్ ఉన్నప్పుడు ఉపశమనం కోసం ఈ యోగా ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ ప్రక్రియను సాధన చేయడానికి ముందు గురువు వద్ద సలహాలు, సూచనలను తీసుకోవాలి.

**యాపిల్ సైడర్ వెనిగర్..**

ఇక సైనస్ సమస్యను తగ్గించడంలో యాపిల్ సైడర్ వెనిగర్ కూడా ఎంతగానో పనిచేస్తుంది. ఇది మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. సైనస్ నొప్పులను తగ్గించడంలో సహాయం చేస్తుంది. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో అర టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్‌ను కలిపి తాగాలి. ఇలా రోజుకు ఒకసారి తాగుతుండాలి. దీని వల్ల సైనస్ నుంచి బయట పడవచ్చు. అల్లంతో తయారు చేసిన కషాయాన్ని రోజుకు 2 సార్లు తాగుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. లేదా ఒక టీస్పూన్ అల్లం రసం, ఒక టీస్పూన్ తేనెను కలిపి రోజుకు 3 సార్లు తీసుకోవాలి. ఇది సైనస్ నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. అలాగే కారం, మసాలాలు ఉన్న ఆహారాలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. వారంలో కనీసం 2 సార్లు ఇలాంటి ఆహారాలను తీసుకోవాలి. దీని వల్ల కఫం అంతా కరిగిపోతుంది. సైనస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా ఆయా చిట్కాలను పాటిస్తుంటే ఎంతగానో ఉపయోగం ఉంటుంది.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
SPORTS NEWS
స్పోర్ట్స్ న్యూస్
శనివారం
14 మార్చ్ 2026




# 'తెలివితక్కువ జట్టు' అదే..

## టీమిండియాపై మైఖేల్ వాన్ సంచలన వ్యాఖ్యలు!

**ఢిల్లీ:** టీ20 ప్రపంచకప్‌లో వరుసగా రెండోసారి విశ్వవిజేతగా నిలిచి టీమిండియా చరిత్ర సృష్టించిన వేళ.. భారత జట్టు ప్రస్థానంపై ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రీడాలోకంలో పెను దుమారం రేపుతున్నాయి. సాధారణంగా భారత జట్టుపై ఏదో ఒక విమర్శ చేసే వాన్, ఈసారి మాత్రం దక్షిణాఫ్రికా జట్టును టార్గెట్ చేస్తూ 'తెలివితక్కువ జట్టు' అని సంబోధించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. భారత్‌ను టోర్నీ నుంచి తరిమేసే అవకాశం వచ్చినా వాడుకోలేకపోయారంటూ ఆయన చేసిన విశ్లేషణ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అసలు దక్షిణాఫ్రికాను వాన్ ఎందుకు విమర్శించారు? భారత్ గెలుపు వెనుక సౌతాఫ్రికా చేసిన ఆ 'పొరపాటు' ఏంటి? అనేది తెలుసుకుందాం.

టీ20 వరల్డ్ కప్ 2026 విజేతగా భారత్ నిలవడంపై ఇంగ్లాండ్ మాజీ దిగ్గజం మైఖేల్ వాన్ తనదైన శైలిలో స్పందించారు. ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆయన, దక్షిణాఫ్రికా చేసిన ఒక పొరపాటు వల్లే భారత్ కప్ గెలవగలిగిందని విశ్లేషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.."ఈ టోర్నమెంట్‌లో అత్యంత తెలివితక్కువ జట్టు ఏదైనా ఉందంటే అది దక్షిణాఫ్రికానే. సూపర్-8 దశలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఓడిపోయి ఉంటే, భారత్ టోర్నీ నుంచి నిష్క్రమించేది. కానీ, ఆ మ్యాచ్‌లో గెలిచి టీమ్ ఇండియా రేసులో ఉండేలా సౌతాఫ్రికా అవకాశం కల్పించింది. మీరు ప్రపంచకప్ గెలవాలనుకుంటే, మీకంటే బలమైన జట్టును టోర్నీ ప్రారంభంలోనే ఇంటికి పంపాలి. కానీ సౌతాఫ్రికా ఆ పని చేయలేకపోయింది" అని వాన్ విమర్శించారు. సూపర్-8లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 76 పరుగుల తేడాతో భారీ ఓటమిని మూటగట్టుకుంది. దీంతో నెట్ రన్‌రేట్ దారుణంగా పడిపోయి, భారత్ సెమీస్ అవకాశాలు ప్రమాదంలో పడ్డాయి. అయితే దక్షిణాఫ్రికా చేతిలో వెస్టిండీస్ ఓడిపోవడం భారత్‌కు కలిసొచ్చింది. ఆ తర్వాత జింబాబ్వే, వెస్టిండీస్‌లపై వరుస విజయాలు సాధించి భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసి, ఫైనల్లో న్యూజిలాండ్‌ను ఓడించి కప్‌ను కైవసం చేసుకుంది. భారత్‌కు అవకాశం ఇచ్చిన దక్షిణాఫ్రికా మాత్రం సెమీఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ.. భారత్ లాంటి పటిష్టమైన జట్టుకు లైఫ్ లైన్ ఇవ్వడమే దక్షిణాఫ్రికా చేసిన పెద్ద తప్పని మైఖేల్ వాన్ ఎద్దేవా చేశారు.




# ఐపీఎల్ 2026 కష్టమే..

## ఆందోళనలో ఫ్రాంచైజీలు!

### క్రీడా రంగాన్ని కలవరపెడుతోన్న ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం

### రాబోయే ఐపీఎల్ సీజన్‌పై ఆందోళనలు

### ఇప్పటికే శ్రీలంక-అఫ్గానిస్థాన్ సిరీస్ వాయిదా

**ముంబై:** పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధ వాతావరణం క్రీడా రంగాన్ని కలవరపెడుతోంది. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచ కప్ 2026 అనంతరం వెస్టిండీస్, దక్షిణాఫ్రికా జట్లు స్వదేశం వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడటంతో.. రాబోయే ఐపీఎల్ సీజన్‌పై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. విదేశీ క్రికెటర్ల ప్రయాణంపై ఫ్రాంఛైజీలు ఆందోళనలో ఉన్నాయి. వాయు మార్గాల మూసివేత కారణంగా డారెన్ సామి, క్వింటన్ డికాక్ వంటి దిగ్గజ ఆటగాళ్లు కోల్‌కతాలో చిక్కుకుపోయారు. ఇంగ్లాండ్ జట్టును ముందుగా పంపి.. తమను ఆలస్యం చేయడంపై ఐసీసీపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం దుబాయ్, దోహా వంటి కీలక రవాణా కేంద్రాల్లో విమానాలపై ఆంక్షలు ఉండటంతో.. ఈ నెల 28న ప్రారంభం కానున్న ఐపీఎల్ కోసం విదేశీ ఆటగాళ్లు సమయానికి చేరుకోవడం కష్టంగా మారింది. ఇప్పటికే శ్రీలంక-అఫ్గానిస్థాన్ సిరీస్ వాయిదా పడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ముఖ్యంగా వెస్టిండీస్, దక్షిణాఫ్రికా ఆటగాళ్ల రాకపై ఫ్రాంఛైజీలు ఆందోళన చెందుతున్నాయి. విమాన ఛార్జీలు భారీగా పెరగడం యాజమాన్యాలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతోంది. అయితే చెన్నై సూపర్ కింగ్స్ సీఈఓ కాశీ విశ్వనాథన్ మాత్రం అకీల్ హోసిన్, బ్రెవిస్ వంటి ఆటగాళ్లు సకాలంలో జట్టుతో కలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు వంట గ్యాస్ కొరత కారణంగా జట్లకు ఆతిథ్యమిచ్చే హోటళ్లు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుత పరిస్థితులను పర్యవేక్షిస్తున్న బీసీసీఐ.. కేవలం మొదటి 20 మ్యాచ్‌లకు మాత్రమే షెడ్యూల్‌ను ప్రకటించింది. దేశంలోని వివిధ రాష్ట్రాల ఎన్నికలు మరియు అంతర్జాతీయ ఉద్రిక్తతలను దృష్టిలో ఉంచుకుని మిగతా షెడ్యూల్‌ను ఖరారు చేయనుంది. ఐపీఎల్ 2026 ప్రారంభ మ్యాచ్ ఈ నెల 28న డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరగనుంది. రెండో మ్యాచ్ వాంఖడే స్టేడియంలో జరగనుండగా.. ముంబై, కోల్‌కతా ఢీకొట్టనున్నాయి. టోర్నీ వాయిదా పడుతుందనే ప్రచారాన్ని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా కొట్టిపారేశారు. షెడ్యూల్ ప్రకారమే ఐపీఎల్ జరుగుతుందని, ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి బోర్డు సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

# పాకిస్థాన్ ప్లేయర్ కొనుగోలు ఎఫెక్ట్..

## సన్‌రైజర్స్ లీడ్స్ 'ఎక్స్' అకౌంట్ సస్పెండ్!

**ఢిల్లీ:** మరికొన్ని రోజుల్లో ఐపీఎల్ 2026 ప్రారంభం కానుంది. ఇప్పటికే అన్ని టీమ్‌లు మ్యాచ్‌లకు సంసిద్ధమవుతున్నాయి. ఈ సారి ఎస్ఆర్‌హెచ్ ఎలాగైన కప్పు కొట్టాలని ఫ్యాన్స్ ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐపీఎల్ సన్‌రైజర్స్ ఫ్రాంచైజీపై అనేక విమర్శలు వచ్చాయి. కావ్యా మారన్‌పై ఫ్యాన్స్ ఫుల్ ఫైర్ అవుతున్నారు. ఎందుకంటే.. ఇంగ్లండ్ వేదికగా జరగనున్న 'ది హండ్రెడ్' ప్లేయర్ల వేలం పాటలో పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ అనుబంధ జట్టు అయిన సన్‌రైజర్స్ లీడ్స్ కొనుగోలు చేసింది. అబ్రార్‌ను ఏకంగా 1.90 లక్షల పౌండ్లకు (సుమారు □2.34 కోట్లు) దక్కించుకుంది. భారత యాజమాన్యం కలిగిన ఈ జట్టు పాక్ ఆటగాడిని కొనుగోలు చేయడం ఇదే తొలిసారి. ఇక ఈ వార్త సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను బహిష్కరించాలని.. ఫ్రాంచైజ్, సహ యజమాని కావ్యా మారన్ ఇద్దరూ తీవ్ర విమర్శలకు గురయ్యారు.

ఈ క్రమంలోనే సోషల్ మీడియా వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుపై, యజమాని కావ్యా మారన్‌పై నెటిజన్లు తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. 'బాయ్‌కాట్ సన్‌రైజర్స్ హైదరాబాద్' హ్యాష్‌ట్యాగ్ వైరల్‌గా మారింది. ఇంతలో మరో ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. ఈ వివాదం మధ్య సన్‌రైజర్స్ లీడ్స్ ఖాతా సస్పెన్సన్‌కు గురవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ అకౌంట్‌ను ఓపెన్ చేస్తే.. "ఎక్స్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ ఖాతా సస్పెండ్ చేయబడింది" అనే సందేశం వినియోగదారులకు కనిపిస్తోంది. ఈ అంశంపై మేనేజ్‌మెంట్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఈ సస్పెన్షన్‌కు, అబ్రార్ అహ్మద్ కొనుగోలుకు గల సంబంధంపై ఎక్స్ యాజమాన్యం సైతం సరైన వివరణ ఇవ్వలేదు. దీంతో ఈ టాపిక్ కాస్త మరింత హాట్ హాట్‌గా మారింది. కాగా.. ప్రస్తుతం సన్‌రైజర్స్ యాజమాన్యం (సన్ గ్రూప్) ఇంగ్లాండ్‌లోని 'ది హండ్రెడ్' లీగ్‌లో సన్‌రైజర్స్ లీడ్స్ (గతంలో నార్తర్న్ సూపర్‌చార్జర్స్) పేరుతో కొత్త ఫ్రాంచైజీని కొనుగోలు చేసింది.




# వరల్డ్‌కప్ విజయం మీ అందరిది

## భారత్‌లో క్రికెట్ ఒక భావోద్వేగం..

టీ20 సంచలనంగా భారత జట్టులో పాతుకుపోయిన సూర్యకుమార్ యాదవ్ సారథిగానూ హిట్టయ్యాడు. పొట్టి క్రికెట్‌లో భారత్‌ను తిరుగులేని శక్తిగా మార్చిన సూర్య.. సొంతగడ్డపై భారత్‌కు పొట్టి ప్రపంచకప్ అందించిన తొలి కెప్టెన్‌గా చరిత్ర సృష్టించాడు. ప్రపంచకప్ గెలిచిన తర్వాత మైదానంలో భారత ఆటగాళ్లు కొందరు తమ ప్రియురాళ్లతో సంబురాలు చేసుకోవడంపై దుమారం రేగుతున్న వేళ.. ఈ విజయంలో అభిమానులకూ భాగముందని చెబుతున్నాడు సూర్య. నరేంద్ర మోడీ స్టేడియంలో మార్చి 8న న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన భారత జట్టు వరుసగా రెండోసారి పొట్టి కప్‌ను ఒడిసిపట్టింది. మరే ఆతిథ్య జట్టుకు సాధ్యమవ్వని విధంగా.. సొంతగడ్డపై పొట్టి వరల్డ్‌కప్‌ను పట్టేసింది. సారథిగా దేశానికి వరల్డ్‌కప్ అందించిన సూర్యకుమార్ యాదవ్ దిగ్గజాల సరసన చేరాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా ట్రోఫీని నిలబెట్టుకున్న మొదటి జట్టుగా టీమిండియా గుర్తింపు సాధించడంలో కీలకమైన ఈ మిస్టర్ 360 ప్లేయర్.. వరల్డ్‌కప్ విజయం అందరిదీ అంటున్నాడు. 'ప్రియమైన భారత జట్టు అభిమానులరా.. మొదటగా మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నా. మీ మద్దతు, ఆశీర్వాదం వల్లనే మేము ఇక్కడ ఉన్నాం. ఈ వరల్డ్‌కప్ ట్రోఫీ యావత్ దేశానికి చెందుతుంది. మేము గెలిచినా.. ఇది మా ఒక్కరి విజయ-ంమే కాదు. వరల్డ్‌కప్ గెలవాలనేది మనదేశంలో బ్యాట్ పట్టుకున్న ప్రతి చిన్నారి కల. స్టేడియానికి భారీగా తరలివచ్చే అభిమానులకు ఈ ట్రోఫీ చెందుతుంది.



# వరల్డ్‌కప్ స్టార్ బౌలర్‌కు బంపరాఫర్..

# ఇక ఐపీఎల్‌లో వికెట్ల వేటే!




పొట్టి వరల్డ్‌కప్‌లో వికెట్ల వేటతో అదుర్స్ అనిపించిన జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబని (దీశ్రీవంంఱఅస్త్ర వీబఓ్ఝుతీ్ఝుఎ్ఝుఅఱ)కి బంపరాఫర్ వచ్చింది. సంచలన బౌలింగ్‌లో స్టార్ బ్యాటర్లను వణికించిన ఈ ఆఫ్రికా ఆటగాడికి ఐపీఎల్ అవకాశం వచ్చింది. మార్చి 28 నుంచి మొదలయ్యే19వ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (ఖశీశ్రీఎ్ఝు ఖఅఱస్త్రష్ట్ర =ఱఎవతీం) తరఫున ఈ పొడగరి పేసర్ ఆడనున్నాడు. జింబాబ్వే స్టార్ తమ గూటికి చేరాడనే విషయాన్ని శుక్రవారం కోల్‌కతా యాజమాన్యం ఎక్స్ వేదికగా పంచుకుంది. ఐసీసీ పురుషుల పొట్టి ప్రపంచకప్‌లో జింబాబ్వే విజయాల్లో కీలకమైన బ్లెస్సింగ్ ముజరబని ఇక ఐపీఎల్‌లో చెలరేగనున్నాడు. వరల్డ్‌కప్‌లో సత్తా చాటి13 వికెట్లతో రెండో స్థానంలో నిలిచిన ఈ పేసర్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ పట్టేసింది. విండీస్ పేసర్ షమర్ జోసెఫ్ స్థానంలో ముజరబనికి చోటు కల్పించినట్టు కేకేఆర్ వెల్లడించింది. పద్దెనిమిదో సీజన్‌లో బ్యాకప్‌గా రాయల్ ఛాలెంజర్స్ జట్టుతో చేరిన ముజరబని.. ఈసారి ఊదా, పసిడి రంగు జెర్సీతో మైదానంలోకి దిగనున్నాడు. ఐపీఎల్ తొలి దశ షెడ్యూల్ విడుదల కావడంతో మార్చి 17న ముజరబని కోల్‌కతా స్క్వాడ్‌లో కలువనున్నాడు. ప్రతిభావంతుడైన ఈ పొడగరి పేసర్ రాకతో కోల్‌కతా నైట్ రైడర్స్ పేస్ దళం పటిష్టంగా మారనుంది. ఎందుకంటే.. మినీ వేలంలో రూ.9.20 కోట్లకు ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను కొన్న కోల్‌కతా.. బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసకు నిరసనగా అతడిని వదిలేసింది. ముస్తాఫిజుర్ స్థానంలో మరొకని తీసుకోలేదు. కానీ, వరల్డ్‌కప్‌లో 13 వికెట్లతో మెరిసిన ముజరబని ఈసారి తమ తురుపుముక్క అవుతాడని కోల్‌కతా భావిస్తోంది. ముజరబని, హర్షిత్ రానా, వైభవ్ రానా, ఉమ్రాన్ మాలిక్, ఆకాశ్ దీప్, కార్తిక్ త్యాగి, ప్రశాంత్ సోలంకీలతో కేకేఆర్ పేస్ దళం పటిష్టంగా కనిపిస్తోంది.

మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# ఏ బట్టలు వేసుకోవాలో మాకు తెలుసు

**- రాశి ఖన్నా**

'ఏ అమ్మాయికి అయినా తనకు కంఫర్ట్ గా ఉండే దుస్తులు ధరించే స్వేచ్ఛ ఉంటుంది. ఎలాంటి డ్రెస్ వేసుకోవాలనేది అమ్మాయి ఇష్టం. మేము ఏ దుస్తులు ధరిస్తే మీకేంటి' అంటూ ఫైర్ అయ్యారు నటి రాశి ఖన్నా. తాజాగా ఆమె నటించిన చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కించిన ఈ సినిమా 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో దుస్తులకు సంబంధించి, పెళ్లి గురించి అడిగిన ప్రశ్నలకు రాశి ఇలా సమాధానమిచ్చారు. 'నా పెళ్లి ఎప్పుడో నాకే తెలియదు. ప్రేమ వివాహమా, పెద్దలు కుదిర్చిన పెళ్లా అన్నది కూడా తెలీదు. ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉన్నా. పెళ్లికి టైం లేదు' అన్నారు. పెళ్లి తర్వాత నటిస్తారా? అన్న ప్రశ్నకు 'పెళ్లి తర్వాత కూడా అమ్మాయిలు వర్క్ చేయాలి. నటనకు ఎందుకు దూరమవ్వాలి' అని ప్రశ్నించారు.

## నటనకు ప్రాధాన్యం కనిపిస్తుంది

'గత చిత్రాల ఫలితం గురించి ఇప్పుడు అనవసరం. ప్రస్తుతం నా దృష్టి అంతా 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపైనే. ఇందులో నాతోపాటు శ్రీలీలే కూడా ఉంది. క్యారెక్టర్ లెంగ్త్ ఎవరిది ఎంత అనేది కరెక్ట్‌గా తెలియదుగానీ ఇద్దరం ఇందులో హీరోయిన్లమే. పాత్రలకు మంచి స్కోప్ ఉంది. ఇందులో మా ఇద్దరి నటనకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది.



# కొడుకు కన్నా పదేళ్లు పెద్దోడితో బాలీవుడ్ హాట్ భామ డేటింగ్

బాలీవుడ్ స్టార్ మలైకా అరోరా వ్యక్తిగత జీవితం గురించి మరోసారి సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. తాజాగా జరిగిన ఒక వేడుకలో మలైకా తన రూమర్డ్ బాయ్‌ఫ్రెండ్ హర్ష్ మెహతాతో కలిసి కనిపించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల జరిగిన నటి కృతికా కమ్రా -- టీవీ హోస్ట్ గౌరవ్ కపూర్‌ల గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్‌లో మలైకా సందడి చేశారు. అయితే, ఆమె ఒంటరిగా కాకుండా తన రూమర్డ్ ప్రియుడు హర్ష్ మెహతాతో కలిసి ఈ వేడుకకు హాజరుకావడం విశేషం. కానీ, అక్కడే ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది.



## కెమెరా కళ్లకు చిక్కకుండా..

ఈ స్టార్-స్టడెడ్ పార్టీలో మలైకా అరోరా ఎప్పటిలాగే తన సిల్వర్ కలర్ స్టైలిష్ దుస్తుల్లో రెడ్ కార్పెట్ మీద కెమెరాలకు ఫోజులిచ్చారు. అయితే, ఆమె ప్రియుడు హర్ష్ మెహతా మాత్రం మీడియా కంటపడకుండా ఉండటానికి ప్రయత్నించారు. ఆయన మెయిన్ గేట్ నుంచి కాకుండా, బ్యాక్ డోర్ నుంచి వేదికలోకి ప్రవేశించినట్లు సమాచారం. హర్ష్ మెహతా కెమెరాల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, అక్కడున్న ఫోటోగ్రాఫర్స్ ఆయన్ని వదల్లేదు. వేదిక లోపలికి వేగంగా వెళ్తున్న ఆయన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఒకే పార్టీలో ఉన్నప్పటికీ, మలైకా -- హర్ష్ కలిసి ఫోటోలకు పోజులు ఇవ్వకపోవడం పట్ల నెటిజన్లు రకరకాలుగా చర్చించుకుంటున్నారు.

## ఎవరీ హర్ష్ మెహతా?

మలైకా అరోరా గతంలో నటుడు అర్జున్ కపూర్‌తో డేటింగ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల ఆమె ఒక వజ్రాల వ్యాపారి అయిన హర్ష్ మెహతాతో ప్రేమలో ఉన్నట్లు పుకార్లు వస్తున్నాయి. వీరిద్దరూ గతంలో కొన్ని మ్యూజిక్ కాన్సర్ట్‌లలో, ప్రైవేట్ ఈవెంట్లలో కలిసి కనిపించారు. ఇప్పటివరకు మలైకా తన రిలేషన్‌షిప్‌పై అధికారికంగా స్పందించనప్పటికీ, తాజా సంఘటనతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే వార్తలకు మరింత బలం చేకూరినట్లయిందని సోషల్ మీడియా కోడై కూస్తుంది. మలైకా అరోరా కొడుకు వయస్సు 23 అయితే, ఆమె రూమర్డ్ లవర్ వయస్సు 33, ఆమె వయస్సు 52 ఏళ్లు.. తన కొడుకు కంటే పదేళ్లు పెద్దవాడితో ఈ బాలీవుడ్ హాట్ భామ డేటింగ్ చేస్తుంది నెట్టింట జోరుగా చర్చ జరుగుతుంది.

# ఉస్తాద్ భగత్ సింగ్ టికెట్ ధరల పెంపు

## మొదటి పదిరోజులకు అనుమతించిన ఏపీ ప్రభుత్వం

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న భారీ ప్రతిష్టాత్మక చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదల సమయం దగ్గరపడుతుండటంతో అభిమానుల్లో ఉత్సాహం తారస్థాయికి చేరింది. ఈ క్రమంలో, సినిమా విడుదల సందర్భంగా ప్రేక్షకులకు మెరుగైన థియేటర్ అనుభవాన్ని అందించేందుకు, డిమాండ్‌కు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టికెట్ ధరలను పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది. సినిమా విడుదలైన తొలి 10 రోజుల పాటు ప్రత్యేక ధరలను అమలు చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్స్ సాధారణ టికెట్ ధరపై అదనంగా 100 రూపాయలు పెంచుకునే అవకాశం కల్పించారు. మల్టీప్లెక్స్‌లలో టికెట్ ధరపై అదనంగా 125 రూపాయలు పెంచుకోవచ్చు. సినిమా విడుదల రోజైన మార్చి 19న ఉదయం 4 గంటల సమయంలో అదనపు షోలు ప్రదర్శించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ప్రత్యేక షోలకు టికెట్ ధరను 500 రూపాయలుగా నిర్ణయించారు. ఈ ధరల పెంపు కేవలం మొదటి 10 రోజుల వరకు మాత్రమే వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ సినిమాను చూసేందుకు అభిమానులు ఇప్పటికే టికెట్ల కోసం క్యూ కడుతున్నారు. ధరల పెంపుపై ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల నిర్మాతలకు, థియేటర్ యజమానులకు కొంత ఊరట లభించనుంది.






# అనసూయపై అసభ్యకర పోస్టులు

నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్‌పై గత కొంతకాలంగా సోషల్ మీడియా వేదికగా సాగుతున్న వేధింపుల పర్వంలో కీలక మలుపు చోటుచేసుకుంది. ఆమెపై అసభ్యకర పోస్టులు పెడుతూ, వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న ఓ వ్యక్తిని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఎట్టకేలకు కటకటాల వెనక్కి నెట్టారు. కడప జిల్లాకు చెందిన జనార్ధన్ అనే వ్యక్తి అనసూయను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో వికృత చేష్టలకు పాల్పడ్డాడు. కేవలం తన సోషల్ మీడియా ఖాతాలకు వ్యూస్, ఫాలోయింగ్ పెంచుకోవాలనే దురాలోచనతో అనసూయకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను మార్ఫింగ్ చేయడం లేదా అసభ్యకరమైన రీతిలో ఎడిట్ చేయడం వంటి పనులు చేశాడు. అభ్యంతరకరమైన వ్యాఖ్యలతో ఆమె ప్రతిష్టకు భంగం కలిగించేలా పోస్టులు పెడుతూ వికృతానందం పొందేవాడు. తనపై జరుగుతున్న ఈ డిజిటల్ దాడిని తీవ్రంగా పరిగణించిన అనసూయ, గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు, సాంకేతిక ఆధారాల సాయంతో నిందితుడు జనార్ధన్‌ను గుర్తించారు. కడపలో ఉన్న అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, తనే ఆ పోస్టులు పెట్టినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. కేవలం ఆన్‌లైన్ రీచ్ కోసమే సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకున్నట్లు నిందితుడు అంగీకరించాడు. ప్రస్తుతం జనార్ధన్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, లోతైన విచారణ జరుపుతున్నారు. ఈ ఘటన టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది.



CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861